

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 132

శనివారం 27-1-2024

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



జొకోవిచ్‌కు సినెర్ షాక్

సెమీస్‌లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ ఫైనల్లో మెద్వెదేవ్ వర్సెస్ సినెర్ - 13లో



సెబీ వెసులుబాటు

వదంతులపై స్పందించేందుకు లిస్టెడ్ కంపెనీలకు గడువు పొడిగింపు - 13లో



నారీశక్తి విశ్వరూపం

ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో తొలిసారి పూర్తిగా మహిళా సిబ్బందితో నిర్వహించిన త్రివిధ దళాల కవాతు ఆకట్టుకుంది.

వివరాలు 6లో ▸



రేపే ఎన్డీఏ గూటికి నితీశ్?

ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాల కూటమికి బిహార్ సీఎం నితీశ్ గుడ్‌బై చెప్పి ఎన్డీఏ కూటమిలో చేరడం ఖాయమైందని సమాచారం.

వివరాలు 6లో ▸



జ్ఞానవాపిలో దేవతా విగ్రహాలు

ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఉన్న జ్ఞానవాపి మసీదు కింద శివలింగం భాగాలు, దేవతల ధ్వంసమైన విగ్రహాలున్నట్లు సర్వేలో తేలింది.

వివరాలు 6లో ▸



నైట్రోజన్ గ్యాస్‌తో మరణ శిక్ష

మహిళ హత్య కేసులో దోషిగా తేలిన 58 ఏళ్ల వ్యక్తికి నైట్రోజన్ గ్యాస్ ద్వారా అమెరికా మరణశిక్షను అమలుచేసింది.

వివరాలు 6లో ▸



విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

రాజ్యాంగ స్ఫూర్తితో

చరిత్రాత్మక పాలన

గణతంత్ర దినోత్సవంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

- మా ప్రభుత్వంలో సెక్యులరిజం, సోషలిజం, ప్రజాస్వామ్యం విలువలకు పెద్దపీట.. 99.5% వాగ్దానాలను అమలు చేశాం
- 56 నెలలుగా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా పాలన
- అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహ ఏర్పాటు అణగారిన వర్గాలపై ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా ప్రజలకు రూ.4.21 లక్షల కోట్ల లబ్ధి
- గ్రామ స్వరాజ్యం భావనకు సచివాలయ వ్యవస్థతో జీవం పోశాం
- ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్ పంపిణీ ఓ చరిత్ర
- విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక పురోగతి
- జగనన్న ఆరోగ్య సురక్షలో ప్రివెంటివ్ హెల్త్‌కేర్ గొప్ప అధ్యాయం
- చేయూత, ఆసరా ద్వారా మహిళా సాధికారతకు పెద్దపీట
- సులభతర వాణిజ్యంలోనూ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచాం
- కుప్పానికి నీళ్లు ఇచ్చేందుకు బ్రాంచ్ కెనాల్‌ను పూర్తి చేశాం

2 లో

“ మా ప్రభుత్వం మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ 99.5 శాతం హామీలను అమలు చేసింది. కులమతాలు, ప్రాంతాలు, రాజకీయ వివక్ష లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తూ మన రాష్ట్రాన్ని దేశంలో ప్రత్యేకంగా నిలిపింది. విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతో మా ప్రభుత్వం సామాజిక న్యాయ సాధనను పునరుద్ఘాటించింది. సామాజిక సాధికారత నినాదం కాదు.. మార్గదర్శక విధానమని నిరూపించింది. - గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

సందడిగా రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్'

- ప్రముఖులకు తేనేటి విందు ఇచ్చిన గవర్నర్
- పాల్గొన్న సీఎం వైఎస్ జగన్, భారతి దంపతులు, హైకోర్టు సీజే దంపతులు
- హైకోర్టు న్యాయమూర్తులు, ప్రముఖులు హాజరు

2 లో

ఫ్యాక్ట్‌చెక్

మంగంపేట గనులపై దొంగరాతలా?

- బెరైటీస్ గనుల టెండర్లపై రామోజీ తప్పుడు కథనం
- మంగంపేటలో భారీగా పేరుకు పోయిన సీ, డీ గ్రేడ్ నిల్వలు
- వాటిని విక్రయించేందుకు నిబంధనల ప్రకారమే టెండర్లు
- బాబు హయాంలోని జీవో 262 గైడ్‌లైన్స్ ప్రకారమే రిజర్వు ధర
- టెండర్లలో వ్యయప్రస్తావన లేకున్నా అడ్డగోలు రాతలు
- ఈ తప్పుడు రాతలపై న్యాయ పరంగా చర్యలు: ఏపీఎండీసీ

- వివరాలు 10లో

మొదటి టెస్టు మన చేతుల్లోకి..

- భారత్ ఆధిక్యం 175 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో 421/7
- రాహుల్, జడేజా అర్ధసెంచరీలు

13 లో

దొంగ ఓట్లు.. 'పచ్చ' నోట్లు

'పర్చూరు'లో టీడీపీ ప్రలోభాల పర్వం

- ఎమ్మెల్యే ఏలూరి నిర్వాకాలు వెలుగులోకి..
- 'నోవా అగ్రి టెక్' కేంద్రంగా నల్లధనం పంపిణీ
- పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లకు ఎర.. డీఆర్‌ఐ తనిఖీల్లో ఆధారాలతో బట్టబయలు
- గుట్టు రట్టు చేసిన కీలక 'డైరీ'
- ఐటీ, ఈడీ, సెబీలకు నివేదించిన అధికారులు

5 లో



పోరుకు 'సిద్ధం'

నేడు 'భీమిలి'లో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- 175కు 175 అసెంబ్లీ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యం
- టీడీపీ–జనసేన పొత్తుల జిత్తులు.. కుతంత్రాలను చిత్తు చేసేందుకు శ్రేణులకు దిశానిర్దేశం
- రాష్ట్రంలో 4 ప్రాంతాల్లో పార్టీ కార్యకర్తలతో 4 భారీ సభలు
- మొదటి సభ ఉత్తరాంధ్ర భీమిలి నియోజకవర్గం సంగివలసలో..
- శ్రేణులతో జగన్ మాటామంతి

- వివరాలు 14లో

స్టేటస్ రిపోర్ట్

ఎలక్ట్రానిక్ 'సీమ'

- నాలుగున్నరేళ్లలో 24 భారీ ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీల రాక
- ఇప్పటికే 19 సంస్థల ఉత్పత్తి ప్రారంభం.. దిగ్గజ సంస్థల ద్వారా రూ.10,705 కోట్ల పెట్టుబడులతో పాటు 36,205 మందికి ఉపాధి
- విశాఖ జీఐఎస్ సదస్సులో మరో 23 ఒప్పందాలు.. తద్వారా రూ.15,711 కోట్ల పెట్టుబడులు
- మరో 55,140 ఉద్యోగావకాశాలు
- వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో కొత్తగా 801 ఎకరాల్లో రూ.749 కోట్లతో వైఎస్సార్ ఈఎంసీ అభివృద్ధి

- వివరాలు 3లో



వినూత్నం.. విప్లవాత్మకం

ఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రదర్శించిన శకటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యను మార్చడం –విద్యార్థులను ప్రపంచ వ్యాప్తంగా పోటీపడేలా తయారు చేయడం' అనే ఇతివృత్తంతో శకటాన్ని ప్రదర్శించారు. విద్యారంగంలో సంస్కరణలు, పథకాలను తీసుకురావడంతో పాటు కార్పొరేట్ పాఠశాలలకు పోటీగా ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడం ద్వారా విద్యార్థులను ప్రపంచ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఎం జగన్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని శకటం చాటి చెప్పింది. శకటానికి ఇరువైపులా రెండు డిజిటల్ స్క్రీన్‌లు ఏర్పాటు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్రప్రదేశ్' శకటం విశేషంగా ఆకట్టుకుంది. - సాక్షి, న్యూఢిల్లీ



సముద్రంలో సంబరం

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన రుషికొండ బీచ్ నడిసంద్రంలో వైజాగ్ స్కూబా డైవర్స్ జాతీయ జెండాతో ఏర్పాటు చేసిన వినూత్న ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. లివిన్ అడ్వెంచర్స్ వ్యవస్థాపకులు బలరామ్ నాయుడు ఆధ్వర్యంలో డైవర్స్ మువ్వన్నెల జెండాతో తమ దేశభక్తిని చాటారు. - కొమ్మాది

ఓటుకు లేదు సాటి



'భారతదేశంలో అతి పెద్ద ప్రజాస్వామ్య వేడుక త్వరలో జరుగబోతుంది. ఓటు వేయడం మీ హక్కు... ఓటుకు సాటి లేదు.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదాలతో పాటు స్వీప్–2024 (సిస్టామాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలను వివరిస్తూ భారత ఎన్నికల సంఘం లోగో, పోలింగ్ స్టేషన్, ఈవీఎంలను ఎన్నికల విభాగపు శకటం శుక్రవారం విజయవాడలో ప్రదర్శించింది. ఓటు హక్కు వినియోగం భావితరాల ఉజ్వల భవిష్యత్తును నిర్దేశిస్తుందని చాటి చెప్పింది. - సాక్షి, అమరావతి

29 నుంచి ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

దేశంలోనే తొలిసారిగా పేదలకు ఇచ్చిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు.. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

సాక్షి, అమరావతి: దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం రిజిస్ట్రేషన్లు చేయనుంది. 31.19 లక్షల మందికి ఇళ్ల పట్టాలిచ్చిన ప్రభుత్వం వాటిని ఇప్పుడు రిజిస్టర్ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఈ రిజిస్ట్రేషన్లకు సంబంధించి శనివారం రాష్ట్రవ్యాప్తంగా ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. 29 నుంచి రిజిస్ట్రేషన్లు చేసే కార్యక్రమం పూర్తిస్థాయిలో ప్రారంభం కానుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి అర్హులకు కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వనున్నారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. ప్రభుత్వం తరఫున అన్ని గ్రామాల్లోనూ వీఆర్వోలు రిజిస్ట్రేషన్లు చేయనున్నారు. మరోవైపు.. కన్వేయన్స్ డీడ్స్ జారీకి సంబంధించిన ఆర్డినెన్స్ ఫైలుపై గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం సంతకం చేశారు. ఇందుకు సంబంధించిన గెజిట్, జీఓ శనివారం జారీకానున్నాయి. ఇప్పటికే రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పనుల్లో తలమునకలై ఉన్నాయి. ఇక ఈ రిజిస్ట్రేషన్లను 29న ప్రారంభించి 12 రోజుల వ్యవధిలోనే పూర్తిచేయడానికి సర్వం సిద్ధంచేశారు. ఇందుకు సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసినా రిజిస్ట్రేషన్లు చేసే ప్రయత్నం చేయలేదు. అసైన్డ్ భూముల చట్టానికి అనుగుణంగా డి–పట్టాలు ఇవ్వడంతో వాటిపై పేదలకు ఎటువంటి హక్కులు ఉండేవి కావు. కానీ, వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు చట్ట సవరణ చేసి మరీ సర్వ హక్కులతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే 31.19 లక్షల మందికి ఒకేసారి ఇళ్ల పట్టాలిచ్చి చరిత్ర సృష్టించారు.



గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

రాజ్యాంగ స్ఫూర్తితో చరిత్రాత్మక పాలన

గణతంత్ర దిన వేడుకల్లో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

మా ప్రభుత్వంలో సెక్యులరిజం, సోషలిజం, ప్రజాస్వామ్యం విలువలకు పెద్దపీట

- 99.5% ఎన్నికల వాగ్దానాలను అమలు చేశాం
- కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పాలన



గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్. చిత్రంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తితో సంక్షేమ ప్రగతి దిశగా పయనిస్తోందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. గత 56 నెలలుగా లౌకిక, ప్రజాస్వామిక, గణతంత్ర విలువలను ప్రతిబింబిస్తూ పాలన సాగిస్తోందన్నారు. అణగారిన వర్గాల్లో ఆనందాన్ని నింపడమే లక్ష్యంగా మారుమూల ప్రాంతాలకూ అభివృద్ధి ఫలాలను చేరవేస్తున్నట్లు చెప్పారు. సచివాలయాల వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పౌర సేవలను చేర్చి గ్రామ స్వరాజ్య భావనకు జీవం పోశామన్నారు. ఇప్పటివరకు డీబీటీ ద్వారా రూ.2,52,943.48 కోట్లు, నాన్-డీబీటీ ద్వారా మరో రూ.1,68,151.08 కోట్లు కలిపి మొత్తం రూ.4,21,094.56 కోట్ల మేర ప్రజలకు ప్రయోజనం చేకూర్చినట్లు తెలిపారు. సంక్షేమంతో పాటు సామాజిక విప్లవాన్ని తెస్తూ నామినేటెడ్ పనులు, పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలతో పాటు మహిళలకు ప్రత్యేకంగా 50 శాతం రిజర్వేషన్లు కలిపిస్తూ ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. విద్య, వైద్య రంగాల్లో చరిత్రాత్మక మార్పులు తెచ్చిందని చెప్పారు. పుష్కలమైన వనరులు, అపార అవకాశాలతో ఏపీ పారిశ్రామికవేత్తలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా నిరుద్యోగం రేటు వేగంగా తగ్గిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన పోలవరం ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యంగా పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. శుక్రవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు గవర్నర్ నజీర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

గ్రామ స్వరాజ్యం సాకారం..

రాష్ట్రంలో 15,004 గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా గొప్ప పాలన సంస్కరణలు తెచ్చాం. 540కిపైగా ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దే అందుతున్నాయి. సొంత ఊరిలోనే యువతకు 1.35 లక్షలకుపైగా శాశ్వత ఉద్యోగాలు, 2.66 లక్షల మందికి వలంటీర్లుగా పని చేసే అవకాశం దక్కింది. 9,260 ఎండీయూలతో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ జరుగుతుండగా వలంటీర్ల ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే లబ్ధిదారులకు ఇంటి వద్దే పింఛన్లు అందిస్తున్నాం. రూ.3 వేలు చొప్పున సామాజిక పింఛన్లు అందిస్తూ ఏపీ దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తోంది. ప్రతి నెలా 66.34 లక్షల మంది లబ్ధిదారులకు రూ.1,968 కోట్లు అందిస్తోంది. గత 56 నెలల్లో సామాజిక భద్రతా పింఛన్ల కోసమే రూ. 84,731 కోట్లు ఖర్చు చేసింది. జగనన్న సురక్ష ద్వారా కోటి సర్టిఫికెట్లను పౌరులకు ఉచితంగా అందచేసింది.

ప్రపంచ స్థాయి విద్య..

మన విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతోంది. జగనన్న అమ్మ ఒడి కింద ఏడాదికి రూ.15 వేల చొప్పున 44 లక్షల మంది తల్లులకు రూ.26,067 కోట్లు అందించాం. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ బోధనా పద్ధతులను ప్రవేశపెడుతూ నాడు-నేడు ద్వారా రూ.17,805 కోట్లతో 56,703 ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించాం. రూ.2,400 విలువైన జగనన్న విద్యా కానుక కిట్లను ఉచితంగా అందిస్తున్నాం. దీని కోసం ఇప్పటి వరకు రూ.3367 కోట్లు ఖర్చు చేశాం. విద్యార్థులకు రోజుకో మెనూతో పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం రూ.4,417 కోట్లు వ్యయం చేసింది. జగనన్న విద్యాదీవెన కింద 26,98,728 మంది లబ్ధిదారులకు రూ.11,901 కోట్ల పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించగా వసతి దీవెన కింద 25,17,245 మంది లబ్ధిదారులకు రూ.4,276 కోట్ల మేర ప్రయోజనం చేకూరింది. జగనన్న విదేశీ విద్యా దీవెన కింద ప్రపంచ అగ్రశ్రేణి విద్యాసంస్థల్లో మన విద్యార్థులు ఉచితంగా చదువుకునేందుకు రూ.107.08 కోట్లు వెచ్చించింది. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వ స్కూళ్లలో ఆంగ్ల మాధ్యమం, సీబీఎస్‌ఈ సిలబస్‌తో పాటు ఇంటర్నేషనల్ బాకలారియేట్ (ఐబీ) వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. 8వ తరగతి నుంచి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీకి రూ.1,306 కోట్లు ఖర్చు చేసింది. 62 వేలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, 45 వేల స్మార్ట్ టీవీలను సమకూర్చింది. ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిష్ నైపుణ్యాలను పెంపొందించేందుకు టోఫెల్‌కు సన్నద్ధం చేస్తూ శిక్షణ అందిస్తోంది.

ఉన్నత విద్యలో సమున్నతం..

అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఆన్‌లైన్ విద్యా వేదిక ఎడెక్స్‌తో ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, కేంబ్రిడ్జ్, స్టాన్‌ఫోర్డ్ వర్సిటీల్లో లభించే 2 వేల వర్టికల్స్‌ను మన విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. డిగ్రీలో నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులతో పాటు జాబ్ ఓరియెంటెడ్ మాడ్యూల్స్, 30 శాతం స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను కరిక్యులమ్‌లో ప్రవేశపెట్టింది. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా ఒకే ఏడాది ఇంటర్న్‌షిప్‌లలో 3 లక్షల కంటే ఎక్కువ సర్టిఫికేషన్లు సాధించిన ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. 18 విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న 3,295 పోస్టులను భర్తీ చేస్తోంది.

ప్రజారోగ్యానికి పెద్ద పీట..

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్యాన్ని రూ.25 లక్షలకు పెంచడంతో పాటు క్యాన్సర్ లాంటి క్లిష్టమైన వ్యాధులకు పరిమితి లేని వైద్యాన్ని అందిస్తోంది. ఆరోగ్యశ్రీ ప్రొసీజర్స్‌ను 1,059 నుంచి 3,257కి పెంచింది. ఇప్పటి వరకు ఆరోగ్యశ్రీ కింద రూ.12,150 కోట్లు ఖర్చు చేయగా 4.25 కోట్ల మందికిపైగా వైద్య సేవలు పొందారు. వీరికి విశ్రాంతి సమయంలో వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం కింద రూ.1,366 కోట్లు అందించింది. వైద్య రంగంలో ఖాళీలు లేకుండా 53,126 మంది వైద్య సిబ్బందిని నియమించింది. రూ.1,208 కోట్లతో 1,704 వాహనాలు (108, 104లు), రూ.71 కోట్లతో 500 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు, డబ్ల్యూహెచ్‌ఓ/జీఎంపీ ప్రమాణాలతో 562 ఔషధాలను ప్రతి పీహెచ్‌సీలో అందుబాటులో ఉంచింది. నాడు-నేడు ద్వారా రూ.16,852 కోట్లతో వివిధ స్థాయిల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, బోధనాస్పత్రుల్లో వైద్యసేవలను మెరుగుపర్చింది. 17 కొత్త మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తుండగా ఇప్పటి వరకు 5 నూతన కళాశాలల్లో ఎంబీబీఎస్ తరగతులను ప్రారంభించింది. రూ.700 కోట్లతో 'వైఎస్సార్ సుజలధార' ప్రాజెక్టు ద్వారా ఉద్దానం కిడ్నీ బాధితుల కష్టాలను తీర్చింది. 5 గిరిజన ప్రాంతాల్లో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రులు, తిరుపతి (చిల్డ్రన్స్ హార్ట్ సెంటర్), కడప (మానసిక ఆరోగ్య కేంద్రం, క్యాన్సర్ ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ బ్లాక్) పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా 1.96 కోట్ల మందికి ఇంటి వద్దే నాణ్యమైన వైద్యాన్ని అందించింది. హృద్రోగ బాధితులకు సేవలందించేందుకు విశాఖపట్నం, గుంటూరు, కర్నూలులో 3 మెడికల్ హబ్‌లను ఏర్పాటు చేస్తోంది. గుంటూరు, కర్నూలు, విశాఖపట్నం, కడప, కాకినాడ, అనంతపురంలో 6 క్యాన్సర్ కేర్ సెంటర్లు నెలకొల్పుతోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా వైద్యులను గ్రామాలకే పంపిస్తుండగా ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌లో కొత్త అధ్యాయంగా జగనన్న ఆరోగ్య సురక్షను చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలలో రక్తహీనత నివారణకు రూ.6,688 కోట్లతో 35.70 లక్షల మంది లబ్ధిదారులకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్ కిట్లను అందిస్తోంది.

సులభతర వాణిజ్యంలో అగ్రస్థానం

దేశంలోనే అత్యధిక జీఎస్‌డీపీ వృద్ధి రేటుతో ఆంధ్రప్రదేశ్ ప్రగతి పథంలో దూసుకెళ్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడో ఏడాది అగ్రస్థానంలో నిలిచింది. ఇప్పటి వరకు రూ.30 వేల కోట్లతో 3.94 లక్షల కొత్త ఎంఎస్ఎంఈ యూనిట్లు స్థాపించింది. రీస్టార్ట్ ప్యాకేజీ కింద రూ.2,087 కోట్ల మేర ప్రోత్సాహకాలను అందించింది. రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే వద్ద రూ.16 వేల కోట్లతో 110 మిలియన్ టన్నుల కార్గో హ్యాండ్లింగ్ సామర్థ్యంతో 4 కొత్త ఓడరేవులను నిర్మిస్తోంది. పది ఫిషింగ్ హార్బర్‌లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. రూ.3,200 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం జరుగుతుండగా గన్నవరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతి, కర్నూలు, కడప ఎయిర్‌పోర్టులను విస్తరిస్తోంది. వీటి ద్వారా సుమారు 2 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో గత 56 నెలల్లో 311కి పైగా భారీ, మెగా పరిశ్రమలు స్థాపించగా 1.30 లక్షల మందికి పైగా ఉపాధిని కల్పిస్తున్నాయి. విశాఖలో జరిగిన జీఐఎస్ సదస్సులో రూ.13.11లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు కుదిరాయి.



వేడుకలను తిలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు

మహిళకు సాధికారత..

ఎన్నికల హామీలో భాగంగా స్వయం సహాయక సంఘాల రుణ బకాయిలను ప్రభుత్వం తిరిగి చెల్లించింది. నాలుగు దశల్లో 78.94 లక్షల మంది మహిళలకు మొత్తం రూ.25,571 కోట్లను జమ చేసింది.సున్నా వడ్డీ కింద రూ.4969 కోట్లు అందించింది. వైఎస్సార్ చేయూత కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల మహిళలకు రూ.14,129 కోట్ల సాయాన్ని అందించింది. కాపు నేస్తం కింద రూ.2,029 కోట్లు, ఈబీసీ నేస్తం కింద ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.1257 కోట్లు పంపిణీ చేసింది. మహిళల భద్రత కోసం దిశ యాప్, సచివాలయాల్లో మహిళా పోలీసు కానిస్టేబుళ్లను నియమించింది. నిరుపేదల కలను నెరవేరుస్తూ 31.19 లక్షల మందికి మహిళల పేరిట ఉచిత ఇంటి స్థలాలు పంపిణీ చేయడంతోపాటు 22 లక్షల గృహాలను నిర్మిస్తోంది. సుమారు రూ.మూడు లక్షల కోట్ల సంపదను సృష్టించి మహిళలకు అందించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా ద్వారా అండగా నిలుస్తోంది. బాలికా విద్యను ప్రోత్సహించడంలో భాగంగా ఈ పథకాలకు కనీసం 10వ తరగతి విద్యార్హతను ప్రామాణికంగా నిర్ణయించి ఇప్పటివరకు 46,062 మంది లబ్ధిదారులకు రూ.349 కోట్లు పంపిణీ చేసింది.

వ్యవసాయానికి 'భరోసా'

సొంత భూమిని సాగుచేసుకుంటున్న రైతులకే కాకుండా దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కౌలు రైతులు, ఆర్ఓఎఫ్ఆర్ (అటవీ), ఎండోమెంట్ భూముల సాగుదారులకు సైతం వైఎస్సార్ రైతు భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఇప్పటి వరకు 53.53 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.33,300 కోట్లు జమ చేసింది. 10,778 ఆర్బీకేల ద్వారా గ్రామంలోనే విత్తనం నుంచి పంట ఉత్పత్తుల అమ్మకం వరకు అన్ని వ్యవసాయ సేవలను అందిస్తోంది. ఉచిత పంటల బీమా కింద 54.75 లక్షల మంది రైతులకు రూ.7802 కోట్లు అందించగా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద 22.85 లక్షల మందికి రూ.1977 కోట్లు అందించింది. వైఎస్సార్ సున్నా వడ్డీ రుణాల కింద 73.88 లక్షల మంది రైతులకు రూ.1835 కోట్లు వడ్డీ రాయితీ జమ చేసింది. మరో 25ఏళ్ల పాటు పగటిపూట నాణ్యమైన ఉచిత వ్యవసాయ విద్యుత్ అందించేందుకు సెకీతో ఒప్పందం చేసుకుంది. ఉచిత విద్యుత్‌తో 39.77లక్షల మంది రైతులు రూ.43,066 కోట్లు లబ్ధి పొందారు. ఆక్వా రంగంలో ఏపీ దేశంలో అగ్ర స్థానంలో ఉంది. చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా ఏకంగా 30 శాతం ఉంది. నాణ్యమైన ఆక్వా ఉత్పత్తులను అందించేందుకు రూ.50.30 కోట్లతో 35 ఇంటిగ్రేటెడ్ ఆక్వా ల్యాబ్‌లను నిర్మించింది. 10 ఎకరాల కంటే తక్కువ ఉన్న ఆక్వా రైతులకు యూనిట్‌కు కేవలం రూ.1.50 చొప్పున విద్యుత్‌ను సరఫరా చేస్తూ 3,250 కోట్లు సబ్సిడీ భారాన్ని భరించింది. రూ.1,052 కోట్లతో యంత్ర సేవా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ధాన్యం కొనుగోలులో దళారీ వ్యవస్థను రూపుమాపి ఇప్పటి వరకు 36.60లక్షల మంది రైతుల నుంచి రూ.63,827 కోట్ల విలువైన 3.34 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి సంపూర్ణ మద్దతు ధర అందించింది. మూతపడిన సహకార డెయిరీలను పునరుజ్జీవం పోస్తూ అమూల్ సహకారంతో జగనన్న పాలవెల్లువను కొత్త పుంతలు తొక్కిస్తోంది.

జలయజ్ఞం ఫలాలు..

నీటిపారుదల రంగంలో ప్రభుత్వ దార్శనికత కోట్లాది మంది ప్రజల తాగు, సాగునీటి అవసరాలను తీరుస్తోంది. కరువు పీడిత రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలోని వెనుకబడిన జిల్లాల్లో చేపట్టిన భారీ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. పెన్నా నదిపై సంగం బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీలు పూర్తి కాగా రూ.600 కోట్లతో బ్రహ్మంసాగర్ లీకేజీ సమస్యను పరిష్కరించింది. చిత్రావతి కోసం రూ.280 కోట్లతో భూసేకరణ, ఆర్అండ్ఆర్ పూర్తి చేసి 10 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని సాధించింది. గండికోట నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం కోసం రూ.925 కోట్లు వెచ్చించింది. అవుకు 2వ సొరంగం పనులు పూర్తి చేసి ఎస్ఆర్‌బీసీ సామర్థ్యాన్ని 20 వేల క్యూసెక్కులకు పెంచింది. 3వ సొరంగం పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.253 కోట్లతో లక్కసాగరం ఎత్తిపోతల పూర్తి కావడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలకు ప్రయోజనం చేకూరుతోంది. ఖరీఫ్ వర్షాలతో నల్లమల సాగర్‌లో నీటిని నిల్వ చేయనుంది. రూ.240 కోట్లతో మడకశిర బైపాస్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు నీటి పంపిణీ దిశగా అడుగులు వేస్తోంది. కుప్పం నియోజకవర్గానికి నీటిని అందించేందుకు కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తి చేసింది. రూ.340 కోట్లతో వరికపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ పథకాన్ని ప్రారంభించింది. మార్చి నాటికి నాగావళి, వంశధార అనుసంధానం, జూన్ నాటికి వంశధార ప్రాజెక్ట్ 2వ దశ పూర్తి చేసి శ్రీకాకుళం జిల్లాకు మెరుగైన నీటిపారుదల సౌకర్యాన్ని కల్పిస్తాం. రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం నుంచి 800 అడుగుల్లో 3 టీఎంసీల నీటిని మళ్లిస్తాం. పోతిరెడ్డిపాడు, ఎస్ఆర్‌బీసీ, జీఎన్ఎస్ఎస్, కుందూ నది, నిప్పుల వాగు సామర్థ్యం పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాం. హెచ్ఎన్ఎస్ఎస్ ద్వారా ధర్మవరం నియోజకవర్గానికి నీరందించేందుకు జిల్లెడు బండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణ పనులను చేపట్టాం.హెచ్ఎన్ఎస్ఎస్ పనులు ప్రారంభించగా తారకరామ తీర్థ సాగర్, తోటపల్లి కెనాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారంగా దేశంలో వందేళ్ల తర్వాత చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటికే రెండు దశల్లో 17,460 రెవెన్యూ గ్రామాల్లో 42.6 లక్షల ఎకరాల రీ సర్వేను రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా పూర్తి చేసింది. భూమిలేని పేదలకు భూమి పంపిణీ చేయడంతో పాటు అసైన్డ్ భూముల లబ్ధిదారులకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది.
- వర్క్‌ఫ్రమ్ హోమ్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత కోసం వైఎస్సార్ గ్రామ డిజిటల్ లైబ్రరీలను 12,979 పంచాయతీల్లో నిర్మిస్తూ అపరిమిత బ్యాండ్‌విడ్త్ సౌకర్యం కల్పిస్తోంది.
- వైఎస్సార్ వాహనమిత్ర కింద రూ.1305 కోట్లు, నేతన్న నేస్తం కింద రూ.983 కోట్లు, జగనన్న చేదోడు కింద నాయీబ్రాహ్మణులు, దర్జీలకు రూ.1268 కోట్లు, మత్స్యకార భరోసా కింద రూ.540 కోట్లు అందించింది.
- జగనన్న తోడు కింద 16.73 లక్షల మంది చిరువ్యాపారులకు రూ.3374 కోట్లు వడ్డీలేని రుణాలు ఇవ్వడంతో పాటు రూ.88.33 కోట్లు రీయింబర్స్ చేసింది.
- ప్రమాదాల్లో మరణించినవారు, దివ్యాంగులకు వైఎస్సార్ బీమా ద్వారా రూ.1582 కోట్లు అందించింది.
- ఏపీ ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్ ఏర్పాటుతో పారదర్శకంగా ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు అందిస్తోంది.
- టీటీడీకి చెందిన శ్రీవాణి ట్రస్ట్‌తో కలిసి రూ.1,695 కోట్లతో 3,967 ఆలయాల్లో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. అర్చక సంక్షేమ నిధి ట్రస్ట్ ద్వారా 3వేల మంది అర్చకులకు రూ.48.33 కోట్ల మేర ఆర్థిక భరోసా అందించింది. ధూపదీప నైవేద్యం పథకం కింద ఏటా రూ.30 కోట్లు ఖర్చు చేస్తోంది. 3,518 మంది టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించింది.
- ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కలను నెరవేరుస్తూ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసింది 51,387 మంది ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించింది.
- గ్రామాల్లో యువతను క్రీడలవైపు ప్రోత్సహించడం, సమాజంలో ఆరోగ్యకర జీవనాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ఏటా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టింది.

సందడిగా రాజ్‌భవన్‌లో 'ఎట్ హోమ్'

ప్రముఖులకు తేనీటి విందు ఇచ్చిన గవర్నర్



సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్

సాక్షి, అమరావతి: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఎట్ హోమ్ కార్యక్రమం సందడిగా జరిగింది. గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ రాష్ట్రంలోని ప్రముఖులకు రాజ్‌భవన్‌లో తేనీటి విందు ఇచ్చారు. ఈ విందుకు సీఎం వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, గుడియా ఠాకూర్ దంపతులతోపాటు వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ భారతి దంపతులకు గవర్నర్ ముఖ్య కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ సాదర స్వాగతం పలికారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం మొదలైంది. గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్, వైఎస్ భారతి దంపతులు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు వివిధ అంశాలపై కొద్దిసేపు సంభాషించుకున్నారు. రాజ్‌భవన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ మీద ప్రదర్శించిన దేశ స్వాతంత్ర్య పోరాట చిత్రాలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అతిథులు అందరి వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, మంత్రులు జోగి రమేశ్, ఆర్ కే రోజా, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డితోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వాతంత్ర్య సమర యోధులు, పద్మ అవార్డు గ్రహీతలు, వివిధ రంగాల ప్రముఖులు, అధికారులు, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు ఈ కార్యక్రమానికి హాజరుకాలేదు.



సీఎం వైఎస్ జగన్‌కు ఆహ్వానిస్తున్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్



ఎట్ హోమ్ కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దంపతులు, సీఎం వైఎస్ జగన్ దంపతులు

భళా 'సంక్షేమ' శకటాలు

- ఘనంగా విజయవాడలో గణతంత్ర దిన వేడుకలు
- ఆకట్టుకున్న సాయుధ దళాల కవాతు
- 12 ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాల ప్రదర్శన
- గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గణతంత్ర దినోత్సవం వేళ శకటాలపై అద్భుతంగా ఆవిష్కృతమయ్యాయి. అతిథుల మనస్సు గెలిచి బహుమతుల పంట పండించాయి. విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి గణతంత్ర దిన వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి హాజరయ్యారు. జెండా ఆవిష్కరణ అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో గవర్నర్ పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన భారత ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, తమిళనాడు పోలీస్, ఏపీఎస్పీ 2వ బెటాలియన్ కర్నూల్, ఏపీఎస్పీ 5వ బెటాలియన్ విజయనగరం, ఎన్‌సీసీ బాలికలు, బాలురు, ఏపీ గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు(బాయ్స్), ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు (బాలబాలికలు), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, యూత్ రెడ్‌క్రాస్, బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ బృందాల కవాతు ఆకట్టుకుంది. వీటితో పాటు 12 ప్రభుత్వ శకటాల ప్రదర్శన ప్రజా సంక్షేమానికి అద్దం పట్టాయి. సాయుధ దళాల కవాతులో భారత్ ఆర్మీ ప్రథమ స్థానంలో, తమిళనాడు పోలీస్ బృందం ద్వితీయ స్థానంలో నిలిచింది. అన్-ఆర్మ్‌డ్ కవాతుల్లో తొలి స్థానంలో ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థుల బృందం, ద్వితీయ స్థానంలో నిలిచిన గిరిజన సంక్షేమ గురుకుల విద్యార్థుల బృందానికి గవర్నర్ బహుమతులు ప్రదానం చేశారు. శకటాల ప్రదర్శనలో విద్యాశాఖ శకటం ప్రథమ స్థానం, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వితీయ, గ్రామ/వార్డు సచివాలయ శాఖ శకటం తృతీయ స్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





1. ప్రథమ బహుమతి గెలుచుకున్న విద్యా శాఖ శకటం
2. ద్వితీయ బహుమతి పొందిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ శకటం

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బాడుగ ఇంటి బాధ తప్పింది..



కూలీనాలీ చేసుకుంటూ బతికే కుటుంబం మాది. నా భర్త విజయశేఖర్ గనిలో పనికిపోతాడు. నేను నాపరాయి పాలిష్ మెషిన్లో బండరాళ్ల పాలిష్ పనికిపోతా. మాకు ఇద్దరు ఆడబిడ్డలు. మా సొంతూరు వైఎస్సార్ కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం బుక్కయ్యపల్లి. పెళ్లికి ముందు అక్కడే గుడిసెలో ఉండేటోళ్లం. పెళ్లి అయ్యాక వైఎస్సార్ జిల్లా యర్రగుంట్ల పట్టణం, ప్రకాష్‌నగర్ కాలనీలో పెంకుటింట్లో అద్దెకు దిగాం. రూ.150 నుంచి రూ.3 వేలు అద్దె వరకు పెరిగింది. అద్దెలు కట్టలేక 20 ఏళ్ల నుంచి ఇంటి స్థలం కోసం నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగాం. మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో వెంట తిప్పించుకున్నారు తప్ప, ఇల్లు కేటాయించలేదు. ఇక మాకు సొంతింటి యోగం లేదనుకుని ఆశలు వదిలేసుకున్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే వలంటీరు మా ఇంటికే వచ్చి, ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేస్తామని చెప్పింది. అలానే కానివ్వండని, ఆధార్ కార్డు వలంటీర్ చేతికిచ్చాం. యర్రగుంట్ల జగనన్న కాలనీలో మాకు ఇంటి స్థలం మంజూరైంది. ప్లాట్ నెం.1036 స్థలానికి పట్టా ఇచ్చారు. వెంటనే ప్రభుత్వం అందించిన సాయం రూ.1.80 లక్షలు, వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా వచ్చిన రూ.32 వేలతోపాటు మేం కూలీనాలీ చేసి దాచుకున్న డబ్బులతో సొంతింటి కలను నెరవేర్చుకున్నాం. ఇపుడు బాడుగ బాధలు తొలిగాయి. జగనన్న ఇచ్చిన ఇంట్లో ఆనందంగా జీవిస్తున్నాం. నర్సింగ్ చదువుతున్న నా పెద్ద కుమార్తె స్వరూపకు విద్యాదీవెన, చిన్న కుమార్తె సింధూరకు అమ్మఒడి డబ్బులు వచ్చాయి. వారి చదువుపై మాకెలాంటి బెంగ లేకుండా పోయింది. మాలాంటి పేదలు ప్రశాంతంగా బతికేందుకు అవసరమైన వాటన్నింటినీ ఈ ప్రభుత్వం సమకూరుస్తోంది. జగనన్నకు మా కుటుంబమంతా రుణపడి ఉంటుంది.

– తీట్ల నీతమ్మ, యర్రగుంట్ల
(వల్లెపు శ్రీనివాసులు, విలేకరి, యర్రగుంట్ల)

సర్కారు సాయంతో నిలదొక్కుకున్నాం



మాది నిరుపేద కుటుంబం. మాకు ఇద్దరు మగ, ఇద్దరు ఆడపిల్లలు. అందరం ప్రకాశం జిల్లా పొదిలి మండలం సూదనగుంట పంచాయతీ రామాపురంలోని ఒకే ఇరుకింట్లోనే సర్దుకుపోయేవాళ్లం. గత టీడీపీ ప్రభుత్వంలో మాకు ఎలాంటి పథకాలు అందలేదు. అందరం కూలీ పనులకు పోయి జీవనం సాగిస్తూండేవాళ్లం. ఉండేందుకు 3.56 ఎకరాల మెట్ట పొలం ఉన్నా అక్కడ పంట దైవాధీనం. చేసేది లేక నా భార్యను రోజువారి కూలీకి పంపి, నేను ఆటో తోలుకుని బతికేవాళ్లం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక మా పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. సంక్షేమ పథకాలతో ఇంటిల్లి పాది లబ్ధి పొందుతున్నాం. నాకు ఆటో ఉండటం వల్ల వాహన మిత్ర ద్వారా ఏడాదికి రూ.10 వేలు జమవుతున్నాయి. రైతు భరోసా ద్వారా ప్రతి ఏటా రూ.13,500 లు, పంటనష్ట పరిహారం క్రింద రూ.51 వేలు వచ్చాయి. నా భార్య సరోజమ్మకు వైఎస్సార్ చేయూత పథకం ద్వారా రూ.18,750లు, సున్నా వడ్డీ కింద రూ. 2వేలు అందాయి. నా కుమారుడు వెంకటేశ్వర్లకు కూడా ఆటో ఉంది. తనకు కూడా వాహనమిత్ర ద్వారా ఏడాదికి రూ. 10 వేలు అందుతున్నాయి. కోడలు కృష్ణవేణి పేరున జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం, సున్నా వడ్డీ కింద రూ.1.80 లక్షలు ప్రభుత్వం అందించింది. నా మనవడు విరహాన్‌కు అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ..15 వేలు అందుతున్నాయి. ఇంతకంటే ఏ కుటుంబానికైనా ఈ ప్రభుత్వం ఏమి చేయాలి. అందుకే మేమెప్పుడూ ఈ ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– ఎద్దు నగేష్, రామాపురం
(మోరా శ్రీనివాసరెడ్డి, విలేకరి, పొదిలిరూరల్)

సొంతంగా వ్యాపారం.. హాయిగా జీవనం..



శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం మహార్తాపురంలో బతుకు లేకపోవడంతో విశాఖపట్నం ఎన్ఏడీ దగ్గరలోని దుర్గాపురంలోని మా కన్నవారింటికి చేరాం. అమ్మ వాళ్లకు భారం కాకూడదని మేము వేరే ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాం. మా ఆయన కాశీబాబు క్రేన్ ఆపరేటర్‌గా ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు. నేను డిగ్రీ చదువుకున్నాను. ఎక్కడికో వెళ్లి ఉద్యోగం చేసేకంటే, ఇంటి వద్దనే పిల్లలను చూసుకుంటూ చిన్న దుకాణం ప్రారంభించాను. ఇందుకు సున్నా వడ్డీ రుణం ఎంతగానో దోహద పడింది. డ్వాక్రా గ్రూపులో కొద్ది కాలం కిందటే సభ్యురాలిగా చేరాను. కొత్త గ్రూపు అయినప్పటికీ రుణం రూ. 1.70 లక్షలు ఇచ్చారు. ఆ మొత్తంతో దుకాణం ఏర్పాటు చేసుకున్నాను. ఇప్పుడు రోజుకు వెయ్యి రూపాయిల వరకు సరుకులు అమ్ముడవుతున్నాయి. పెట్టుబడి పోను మిగిలిన డబ్బులు ఇంట్లో ఖర్చులకు ఉపయోగపడుతున్నాయి. అప్పు కట్టేసిన వెంటనే సున్నా వడ్డీ కూడా పడుతుందని కమ్యూనిటీ ఆర్గనైజర్ చెప్పారు. మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు ఈ ప్రభుత్వం ఇలా ఉదారంగా రుణ సాయం అందిస్తుండటం గొప్ప విషయం. మా పెద్దమ్మాయి భవిష్య 3వ తరగతి చదువుతోంది. ఏటా రూ.15 వేల వంతున అమ్మ ఒడి డబ్బులు వస్తున్నాయి. చిన్నమ్మాయి రిషిత అంగన్‌వాడీకి వెళుతోంది. క్రమం తప్పకుండా పౌష్టికాహారం ఇస్తున్నారు. ఇప్పుడు మా జీవనానికి ఎలాంటి ఢోకా లేదు.

– రేగాన పద్మజ, దుర్గాపురం
(కోవెల కాశీ విశ్వనాథం, విలేకరి, విశాఖపట్నం)



ఎలక్ట్రానిక్ సీమ

నాలుగున్నరేళ్లలో 24 భారీ ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీల రాక

- వీటిల్లో ఇప్పటికే 19 సంస్థల ఉత్పత్తి ప్రారంభం
- దిగ్గజ సంస్థల ద్వారా రూ.10,705 కోట్ల పెట్టుబడులతో పాటు 36,205 మందికి ఉపాధి
- విశాఖ జీఐఎస్ సదస్సులో కొత్తగా మరో 23 ఒప్పందాలు
- తద్వారా రూ.15,711 కోట్ల పెట్టుబడుల ఆకర్షణ.. మరో 55,140 ఉద్యోగావకాశాలు
- కొప్పర్తిలో కొత్తగా 801 ఎకరాల్లో రూ.749 కోట్లతో వైఎస్సార్ ఈఎంసీ అభివృద్ధి
- డిక్సన్‌తో పాటు పలు కంపెనీల పెట్టుబడులతో రూపుమారుతున్న కొప్పర్తి
- ఈ ఒక్క ఈఎంసీ ద్వారానే రూ.8,910 కోట్ల పెట్టుబడులు
- 28,250 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా

ఫోకస్ రిపోర్ట్ సాక్షి

ఎలక్ట్రానిక్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోంది. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో ముఖ్యంగా ఎయిర్ కండీషనర్లు, సెల్‌ఫోన్ కెమెరాలు, సీసీ కెమెరాలు, మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాయి. కోవిడ్ తర్వాత ఎలక్ట్రానిక్ రంగంలో చైనా దిగుమతులను తగ్గించుకోవాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలు (పీఎల్ఐ) స్కీంను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందిపుచ్చుకుంది. ఈ పథకం కింద పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన అనేక కంపెనీలను రాష్ట్రం స్వాగతించి వేగంగా అనుమతులు మంజూరు చేయడంతో అవి ఉత్పత్తిని కూడా ప్రారంభించాయి.

సాక్షి, అమరావతి

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మే, 2019 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి కొత్తగా 19 కంపెనీలు ఉత్పత్తిని ప్రారంభించగా, మరో ఐదు కంపెనీలు నిర్మాణాలు పూర్తిచేసుకుని త్వరలో ఉత్పత్తి ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి. మొత్తం ఈ 24 కంపెనీల ద్వారా రూ.10,705 కోట్ల విలువైన పెట్టుబడులు వాస్తవ రూపంలోకి రావడం ద్వారా 36,205 మందికి ఉపాధి లభించింది. పీఎల్ఐ స్కీం కింద రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన వాటిలో డైకిన్, బ్లూస్టార్, యాంబర్, హావెల్స్ ఇండియా వంటి ప్రముఖ సంస్థలున్నాయి. అలాగే, గతేడాది మార్చిలో విశాఖపట్నంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ మీట్‌లో ఎలక్ట్రానిక్ రంగానికి సంబంధించి 23 ఒప్పందాలు కుదుర్చుకుంది. వీటి ద్వారా మరో రూ.15,711 కోట్ల పెట్టుబడులతోపాటు 55,140 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.

రూ.749 కోట్లతో కొప్పర్తి ఈఎంసీ అభివృద్ధి..

అలాగే, రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ వచ్చాక అప్పటికే ఉన్న తిరుపతి ఈఎంసీ–1, ఈఎంసీ–2, శ్రీసిటీ ఈఎంసీల్లో మౌలిక వసతులను పెంచడంతోపాటు కొత్తగా వైఎస్సార్ జిల్లా కడపలో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ (ఈఎంసీ)ను అభివృద్ధి చేసింది. కోవిడ్ వంటి మహమ్మారి ఉన్నా రికార్డు కాలంలో 801 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీని రూ.748.76 కోట్లతో అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకొచ్చింది. వైఎస్సార్ ఈఎంసీ ద్వారా రూ.8,910 కోట్ల పెట్టుబడులు.. 28,250 మందికి ఉపాధి లభించడమే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల ఆర్థిక స్వరూపాన్ని మార్చనుంది. ఇప్పటికే డిక్సన్ వంటి కంపెనీలు పీఎల్ఐ స్కీం కింద సీసీ కెమెరాల తయారీ యూనిట్‌ను ఏర్పాటుచేసి ఉత్పత్తి ప్రారంభించగా, టెక్నోడ్రోమ్, సెల్‌కాన్ రిజల్యూట్, సాఫ్టసిస్ ప్రైవేట్ లిమిటెడ్‌లతో పాటు ఈ స్కీం కింద విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్లు రానున్నాయి. వైఎస్సార్ ఈఎంసీ పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే ఆ జిల్లా స్థూల ఉత్పత్తి 15 శాతం పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం రూ.41,000 కోట్లుగా ఉన్న ఉమ్మడి వైఎస్సార్ కడపజిల్లా స్థూల ఉత్పత్తి విలువ (జీవీఏ) వైఎస్సార్ ఈఎంసీ రాకతో అదనంగా రూ.6,045 కోట్లు పెరిగి రూ.47,045 కోట్లకు పెరుగుతుందని పరిశ్రమల శాఖ అంచనా వేసింది. వైఎస్సార్ ఈఎంసీలో పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా రూ.33,600 కోట్ల విలువైన ఉత్పత్తులు తయారవుతాయని అంచనా. వీటిద్వారా 28,250 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతోపాటు పరోక్షంగా 42,780 మందికి ఉపాధి లభించనుంది.

మేడిన్ ఆంధ్ర ఏసీలు..

ఇక దేశంలో అమ్ముడయ్యే ప్రతీ రెండు ఎయిర్ కండీషనర్లలో ఒకటి మనం రాష్ట్రంలోనే తయారు కానుండగా, అదే దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే ఏసీ అమ్మకాల్లో 80 శాతం రాష్ట్రంలో తయారయ్యే ఏసీలే ఉండనున్నాయి. దేశంలోని దిగ్గజ ఏసీ తయారీ సంస్థలు రాష్ట్రంలో ఏసీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేసుకుని ఉత్పత్తిని ప్రారంభించాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) స్కీం కింద శ్రీసిటీలో జపాన్ ఏసీ తయారీ సంస్థ డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్ వంటి సంస్థలు భారీ తయారీ యూనిట్లను ఏర్పాటుచేశాయి. ఇందులో ఒక్క డైకినే తొలి దశలో ఏటా 10 లక్షల యూనిట్లను తయారుచేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటుచేయడమే కాక రెండో దశలో మరో 15 లక్షలు తయారుచేసే విధంగా విస్తరణ చేపట్టనుంది. ఇందుకోసం రూ.వెయ్యి కోట్ల పెట్టుబడులను ఈ జపాన్ సంస్థ పెట్టింది. అలాగే, బ్లూస్టార్ ఏటా 12 లక్షల యూనిట్లను తయారుచేసే విధంగా యూనిట్‌ను ఏర్పాటుచేస్తోంది. ప్రస్తుతం ఏటా దేశవ్యాప్తంగా 75 లక్షల గృహ వినియోగ ఏసీలు అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షలు పైనే ఉంటుందని అంచనా. ఈ విధంగా చూస్తే వచ్చే మార్చి నుంచి దేశవ్యాప్తంగా అమ్ముడయ్యే ప్రతీ రెండు ఏసీల్లో ఒకటి మన రాష్ట్రంలో తయరైనదే ఉంటుందని అంచనా. మొత్తం ఈ ఆరు యూనిట్లు, వీటికి సరఫరా చేసే ఉపకరణాల యూనిట్లను చూసుకుంటే ఒక్క ఏసీ తయారీ రంగంలోనే రాష్ట్రం రూ.3,755 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే, 10,000 మందికి ఉపాధి లభించనుంది.



కొప్పర్తి పారిశ్రామిక వాడలోని డిక్సన్ కంపెనీలో పని చేస్తున్న సిబ్బంది

ఈ ఐదేళ్లలో ఉత్పత్తి ప్రారంభించిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలు..

కంపెనీ	ప్రతిపాదిత పెట్టుబడి (రూ. కోట్లలో)	ఉపాధి కల్పన
డైకిన్	4,000	5,000
బ్లూస్టార్	1,050	2,000
ప్యానల్ ఆప్టో డిస్‌ప్లే టెక్నాలజీ	1,230	3,174
యాంబర్ ఎంటర్‌ప్రైజెస్	320	1,500
ఈప్యాక్ డ్యూరబుల్స్	305	1,560
పానాసోనిక్ లైఫ్ సొల్యూషన్స్	600	1,500
హావెల్స్ ఇండియా	300	2,000
సీఈటీసీ రెన్యూవబుల్ ఎనర్జీ	540	350
ఏఐఎల్ డిక్సన్	127	1,500
క్లారియన్ సర్వీసెస్	135	300
ఆరుషి ఏరోసోనిక్స్	120	400
యునైటెడ్ టెలీ లింక్స్	130	1,800
నియోలింక్ టెక్నాలజీస్	120	1,650
ఫాక్స్‌లింక్ ఇండియా ఎలక్ట్రిక్	420	4,290
సన్నీ ఆప్‌టెక్ విస్తరణ	136	1,200
డిక్సన్ టెక్నాలజీస్ (వాషింగ్ మెషీన్)	145	1,131
టీటీఈ టెక్నాలజీస్	700	1,500

ఏపీ ఎలక్ట్రానిక్స్ రంగంలో పెట్టుబడులు..

2019 నుంచి ఇప్పటివరకు ఉత్పత్తి ప్రారంభించిన కంపెనీలు	19
త్వరలో ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి	5
ఈ 24 సంస్థల ద్వారా వచ్చిన పెట్టుబడుల విలువ	రూ.10,705 కోట్లు
వీటి ద్వారా ఉపాధి పొందిన వారు	36,205
ఎలక్ట్రానిక్స్ రంగానికి సంబంధించి జీఐఎస్‌లో జరిగిన ఒప్పందాలు	23
వీటి ద్వారా వచ్చే పెట్టుబడుల విలువ	రూ.15,711కోట్లు
ఉపాధి అవకాశాలు లభించేవారు	55,140
రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టిన వాటిలో దిగ్గజ సంస్థలు.. డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్	
కొప్పర్తి ఈఎంసీ అభివృద్ధికి ఖర్చుపెట్టిన మొత్తం	రూ.749 కోట్లు
ఇందులో వచ్చే పెట్టుబడుల విలువ	రూ.8,910 కోట్లు
వీటి ద్వారా ఉపాధి పొందేవారు	28,250
ఈ ఈఎంసీ పూర్తిస్థాయిలో పనిచేస్తే ఏటా వచ్చే ఉత్పత్తుల విలువ	రూ.33,600 కోట్లు
మొత్తం ఉపాధి పొందేవారు	71,030
ఇది పూర్తిగా అమల్లోకి వస్తే జిల్లా స్థూల ఉత్పత్తి పెరిగే శాతం	15
ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఏసీలు	75 లక్షలు
ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం	50 లక్షలు

రూ.749 కోట్లతో వైఎస్సార్ ఈఎంసీ అభివృద్ధి..

ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ కోసం వైఎస్సార్ ఈఎంసీని 801 ఎకారాల్లో అభివృద్ధి చేస్తున్నాం. ఇందులో తొలిదశలో 540 ఎకరాలు, రెండో దశలో 261 ఎకరాలు అభివృద్ధి చేయనున్నాం. తొలిదశలో రూ.749 కోట్లతో వైఎస్సార్ ఈఎంసీని అభివృద్ధి చేశాం. దీని ద్వారా సుమారు రూ.8,910 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడమే కాక సుమారు 28,250 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నాం. రానున్న కాలంలో ఎలక్ట్రానిక్ తయారీ హబ్‌గా కొప్పర్తి రూపుదిద్దుకోనుంది.

– కోన శశిధర్, ఐటీ శాఖ కార్యదర్శి

ఎలక్ట్రానిక్ రంగంలో 36,205 మందికి ఉపాధి..

ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక హబ్‌గా తయారవుతోంది. టీవీలు, వాషింగ్ మెషీన్లు, సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్లు, ఏసీలు వంటి అనేక కీలక ఉత్పత్తులకు రాష్ట్రం కేంద్రంగా మారుతోంది. అత్యధిక వినియోగం ఉండే దక్షిణాది రాష్ట్రాలకు చిత్తూరు, తిరుపతి, వైఎస్సార్ జిల్లాలు దగ్గరగా ఉండటంతో పెట్టుబడులను ఆకర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలు అందిస్తున్నాయి. ప్రస్తుతం ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క ఎలక్ట్రానిక్ రంగంలోనే రాష్ట్రం రూ.10,705 కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 36,205 మందికి ఉపాధి కల్పించింది.

– సాలికిరెడ్డి కిరణ్, గ్రూపు సీఈఓ, అపిటా

అబద్ధాల రోగం.. కథనాలు ఘోరం

- పేదలకు ఉచిత వైద్యంపైనా రామోజీకి కడుపుమంటే
- ఆరోగ్యశ్రీ సేవలపై విషంజిమ్ముతూ ఈనాడు కథనం
- నిరాటంకంగా కొనసాగుతున్న ఉచిత వైద్య సేవలు
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో రోగులను చేర్చుకోని ఘటనలు లేవు
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే రూ. 2,790.61 కోట్ల చెల్లింపు
- అయినా ఆస్పత్రులు చేతులెత్తేస్తున్నాయంటూ అక్కసు రాతలు

సాక్షి, అమరావతి: అబద్ధాలు అచ్చేయకపోతే రామోజీరావుకు నిద్రపట్టేలా లేదు. వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లకుండా ఆయన భోజనం చేయలేరు. పేదలకు అందించే ఉచిత కార్పొరేట్ వైద్యం పైనా విషపురాతలే. రాష్ట్రంలో పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందడం రామోజీరావుకు నచ్చడం లేదు. మన రాష్ట్రంతో పాటు, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాల్లోని ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద పేద, మధ్యతరగతి ప్రజలకు అందుతున్న ఉచిత వైద్య సేవలపై నిత్యం కడుపు మంటను ప్రదర్శిస్తున్నారు. ఈ పరంపరలో భాగంగానే 'బకాయిల రోగం.. సేవలు ఘోరం!' అంటూ ఈనాడు పత్రికలో శుక్రవారం కథనం అచ్చేశారు. ఆ పథకం సమర్థవంతంగా అమలు కావడం లేదంటూ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేశారు. బకాయిల కారణంగా రాష్ట్రంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో సేవలు ఆగిపోయాయంటూ ఆరోపణలు చేశారు. ఈ క్రమంలో వాస్తవాలను ఓ సారి పరిశీలిస్తే..

ఈ ఏడాది రూ. 2,790.61 కోట్లు చెల్లించిన ప్రభుత్వం

గత టీడీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పూర్తి నిర్లక్ష్యం చేసింది. ఈ ప్రభుత్వం వచ్చాక ఆ పథకానికి ప్రాధాన్యత గణనీయంగా పెరిగింది. బాబు పాలనలో నిర్వీర్యమైన పథకానికి సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణల ద్వారా ఊపిరిలూదారు. ఇటీవలే పథకం కింద వైద్య ఖర్చుల పరిమితిని ఏకంగా రూ. 25 లక్షలకు పెంచారు. 1,059 ప్రొసీజర్‌లను 3,257కు తీసుకుని వెళ్లారు. ప్రొసీజర్‌ల సంఖ్య గణనీయంగా పెరగడంతో 2019కు ముందు రోజుకు సగటున 1,547 చికిత్సలు చేయగా, ప్రస్తుతం 5,608 చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ పథకం ఇంత ఘనంగా కొనసాగుతుంటే.. రాష్ట్రంలో నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేశాయంటూ అబద్ధాలను అల్లి ఆ కథనం ప్రచురించారు. నిజానికి ఆరోగ్యశ్రీ సేవలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. ఏ నెట్‌వర్క్ ఆస్పత్రిలోనూ రోగులను చేర్చుకోని ఘటనలు లేవు. కావాలని ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు, సేవలకు అంతరాయం కలిగించే ఆస్పత్రులపై తగిన చర్యలు తీసుకుంటున్నారు.



ఫ్యాక్ట్ చెక్

త్వరితగతిన క్లెయిమ్‌లు

గత ఆర్థిక సంవత్సరంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి రూ. 2,146.90 కోట్లు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం చెల్లించింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకూ రూ. 2,790.61 కోట్లు విడుదల చేశారు. ఆస్పత్రుల నుంచి వచ్చే క్లెయిమ్‌లను త్వరితగతిన అత్యంత పారదర్శకంగా ఆమోదిస్తున్నారు. ప్రభుత్వ స్పెషలిస్టు వైద్యులను ప్యానెల్ వైద్యులుగా తీసుకునే ప్రక్రియ చేపడుతున్నారు. క్యాన్సర్ చికిత్స ముందస్తు అనుమతి, క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రముఖ కేంద్ర ప్రభుత్వ సంస్థలైన ఎయిమ్స్, హోమీబాబా, శ్రీవెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలైన డీఎంఈ, స్విమ్స్, విమ్స్ వైద్యుల సేవలను వినియోగించుకుంటున్నారు. ఈ క్రమంలో క్లెయిమ్స్ ఆమోద ప్రక్రియలో తీవ్రమైన జాప్యానికి ఆస్కారమే లేదు.

లంచాలకు తావు లేకుండా

లంచాలకు, డబ్బు వసూళ్లకు తావులేకుండా పేదరోగులకు పూర్తి ఉచితంగా పథకం సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందేటప్పుడు నెట్‌వర్క్ ఆరోగ్యమిత్రల పర్యవేక్షణ ఉంటుంది. డిశ్చార్జ్ సమయంలో ఆసుపత్రిలో సేవలు ఎలా అందాయో రోగుల నుంచి అభిప్రాయ సేకరణ విధానం అమలు చేస్తున్నారు. డిశ్చార్జ్ అనంతరం కూడా రోగులు ఇంటికెళ్లి ఏఎన్ఎంలు మరోమారు ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియలో ఎక్కడైన రోగులు లంచాలు, చేతి నుంచి డబ్బు చెల్లించిన ఘటనలు వెలుగు చూస్తే వెంటనే ఆ డబ్బులు వెనక్కి ఇప్పించడంతో పాటు, బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నారు. రోగులకు పథకం విషయంలో సందేహాల నివృత్తి వారికి ఎదురయ్యే సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణకు 104 కాల్ సెంటర్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోంది. కాల్ సెంటర్‌లకు వచ్చే ఫిర్యాదులను విచారించి చర్యలు తీసుకుంటున్నారు.

టీడీపీ నేత బొల్లినేని కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: భర్త, అతని తరపు బంధువుల నుంచి తనకు ప్రాణహాని ఉందని, భద్రత కల్పించాలని కోరుతూ హైదరాబాద్ ఖాజాగూడకు చెందిన బొల్లినేని కృష్ణవేణి దాఖలు చేసిన పిటిషన్‌లో టీడీపీ నేత బొల్లినేని కృష్ణయ్యకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆమెకు భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. కృష్ణయ్యతో పాటు హోం శాఖ ముఖ్య కార్యదర్శి, రాయదుర్గం ఎస్‌హెచ్‌ఓ, సైబరాబాద్ కమిషనర్, డీజీపీ, అనధికారిక ప్రతివాదులు హేమ, వీఎస్‌ఈ ప్రసాద్‌లకు కూడా నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 15కు వాయిదా వేసింది. 'ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత, కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య నన్ను రెండో వివాహం చేసుకున్నారు. ఆయనకు, నాకు పుట్టిన ముగ్గురు పిల్లల్లో ఇద్దరిని నా వద్ద కాకుండా మొదటి భార్య, బంధువుల వద్ద పెంచుతున్నారు. నా కుమారుడి తల్లి పేరు కూడా మార్చి సర్టిఫికెట్లు సృష్టించారు. ఈ విషయంలో పలుమార్లు గొడవలు కూడా చోటు చేసుకున్నాయి. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడే వారిని తీసుకెళ్లడంతో వారు నేనే అసలు తల్లిని అని గుర్తించలేని పరిస్థితిలో ఉన్నారు. విధిలేని పరిస్థితుల్లో నా భర్తపై రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశా. అయితే పోలీసులు పారదర్శకంగా విచారణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారు. కనీసం నాకు భద్రత కల్పించాలని కోరినా పోలీసులు ఇంత వరకు స్పందించడం లేదు. నా పిల్లలకు నేనే తల్లిని అని చెప్పుకునే స్థితికి తీసుకొచ్చిన ఈ అంశంపై సిట్ లేదా సీబీసీఐడీతో దర్యాప్తు జరిపించాలి' అని కోరుతూ కృష్ణవేణి పిటిషన్ దాఖలు చేశారు.

ఈ ఆత్మ (పరమ పురుషుడు) సమస్త ప్రాణుల్లోనూ నిహితమై ఉన్నప్పటికీ,
యోగమాయ తెర వెనుక దాగివుండటం వల్ల అందరికీ ప్రత్యక్షం కాదు.
తమ బుద్ధిని అతి సూక్ష్మము, తీక్షణంగా మలుచుకున్నవారు మాత్రమే దర్శించగలరు.
– కేనోపనిషత్తు

సాక్షి

శనివారం, 27 జనవరి 2024

నితీశ్ కొత్త అవతారం!

గాలి ఎటు వీస్తున్నదో... అది ఏ గమ్యం చేరుతుందో బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు తెలుసున్నంతగా దేశంలో మరే రాజకీయ నాయకుడికీ తెలియదని ఇప్పటికే ముద్రపడింది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా ఆయన మరోసారి ఈ విన్యాసానికి తెరలేపారు. విపక్ష ఇండియా కూటమి ఏర్పాటులో చొరవ తీసుకుని, నాలుగైదు సమావేశాల్లో కూడా పాల్గొన్న నితీశ్ మరోసారి రంగు మార్చబోతున్నారని వారం రోజులుగా కథనాలు వస్తూనేవున్నాయి. మరికొన్ని గంటల్లో ఆయన కాషాయ కూటమి తీర్థం పుచ్చుకుని తరించబోతున్నారని కథనాలు వెలువడుతున్న దశలో కూడా ఆయన మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. పరస్పర విరుద్ధ సంకేతాలిస్తూ కథను రక్తికట్టించటానికి ఆయన పార్టీ జేడీ(యూ) ప్రయత్నిస్తోంది. ఒకపక్క తదుపరి సర్కారు గురించి గవర్నర్‌తో మంతనాలు జరుపుతూ కూడా 'మహాగఠ్‌బంధన్ సర్కారు బాగానేవుంది. మీడియా కథనాలన్నీ ఊహాగానాలే' అంటూ ఆ పార్టీ అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుష్వాహ్ ప్రకటించటం ఎవరిని నమ్మించటానికో అర్థం కాదు. చిత్రమేమంటే మహాగఠ్‌బంధన్ కాపురాన్ని వదులుకోకుండానే... సీఎం పదవికి రాజీనామా చేయకుండానే ఆదివారం ఆయన నేతృత్వంలో ఏర్పడబోయే ఎన్డీయే సర్కారులో ఉపముఖ్యమంత్రులుగా, మంత్రులుగా ఎవరెవరుండాలనే నిర్ణయాలు జరిగిపోతున్నాయి. పట్నా–ఢిల్లీ మధ్య ఫోన్‌లైన్లు బిజీ అయిపోయాయి. బీజేపీలో బహిరంగంగానే హడావుడి కనబడుతోంది. ఎందుకిలా? 'రాజకీయాల్లాంటి జూదం మరేదీ లేదు... అక్కడ కనిపించినంత ప్రస్ఫుటంగా మరెక్కడా వైపరీత్యాలు కనబడవు' అని వెనకటికొక రాజనీతిజ్ఞుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ పోకడలు గమనిస్తే అది అక్షరాలా నిజం అనిపిస్తుంది. ఆయన ఒక కూటమిలో వున్నంత కాలం మరో కూటమి ఆయన రాక కోసం ఎదురు చూస్తూ వుంటుంది. నితీశ్‌కు సీఎం పదవి కట్టబెట్టి ఆయన డిప్యూటీలుగా కొనసాగేందుకు రెండుచోట్లా నేతలు సిద్ధంగావుంటారు.

కూటములను మార్చటంలో నితీశ్‌ను తలదన్నే నేత దేశంలో మరెవరూ ఉండకపోవచ్చు. ఏపీ మాజీ సీఎం చంద్రబాబు నాయుడొక్కరే బహుశా ఆ విషయంలో నితీశ్‌తో పోటీపడగలరు. ఎన్డీయేతో తన దశాబ్దకాల అనుబంధాన్ని 2013లో నితీశ్ తెంచుకుని అందరినీ ఆశ్చర్యపరిచారు. నరేంద్ర మోదీని బీజేపీ ప్రధాని అభ్యర్థిగా ప్రకటించటం అప్పట్లో ఆయనకు అభ్యంతరం అనిపించింది. తీరా 2014 లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలవడం, కేంద్రంలో ఎన్డీయే సర్కారు ఏర్పడటంతో సీఎం పదవికి రాజీనామా చేసి జీతన్‌రాం మాంఝీని ఆ పీఠంపై కూర్చోబెట్టారు. కానీ ఆ వైరాగ్యం మూన్నాళ్ల ముచ్చటే అయింది. కొన్ని నెలలకే ఆయన్ను తొలగించి తిరిగి సీఎం అయ్యారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, కాంగ్రెస్‌లతో కలిసి మహాగఠ్‌బంధన్ కూటమి కట్టి మరోసారి సీఎం అయ్యారు. కానీ రెండేళ్లు గడిచేసరికల్లా మళ్లీ ఎన్డీయే గూటికి చేరి మళ్లీ సీఎం అవతారమెత్తారు. మోదీ నాయకత్వాన్ని సంపూర్ణంగా ఆమోదించారు. తీరా 2022లో దాన్నుంచి బయటపడి మరోసారి మహాగఠ్‌బంధన్ సర్కారుకు సారథ్యం వహించారు. తాజాగా ఎన్డీయే కూటమిలో ప్రవేశం ఖరారైందన్న కథనాలు నిజమైతే ఆయన ముచ్చటగా మూడోసారి రంగు మార్చినట్టు! 2005లో తొలిసారి సీఎంగా అయినప్పుడు మొదలుకొని ఈ పదిహేడేళ్లలో ఆయన పదహారేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. చిత్రమేమంటే ఆయన ఎన్నిసార్లు యూటర్న్‌లు తీసుకున్నా బిహార్‌లో కాస్త అటూ ఇటూగా ఆయన ప్రతిష్ఠకు ఏనాడూ ఇబ్బంది కలగలేదు. లాలూ ప్రసాద్ యాదవ్, అటుపై ఆయన సతీమణి రబ్డీ దేవి ఏలుబడి సవ్యంగా వుంటే నితీశ్ ప్రాభవం ఈ స్థాయిలో ఉండేది కాదేమో! తన సొంత సామాజికవర్గం కుర్మీల బాగోగులు చూస్తూ బాగా వెనకబడిన కులాలనూ, మహాదళిత్ కులాలనూ సమాదరించి 'కోటాలో కోటా' కల్పించటం ఆయనకు రాజకీయంగా కలిసొచ్చింది. అట్టడుగు వర్గాలకు ప్రాధాన్యతనీయటంవల్ల ఆధిపత్య కులాల్లో కొంత అసంతృప్తి ఉన్నమాట నిజం. అలాగే బీజేపీతో తరచు దగ్గరవుతున్నందుకు ముస్లింలలోనూ నితీశ్‌పై కినుకవుంది. కానీ ఆయన్ను పూర్తిగా దూరం పెట్టేంత తీవ్ర వ్యతిరేకత ఆ వర్గాల్లో లేకపోవటం నితీశ్‌కు ఆమోదయోగ్యతను కల్పిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లో బీసీల్లోనూ, దళితుల్లోనూ అత్యంత వెనకబడిన కులాల ఆదరణను సులభంగా పొందగలిగిన బీజేపీకి బిహార్‌లో నితీశ్ అండదండలుంటేనే అది సాధ్యంకావటం జేడీ(యూ)కు తోడ్పడుతోంది.

మన పార్లమెంటరీ పార్టీలకు సిద్ధాంత జంజాటం తక్కువ. కొంతకాలం క్రితంవరకూ వామపక్షాల్లో, మితవాదపక్షాల్లో ఆ పట్టింపు ఎక్కువుండేది. కానీ ఓట్ల, సీట్ల వేటలో అది మసకబారింది. వామపక్షాలు బీజేపీని అంటరాని పార్టీగా చూస్తాయి తప్ప దాంతో జతకట్టినవారిపట్ల ఆ భావం వుండదు. వారు బయటపడిన మరుక్షణం పునీతులైనట్టే భావిస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో గాలివాలుకు తగినట్టు రంగులు మార్చే నితీశ్ వంటి వారి నుంచి మెరుగైన కార్యాచరణను ఆశించలేం. ఆ సంగతలావుంచి ఇప్పటికే తృణమూల్ అధినేత, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రంలో ఇండియా కూటమితో పొత్తుండదని చెప్పిన తరుణంలో, పంజాబ్ ఆప్ నేత, సీఎం భగవంత్ మాన్ సైతం అదే బాణీ వినిపించిన నేపథ్యంలో నితీశ్ నిర్ణయం ఇండియా కూటమిని నామమాత్రావశిష్టం చేస్తుంది. నిర్దిష్టమైన సిద్ధాంతం లేనివారినీ, సులభంగా రంగులు మార్చే వారినీ, సూత్రబద్ధ రాజకీయాలు అనుసరించలేని వారినీ వెంటేసుకుని కూటమి కట్టినంత మాత్రాన మెరుగైన ఫలితాలు రావని, ఎంత మాత్రమూ ప్రయోజనం ఉండదని విపక్షాలు ఇప్పటికైనా గ్రహించటం ఉత్తమం.

ఈశాన్య సరిహద్దుల్లో మత్తు మహమ్మారి

విశ్లేషణ



డాక్టర్ గద్దె ఓంప్రసాద్

ఇండియా–మయన్మార్ సరిహద్దులను కంచెతో మూసేస్తామని ఇటీవల కేంద్ర హోంమంత్రి ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ఉన్న 1,643 కిలోమీటర్ల సరిహద్దు గుండా ఈశాన్య రాష్ట్రాల్లోకి మత్తు పదార్థాలు, ఆయుధాలు సరఫరా అవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అఫ్గానిస్తాన్‌ను దాటి మయన్మార్ ప్రపంచంలో అత్యధిక నల్లమందు ఉత్పత్తిదారుగా అవతరించిందని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. ఆ సాగుకు కావాల్సిన నీరు, ఎరువులు, మూలధన పెట్టుబడులు, కొనుగోలుదారులు, మార్కెటింగ్, హవాలా లాంటి కార్యకలాపాలన్నీ ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌గా ఏర్పడ్డాయి. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటుగా, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా సమాజాన్ని జాగృతం చేస్తే తప్ప ఈ ప్రమాదాన్ని అరికట్టలేం.

కాలాడాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా మయన్మార్‌లోని సిత్వే పోర్ట్‌ను మిజోరం రాజధాని ఐజ్వాల్‌తో కలిపే ప్రణాళికలో ముఖ్యమైన పాలేత్వా పట్టణాన్ని సాయుధ తిరుగుబాటు గెరిల్లా గ్రూపు అరగాన్ ఆర్మీ స్వాధీనం చేసుకుందన్న వార్తలు... ఇండియా–మయన్మార్ సరిహద్దులను కంచెతో మూసేస్తాం అన్న కేంద్ర హోం మంత్రి ప్రకటన... ఈ రెండు కూడా భారతదేశ భద్రతతో ముడిపడిన అంశాలు. అలాగే ఇటీవల మణిపూర్‌లో చెలరేగిన జాతుల మధ్య ఘర్షణతో కూడా కొంత సంబంధం ఉన్న విషయాలు. 2003 డిసెంబర్‌లో వెలువడిన 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' నివేదిక ప్రకారం, అఫ్గానిస్తాన్‌ను దాటి మయన్మార్ ప్రపంచంలో అత్యధిక నల్లమందు ఉత్పత్తిదారుగా అవతరించింది. అఫ్గానిస్తాన్‌లో నల్లమందు సాగుపై తాలిబన్ ప్రభుత్వం తీసుకొంటున్న కఠిన చర్యల ఫలితంగా అక్కడి ఉత్పత్తిలో గణనీయమైన తరుగుదల కనిపిస్తుండగా, మయన్మార్‌లో పెరుగుతోందన్న వార్తలు సరిహద్దు పంచుకుంటున్న భారత్ లాంటి దేశాలకు కలవరం కలిగించేదే.

దశాబ్దాలపాటు మయన్మార్‌లో నెలకొన్న రాజకీయ అస్థిరత, సాయుధ తిరుగుబాటు... నల్లమందు (ఓపియం) ఉత్పత్తి పెరగడానికి కారణమయ్యాయి. పేదరికంతో బాధపడుతున్న రైతులకు నల్లమందు సాగు పరిస్థితులు మెరుగుపరుచుకునేందుకు ఒకే ఒక మార్గంగా అవతరించింది. కిలోకు సుమారు 23 వేల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఒక కోటి పదిలక్షల హెక్టార్ల సాగు చేయదగిన భూమి ఉన్న మయన్మార్‌లో దాదాపు 47,000 హెక్టార్లు అంటే 0.5 శాతం భూమిలో నల్లమందు పండుతోంది. దీనివల్ల గతేడాది 1080 మెట్రిక్ టన్నుల నల్లమందు ప్రపంచ మార్కెట్లోకి విడుదలైంది. ఇది 2022లో ఆ దేశం ఉత్పత్తి చేసిన నల్లమందు కన్నా సుమారు 36 శాతం అధికం. ఇదే సమయంలో ఎకరానికి సగటు ఉత్పత్తి 19 నుండి 22 కిలోలకు పెరిగింది. సాగులో అధునాతన పద్ధతులు అవలంబిస్తున్నారనీ, ఆయా ప్రాంతాలను నియంత్రిస్తున్నవారి సహాయం లేకుండా ఇది సాధ్యపడదనీ మనం అర్థం చేసుకోవచ్చు. ఈ మొత్తం వ్యాపారం విలువ సుమారు రెండు బిలియన్ డాలర్లు. ఈ నల్లమందు ద్వారా ఉత్పత్తయ్యే హెరాయిన్, మార్ఫిన్, కోడెయిన్ వంటి మత్తు పదార్థాల ద్వారా సుమారు పది బిలియన్ డాలర్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. ఇది మయన్మార్ స్థూల జాతీయోత్పత్తిలో 2–4 శాతం.

మయన్మార్‌లో ముఖ్యంగా మూడు రాష్ట్రాలైన షాన్, చిన్, కాచిన్‌లలో నల్లమందు సాగు నిరాటంకంగా జరుగుతోంది. థాయిలాండ్, లావోస్ దేశాలను అనుకుని ఉండే షాన్‌లో 1750ల లోనే నల్లమందు సాగు మొదలైంది. క్రమంగా ఆ ప్రాంతం మొత్తం విస్తరించి, ఇరవయ్యో శతాబ్దం నాటికి గోల్డెన్ ట్రయాంగిల్ రూపంలో అవతరించడమే గాక, ప్రపంచంలో సగం నల్లమందు ఆధారిత మత్తుపదార్థాలు ఉత్పత్తి చేసే స్థాయికి ఎదిగింది. ఈ ఒక్క రాష్ట్రంలోనే సుమారు 80 శాతం ఉత్పత్తి జరుగుతుంటే, భారత్‌ను ఆనుకొని ఉండే చిన్, కాచిన్ రాష్ట్రాలు మిగిలిన ఇరవై శాతం ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ రాష్ట్రాలలోని టాహం, ఫాలం, తుఎంసెంగ్ ప్రాంతాల మీదుగా మయన్మార్‌తో సుమారు 510 కిలోమీటర్ల కంచె లేని సరిహద్దు కలిగి వున్న మిజోరంలోని ఛాంపై, మణిపూర్‌లోని మొరెహ్, టాము ప్రాంతాల ద్వారా నల్లమందు భారత్‌లోకి చేరుతోంది. మయన్మార్‌తో సుమారు 1,600 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్న భారత్‌పై, ముఖ్యంగా మిజోరం, మణిపూర్, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలపై దీని ప్రభావం పడుతుందనడంలో సందేహం లేదు.



వివిధ జాతులకు చెందిన సాయుధ పోరాట సంస్థలతో పాటు కొన్ని మిలిటరీ విభాగాలు, రాజకీయ నాయకులు తమ అవసరాల కోసం, ఆయుధాల కొనుగోలు కోసం ఈ మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో భాగం పంచుకుంటున్నారు. కాచిన్ ప్రాంతంలోని కాచిన్ ఇండిపెండెన్స్ ఆర్మీ, అరగాన్ ఆర్మీ, యునైటెడ్ వా స్టేట్ ఆర్మీ వాటిలో కొన్ని మాత్రమే. అలాగే చిన్ రాష్ట్రం నుండి కార్యకలాపాలు సాగిస్తున్న చిన్ నేషనల్ ఆర్మీ, చిన్ నేషనల్ డెమోక్రాటిక్ ఫోర్స్, చిన్ ల్యాండ్ డిఫెన్స్ ఫోర్స్ లాంటి కొన్ని సాయుధ సంస్థలతో పాటు, సరిహద్దులకు ఇరువైపులా కార్యకలాపాలు సాగిస్తున్న కుకీ నేషనల్ ఆర్మీ కూడా ఈ వ్యవహారాల్లో భాగం కావడం ఆందోళన కలిగించేదే. సరిహద్దు దేశాలపై తిరుగుబాటు దారులకు వ్యతిరేకంగా ఒత్తిడి తేవడానికి మయన్మార్ మిలిటరీ జుంటా కూడా ఈ నల్లమందు అక్రమ రవాణాలో భాగం పంచుకుంటోందని ఆ దేశానికి చెందిన 'నేషనల్ యూనిటీ కన్సల్టేటివ్ కౌన్సిల్' సభ్యుడు యు మయూన్గ్ మయూన్గ్ ఆరోపిస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌లో చైనీస్ డ్రగ్ కార్టెల్స్ పాత్ర చెప్పుకోదగినది. డ్రగ్స్‌ను అటు ఆగ్నేయాసియా మార్కెట్లలోకి తరలిస్తూ, ఇటు థాయిలాండ్ నుంచి మయన్మార్, బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ మీదుగా ఈశాన్య రాష్ట్రాల్లోకి ఆయుధాల్ని సరఫరా చేస్తున్నాయి.

ఈశాన్య ప్రాంతానికి చెందిన సాయుధ వేర్పాటు దళాలు ఇంతకు ముందు నిధుల సేకరణకు బ్యాంకు దోపిడీలు, టీ గార్డెన్లు, వ్యాపార సముదాయాల నుండి అక్రమ వసూళ్లు, ప్రజల వద్ద పన్నులు, కాంట్రాక్టర్లు, రాజకీయ నాయకుల నుండి డబ్బు గుంజడాలు లాంటివి చేస్తుండేవి. ఈ నిధులను మయన్మార్‌లోని కాచిన్ వేర్పాటు వాద వర్గాల నుండి ఆయుధాలు కొనుగోలు కోసం వెచ్చిస్తుండేవి. అవి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో పాలు పంచుకునేవి కాదు. కానీ గత కొన్నేళ్లుగా ఈ ధోరణిలో మార్పు వస్తోంది. ఈ వ్యవహారాలను పరిశీలిస్తే, నాలుగు విషయాలు గోచరిస్తాయి. ఈశాన్య రాష్ట్రాల్లోని కొండ, మారుమూల ప్రాంతాల్లో నల్లమందు, గంజాయి సాగు పెరుగుతోంది. హెరాయిన్, యాంఫేటమిన్ లాంటి మత్తు పదార్థాలు చిన్న పరిమాణాల్లో ఈశాన్య రాష్ట్రాలకు వస్తున్నాయి. కొన్ని రకాల ఫార్మాస్యూటికల్స్ ఈశాన్య రాష్ట్రాల నుండి మయన్మార్‌లోకి రవాణా అవుతున్నాయి. యాంఫేటమిన్ లాంటి మత్తు పదార్థాలు ఉత్పత్తి చేయడానికి కావాల్సిన ఫెడ్రిన్, సూడోఫెడ్రిన్ లాంటివి మయన్మార్‌కు ఈశాన్య రాష్ట్రాల నుండి వెళ్తున్నాయి. అంటే సరిహద్దులకు ఇరు వైపులా సాగుతున్న వ్యవహారం ఇది!

పశ్చిమాన అఫ్గానిస్తాన్, వాయవ్య పాకిస్తాన్, మధ్య ఆసియాతో కూడిన 'గోల్డెన్ క్రెసెంట్'కూ... తూర్పున మయన్మార్, థాయిలాండ్, లావోస్‌లతో కూడిన 'గోల్డెన్ ట్రయాంగిల్'కూ మధ్యలో ఉన్న భారత్ మాదక ద్రవ్యాలకు అతిపెద్ద ఆకర్షణీయమైన మార్కెట్. మత్తు పదార్థాలను ఏమాత్రం సహించని(జీరో టోలరెన్స్) విధానాన్ని కేంద్ర ప్రభుత్వ స్వీకరించింది. దీనిలో భాగంగా 2016లో నార్కో కోఆర్డినేషన్ సెంటర్, కేంద్ర రాష్ట్రాల మధ్య సమన్వయం కోసం 2019లో జాయింట్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటైనాయి. 'నార్కోటిక్స్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్స్' చట్టం 1985లో భాగంగా బీఎస్ఎఫ్, ఎస్ఎస్‌బీ, అస్సాం రైఫిల్స్‌కు డ్రగ్స్ వ్యతిరేక చర్యలు తీసుకోవడానికి అధికారం కల్పించారు. ఇప్పటివరకూ సుమారు ఒకటిన్నర లక్షల కిలోల మత్తు మందులను స్వాధీనం చేసుకొని ధ్వంసం చేస్తే, అందులో నలభై వేల కిలోలు ఒక్క ఈశాన్య రాష్ట్రాల్లోవే. ప్రభుత్వాలే కాకుండా వివిధ రంగాల ప్రజలు కూడా సమాజాన్ని జాగృతం చేస్తేనే మత్తు మహమ్మారిని అరికట్టగలం. కొన్ని సినిమాల్లో చూపిస్తున్న విధంగా డ్రగ్స్ సేవించడం, సైకోల్లా ప్రవర్తించడమే హీరోయిజంగా యువత భావిస్తే మనం కేవలం నిట్టూర్పు విడవాల్సి వస్తుంది.

వ్యాసకర్త అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన విభాగం, జేఎన్‌యూ । 79089 33741

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

చెల్లెలా, సెలవు!



డియర్ బవత (భవతారిణి: సంగీత దర్శకురాలు, ఇళయరాజా కూతురు). దీన్ని భారమైన హృదయంతో రాస్తున్నాను. నువ్వు నా సొంత చెల్లెలిలాంటి దానివి. గత కొన్ని వారాలుగా నాకు నచ్చిన వాళ్లను ఎందుకు కోల్పోతున్నానో నాకు తెలీదు. ఈ జీవితపు నిర్మాణం నాకు అంతు పట్టడం లేదు. నీ ఆత్మకు శాంతి కలగాలి.

– విశాల్, నటుడు

ఏం మిగిలిందని?



గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోవడానికి ఏమీ మిగల్లేదు. రాజ్యాంగం చచ్చిపోయింది. అన్ని సంస్థలూ ఉమ్మడిగా ఆ మిగిలివున్న గణతంత్ర నిర్మాణాన్ని కాస్తా కూల్చేస్తున్నాయి. ఇది శోకించాల్సిన, మనల్ని మనం తరచి చూసుకోవాల్సిన రోజు.

– అపూర్వానంద్, ప్రొఫెసర్

రాజీ మార్గం



మార్కెట్ ధరకు పొందని నేల మీద చేసే నమాజు చెల్లదని మా ముస్లింలకు తెలును. ఒకవేళ సాక్ష్యాధారాలు లేకపోవడమే అయోధ్య కేసులో పోరాటానికి కారణమైతే... మరి కాశీ, మధురల్లో ఉన్న పుష్కలమైన సాక్ష్యాధారాలు రాజీకి సరిపోవా?

– షెహలా రషీద్, యాక్టివిస్ట్

జరిగేదదే!

'లౌకిక', 'సామ్యవాద' పదాలు లేని పాత రాజ్యాంగ పీఠికను భారత ప్రభుత్వ అధికారిక హ్యాండిల్ షేర్ చేసింది. ఈ పదాలను తొలగించేలా పార్లమెంటులో కొత్త సవరణ తేవడానికి ఇంకెంతో కాలం పట్టదు.

– సిద్ధార్థ్, వ్యాఖ్యాత

మన ఘనత



ప్లేటో, అరిస్టాటిల్ రాశారని తప్పుగా ఆపాదించిన వందలాది పుస్తకాలను విశ్లేషించిన కొద్దీ, ప్రాచీన గ్రీకులు సంస్కృతం, పాళీ పుస్తకాలు చదివారని స్పష్ట మవుతుంది. చాలాసార్లు వాళ్లే దాన్ని ఒప్పుకొంటారు కూడా. జేఎన్‌యూ పీహెచ్‌డీలు అలాంటి అంశాల మీద పరిశోధనలు చేయాలి; మొఘలుల పట్ల అపరాధనా భావాన్ని చూపే నాసిరకపువి కాకుండా.

– జోసెఫ్ టి. నూనీ, రచయిత

చిత్రకళకు కొండంత చిరునామా

ఆ చిత్రాలను చూస్తే మన కనులకు ఆహ్లాదం మన మనసుకు ఆనందం. సప్తవర్ణ సోయగాలు బొమ్మలుగా సాక్షాత్కరిస్తాయి. విశాలంగా రెక్కలార్చిన పక్షులూ, శరవేగంగా పరుగులెత్తే జింకలూ ఎలా కాన్వాస్‌పై రంగుల్లో నిలిచిపోతాయో, గలగల సెలయేరులూ గంగానది ప్రవాహాలు కళ్ల ముందు నిలుస్తాయి. అభిజ్ఞాన శాకుంతల కావ్యమైనా, రామాయణ భారత భాగవతాది కథలైనా వారి కుంచె విన్యాసాల్లో ఒదిగిపోతాయి. కోతుల నాడించే మదారి అయినా, పల్లెటూరి జంట అయినా, అరకు లోయలో అందాలైనా వారి బొమ్మల్లో గమ్మున కూర్చుంటాయి. వీరనారి ఝాన్సీ రాణీ, మహా పరాక్రమశాలి మహారాణి రుద్రమదేవీ పౌరుషంగా నిలబడతారు. నన్నయ్య, పోతన, వేమన ఇదిగో మేము ఇలా ఉంటాం అంటూ చిత్రాలై వస్తారు. ప్రకృతి చిత్రాల సోయగాల నుండి, సంప్రదాయ చిత్రాల ఆలోచనల నుండి, సామాజిక చింతన చేతనత్వం వరకు కొండపల్లి శేషగిరి రావు 40వ దశకం నుండి, 2000వ దశకం వరకు 70 ఏళ్ళు చిత్ర కళా జగత్తుకు నిలువెత్తు చిత్రమై నిలిచారు.



కొండపల్లి శేషగిరిరావు 1924 జనవరి 27న వరంగల్ జిల్లా మానుకోట దగ్గర ఉన్న పెనుగొండ గ్రామంలో జన్మించారు. పుట్టింది సంపద గల ఇల్లే అయినా, పదేళ్ల బాలుడు అయ్యేసరికి అనివార్య కారణాలతో పేదరికంలో పడిపోయింది కుటుంబం. పదవ తరగతి వరకు హనుమకొండలో వారాలబ్బాయిగా బ్రతుకు సాగించి చిత్రకళపై ఉన్న మక్కువతో హైదరాబాదుకు ధైర్యాన్ని వెంటబెట్టుకొని నడిచారు. కొందరు ప్రముఖుల సహకారంతో మెహదీ నవాజ్ జంగ్ గారికి పరిచయమై వారి సహాయంతో రెడ్డి హాస్టల్లో జాయిన్ అయి, 'హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్'లో విద్యార్థిగా చేరి నూతన అధ్యాయాన్ని తెరుచుకున్నారు. ఐదేళ్ల చదువును పూర్తి చేసుకుని ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణుడై, చిత్రకారునిగా ఎదిగి, మెహదీ ఫర్మాయిషీతో కలకత్తాకు పయనమయ్యారు.



కొండపల్లి శేషగిరిరావు : శాకుంతల పత్రలేఖనం

రవీంద్రనాథ్ టాగూర్ స్థాపించిన 'శాంతినికేతన్'లో శేషగిరిరావు విద్యార్థి అయ్యారు. ప్రముఖ చిత్రకారులు నందాలాల్ బోస్, అవనీంద్రనాథ్ ఛటోపాధ్యాయుల ప్రియ శిష్యుడూ అయ్యారు. తరువాత తాను చదువుకున్న ఫైనార్ట్స్ కళాశాలలోనే అధ్యాపకునిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ప్రొఫెసర్‌గా, ప్రిన్సిపల్‌గా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దారు.

రిటైర్ అయిన తర్వాత ఎన్నో వందల చిత్రాలను వేశారు. హైదరాబాద్ పరిసరాలలో కనిపించకుండా పోయిన కొండలు, గుట్టలు శేషగిరిరావు చిత్రించిన చిత్రాల్లో వందలాదిగా దర్శనమిస్తాయి. ఆక్వాటెక్చర్‌లో, కలర్ గ్రాన్యూల్స్ మ్యూరల్ పెయింటింగ్స్‌లో ఎన్నో కొత్త కొత్త ప్రయోగాలు చేశారు. అమీర్ పేట్ దగ్గర మైత్రి భవన్ హుడా కాంప్లెక్స్ ముఖ ద్వారం రెండువైపులా గోడలపై కనిపించే విశ్వరూప సందర్శనం, లవకుశులు చేజిక్కించుకున్న అశ్వమేధ యాగాశ్వ పెయింటింగ్ ఇప్పుడూ చూసి ఆనందించవచ్చు. 'చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు జీవిత చరిత్ర' అనే పుస్తకానికి ముందుమాటగా 'కుంచె సామ్రాజ్య మహారాజు' అంటూ ఆర్టిస్ట్ మోహన్ రాసిన వ్యాసంలో 'రావి నారాయణ రెడ్డి పైన నీలాకాశం తేలి, మబ్బుల కాంట్రాస్టులో ఆదర్శమంత ఎత్తెగురు తున్న ఎర్రని జెండా, దానిపై హత్తిన తెల్లని సుత్తి కొడవలి. కళ్ళు నిండిపోతాయి', 'నుదుట నామం దిద్దుకుని పరమ సాంప్రదాయకంగా కనిపిస్తూ చిత్రాలు గీసే ఈ పవిత్ర బ్రాహ్మణ మూర్తికి ఎర్రజెండా జబ్బు ఎలా సోకిందబ్బా? అని ఓ నాయకుడిని అడిగాను, ఇలాంటి పెద్ద కమ్యూనిస్టు నాయకులు ఎందరో ఆయనకు జిగిరీ దోస్తులు అని చెప్పాడు' అన్నారు. ఈ మాటలు శేషగిరి రావు నిండైన సామాజిక మూర్తి మత్వానికి అద్దం పట్టాయి అని చెప్పవచ్చు.

'కాకి పడిగెలు' జానపద చిత్రకళను వెలుగులోకి తెస్తూ రచించిన పరిశోధనాత్మక వ్యాసమైన 'ఆంధ్రదేశంలో చిత్రకళ', 'తెలంగాణాలో చిత్రకళ', 'కళ – కల్పనా వైచిత్రి' వంటి ఎన్నో గొప్ప వ్యాసాలను రచించిన కవి, రచయిత కూడా శేషగిరిరావు. 'చిత్ర శిల్పకళా రామణీయకము' వ్యాస సంపుటి వీరి పాండితి గరిమకు నిదర్శనం. మొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలలో 'తెలుగు తల్లి' విగ్రహానికి రూపకల్పన చేశారు. 2012 జూలై 26న తుది శ్వాస విడిచారు. నేడు ఆ అద్భుత చిత్రకారుడు పుట్టిన రోజు సందర్భంగా శత జయంతి వేడుకలు జరుపుతున్నామని తెలియచేయడానికి సంతోషిస్తున్నాం.

– డాక్టర్ కొండపల్లి నీహారిణి । రచయిత్రి, సంపాదకురాలు

(నేడు కొండపల్లి శేషగిరిరావు శతజయంతి వేడుక జేఎన్ఏఎఫ్ఏయూ, హైదరాబాదులో ఉదయం 11 గంటలకు జరగనుంది.)

ఓ మైగాడ్.. వాటీజ్ దిస్..!

సారాంశం

సరికొండ చలపతి

పిల్లలూ.. దేవుడూ..
పండుగ పూట ఓ మిడిల్ క్లాస్ ఫ్యామిలీ గుడికి వెళ్లారు.
దైవ దర్శనం అయ్యింది. పిల్లాడితో సాష్టాంగ నమస్కారం చేయించారు. '..దేవుడు బాగా చదువు వచ్చేలా చేస్తాడు...' అని చెప్పే సరికి ఐదేళ్ల ఆ కుర్రాడు ఉత్సాహంగా దండం పెట్టేసి ప్రసాదం నోట్లో వేసుకుని తల్లిదండ్రులతో పాటు బయటికి వచ్చాడు. అంతా కలసి గుడి ప్రాంగణంలో తిరుగుతున్నారు. అక్కడో స్తంభంపైన చెక్కి ఉన్న సింహం ముఖాన్ని చూసి పిల్లాడు జడుసుకుని భయంతో "అమ్మా.. నాన్నా... పరుగెత్తండి... సింహం మనల్ని చంపేస్తుంది.." అని కేకలు పెట్టాడు. అప్పుడు తండ్రి చటుక్కున కొడుకుని దగ్గరకు తీసుకుని "అలా భయపడకూడదు. అది ఒట్టి శిల్పం.. మనల్ని ఏమీ చేయదు.." అని చెబుతూ ఆ సింహం బొమ్మ దగ్గరకు తీసుకెళ్లాడు. ఆ పిల్లాడు అమాయకంగా 'శిల్పం రూపంలో ఉన్న సింహం మనల్ని ఏమీ చేయలేక పోతే... గుడిలో శిల్పం రూపంలో ఉన్న దేవుడు మనకు ఎలా మేలు చేస్తాడు.. నాకు చదువు వచ్చేట్టు ఎలా చేస్తాడు..?'

■ తండ్రికి వెంటనే ఏం చెప్పాలో తోచలేదు..
ఆ తండ్రి ఏం చెప్పాడనేది వదిలేసినా .. అలాంటి సందర్భాలలో ఏ తండ్రి అయినా కొడుక్కి కన్విన్సింగా చెప్పేదే... వాడి భవిష్యత్ విశ్వాసాలను ప్రభావితం చేస్తుందనేది మాత్రం నిజం..

పేరెంట్స్ దారిలోనే..
మతం, రాజకీయాలు.. ప్రతి ఒక్కరిలో ఈ రెండు అంశాలకు సంబంధించి రకరకాల అభిప్రాయాలు ఉంటాయి. ఈ రెండింటి విషయంలో వ్యవహరించే తీరు కూడా భిన్నంగా ఉంటుంటాయి. పుట్టి, పెరిగిన వాతావరణం.. చిన్ననాటి నుంచి ఎదుర్కొన్న పరిస్థితులు.. చుట్టూ ఉన్నవారి ప్రభావం.. వంటివి ఆ అభిప్రాయాలకు, వ్యవహార శైలికి కారణమవుతాయి. అయితే ఇందులో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని, వారు భావించిన దాని కంటే ఎక్కువగా పిల్లలపై ప్రభావం ఉంటుందని ప్యూ రీసెర్చ్ సెంటర్ ఇటీవల చేసిన ఓ అధ్యయనం తేల్చింది.



కావాలని నేర్పించేవాటికన్నా..
చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు నైతికంగా మంచి ప్రవర్తనతో ఉండాలని కోరుకుంటారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ఉండటం నుంచి బయటివారితో వ్యవహరించే తీరు, కష్టపడి పనిచేసే అలవాటు దాకా నేర్పించాలని ప్రయత్నిస్తుంటారు. తమలా ఉండాలని భావిస్తుంటారు. కానీ చాలా మంది పిల్లలు ఈ అంశాల్లో తల్లిదండ్రుల కోరికకు భిన్నంగా వ్యవహరిస్తుంటారు. కానీ **మత, రాజకీయ అంశాల్లో మాత్రం 80 శాతం మంది పిల్లలు తమ తల్లిదండ్రుల అభిప్రాయాలకు తగినట్టుగానే వ్యవహరిస్తుంటారని ప్యూ రీసెర్చ్ అధ్యయనంలో తేలింది.**

■ రాజకీయ అంశాల్లో పిల్లలు తమ బాటనే అనుసరించాలని కోరుకుంటున్నట్టు కేవలం 16 శాతం మంది, మతపరమైన అంశాల్లో తమ బాటలోనే నడవాలని భావిస్తున్నామని కేవలం 35 శాతం మంది తల్లిదండ్రులు చెప్పడం గమనార్హం.

■ అంటే పిల్లలపై తల్లిదండ్రుల నుంచి పెద్దగా ఒత్తిడేమీ లేకున్నా కూడా వారిబాటలోనే నడుస్తున్నారు. కొన్ని కుటుంబాల విషయంలో తరతరాలుగా ఇది కొనసాగుతూనే వస్తున్నట్టు తేలింది.

మేం వేరే అని పైకి చెప్తున్నా..
తరాలు మారుతున్న కొద్దీ చాలా అంశాల్లో పిల్లల అభిప్రాయాలు/ వ్యవహారశైలి మారుతూ ఉంటాయి. తల్లిదండ్రులు పాటించేవి పాత/కాలం చెల్లిన ఆచారాలు, అభిప్రాయాలు అని పిల్లలు చెప్తుంటారు. తాము వేరేనని అంటుంటారు. ఇలా చాలా అంశాల్లో తల్లిదండ్రులతో విభేదించినా.. మత, రాజకీయ అంశాల్లో తమకు తెలియకుండానే వారిని అనుసరిస్తుంటారని ప్యూ రీసెర్చ్ సెంటర్ రెలీజియస్ రీసెర్చ్ డైరెక్టర్ అలన్ కూపర్‌మన్ చెప్పారు. "నిజానికి.. పిల్లలు మనం చెప్పినట్టుగా చేయాలని/వినాలని కోరుకోవడం.. పిల్లలు వాటిని తప్పనిసరిగా పాటించేలా చేయడం.. రెండూ వేర్వేరు. పిల్లలు చాలా విషయాల్లో తమకు నచ్చినట్టుగా చేస్తుంటారు. ఇది పిల్లల తల్లిదండ్రులందరికీ తెలుసు. అయినా కూడా.. మత, రాజకీయపరమైన అంశాల్లో తల్లిదండ్రుల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని మా అధ్యయనంలో తేలింది.." అని వెల్లడించారు.

....

ఈ పరిస్థితి పేరెంట్స్ నుంచి సమాజం చేతుల్లోకి మారుతోందా.. దారి తప్పుతోందా...

....

సొసైటీ చేతుల్లోకి..
ఇది చూడండి.. ఇటీవలి సంభాషణ. ఎనిమిదో తరగతి చదువుతున్న టింకూ సాయంత్రం స్కూల్ నుంచి ఉత్సాహంగా వచ్చాడు. చేతిలో రామమందిరం తాలూకు కాషాయం జెండా. దాన్ని తన తండ్రి చేతిలో పెడుతూ 'డాడీ..ఇది మన ఇంటి మీద కట్టిరా..' ... ఆర్డరేశాడు.
'ఎందుకురా ఇది..'
'ఎందుకేమిటి?.. అయోధ్యలో రామ మందిరం కట్టారుగా.. మనం కూడా సెలబ్రేట్ చేసుకోవాలి..'
తండ్రికేమీ అభ్యంతరం అనిపించలేదు. ఇంట్లో నానమ్మ, తల్లి చేసే పూజలు సహజంగానే పిల్లాడికి ఆసక్తిని పెంచి ఉంటాయిగా అనుకుని.. ' సరే.. పైకి వెళ్లి కట్టేసి వస్తా..' అని మెట్లెక్కసాగాడు. టింకూ మాట్లాడుతూనే ఉన్నాడు,, '.. స్కూల్లో ఫుల్ జోష్ డాడీ..అంతా జై శ్రీరామ్ అని.. అందరం భలే ఎంజాయ్ చేశాం..'' – చెబుతూనే ఉన్నాడు.. సరదాగా వింటూ మెట్లెక్కుతున్న తండ్రి కొడుకు మాటకు ఒక్కసారిగా మెట్లు జారిపోయినట్టుగా అనిపించింది.
–' ఇది ముస్లింలపై మన సక్సెస్... నాన్నా..!
పసి పిల్లాడి నోట మనది కాని మాట ..

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు , పుష్య మాసం, **తిథి:** తిథి బ.విదియ రా.1.56 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** ఆశ్లేష ప.12.06 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.1.21 నుండి 3.05 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.6.34 నుండి 8.06 వరకు, **అమృతఘడియలు:** ప.10.22 నుండి 12.05 వరకు : **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 6.38, **సూర్యాస్తమయం:** 5.49.

టీడీపీలో ఫ్లెక్సీల లొల్లి

- మాజీ మంత్రి జవహర్‌పై అచ్చిబాబు వర్గీయుల ఆగ్రహం
- దొమ్మేరులో సమావేశం నిర్వహించి మరీ విమర్శనాస్త్రాలు


యలమర్తి రాంబాబు


కేఎస్ జవహర్

కొవ్వూరు: తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు టీడీపీలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కె.ఎస్.జవహర్ తన పుట్టిన రోజును వేదికగా చేసుకుని నియోజకవర్గవ్యాప్తంగా గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. ఆ ఫ్లెక్సీల్లో జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్నట్లు వ్యక్తుల పేర్లు కాకుండా గ్రామ టీడీపీ అని పేర్కొనడం వివాదానికి కారణమైంది. నియోజకవర్గ టీడీపీకి పెద్ద దిక్కుగా ఉన్న పెండ్యాల అచ్చిబాబు స్వగ్రామమైన దొమ్మేరులో ఆయన ఫొటో లేకుండా ఈ తరహా ఫ్లెక్సీల ఏర్పాటును ఆ పార్టీ స్థానిక నాయకులు తప్పుబట్టారు. ఈ నేపథ్యంలో అచ్చిబాబు వర్గీయులు శుక్రవారం గ్రామంలో సమావేశమై మరీ జవహర్‌పై బహిరంగ విమర్శలకు దిగారు. గ్రామ కమిటీ, స్థానిక నాయకుల ప్రమేయం లేకుండా 'దొమ్మేరు టీడీపీ' అని పేర్కొంటూ తమ గ్రామంలో ఫ్లెక్సీలు ఎలా ఏర్పాటు చేస్తారని, ఇది జవహర్ దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. పార్టీని రెండు గ్రూపులుగా చేసేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ సభ్యుడు యలమర్తి శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు)మండిపడ్డారు. దొమ్మేరు గ్రామ కమిటీని సంప్రదించకుండా ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అచ్చిబాబు చెప్పినట్లే నడుస్తాం తప్ప, జవహర్ చెప్పినట్లు కాదని స్పష్టం చేశారు. సీనియర్ నాయకుడు కేవీకే రంగారావు, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొక్కిరిపాటి శ్రీహరి కూడా జవహర్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పార్టీకి, ఆ ఫ్లెక్సీలకు ఎటువంటి సంబంధమూ లేదని ప్రకటించారు. గతంలో అచ్చిబాబు చెబితేనే జవహర్‌కు 13 రోజుల ముందు టికెట్ ఇచ్చినా ఎమ్మెల్యేగా గెలిపించామని అన్నారు. దొమ్మేరులో జవహర్‌కు మద్దతుదారులు లేరని ప్రకటించారు. అందువల్లే సొంతంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారన్నారని అన్నారు. కొవ్వూరులో శుక్రవారం జరిగిన జవహర్ పుట్టిన రోజు వేడుకలకు సైతం అచ్చిబాబు వర్గీయులు దూరంగానే ఉన్నారు. ఇటీవల అభ్యర్థుల ఖరారులో భాగంగా అధిష్టానం నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో కూడా జవహర్ పేరు ప్రస్తావించడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. తాజా వివాదానికి సంబంధించిన వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

ఎనిమిదేళ్లుగా..: జవహర్, అచ్చిబాబు వర్గాల మధ్య ఏడెనిమిదేళ్లుగా వివాదం నడుస్తోంది. దీంతో నియోజకవర్గంలో టీడీపీ రెండు గ్రూపులుగా పనిచేస్తోంది. గతంలో అచ్చిబాబు వర్గం వ్యతిరేకించినందునే జవహర్‌ను అధిష్టానం కృష్ణా జిల్లా తిరువూరు నియోజకవర్గానికి పంపింది. అక్కడ ఓటమి చవిచూసిన ఆయన మళ్లీ కొవ్వూరుపై దృష్టి సారించారు. పేరుకు జిల్లా అధ్యక్షుడి పదవి కట్టబెట్టినప్పటికీ కొవ్వూరు నియోజకవర్గంలో పార్టీ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని అధిష్టానం షరతు విధించిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

చిరంజీవి, వెంకయ్యకు మంత్రి శుభాకాంక్షలు

సాక్షి, అమరావతి: పద్మ విభూషణ్ అవార్డులు దక్కించుకున్న సినీ నటుడు చిరంజీవి, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు దక్కడం చాలా సంతోషంగా ఉందన్నారు. చిరంజీవి, స్వర్ణ భారత్ ట్రస్ట్ ద్వారా ఎంతోమందికి సేవలందిస్తున్న వెంకయ్య నాయుడు ఇద్దరూ తమదైన శైలిలో స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో ముందుంటున్నారని వేణు పేర్కొన్నారు.

ఆటోపైకి ఎక్కిన బస్సు.. ముగ్గురు దుర్మరణం

- మరొకరి పరిస్థితి విషమం.. మరో 12 మందికి గాయాలు
- అందరూ వ్యవసాయ కూలీలే
- చిలకలూరిపేట మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం


ఘటనా స్థలంలో హాహాకారాలు చేస్తున్న కూలీలు

చిలకలూరిపేట: ఎదురెదురుగా వస్తున్న బస్సు, ఆటో ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందగా మరో 13మంది తీవ్రంగా గాయపడిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామం వద్ద చోటుచేసుకుంది. ఘోర రోడ్డు ప్రమాదానికి చెందిన వివరాలిలా ఉన్నాయి. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మిర్చి కోతల నిమిత్తం శుక్రవారం ఉదయం ఆటోలో అప్పాపురం గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో గణపవరం డొంకనుంచి ఆటో నరసరావుపేట రోడ్డులోకి ప్రవేశించింది. చిలకలూరిపేట వైపు ఆర్టీసీ బస్సు రావడంతో రెండు వాహనాలు లింగంగుంట్ల గ్రామం వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోపైకి బస్సు ఎక్కడంతో ఆటోలో ఉన్న ఏకసిరి హనుమాయమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. గాయపడిన వారిని చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ గన్నవరపు శివపార్వతి (60) మృతి చెందింది. షేక్ హజరత్‌వలి (60)ని గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతి చెందాడు. వీరితోపాటు తీవ్రంగా గాయపడిన సురుగుల కోటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరుకు తరలించారు. ఆటో డ్రైవర్‌తో సహా మరో 12 మందికి ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందజేస్తున్నారు. మృతి చెందిన వారు, గాయపడిన వారు మొత్తం వేలూరు గ్రామానికి చెందిన వారే కావడంతో ఆస్పత్రి ప్రాంగణం ఆ గ్రామస్తులతో నిండిపోయింది. వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆస్పత్రిని సందర్శించి బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.లక్ష, గాయపడిన వారికి ఒక్కొక్కరికీ రూ.20 వేల చొప్పున అందజేస్తామని, దీనికి తోడు ప్రభుత్వం తరఫున సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సరిహద్దులు కట్టుదిట్టం

- రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు 139కి పెంపు
- మరో 15 ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, అమరావతి: రానున్న ఎన్నికల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సర్వసన్నద్ధమవుతోంది. ప్రధానంగా రాష్ట్రంలోకి అక్రమ రవాణా నిరోధానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులను మూడురెట్లు పెంచింది. ఇప్పటివరకు ఉన్న 46 చెక్‌పోస్టుల సంఖ్యను 139కి పెంచింది. వీటిలో వివిధ శాఖల పరిధిలోని చెక్‌పోస్టులు, పలు శాఖలతో కలిపి ఏర్పాటుచేసిన ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నాయి. మరో 15 చెక్‌పోస్టుల ఏర్పాటుకు సిద్ధమవుతోంది. ఎన్నికల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రశంసించింది. అదే తరహాలో వ్యవహరించాలని సరిహద్దు రాష్ట్రాల ప్రభుత్వాలకు కూడా సూచిస్తామని పేర్కొంది.

అక్రమ రవాణా నిరోధమే లక్ష్యం

ఎన్నికల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చెక్‌పోస్టుల్ని బలోపేతం చేస్తోంది. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు సరిహద్దుల రాష్ట్రాల నుంచి నగదు, మద్యం మొదలైనవాటిని రాష్ట్రంలోకి అక్రమంగా తరలించకుండా చూడటమే లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వ యంత్రాంగం ఇతర రాష్ట్రాల నుంచి దొంగ ఓటర్లు రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకోవాలని నిర్దేశించుకుంది. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి పరిధిలోని యానాం రాష్ట్రానికి సరిహద్దులు. వీటితో రాష్ట్రానికి పొడవైన సరిహద్దు ప్రాంతం ఉంది. అందుకే అక్రమ రవాణాను అడ్డుకోవడం కోసం అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులను మూడురెట్లు పెంచింది. 2019 వరకు రాష్ట్రంలో 46 అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టులు ఉండేవి. కాగా తాజాగా ఆరు కేటగిరీల కింద వీటి సంఖ్యను 139కి పెంచడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో పోలీస్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, అటవీశాఖ, జీఎస్టీ, రవాణాశాఖల పరిధిలోని చెక్‌పోస్టులు, ఈ శాఖలన్నింటితో కలిపి ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఉన్నాయి.

దొంగ ఓట్లు.. 'పచ్చ' నోట్లు

'పర్చూరు'లో టీడీపీ ప్రలోభాల పర్వం

- ఎమ్మెల్యే ఏలూరి నిర్వాకాలు వెలుగులోకి
- 'నోవా అగ్రి టెక్' కేంద్రంగా నల్లధనం పంపిణీ
- పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్లకు ఎర
- డీఆర్ఐ తనిఖీల్లో ఆధారాలతో బట్టబయలు
- గుట్టు రట్టు చేసిన కీలక 'డైరీ'
- ఐటీ, ఈడీ, సెబీలకు నివేదించిన అధికారులు



సాక్షి, అమరావతి: ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, దొంగ ఓట్లతో మోసాలకు పాల్పడటంలో టీడీపీ అధినేత చంద్రబాబు సిద్ధహస్తుడని మరోసారి రుజువైంది! నల్లధనాన్ని వెదజల్లి ఎన్నికల్లో అక్రమ మార్గాల్లో నెగ్గేందుకు టీడీపీ ఏకంగా ప్రత్యేక కార్యాలయాలనే ఏర్పాటు చేసుకున్నట్లు ఆధారాలతో సహా బట్టబయలైంది. 2019 ఎన్నికల సందర్భంగా ప్రకాశం జిల్లా (ప్రస్తుతం బాపట్ల జిల్లా) పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ పాల్పడిన అక్రమాలు రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (ఏపీఎస్ డీఆర్ఐ) తనిఖీల్లో తాజాగా వెలుగులోకి వచ్చాయి. టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చైర్మన్‌గా ఉన్న నోవా అగ్రిటెక్ కంపెనీ కార్యాలయం కేంద్రంగా ఎన్నికల అక్రమాలకు తెగబడినట్లు డీఆర్ఐ కీలక ఆధారాలను గుర్తించింది. ఆ వెంటనే ఆ కంపెనీకి చెందిన కీలక వ్యక్తులు పరారు కావడం గమనార్హం. ఆదాయపన్ను (ఐటీ) చట్టం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ) నిబంధనలను ఉల్లంఘించి ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డట్టు తేలింది. డీఆర్ఐ నివేదిక మేరకు న్యాయస్థానం అనుమతితో టీడీపీ ఎమ్మెల్యే సాంబశివరావు, నోవా అగ్రిటెక్ కంపెనీలపై కేసు నమోదు చేసేందుకు పోలీసులు సన్నద్ధమవుతున్నారు. ఈ వ్యవహారం ఇదిగో ఇలా సాగింది..

నోవా అగ్రిటెక్ కేంద్రంగా...

పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు చెందిన నోవా అగ్రిటెక్ కంపెనీ కార్యాలయంలో డీఆర్ఐ అధికారులు తాజాగా తనిఖీలు నిర్వహించారు. గుంటూరు శ్రీలక్ష్మీ నగర్‌లోని ఆ కంపెనీ కార్యాలయంలో ఈ నెల 24న చేపట్టిన సోదాల్లో ప్రధానంగా డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న ఓ డైరీ టీడీపీ ఎన్నికల అక్రమాల గుట్టును విప్పింది. స్వతంత్ర సాక్షులు, నోవా అగ్రిటెక్ కంపెనీ ఉద్యోగుల సమక్షంలో ఆ డైరీని డీఆర్ఐ అధికారులు జప్తు చేశారు.

కీలక అధికారి పరార్

నోవా అగ్రిటెక్‌కు చెందిన ఉద్యోగి పుల్లెల అజయ్‌బాబు ఆ డైరీని ఉపయోగించారని కంపెనీ ఉద్యోగులు వెల్లడించారు. ప్రస్తుతం రిటైరైన పుల్లెల అజయ్ బాబును కార్యాలయానికి రావాలని డీఆర్ఐ అధికారులు సూచించిన వెంటనే ఆయన పరారు కావడం గమనార్హం. తన సెల్‌ఫోన్‌ను సైతం స్విచ్ఛాఫ్ చేసేసి అందుబాటులో లేకుండా పోయారు. టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదేశాలతోనే ఆయన పరారైనట్లు స్పష్టమవుతోంది.

13 పేజీల్లో నమోదు..

ఆ డైరీని పరిశీలించగా పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ ఎలా ఎన్నికల అక్రమాలకు పాల్పడిందో వెలుగు చూసింది. పోలింగ్‌కు ముందు రోజు అంటే 2019 ఏప్రిల్ 11న అక్రమ నిధులను ఎలా తెచ్చారు? ఓటర్లకు ఎలా పంపిణీ చేశారనే వివరాలన్నీ అందులో ఉన్నాయి. ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు పంపిణీ చేసిన డబ్బుల వివరాలను ఏకంగా 13 పేజీల్లో నమోదు చేయడం గమనార్హం.

అంతా నల్లధనమే...

ఓటర్లను ప్రలోభపెట్టేందుకు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భారీగా నల్లధనాన్ని తరలించినట్లు డీఆర్ఐ సోదాల్లో వెల్లడైంది. అందుకోసం షెల్ కంపెనీల ద్వారా అక్రమ నిధులను చేరవేశారు. ఆ డబ్బుల వివరాలేవీ నోవా అగ్రిటెక్ కంపెనీ రికార్డులతో సరిపోలకపోవడంతో అదంతా నల్లధనమేనని రుజువవుతోంది. కంపెనీ బ్యాంకు ఖాతాల్లో ఆ నిధుల జమ, విత్‌డ్రాలకు సంబంధించిన వివరాలేవీ లేవు. అంటే ఓటర్లను ప్రలోభ పెట్టి ఎన్నికల్లో అక్రమాలుకు పాల్పడేందుకు వెచ్చించినదంతా నల్లధనమేనని నిర్ధారణ అయింది.

ఎన్నికల కమిషన్‌కూ బురిడీ...

డైరీలో పేర్కొన్న నిధుల వ్యయానికి సంబంధించిన వివరాలను టీడీపీ ఎమ్మెల్యే ఎన్నికల కమిషన్‌కు సమర్పించిన ఎన్నికల వ్యయంలో చూపలేదు. కమిషన్‌కు ఎప్పటికప్పుడు సమర్పించాల్సిన వ్యయంలో డైరీలో పేర్కొన్న నిధుల వివరాలు లేవు. అంటే టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఎన్నికల కమిషన్‌కు తప్పుడు నివేదిక ఇచ్చినట్టు స్పష్టమవుతోంది.

ఐటీ, ఈడీ, సెబీలకు నివేదిక..

టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అక్రమంగా నిధులు తరలించినట్లు ఆధారాలతో వెల్లడి కావడంతో డీఆర్ఐ అధికారులు తదుపరి చర్యలకు ఉపక్రమించారు. తమ తనిఖీల్లో వెలుగు చూసిన అంశాలను ఆదాయపన్ను శాఖ, ఈడీ, సెబీ దృష్టికి తెచ్చారు. నోవా అగ్రిటెక్ కంపెనీ తమ రికార్డుల్లో చూపని నిధులను వెచ్చించడంతోపాటు పన్ను చెల్లించకుండా ఎగవేసింది. అక్రమ నిధుల తరలింపు ద్వారా కేంద్ర మనీ లాండరింగ్ చట్టాన్ని ఉల్లంఘించింది. అక్రమ నిధులను తరలించేందుకు కంపెనీని కేంద్ర బిందువుగా చేసుకోవడం సెబీ నిబంధనలకు విరుద్ధం. నోవా అగ్రిటెక్ అక్రమాలపై విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదాయపన్ను, ఈడీ, సెబీలకు డీఆర్ఐ అధికారులు నివేదిక సమర్పించారు. త్వరలోనే ఆ మూడు సంస్థలు రంగంలోకి దిగనున్నట్టు తెలుస్తోంది.

కేసు నమోదుకు సన్నద్ధం

అక్రమ నిధుల ద్వారా ఎన్నికల అక్రమాలకు పాల్పడ్డ నోవా అగ్రిటెక్ కంపెనీ, కంపెనీ చైర్మన్‌గా ఉన్న టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుపై పోలీసు శాఖ కేసు నమోదు చేయనుంది. ఈ అక్రమ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదుకు అనుమతి కోరుతూ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసేందుకు బాపట్ల జిల్లా పోలీసులు సన్నద్ధమవుతున్నారు. ఈ కేసులో త్వరలో మరిన్ని కీలక పరిణామాలు చోటు చేసుకోనున్నట్లు స్పష్టమవుతోంది.

డైరీలో నల్లధనం

- పవులూరు అనే గ్రామంలో పోలింగ్ కేంద్రాలు 223 నుంచి 226 పరిధిలో 239 మంది ఓటర్లకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేశారు. మొత్తం రూ.2.39 లక్షలు పంపిణీ చేసినట్టు ఆ డైరీలో ఉంది.
- మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకట్రావు ద్వారా రూ.3.60 లక్షలు ఓటర్లకు పంపిణీ చేసినట్లు డైరీలో ఉంది.
- నోవా అగ్రిటెక్ కంపెనీకి చెందిన ఉద్యోగి ద్వారా ఓటర్లకు ఆ డబ్బులను పంపిణీ చేశారు.
- ఆ కంపెనీకి చెందిన అప్పారావు, బుజ్జిబాబు, సాయి గణేశ్ అనే ఉద్యోగుల ద్వారా దుద్దుకూరు గ్రామంలో ఓటర్లకు రూ.15 లక్షలు పంపిణీ చేశారు.
- పర్చూరు నియోజకవర్గంలోని దుద్దుకూరు, ఇంకొల్లు, తాటిపర్తివారిపాలెం, గంగవరం తదితర గ్రామాల్లో ఓటర్లకు డబ్బులు ఎలా పంపిణీ చేసి ఓట్లను కొనుగోలు చేశారో డైరీలో వివరంగా ఉంది.
- ఇతర ప్రాంతాల నుంచి ఓటర్లను తరలించేందుకు రవాణా వ్యయం, పోలింగ్ బూత్‌ల వారీగా ఓటర్ల పేర్లు, వారికి పంపిణీ చేసిన మొత్తం తదితర వివరాలను ఆ డైరీలో సవివరంగా పేర్కొనడం గమనార్హం.

'నారాయణ'లో విద్యార్థి ఆత్మహత్య

- ఫ్యాన్‌కు ఉరి వేసుకున్న తొమ్మిదో తరగతి బాలుడు
- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమంటున్న విద్యార్థి తండ్రి
- విశాఖ పీఎంపాలెం నారాయణ క్యాంపస్‌లో ఘటన


పీఎంపాలెంలోని నారాయణ క్యాంపస్

మధురవాడ (విశాఖజిల్లా): నారాయణ క్యాంపస్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పీఎంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం పట్టణంలోని పీఎస్ఎన్ఎం స్కూలు సమీపంలో నివాసం ఉంటున్న నెల్లూరు రవికుమార్, ఆయన భార్య మార్కెటింగ్ శాఖలో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా, చిన్న కుమారుడు నెల్లూరు అఖిల్ వినాయక్(15)ను విశాఖలోని నారాయణ విద్యాసంస్థలో 6వ తరగతి నుంచి చదివిస్తున్నారు. ప్రస్తుతం పీఎంపాలెంలోని క్యాంపస్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం గణతంత్ర వేడుకలకు సహచర విద్యార్థులు వెళ్లగా, నిఖిల్ మాత్రం హాస్టల్ రూము నంబరు 203లోనే ఒంటరిగా ఉన్నాడు. సుమారు 10.15 గంటల సమయంలో జెండా వందనం కార్యక్రమం పూర్తయి సహచర విద్యార్థులు వచ్చేసరికి నిఖిల్ వినాయక్ గదిలో ఫ్యాన్‌కు బెడ్‌షీట్‌తో ఉరివేసుకుని ఉన్నాడు. అతడిని వైద్యం నిమిత్తం గాయత్రి ఆస్పత్రికి యాజమాన్యం తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. నిఖిల్ ప్యాంటు కుడి జేబులో 'నా చావుకి నేనే కారణం. పదో తరగతి ఫెయిల్ అవుతాననే భయంతో చస్తున్నాను.. ' అని రాసిన లేఖ ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే నా కుమారుడు మృతి

'బాగా చదువు చెబుతారని ఏడాదికి రూ.2లక్షలు ఫీజు కట్టి నారాయణ పీఎంపాలెం క్యాంపస్‌లో చేర్పించాను. నా కుమారుడు నిఖిల్‌పై గత ఏడాది ఆగస్టు 7వ తేదీన సహచర విద్యార్థులు దాడి చేయగా, బాగా దెబ్బలు తగిలాయి. ఫిట్స్ కూడా వచ్చాయి. నాలుగు నెలలు ఇంటి వద్దే ఉంచాం. ఆ తర్వాత మళ్లీ ఇక్కడికి తీసుకొచ్చాం. గత ఏడాది గొడవ జరిగినప్పుడు ప్రిన్సిపాల్, ఇతర సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అప్పటి నుంచే నిఖిల్ ఆరోగ్యం పాడైంది. ఈ నెల 21న నిఖిల్ జ్వరంతో బాధపడుతున్నాడని వార్డెన్ శ్రావణ్ ఫోన్ చేసి చెప్పారు. రూ.వెయ్యి ఫోన్ పే ద్వారా పంపించగా, వైద్యం చేయించారు. అనారోగ్యానికి గురైన నిఖిల్‌ను ఒంటరిగా గదిలో మేనేజ్‌మెంట్ వదిలేసింది. ఉదయం 10.15 గంటలకు ఫ్యాన్‌కు వేలాడుతున్నాడని గుర్తించినా, 10.45 గంటల వరకు ఆస్పత్రికి తీసుకువెళ్లలేదు. కనీసం 108 అంబులెన్స్‌కు కూడా ఫోన్ చెయ్యలేదు. పక్కనే ఆస్పత్రి ఉన్నా, హాస్టల్ వ్యాన్‌లో గాయత్రి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. నా కుమారుడి మృతికి నారాయణ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం. మృతిపై కూడా అనుమానాలు ఉన్నాయి. మేనేజ్‌మెంట్ ఒత్తిడి లేదా ఇంకా ఏమైనా జరిగి ఉండవచ్చు. యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

– నెల్లూరి రవికుమార్, విద్యార్థి నిఖిల్ వినాయక్ తండ్రి, శ్రీకాకుళం

జాతీయ పోటీల్లో 'గురుకుల' ప్రతిభ

- 'స్కూల్ బ్యాండ్'లో ద్వితీయ బహుమతి
- ఎన్ఎస్ఐసీలో ప్రత్యేక కేటగిరీ అవార్డు సాధించిన విద్యార్థులు


స్కూల్ బ్యాండ్ పోటీల్లో బహుమతి అందుకుంటున్న ఆరుగొలను విద్యార్థులు

సాక్షి, అమరావతి: జాతీయ పోటీల్లో ఏపీ సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సంస్థ విద్యార్థులు సత్తా చాటారని ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల శుక్రవారం తెలిపారు. గణతంత్ర దినోత్సవాల నేపథ్యంలో న్యూఢిల్లీలోని ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఈ నెల 21, 22 తేదీల్లో రక్షణ మంత్రిత్వ, విద్యా మంత్రిత్వ శాఖలు నిర్వహించిన నేషనల్ స్కూల్ బ్యాండ్ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన 14 జట్లు పాల్గొన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లా ఆరుగొలను (న్యూ) డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం నుంచి 27 మంది విద్యార్థులు బ్యాండ్ టీంగా పాల్గొన్నారు. ఆరుగొలను గురుకులం ప్రిన్సిపల్ బి.రాజారావు నేతృత్వంలో 9వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థుల బృందానికి బ్యాండ్ మేజర్‌గా రోహిత్ వ్యవహరించారు. ఈ బృందం 2023 నవంబర్‌లో అన్నమయ్య జిల్లా పుల్లంపేటలో రాష్ట్ర స్థాయిలోనూ, డిసెంబర్‌లో కేరళలోని తిరువనంతపురంలోనూ సౌత్‌జోన్ పోటీల్లో సత్తా చాటి ఢిల్లీలో జరిగిన ఫైనల్‌లో రెండోస్థానం దక్కించుకుంది.

ఎన్ఎస్ఐసీ పోటీల్లో ప్రతిభ: ఈ నెల 23, 24 తేదీల్లో బెంగళూరులో జరిగిన నేషనల్ స్టూడెంట్స్ ఇన్నోవేషన్ చాలెంజ్ (ఎన్ఎస్ఐసీ) ఈవెంట్‌లో నెల్లూరు జిల్లా బోగోలు అంబేడ్కర్ గురుకులంకి చెందిన 8వ తరగతి విద్యార్థినులు పి.సుహిత, బీఎస్ దివ్యదర్శిని తమిళనాడుకు చెందిన మరో ఇద్దరు విద్యార్థులతో కలిసి ప్రత్యేక కేటగిరిలో రూ.40 వేల నగదు ప్రోత్సాహకాన్ని గెల్చుకున్నారు. ఎల్అండ్‌టీ స్పాన్సర్‌తో ఎన్ఎస్ఐసీ, ఈ–విద్యాలోక్ ద్వారా నిర్వహించిన వార్షిక కార్యక్రమం 2 రౌండ్లలో జరిగింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని 6–8వ తరగతి విద్యార్థులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల్లో దేనికైనా సహకరించేందుకు, పరిష్కారాలను రూపొందించేందుకు ఈ అవకాశాన్ని ఎన్ఎస్ఐసీ అందిస్తుంది. ఇందులో 40 పాఠశాలల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. మలేరియా, ఇతర వ్యాధుల నివారణకు స్థిరమైన ప్రత్యామ్నాయంపై విద్యార్థులు ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసి ప్రదర్శించి.. ప్రత్యేక కేటగిరీ అవార్డును అందుకున్నారు.

సీనియర్లకు దిక్కేది?

- జేసీ కుటుంబం తప్ప అంతా డమ్మీలే
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిస్థితి
- రగిలిపోతున్న సీనియర్ నేతలు
- ఏళ్ల తరబడి జెండా మోసినా పట్టించుకోరా? అని ఆక్రోశం
- బీసీ నేతల్లోనూ పెరుగుతున్న అసహనం
- టికెట్ ఇవ్వకపోతే ఏం చేయాలనే దానిపై మంతనాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: నమ్మించి నట్టేట ముంచడం అనే దానికి అసలైన నిదర్శనం చంద్రబాబు అని తెలుగుదేశం వర్గాల్లో చర్చ జరుగుతోంది. మూడు దశాబ్దాల పాటు పార్టీ జెండా మోసిన తమకే టికెట్ లేదంటే ఇక ఎటు వెళ్లాలి అంటూ అనంతపురం జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు ఆవేదనతో రగిలిపోతున్నారు. అసలే వర్గపోరుతో గందరగోళంగా ఉన్న పార్టీలో సీనియర్ నాయకులను పట్టించుకోకపోవడం, చివరి నిమిషం వరకూ 'నీకే టికెట్' అంటూ పలువురికి అధిష్టానం చెప్పడం నాయకుల్లో తీవ్ర అసహనాన్ని కలిగిస్తోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే ఒకప్పుడు టీడీపీకి మంచి పట్టున్న ప్రాంతమని చెప్పుకునేవారు. కానీ ఇప్పుడు టీడీపీ ఓటికుండగా మారింది. చంద్రబాబును నమ్ముకున్న సీనియర్ నాయకులు ఇప్పుడు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

- కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఉన్నం హనుమంతరాయచౌదరి ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్నారు. పైగా 2014లో గెలిచారు. ఇప్పుడు ఆయనను కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకపోవడంతో లోలోపల అధినేతపై రగిలిపోతున్నారు.
- గుంతకల్లు నియోజకవర్గంలో సీనియర్ నాయకుడైన జితేందర్‌గౌడ్‌కు టికెట్ లేదని పరోక్షంగా లీకులు ఇస్తుండటంతో టీడీపీపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. పాతికేళ్లుగా పార్టీ జెండాను మోసిన తనను కాదని వేరేవాళ్లకు ఇస్తే ఎలా గెలుస్తారో తానూ చూస్తా అని వ్యాఖ్యానిస్తున్నారు.
- పుట్టపర్తి సీటుపైనా ఇప్పటివరకు స్పష్టత ఇవ్వకపోవడంతో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. తనకు టికెట్ ఇవ్వకపోతే పార్టీకి పని చేసేది లేదని ఆయన ఇప్పటికే క్యాడర్‌తో చెప్పినట్టు తెలుస్తోంది. పైగా ఈయన అధికార పార్టీ ఎమ్మెల్యేలతో టచ్‌లో ఉన్నారని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది.

జేసీ కుటుంబానికి కొమ్ములొచ్చాయా?

నిన్నగాక మొన్న టీడీపీలోకి వచ్చిన జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గానికి ఏమైనా కొమ్ములొచ్చాయా అంటూ కొంతమంది నాయకులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. 2014లో జేసీ వర్గం టీడీపీలోకి వచ్చింది. జేసీ ప్రభాకర్‌రెడ్డి తనయుడు అస్మిత్‌రెడ్డికి దాదాపుగా సీటు ఖరారైన నేపథ్యంలో.. దివాకర్‌రెడ్డి కొడుకు పవన్‌రెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నారు. ఒకవేళ పవన్‌కు టికెట్ ఇస్తే మిగతా నియోజకవర్గాల్లో అసంతృప్తి భగ్గుమనేలా కనిపిస్తోంది. కుటుంబానికి ఒక్కటే టికెట్ అన్న బాబు.. జేసీ వర్గానికి రెండు ఇస్తే తమకూ రెండు సీట్లు ఇవ్వాల్సిందేనని పరిటాల వర్గం పట్టుబట్టనుంది.

బీసీ వర్గాల్లో అసమ్మతి రాగాలు

బోయ, కురుబ సామాజిక వర్గానికి సంబంధించిన ఓట్ల శాతం జిల్లాలో ఎక్కువ. ఈ నేపథ్యంలో బీసీ వర్గాల నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో హిందూపురం ఎంపీగా గెలిచిన నిమ్మల కిష్టప్ప తనను పక్కన పెట్టారని టీడీపీ అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. అవసరమైనప్పుడు వాడుకుని ఇప్పుడు వదిలేస్తారా అంటున్నట్టు సమాచారం. నిమ్మల, బీకే పార్థసారథి, జితేందర్‌గౌడ్ వంటి బీసీ నేతలతోపాటు శింగనమల, మడకశిర నియోజకవర్గాలకు చెందిన ఎస్సీ సామాజిక వర్గ నేతలూ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుగుదేశం వర్గాలు చెబుతున్నాయి. ఓవైపు అధికార పక్షం దాదాపుగా అభ్యర్థులను ఖరారు చేసి ఎన్నికల బరిలోకి దూసుకెళుతుండగా.. ఇప్పటివరకు చంద్రబాబు ఎటూ తేల్చడం లేదని నాయకులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. చంద్రబాబు శనివారం ఉరవకొండకు వస్తున్న నేపథ్యంలో నేతల స్పందన ఎలా ఉంటుందో చూడాల్సిందే.

తెలుగు 'తమ్ముళ్ల' తకరారు!

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీకి విశాఖ నగరంలో నలుదిక్కులా టికెట్ల సెగ మొదలైంది. ప్రస్తుతం విశాఖ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ నియోజకవర్గ నేతలకు టికెట్లను కేటాయిస్తే ఓడించేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తామని ఆ పార్టీలోని వ్యతిరేక వర్గాల నాయకులు తెగేసి చెబుతున్నారు. ఏకంగా పత్రికా సమావేశాలు నిర్వహించి మరీ ఆయా నేతల తీరును తూర్పారబడుతున్నారు. గత ఎన్నికల్లో నగరంలో నాలుగు సీట్లను గెలుచుకున్న తెలుగుదేశం పార్టీకి ఈసారి ఆ నాలుగూ దక్కేలా లేవు. సొంత పార్టీ నేతల తిరుగుబాటు చర్యల్ని నిలువరించేందుకు ఆ పార్టీ పెద్దలు కనీస ప్రయత్నం చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు.

విశాఖలో 'గంట'మోగదు!

విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి గెలిచిన తర్వాత ఇన్నాళ్లుగా నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడని గంటా శ్రీనివాసరావుపై పార్టీలో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ప్రతి ఎన్నికలకూ స్థానాన్ని మార్చే గంటాకు విశాఖలో ఎక్కడ సీటు ఇచ్చినా సహించేదిలేదని ఆ పార్టీలోని వ్యతిరేక వర్గ నేతలు మండిపడుతున్నారు. ఏకంగా గంటాను విశాఖ నుంచే తరిమేస్తామంటూ తెగేసి చెబుతున్నారు. విశాఖ ఉత్తరం నుంచి మరోసారి గంటాకు టికెట్ ఇవ్వకూడదని, ఇస్తే సహకరించే ప్రసక్తే లేదని ఆ పార్టీ నేత పాశర్ల ప్రసాద్ బహిరంగంగానే తేల్చిచెప్పారు. ఇక భీమిలివైపు కన్నెత్తి చూసినా ఒప్పుకునేది లేదని ఆ నియోజకవర్గ ప్రస్తుత ఇన్‌చార్జి కోరాడ రాజబాబు బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. ఇన్నాళ్లూ సైలెంట్‌గా ఉండి.. ఎన్నికల ముందు మాట్లాడుతున్నారంటూ ఎప్పటికప్పుడు నేరుగా చంద్రబాబు ముందే గంటాపై మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో విశాఖలో ఎక్కడా తనకు సురక్షితం కాదనే అభిప్రాయానికి గంటా వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో విజయనగరం జిల్లాలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఆయన సిద్ధమవుతున్నారు.

గణబాబుపై అసమ్మతి సెగ

పశ్చిమ ఎమ్మెల్యే గణబాబుకు సొంత పార్టీ నేతల నుంచే రోజురోజుకీ అసమ్మతి పెరుగుతోంది. పార్టీ కార్యకర్తలను, నేతలను పట్టించుకోకుండా సొంత ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేశారని మండిపడుతున్నారు. నేరుగా పత్రికా సమావేశం నిర్వహించి మరీ గణబాబుకు సీటు కేటాయించవద్దని ఆ పార్టీ చోడవరం నియోజకవర్గ పరిశీలకుడు మూర్తి యాదవ్ పార్టీ అధిష్టానాన్ని డిమాండ్ చేశారు. పార్టీ నేతలు, కార్యకర్తల గురించి పట్టించుకోకుండా అక్రమ సంపాదనతో భారీ షోరూం నిర్మించుకున్నారంటూ ఆరోపణలను గుప్పించారు. ఈ స్థానాన్ని కాపు సామాజిక వర్గానికి లేకుంటే యాదవులకు కేటాయించాలని కోరుతున్నారు. ఒకవేళ గణబాబుకు కేటాయిస్తే సహకరించే ప్రసక్తే లేదని మూర్తి యాదవ్‌తో పాటు త్రినాథ్, కొందరు స్థానిక నేతలు తెగేసి చెప్పారు.

లిల్లియాప్ శఠగోపం

- రూ.5కోట్లతో సిబ్బంది పరారీ
- లబోదిబోమంటున్న బాధితులు
- పోలీసులకు ఫిర్యాదు


పోలీస్‌స్టేషన్ వద్ద తమగోడు వెళ్లబోసుకుంటున్న బాధితులు

పుంగనూరు (చిత్తూరు జిల్లా): అమాయక ప్రజలను మోసం చేసి కోట్లాది రూపాయలు స్వాహా చేసిన 'లిల్లియాప్' సిబ్బంది పరారు కావడంతో ఖంగుతిన్న బాధితులు పోలీసులను ఆశ్రయించిన ఘటన చిత్తూరు జిల్లా పుంగనూరులో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గుర్గావ్ ప్రాంతానికి చెందిన లిల్లియాప్‌కు మేనేజింగ్ డైరెక్టర్‌నంటూ ఎం.నౌహీరాబేగం తన కార్యాలయాన్ని ఆరు నెలల క్రితం పుంగనూరు పట్టణంలోని దోబీకాలనీలో ప్రారంభించారు. ప్రారంభంలో 'ప్రతి రోజూ రూ.500కు తక్కువ కాకుండా డిపాజిట్ చేస్తే ఆ విలువ సరుకులు ఇస్తాం.. ఆ సరుకులు మేమే అమ్ముతాం.. వచ్చిన లాభం రోజుకు ఒక్కొక్కరికి రూ.23 చొప్పున 53 రోజులు ఇస్తాం.. అలా రూ.2,600 ఇస్తాం' అంటూ విపరీత ప్రచారం చేసుకుంటూ.. స్థానిక ప్రజలకు ఏజెంట్ల ద్వారా సరుకులను విక్రయించి లాభాలను ఎప్పటికప్పుడు జమ చేసేవారు. దీంతో లిల్లియాప్ కార్యాలయం వద్ద డిపాజిటర్లు బారులు తీరారు. పుంగనూరు, చౌడేపల్లె, మదనపల్లె, తిరుపతి ప్రాంతాల్లోని సుమారు 2వేల మంది తమ శక్తి మేరకు యాప్ ద్వారా డిపాజిట్లు చెల్లించడంతో కంపెనీకి సుమారు రూ.5 కోట్ల మేరకు వసూలైంది. అయితే ఈనెల 18వ తేదీ నుంచి లిల్లియాప్ యాజమాన్యం డబ్బులు చెల్లించకపోవడం, సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేస్తుండడంతో బాధితుడు నవాజ్‌బాషా సీఐ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. అదే సమయంలో తమ సిబ్బంది, ఏజెంట్లు వసూలు చేసిన డబ్బులతో పరారయ్యారని నౌహీరాబేగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం గమనార్హం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని సీఐ తెలిపారు.


శుక్రవారం గణతంత్ర వేడుకలకు గుర్రపు బగ్గీలో వస్తున్న రాష్ట్రపతి ముర్ము, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్


ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌తో ముచ్చటిస్తున్న మోదీ


కవాతులో పాల్గొన్న ఫ్రెంచి ఫారిన్ లెజియన్ జవాన్లు


అయోధ్య రామాలయ థీమ్‌తో ఉత్తరప్రదేశ్ శకటం

నారీశక్తి విశ్వరూపం

ఘనంగా 75వ గణతంత్ర వేడుకలు | తొలిసారి మహిళలతో త్రివిధ దళాల కవాతు

- శకటాల నుంచి విన్యాసాల దాకా నారీభేరి
- సాయుధ పాటవానికీ అద్దం పట్టిన వేడుకలు
- ముఖ్య అతిథిగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్
- ముర్ముతో కలిసి గుర్రపు బగ్గీలో వేడుకలకు
- రంగుల తలపాగాతో ఆకట్టుకున్న మోదీ

న్యూఢిల్లీ: భారత 75వ గణతంత్ర వేడుకల్లో నారీ శక్తి వెల్లివిరిసింది. శుక్రవారం ఢిల్లీలో కర్తవ్య పథ్‌లో జరిగిన వేడుకలు మన సైనిక పాటవ ప్రదర్శనకు కూడా వేదికగా నిలిచాయి. దేశ ఘన సాంస్కృతిక చరిత్రకు అద్దం పట్టాయి. ఆర్మీ మిలిటరీ పోలీస్ విభాగానికి చెందిన కెప్టెన్ సంధ్య సారథ్యంలో తొలిసారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో జరిగిన త్రివిధ దళాల కవాతు అందరినీ ఆకట్టుకుంది. నేవీ, డీఆర్‌డీఓ శకటాలతో పాటు మణిపూర్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, హరియాణా, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి పలు రాష్ట్రాల శకటాలు కూడా ఆసాంతం నారీ శక్తికి అద్దం పట్టేలా రూపొందాయి. 265 మంది మహిళా సిబ్బంది మోటార్ సైకిళ్లపై ఒళ్లు గగుర్పొడిచేలా డేర్‌డెవిల్ విన్యాసాలు చేశారు. సంప్రదాయ మిలిటరీ బ్యాండ్ స్థానంలో కూడా ఈసారి 112 మంది మహిళా కళాకారులు శంఖం, నాదస్వరాలతో పాటు గిరిజన తదితర సంగీత వాయిద్యాలతో అలరించారు. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ మొదలుకుని ఢిల్లీ పోలీస్, ఎన్‌సీసీ వంటి పలు విభాగాల కవాతులన్నీ పూర్తిగా నారీమయంగా మారి అలరించాయి. వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ వీటన్నింటినీ ఆసాంతం ఆస్వాదిస్తూ కనిపించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఆయన సంప్రదాయ గుర్రపు బగ్గీలో ఆయన వేడుకలకు విచ్చేయడం విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం జరిగిన పరేడ్‌లో ముర్ము, మేక్రాన్ త్రివిధ దళాల వందనం స్వీకరించారు. 90 నిమిషాలకు పైగా జరిగిన వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు సైనిక దళాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. వణికించే చలిని, దట్టంగా కమ్మేసిన పొగ మంచును లెక్క చేయకుండా భారీ జనసందోహం వేడుకలను తిలకించింది. ఈసారి ఏకంగా 75 వేల మందికి పైగా గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. మోదీ వారితో కలివిడిగా మాట్లాడుతూ గడిపారు. ఫొటోలు, సెల్ఫీలకు పోజులిచ్చారు. ఆయన ధరించిన రంగురంగుల బంధనీ తలపాగా ఆహూతులను ఆకట్టుకుంది. మోదీ రాక సందర్భంగా భారత్ మాతా కీ జై అంటూ వారు చేసిన నినాదాలతో కర్తవ్య పథ్ మారుమోగింది. ఫ్రాన్స్‌కు చెందిన 95 మంది సభ్యుల కవాతు దళం, 30 మందితో కూడిన సైనిక వాయిద్య బృందం కూడా వేడుకల్లో పాల్గొన్నాయి. చివరగా వాయుసేనకు చెందిన 29 యుద్ధ విమానాలు, ఏడు రవాణా విమానాలు, 9 హెలికాప్టర్లు, ఒక హెరిటేజ్ ప్లేన్‌తో పాటు ఫ్రాన్స్ వైమానిక దళానికి చెందిన ఎయిర్‌బస్ ఏ330 మల్టీ ట్యాంకర్ రావాణా విమానం, రెండు రాఫెల్ ఫైటర్ జెట్లు చేసిన ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ విన్యాసాల్లో కూడా 15 మంది మహిళా పైలట్లు పాల్గొనడం విశేషం.


మహిళా డేర్‌డెవిల్స్ వీరోచిత విన్యాసాలు


అలరించిన నాగ్ మిసైల్ వ్యవస్థ

- వేడుకల్లో ప్రదర్శించిన టీ–90 భీష్మ ట్యాంకులు, నాగ్ మిసైల్ వ్యవస్థ, తేజస్ వంటి యుద్ధ వాహనాలు, ఆయుధాలను గుర్తించే రాడార్ వ్యవస్థ స్వాతి, డ్రోన్లను జామ్ చేసే వ్యవస్థ, అత్యాధునిక ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థ, క్యూఆర్ఎస్ఏఎం తదితర క్షిపణులు అలరించాయి.


వందనం స్వీకరిస్తున్న రాష్ట్రపతి ముర్ము


అసోం పోలీస్ మహిళా కమెండోల కవాతు


బీఎస్ఎఫ్ మహిళా బృందం కవాతు


పూర్తిగా మహిళలతో కూడిన సైనిక దళాల వైద్య సేవల విభాగం కవాతు

మోదీ నివాళులు

శుక్రవారం ఉదయం ప్రధాని మోదీ తొలుత నేషనల్ వార్ మెమోరియల్‌ను సందర్శించారు. దేశమాత రక్షణలో ప్రాణాలొదిలిన సైనిక వీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ముర్ము, మేక్రాన్ గుర్రపు బగ్గీలో వస్తున్న దృశ్యాలను కెమెరాలు, సెల్ ఫోన్లలో బంధించేందుకు జనం పోటీ పడ్డారు. అనంతరం జెండా వందనం, జాతీయ గీతాలాపన, 105 ఎంఎం దేశీయ శతఘ్నులతో 21 గన్ సెల్యూట్ అందరినీ ఆకట్టుకున్నాయి. భారత కీర్తి పతాకను వినువీధిలో ఘనంగా ఎగరేసిన చంద్రయాన్ థీమ్‌తో రూపొందిన శకటం అలరించింది. దాంతోపాటు అయోధ్య రామాలయ ప్రారంభం నేపథ్యంలో కొలువుదీరిన బాలక్ రామ్ శకటం ప్రధానాకర్షణగా నిలిచింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 16 శకటాలు, కేంద్ర శాఖలకు సంబంధించి 9 శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. వేడుకలు ముగిశాక మోదీ కర్తవ్య పథ్ పొడవునా కాలినడకన సాగి ఆహూతులను అలరించారు. మరోవైపు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కూడా గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. గవర్నర్లు, ముఖ్యమంత్రులు తదితరులు వాటిలో పాల్గొన్నారు.

గొప్ప గౌరవం: మేక్రాన్

''గణతంత్ర వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొనడం నాతో పాటు ఫ్రాన్స్‌కు కూడా గొప్ప గౌరవం. థాంక్యూ ఇండియా. రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీతో పాటు భారత ప్రజలందరికీ గణతంత్ర దిన శుభాకాంక్షలు'' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ పేర్కొన్నారు. వేడుకల అనంతరం ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. గణతంత్ర వేడుకల్లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొనడం ఇది ఆరోసారి కావడం విశేషం! ఈ వేడుకలకు దేశాధినేతలను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం ఆనవాయితీగా వస్తోంది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు నెల్సన్ మండేలా (1995లో) మొదలుకుని అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా (2015లో) దాకా ఎందరో అధినేతలు వీటిలో భాగస్వాములయ్యారు.

దేశాధినేతల అభినందనలు

బ్రిటన్ రాజు చార్లెస్ 3 మొదలుకుని ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు దాకా పలు దేశాల అధినేతలు భారత్‌కు 75వ గణతంత్ర దిన శుభాకాంక్షలు తెలిపారు. అభినందన సందేశాలతో సామాజిక వేదికల్లో పోస్టులు పెట్టారు. భారత్‌తో బ్రిటన్ సంబంధాలు నానాటికీ పటిష్టమవుతున్నాయని రాష్ట్రపతి ముర్ముకు పంపిన సందేశంలో కింగ్ చార్లెస్ హర్షం వెలిబుచ్చారు.

గాజాలో పౌరుల మరణాలను నివారించాలి

ది హేగ్: ఇజ్రాయెల్ ఆర్మీ– హమాస్ మధ్య పోరు కారణంగా గాజాలో తీవ్ర ప్రాణనష్టం సంభవిస్తుండటం, ప్రజలు అంతులేని వేదనకు గురికావడంపై అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) శుక్రవారం ఆందోళన వ్యక్తం చేసింది. యుద్ధం కారణంగా అక్కడ అమాయక ప్రజల మరణాలను, నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌ను కోరింది. అయితే, ఇజ్రాయెల్ ఆర్మీ గాజాలో యుద్ధం ద్వారా మారణహోమానికి పాల్పడుతోందన్న ఆరోపణలను కొట్టివేయరాదని ఐసీజే నిర్ణయించింది. గాజాలో వెంటనే కాల్పుల విరమణను ప్రకటించాలన్న ఉత్తర్వులను మాత్రం ఐసీజే ఇవ్వలేదు. తాజా ఉత్తర్వులు మధ్యంతర తీర్పు మాత్రమేనని చెబుతున్నారు. గాజాలో యుద్ధానికి విరామం ప్రకటించేలా, అక్కడి ప్రజలకు వెంటనే మానవతా సాయం అందేలా చూడాలని దక్షిణాఫ్రికా ఐసీజేలో కేసు వేసింది. దీని విచారణకు ఏళ్లు పట్టొచ్చని భావిస్తున్నారు.

నాటోలో స్వీడన్ చేరికకు తుర్కియే ఆమోదం

అంకారా: నాటోలో స్వీడన్ సభ్యత్వానికి తుర్కియే గురువారం అధికారికంగా ఆమోదం తెలిపింది. హంగేరీ కూడా ఓకే చెబితే నార్డిక్ దేశం స్వీడన్ నాటో దేశంగా మారిపోనుంది. ఏడాదిన్నరగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు తుర్కియే పార్లమెంట్ మంగళవారం ఆమోదం తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర నేపథ్యంలో ఫిన్లాండ్, స్వీడన్ నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. నాటో సభ్యదేశమైన తుర్కియే ఫిన్లాండ్ సభ్యత్వానికి మాత్రమే సమ్మతం తెలిపింది. స్వీడన్ సభ్యత్వంపై అభ్యంతరం తెలుపుతూ వస్తోంది. వాటికి కూడా తగు పరిష్కారం దొరకడంతో తాజాగా ఆమోదం తెలిపింది. ఇక, నాటోలో స్వీడన్ చేరికపై హంగరీ పార్లమెంట్‌లో ఫిబ్రవరి ఆఖరులో చర్చించొచ్చని భావిస్తున్నారు.

రాజకీయాల్లోకి తమిళ నటుడు విజయ్?

చెన్నై: తమిళ నటుడు దళపతి విజయ్ రాజకీయ ప్రవేశానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకుగాను త్వరలోనే కొత్తగా రాజకీయ పార్టీని ప్రకటించనున్నారు. చెన్నైలో గురువారం జరిగిన విజయ్ అభిమానుల సంఘం 'విజయ్ మక్కల్ ఇయక్కమ్'సర్వసభ్య సమావేశం ఇందుకు ఆమోదం తెలిపింది. విజయ్ అధ్యక్షతన ఏర్పాటయ్యే పార్టీకి నియమ నిబంధనలను ఖరారు చేసే అధికారం కూడా ఈ సమావేశం విజయ్‌కే వదిలేసింది. నెలలోగా పార్టీ నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారని సమాచారం. తమిళనాడుతోపాటు కేరళలోనూ విజయ్‌కు భారీగా అభిమానులున్నారు. ఆయన పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక ఎన్నికల్లోనూ విజయ్ అభిమానుల సంఘం పోటీ చేసింది. 2026 ఎన్నికల్లో రాజకీయాల్లోకి ప్రవేశిస్తానంటూ గతంలోనే ఆయన ప్రకటించారు.

రేపే ఎన్డీఏలోకి నితీశ్?

- బీజేపీ మద్దతుతో మళ్లీ సీఎం!
- ఉప ముఖ్యమంత్రిగా బీజేపీ నేత సుశీల్
- రసకందాయంలో బిహార్ రాజకీయం



పట్నా/న్యూఢిల్లీ: బిహార్ రాజకీయం రసకందాయంలో పడింది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన అధికార మహాఘట్‌బంధన్ సంకీర్ణానికి జేడీ(యూ) సారథి, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ గుడ్‌బై చెప్పి ఎన్డీఏ కూటమిలో చేరడం దాదాపుగా ఖాయమైందని తెలుస్తోంది. పాత నేస్తం బీజేపీతో మళ్లీ జట్టు కట్టి ఆయన కొత్తగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. ఆదివారమే నితీశ్ మరోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేయవచ్చని జేడీ(యూ) వర్గాలంటున్నాయి. రాష్ట్ర బీజేపీ అగ్ర నేత సుశీల్‌కుమార్ మోదీకి ఉప ముఖ్యమంత్రి పదవి దక్కనుందని సమాచారం. ''(నితీశ్‌కు ఇంతకాలంగా బీజేపీలోకి) మూసుకుపోయిన తలుపులు తెరుచుకోవచ్చు. రాజకీయాలంటేనే అవకాశాల ఆటస్థలి. కనుక ఏదైనా సాధ్యమే'' అంటూ శుక్రవారం సుశీల్ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు కూడా ఇందుకు బలం చేకూరుస్తున్నాయి. బిహార్ తాజా పరిణామాలపై రాష్ట్ర బీజేపీ చీఫ్ సమ్రాట్ చౌదరి, సుశీల్‌కుమార్ ఇప్పటికే ఢిల్లీ వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్ షా తదితర బీజేపీ అగ్ర నేతలతో చర్చలు జరిపి వచ్చారు. ఈ నేపథ్యంలో జేడీ(యూ)ను ఎన్డీఏలోకి తీసుకోవడంపై శని, ఆదివారాల్లో బిహార్ బీజేపీ రెండు రోజుల రాష్ట్ర కార్యవర్గ సమావేశాల్లో చర్చించనున్నారు. ఆదివారమే పొత్తు నిర్ణయం వెలువడవచ్చని తెలుస్తోంది. ఆ రోజు ఉదయమే జేడీ(యూ) ఎమ్మెల్యేలతో నితీశ్ సమావేశం కానుండటం విశేషం! మరోవైపు 10 మంది దాకా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా బీజేపీతో టచ్‌లో ఉన్నట్టు వస్తున్న వార్తలు అధికార సంకీర్ణంలో కలకలం రేపుతున్నాయి.

నితీశ్ స్పష్టత ఇవ్వాలి: ఆర్జేడీ

సంకీర్ణంలో ప్రధాన భాగస్వామి అయిన ఆర్జేడీతో నితీశ్‌కు విభేదాల నేపథ్యంలో బిహార్‌లో రెండు రోజులుగా రాజకీయ రగడ కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆయన ఎన్డీఏలో చేరతారన్న వార్తలు గురువారం కలకలం రేపాయి. జేడీ(యూ) నిష్క్రమిస్తే సంకీర్ణ ప్రభుత్వం మైనారిటీలో పడుతుంది. దాన్ని కాపాడుకునేందుకు అవసరమైన 8 మంది ఎమ్మెల్యేల కోసం ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. నలుగురు ఎమ్మెల్యేలున్న ఎన్డీఏ భాగస్వామి హిందూస్తానీ అవామ్ మోర్చా చీఫ్ జితిన్‌రామ్ మాంఝీతో శుక్రవారం మంతనాలు జరిపారు. మాంఝీ మాత్రం నితీశ్ కూడా త్వరలో ఎన్డీఏలోకి వస్తారని మీడియాతో చెప్పుకొచ్చారు! ఘట్‌బంధన్ సర్కారు ఒకట్రెండు రోజుల్లోనే కుప్పకూలడం ఖాయమని ఆయన కుమారుడు సంతోష్ జోస్యం చెప్పారు. మొత్తం ఉదంతంపై నితీశ్ తక్షణం స్పష్టమైన ప్రకటన చేసి ఊహాగానాలకు తెర దించాలని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా కోరడం విశేషం.

పొత్తిళ్లలో విడిపోయి 19 ఏళ్లకు కలిశారు

కవలలను కలిపిన టిక్‌టాక్ వీడియో

కన్న తల్లి ఒడిలో పెరిగి జంటగా ఆడుకోవాల్సిన కవల అమ్మాయిలు వీరు. కానీ విధి వారితో వింత నాటకం ఆడింది. ఆస్పత్రుల్లో పుట్టిన పసికందులను దొంగలించి పిల్లల్లేని జంటలకు అమ్మేసే ముఠా బారిన పడి కన్నతల్లి ప్రేమకు దూరమయ్యారు. ఎందరో చిన్నారులను మొబైల్‌ఫోన్‌కు అతుక్కుపోయేలా చేసే టిక్‌టాక్ వీడియో ఒకటి వీరిద్దరినీ మళ్లీ కలిపింది. అందుకు ఏకంగా 19 సంవత్సరాల సమయం పట్టింది. అచ్చం తనలా ఉన్న అమ్మాయిని చూసి ఎవరీమె? ఎందుకు నాలాగే ఉంది? అంటూ ఒకరిని వేధించిన ప్రశ్నలు చివరకు తన కవల సోదరి చెంతకు చేర్చాయి. ఈ గాథ ఐరోపాలోని జార్జియాలో జరిగింది...

ఈ కథ 2002 ఏడాదిలో జార్జియాలోని కీర్ట్‌స్కీ ప్రసూతి ఆస్పత్రిలో మొదలైంది. గోచా ఘకారియా దంపతులకు కవల అమ్మాయిలు పుట్టారు. వెంటనే తల్లి అజా షోనీకి తీవ్ర అస్వస్థతకు గురై కోమాలోకి వెళ్లింది. తను చనిపోతే పసికందులను పెంచడం తన వల్ల కాదని గోచా భావించాడు. ఇదే అదనుగా అక్కడున్న పిల్లల్ని దొంగలించే ముఠా అతనికి డబ్బులు ఎరవేసి పిల్లల్ని తీసుకెళ్లిపోయింది.

అచ్చం తనలా ఉండటంతో అవాక్కై..

పిల్లలను ఆ దొంగల ముఠా వేర్వేరు ప్రాంతాల్లోని వేర్వేరు కుటుంబాలకు పెద్ద మొత్తాలకు అమ్మేసింది. పెంపుడు తల్లిదండ్రులు ఆ చిన్నారులకు అమీ ఖివీటియా, అనో సర్టానియా అని పేర్లు పెట్టారు. చూస్తుండగానే పుష్కరకాలం గడిచిపోయింది. 12 వయసు ఉన్నపుడు అమీ 2014 సంవత్సరంలో ఓ రోజు టీవీలో తనకిష్టమైన ప్రోగ్రాంలో అచ్చం తనలా ఉన్న ఓ 12 ఏళ్ల అమ్మాయి డ్యాన్స్ చేయడం చూసి అవాక్కైంది.

కలిపిన టిక్‌టాక్

అమీకి కూడా డ్యాన్స్ అంటే ప్రాణం. డ్యాన్స్ నేర్చుకుంది. ఏడేళ్ల తర్వాత అమీ ఒక టిక్‌టాక్ వీడియో తీసి అప్‌లోడ్ చేసింది. అది తెగ వైరల్ అయింది. దానిని అమీ సొంతూరుకు 320 కిలోమీటర్ల దూరంలోని టిబిలిసీ నగరంలోని కవల సోదరి అనో సర్టానియా స్నేహితురాలు చూసింది. ఆ వీడియో సర్టానియోది అనుకుని భ్రమపడింది. సర్టానియోకు షేర్ చేసి విషయం కనుక్కోమని చెప్పింది. తనలాగా ఉన్న అమీ వీడియో చూసి సర్టానియోకు అనుమానం వచ్చింది. ఈమె నాకు బంధువు అవుతుందా? అసలు ఈ టీనేజర్ ఎవరు? అంటూ తను చదువుకునే విశ్వవిద్యాలయం వాట్సాప్ గ్రూప్‌లో పోస్టులుపెట్టేది. ఈ గ్రూప్‌లో అమీకి తెల్సిన వ్యక్తి ద్వారా ఒకరి ఫోన్ నంబర్ ఒకరికి అందింది. అందజేశారు. దీంతో అమీ, అనో మొట్టమొదటిసారిగా మెసేజ్‌ల ద్వారా మాట్లాడుకోవడం మొదలైంది.



ఎన్నెన్నో పోలికలు

వేర్వేరు కుటుంబ వాతావరణాల్లో పెరిగినా ఇద్దరి అభిరుచులూ ఒకటే. డ్యాన్స్ ఇష్టం. హెయిర్ స్టైల్ ఒక్కటే. ఇద్దరికీ ఒకే జన్యు సంబంధమైన వ్యాధి ఉంది. సర్టిఫికెట్లలో పుట్టిన తేదీ కూడా చిన్న తేడాతో దాదాపు ఒకేలా చూపిస్తోంది. ఒకే వయసు ఉన్నారు. సర్టిఫికెట్లలో ఆస్పత్రి పేరు కూడా ఒక్కటే. ఇన్ని కలవడంతో తాము కవలలమేమో అని అనుమానం బలపడింది. కానీ ఇరు కుటుంబాల్లో 'నువ్వు మా బిడ్డవే' అని చెప్పారుగానీ కొనుక్కున్నాం అనే నిజం బయటపెట్టలేదు. వీళ్ల మొండిపట్టు చూసి నిజం చెప్పేశారు. కానీ వీళ్లు కవలలు అనే విషయం వారికి కూడా తెలీదు. ఎందుకంటే వీరికి అమ్మిన ముఠా సభ్యులు వేర్వేరు. దీంతో తమ కన్న తల్లిదండ్రులు ఎవరనేది మిస్టరీగా ఉండిపోయింది. పెంచలేక వదిలేశారని అనో ఆగ్రహంతో రగిలిపోయింది. కన్న వారిని ఎలాగైనా కనిపెట్టాలని అమీ మాత్రం పలు వెబ్‌సైట్లు, గ్రూప్‌లలో అన్వేషణ ఉధృతం చేసింది. ఇందుకోసం సొంతంగా ఫేస్‌బుక్ పేజీని ప్రారంభించింది.

మూడో తోబుట్టువు!

ఆ నోటా ఈనోట విన్న ఒక టీనేజర్.. అమీకి ఫోన్ చేసింది. తన తల్లి 2002లో ఒక మెటర్నిటీ ఆస్పత్రిలో కవలలకు జన్మనిచ్చిందని, వారు పుట్టగానే చనిపోయారని తల్లి ఓసారి తనతో చెప్పిందని అమీకి వివరించింది. వెంటనే అమీ అక్కడికి వెళ్లి ఆ టీనేజర్, ఆమె కన్నతల్లి డీఎన్ఏ టెస్ట్‌లు చేయించింది. అవి తమ డీఎన్ఏలతో సరిపోలాయి. అలా ఎట్టకేలకు 19 ఏళ్ల వయసులో లీపెగ్ నగరంలో కవలలు కన్నతల్లిని కలిసి తనివి తీరా కౌగిలించుకున్నారు. దాంతో ఆమెకు నోట మాట రాలేదు. కోమా నుంచి కోలుకున్నాక మీరు చనిపోయారని భర్త చెప్పాడని కన్నీరుమున్నీరైంది. ఈ మొత్తం ఉదంతం తాజాగా వెలుగు చూసింది.

లక్షల శిశు విక్రయాలు

ట్యాక్సీ డ్రైవర్లు మొదలు ఆస్పత్రి సిబ్బంది, అవినీతి అధికారులదాకా ఎందరో ఇలా జార్జియాలో పెద్ద వ్యవస్థీకృత ముఠాగా ఏర్పడి లక్షల మంది పసికందులను ఆస్పత్రుల్లో మాయం చేశారని అక్కడి మీడియాలో సంచలనాత్మక కథనాలు వెల్లడయ్యాయి. దీనిపై ప్రస్తుతం జార్జియా ప్రభుత్వం సమగ్ర దర్యాప్తునకు ఆదేశించింది.


– సాక్షి, నేషనల్ డెస్క్

నైట్రోజన్ గ్యాస్‌తో మరణ శిక్ష అమలు

ప్రపంచంలో తొలిసారిగా నూతన శిక్షను అమలుచేసిన అమెరికా

అట్మోర్(అమెరికా): మూడు దశాబ్దాల క్రితం వేయి డాలర్ల సుపారీ తీసుకుని ఒక మహిళను హత్యచేసిన కేసులో దోషికి అమెరికా నూతన పద్ధతిలో మరణశిక్షను అమలుచేసింది. 58 ఏళ్ల కెన్నెత్ ఎజీన్ స్మిత్ స్వచ్ఛమైన నైట్రోజన్ వాయువును పీల్చేలాచేసి మరణశిక్షను అమలుచేసింది. ఇలా నైట్రోజన్‌గ్యాస్‌ను వాడి దోషికి మరణశిక్షను అమలుచేయడం ప్రపంచంలోనే తొలిసారి కావడం గమనార్హం. అమెరికాలోని అలబామా రాష్ట్రంలో ఈ శిక్షను స్థానిక కాలమానం ప్రకారం గురువారం రాత్రి అమలుచేశారు. అమెరికాలో 1982 ఏడాది నుంచి విషం ఇంజెక్షన్‌తో దోషులకు మరణశిక్షను అమలుచేయడం మొదలెట్టాక మరో నూతన శిక్షా విధానాన్ని అమల్లోకి తేవడం ఇదే తొలిసారి.

ఎలా అమలుచేశారు?: అట్మోర్ నగరంలోని హోల్‌మ్యాన్ కరెక్షన్ ఫెసిలిటీలో నైట్రోజన్ హైపోక్సియా శిక్ష అమలు ప్రక్రియను ఐదుగురు మీడియా ప్రతినిధులను తీసుకెళ్లి చూపించారు. నైట్రోజన్ గ్యాస్ నింపిన సిలిండర్ పైపును దోషి స్మిత్ ముక్కుకు బిగించిన మాస్క్ ద్వారా శరీరంలోకి పంపించారు. స్వచ్ఛమైన నైట్రోజన్ గ్యాస్ అనేది ప్రాణాధారమైన ఆక్సిజన్‌ను శరీరకణాలకు అందకుండా చేస్తుంది. దీంతో కణాలు ఆక్సిజన్ లేక క్షణాల్లోని మృతిచెందుతాయి. దీంతో మరణం సంభవిస్తుంది. రాత్రి 7.53 గంటలకు గ్యాస్‌ను పంపించారు. 8.25 గంటలలోపు అతను మరణించినట్లు ప్రకటించారు.



ఏమిటీ కేసు?: చార్లెస్ సెన్నెట్ అనే మతాధికారి 1980లలో భారీగా అప్పులుచేశాడు. భార్యను చంపేస్తే బీమా సొమ్ము వస్తుందని ఆమె హత్యకు పథకం వేశాడు. చార్లెస్ నుంచి సుపారీ తీసుకుని జాన్ ఫారెస్ట్ పార్కర్, స్మిత్ ఆయన భార్య ఎలిజబెత్‌ను చంపేశారు. వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. పశ్చాత్తాపంతో చార్లెస్ ఆత్మహత్య చేసుకున్నాడు. 2010లో పార్కర్‌కు అమలు శిక్షను అమలుచేయగా తాను నిర్దోషినంటూ ఇన్నాళ్లూ స్మిత్ కోర్టుల చుట్టూ తిరిగారు. జ్యూరీ జీవితఖైదు సిఫార్సుచేయగా జడ్జి ఏకంగా మరణశిక్ష విధించారు. ఇంతవరకూ లేని కొత్త విధానంలో శిక్ష అమలు చేయాలని ఆదేశాలిచ్చారు. దీనిపై గురువారం అమెరికా సుప్రీంకోర్టులో వాదనలు నడిచాయి. ఇంతవరకు వాడని, క్రూరమైన, అసాధారణ శిక్షా విధానాన్ని ఎలా అమలుచేస్తారని స్మిత్ లాయర్లు వాదించినా శిక్ష అమలుకే కోర్టు పచ్చజెండా ఊపింది.

జ్ఞానవాపి మసీదులో దేవతా విగ్రహాలు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లో వారణాసిలోని జ్ఞానవాపి మసీదు కింద పురాతన హిందూ ఆలయ అవశేషాలున్నాయంటూ కోర్టుకు భారత పురావస్తు శాఖ(ఏఎస్ఐ) సమర్పించిన సర్వే నివేదికలో మరి కొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. శివలింగం భాగాలు, హిందూ దేవతల ధ్వంసమైన విగ్రహాలు మసీదులో ఉన్నాయి. వాటి ఫొటోలు తాజాగా జాతీయ మీడియాకు లభించాయి. హనుమాన్, గణేష, నంది విగ్రహాల ఫొటోలు, కొన్ని పానవట్టాలు, కిందిభాగం లేని శివలింగం వాటిలో ఉన్నాయి. శతాబ్దాల నాటి నాణేలు, పర్షియన్ లిపి సున్నపురాయి శాసనం, రోలు ఉన్నాయి. మసీదు కింద భారీ ఆలయముండేదని నివేదిక నిరూపిస్తోందని హిందువుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్ జైన్ చెప్పారు. ఆలయ రాతిస్తంభాలనే కాస్త మార్చి మసీదు నిర్మాణంలో వాడారని నివేదికలో ఉందన్నారు. ''17వ శతాబ్దంలో ఔరంగజేబు ఇక్కడి ఆదివిశ్వేశ్వర ఆలయాన్ని కూల్చేసినట్లు నివేదికలోని ఆధారాలు బలంగా చాటుతున్నాయి. దీన్ని బట్టి ఇక్కడ ఒక ఆలయం ఉండేదని స్పష్టమవుతోంది'' అని ఆయన చెప్పారు. దీనితో అంజుమన్ అంజామియా మసీదు కమిటీ ప్రతినిధి అఖ్‌లాఖ్ అహ్మద్ విభేదించారు. ''ఇందులో కొత్తేమీ లేదు. గతంలోనూ అవి ఉన్నాయని ఏఎస్ఐ తెలిపింది. తాజా నివేదికలో వాటి కొలతలను స్పష్టంగా పేర్కొంది. అవి పురాతనమైనవని చెప్పే ఆధారాలను ఏఎస్ఐ ప్రస్తావించలేదు. ఆ రాళ్ల వయసు ఎంత అనే అంశాలపై ఏఎస్ఐ ఇంకా ఎలాంటి నిర్ధారణకు రాలేదు. సర్వేలో ఉన్నవన్నీ ఏఎస్ఐ అభిప్రాయాలు మాత్రమే. అవి నిపుణుల అభిప్రాయాలు కాదు'' అని ఆయన వాదించారు. గత ఏడాది జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఏఎస్ఐ మసీదు కాంప్లెక్స్‌లో శాస్త్రీయసర్వే చేపట్టి గత ఏడాది డిసెంబర్ 18వ తేదీన సీల్డ్ కవర్‌లో సర్వే నివేదికను సమర్పించింది. తాజాగా కోర్టు వాటిని కేసులో భాగమైన ఇరుపక్షాల ప్రతినిధులు, న్యాయవాదులకు అందజేశారు. దీంతో నివేదికలోని అంశాలు బహిర్గతమయ్యాయి.

సాక్షి 24|7
కర్ణాటక
KARNATAKA
శనివారం : 27 : జనవరి : 2024



బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు సంగొళ్లి రాయణ్ణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బెంగళూరులో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

న్యూస్‌రీల్

కలబుర్గిలో బాలుడిపై దాష్టీకం

రాయచూరు రూరల్: కలబుర్గిలో బాలుడిని కొట్టి అర్ధనగ్నంగా ఊరేగించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కలబుర్గి సర్దార్ వల్లబాయి పటేల్ క్రీడా మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఆచరిస్తుండగా, అక్కడి అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాస్టల్‌లో విద్యార్థులు ఓ బాలుడిపై ఉదయం అంబేడ్కర్ పూజలకు రాలేదనే కోపంతో దాడి చేసి దుస్తులను తొలగించి, కొట్టి అంబేడ్కర్ ప్రతిమను చేతిలో పెట్టి అర్ధనగ్నంగా ఊరేగించారు.

9 మందిపై క్రిమినల్ కేసులు

బనశంకరి: డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ముమ్మర తనిఖీలు చేపట్టిన బెంగళూరు నగర ట్రాఫిక్ పోలీసులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రధానంగా ప్రైవేటు బస్ డ్రైవర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డారు. 881 మంది బస్ డ్రైవర్లను పరీక్షించగా అందులో 9 మంది మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ విభాగ జాయింట్ పోలీస్ కమిషనర్ అనుచేత్ తెలిపారు. తొమ్మిది మంది డ్రైవర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసి డీఎల్ రద్దు చేయాలని ఆర్టీఓ అధికారులకు లేఖ రాశామని, బస్సుల యజమానులకు నోటీస్ ఇచ్చామని తెలిపారు.

గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

- గాల్లోకి కాల్పులు జరిపిన కన్నడ సంఘం నాయకుడు

సాక్షి,బళ్లారి: గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. శుక్రవారం విజయపుర జిల్లా ఇండి తాలూకాలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండగా జెండా అవిష్కరణ అనంతరం కన్నడ సంఘాలకు చెందిన మల్లుగిన్ని అనే వ్యక్తి గన్‌తో గాల్లోకి కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ అక్కడే ఉన్న జీపీ అధ్యక్షుడిపైకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఆయనకు ప్రాణాపాయం తప్పింది. పోలీసులు అప్రమత్తం అయ్యేలోపు కాల్పులు జరిపిన వ్యక్తి పరారయ్యాడు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



విజయలక్ష్మి(ఫైల్)

మైసూరు : కట్నం వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హూసకోటెలో చోటు జరిగింది. 12 సంవత్సరాల క్రితం మైసూరు తాలూకా బొమ్మనహళ్లికి చెందిన విజయలక్ష్మి(35)ని నంజనగూడు తాలూకాలోని హూసకోటెకు చెందిన హరీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో బంగారం కట్నంగా సమర్పించారు. అయితే అదనపు కట్నం తేవాలని భర్తతోపాటు అత్త మల్లిగమ్మ, మామ మహాదేవ మూర్తి, మరిది రాఘవేంద్రలు వేధించేవారు. దీంతో పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. అయినప్పటికీ వేధింపులు ఆపలేదు. దీంతో బిళిగెరె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కూడా పంచాయితీ చేశారు. అయినా భర్త, అతని కుటుంబ సభ్యులు పద్ధతి మార్చుకోలేదు. వేధింపులు కొనసాడంతో విజయలక్ష్మి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో బిళిగెరె పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సీఎం వద్దకు దూసుకొచ్చిన మైసూరువాసి

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

శివాజీనగర: మాణిక్ షా పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల సమయంలో సీఎం సిద్దరామయ్య వద్దకు ఓ వ్యక్తి దూసుకురాగా, అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మైసూరుకు చెందిన పరశురామ్ అనేవ్యక్తి కేపీఎస్‌సీ ఆర్డర్ ఆలస్యంపై సీఎం సిద్దరామయ్యకు వినతిపత్రం సమర్పించేందుకు వచ్చాడు. అయితే పోలీసులు అందుకు అవకాశం కల్పించకపోవటంతో పరశురామ్ సీఎం వద్దకు దూసుకొని వచ్చేందుకు ప్రయత్నించారని తెలిసింది.

అన్ని రంగాల్లో విశేష సాధన

- భారత రాజ్యాంగం దేశప్రగతికి దారిదీపం
- రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి
- గణతంత్ర దిన వేడుకల్లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్



తుమకూరులో త్రివర్ణ పతాకం రెపరెపలు

శివాజీనగర: రాష్ట్రంలో అన్ని రంగాల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయటంతోపాటు శాంతి, సామరస్యతను కాపాడుకొని జాతీయ ఐక్యత కోసం శ్రమించాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బెంగళూరులోని ఫీల్డ్‌మార్షల్ మానెక్ పరేడ్ మైదానంలో శుక్రవారం జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 75 సంవత్సరాల్లో రాష్ట్రం, దేశం అపూర్వ ప్రగతి సాధించిందన్నారు. 1950లో అద్భుత లిఖిత రాజ్యాంగాన్ని అనుసరించడమే ఇందుకు కారణమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, ఆయన బృందం సభ్యుల దూరదృష్టికి తాము రుణపడి ఉన్నామన్నారు. ఆయన తమకు ప్రగతి దారిలో నడిచేందుకు దారిదీపమయ్యారని గవర్నర్ తెలిపారు.

సమర్థంగా గ్యారంటీ పథకాల అమలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఐదు గ్యారంటీ పథకాలు విజయవంతంగా కొనసాగిస్తోందని ప్రశంసలు కురిపించారు. భారతదేశ ప్రజలకు సమానత్వ అవకాశాలను కల్పించటంతో పాటు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడాల్నారు. భారత రాజ్యాంగ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం శ్రమిస్తుందన్నారు. యుగయుగాల నుంచి సమానవత్వం కలిగిన భారతదేశంలో విభిన్న మతాలు, సంస్కృతి, సంప్రదాయాలతో అలరారుతోందన్నారు. ఐక్యత విషయంలో భారత దేశం ప్రపంచానికే సందేశాన్ని ఇస్తోందన్నారు.

పథకాలు ప్రజలకు ఆసరా

అన్నభాగ్య, శక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధి పథకాలు రాష్ట్ర ప్రజల జీవితాలకు ఉపకారిగా ఉన్నాయని గవర్నర్ అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కరువు ప్రభుత్వ విజయవంతంగా ఎదుర్కొందన్నారు. రైతుల కష్టాలను నివారించేందుకు ప్రతి రైతుకు రూ.2 వేల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సుమారు 30 లక్షల మంది రైతులకు రూ.580 కోట్లు విడుదల చేసే ప్రక్రియ జరిగిందన్నారు. కరువు పరిహార చర్యలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్‌ఎఫ్ నుంచి నిధులను కోరిందన్నారు. రైతు సురక్షా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద 6.77 లక్షల మంది రైతులకు రూ.459.59 కోట్లు పరిహార బీమా ఇచ్చినట్లు తెలిపారు.

జోరుగా కరువు నివారణ పనులు

కరువు పరిహారాల చర్యలను పర్యవేక్షించేందుకు ఎమ్మెల్యేల నేతృత్వంలో తాలూకా స్థాయి కార్యచరణ కమిటీలు ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. నరేగా పథకం కింద 2023 డిసెంబర్ ఆఖరు వరకు 63.13 లక్షల మందికి పనులు కల్పించినట్లు తెలిపారు. గ్రామీణ తాగునీటి పథకం ద్వారా 22.38 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య కవచం పథకం కింద 262 కొత్త అంబులెన్స్‌లు ప్రభుత్వం సమకూర్చినట్లు గవర్నర్ తెలిపారు. ఉచిత డయాలసిస్ కోసం డయాలిసిస్ కేంద్రాలను 168 నుంచి 219కు పెంచే కార్యం ప్రగతిలో ఉందన్నారు. డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ ఉదయ జ్యోతి పథకాన్ని జారీ చేసినట్లు తెలిపారు.

రైతులకు సర్కార్ అండ

రైతులకు ఈ సంవత్సరం అధిక రుణాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సుమారు 35 లక్షల మందికి పైగా రైతులకు రూ.25 వేల కోట్ల వరకు రుణాలను 2023–24వ సంవత్సరంలో పంపిణీ చేసే లక్ష్యం పెట్టుకొందన్నారు.

బెంగళూరు అభివృద్ధికి ప్రాధాన్యత:

బెంగళూరు సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించినట్లు గవర్నర్ తెలిపారు. ప్రధాన రోడ్లను వైట్ ట్యాపింగ్ చేసేందుకు రూ.2 వేల కోట్లతో టెండర్ ప్రక్రియలు జరిగాయన్నారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎంపికైన స్థలాల్లో సొరంగ మార్గాలను నిర్మించేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు అమలు చేసిందన్నారు. వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్వయం ఉపాధి చేపట్టే అల్పసంఖ్యాకులకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



మానెక్‌షా పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమం



బెంగళూరులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన



మహనీయుల వేషధారణలో విద్యార్థులు



కలబుర్గిలో జాతీయ జెండాకు చిన్నారుల జేజేలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

స్వాతంత్ర్యనంతరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన దినాన్ని పురస్కరించుకొని నిర్వహించే గణతంత్ర వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అంబరమంటాయి. ప్రజల్లో దేశభక్తి ఉప్పొంగింది. వాడవాడలా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నేతలు ఇచ్చిన ప్రసంగాలు ప్రజల్లో స్ఫూర్తి నింపాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సాహస క్రీడలు ఉత్సాహాన్ని నింపాయి.

పదవుల పందేరం

కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

బనశంకరి: కాంగ్రెస్ ప్రభుత్వం పదవుల పందేరం చేపట్టింది. 36 మంది ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులను కట్టబెట్టింది. ఈమేరకు శుక్రవారం జాబితా విడుదల చేసింది. శాంతినగర ఎమ్మెల్యే ఎన్‌ఏ.హ్యారీస్‌కు బెంగళూరు అభివృద్ధి ప్రాధికార అధ్యక్ష పదవి(బీడీఏ), బేలూరుగోపాలకృష్ణను అటవీపరిశ్రమ మండలి అధ్యక్షుడిగా నియమించింది. శివలింగేగౌడకు కర్ణాటకగృహమండలి, నరేంద్రస్వామికి కాలుష్యనియంత్రణమండలి, హెచ్‌సీ.బాలకృష్ణకు కర్ణాటక రవాణాశాఖమండలి, వినయ్‌కులకర్ణికి బెంగళూరు జలమండలి, శ్రీనివాస్‌మానేకు డిప్యూటీ సీఎం రాజకీయసలహాదారుడిగా, అనిల్‌చిక్కమాధుకు జంగల్ లాడ్జి, విజయానందకాశప్పనవర్‌కు క్రీడా ప్రాధికార, రూపకళా హస్తకళల అభివృద్ధిమండలి అధ్యక్ష పదవులు కేటాయించారు. వీరికి మంత్రి వర్గస్థాయి సౌలభ్యాలు ఉంటాయని ప్రభుత్వ ఆదేశాల్లో తెలిపింది. కార్పొరేషన్ చైర్మన్ల అధికార అవధిని ఏడాదిగా నిర్ణయించారు.

డిమాండ్లకు ఓకే అంటే బీజేపీతో పొత్తు

- ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి

గంగావతి: తమ డిమాండ్లకు ఒప్పుకుంటే బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ వ్యవస్థాపకుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగావతిలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో చర్చించి బీజేపీతో పొత్తుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రధాని మోదీని మరోమారు ప్రధానిని చేసేందుకు బీజేపీకి మద్దతు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అగ్రనేతలనుంచి పిలుపు వచ్చిందని, త్వరలో ఢిల్లీ వెళతానన్నారు.

సిద్ధాంతాలకు కట్టుబడితేనే పార్టీలో చేర్చుకోవాలి

- మల్లికార్జున ఖర్గే

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలోకి ఎవరినిపడితే వారిని తీసుకోరాదని, పార్టీకి కట్టుబడి ఉన్నవారిని మాత్రం చేర్చుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. శుక్రవారం కేపీసీసీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరిన నేపథ్యంలో ఖర్గే వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. గుణం, సిద్ధాంతాల గురించి యోచించి పార్టీలోకి చేర్చుకోవాలి. ఎలాగొచ్చారో అలాగే వెళ్లారనేది ఉండరాదు. తమ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి నడుచుకునే పార్టీ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో కలసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మ:

రాజ్యాంగం అమల్లో లేకపోతే ప్రజాస్వామ్యం ఉండేది కాదని, రాజ్యాంగ మార్పు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మ అని ఖర్గే మండిపడ్డారు. ఇదే సమయంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ...రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఈ దిశగా అందరూ ఐక్యంగా పోరాటం చేపట్టాలన్నారు.



గ్లాస్‌హౌస్‌లో పోటెత్తిన సందర్శకులు

పుష్పసోయగం..జనసాగరం



బసవణ్ణ థీమ్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు

బనశంకరి: గణతంత్రదినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్ ఉద్యానవనం గ్లాస్ హౌస్‌లో ఏర్పాటుచేసిన 215వ ఫలపుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. బసవణ్ణ వచన సాహిత్య ఆధారిత థీమ్‌తో ఫ్లవర్‌షో ఏర్పాటు చేశారు. గ్లాస్‌హౌస్‌లో బసవణ్ణ అనుభవ మంటపం వెనుక బసవణ్ణ, అక్కమహాదేవి, అంబిగరచౌడయ్య, హరళయ్యతో పాటు శరణ విగ్రహాలు వివిధ రకాల పుష్పాల మధ్య సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సెలవురోజు కావడంతో విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పుష్పాల అందాలను వీక్షించారు. పుష్ప అందాలను తమ సెల్ఫోన్లలో బంధించి సందడి చేశారు.

క్లుప్తంగా

కెనరా బ్యాంకు కార్యాలయంలో గణతంత్ర వేడుకలు



జెండా ఎగురవేస్తున్న కే.సత్యనారాయణరాజు

బనశంకరి: బెంగళూరులోని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. బ్యాంక్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌, సీఈఓ కే.సత్యనారాయణరాజు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రష్యాలో జరిగిన ప్రపంచ గ్రాప్లింగ్‌ చాంపియన్‌షిప్‌ 2023 పోటీల్లో రజత పతాకాన్ని సాధించిన ఏపీలోని సత్యసాయి జిల్లాకు చెందిన రెజ్లర్‌ ఉమాదేవిదేవరకొండను బ్యాంక్‌ సీఈఓ సత్కరించారు.

నెలాఖరు నాటికి ఎయిర్‌పోర్టులో ఇందిరా క్యాంటీన్‌

దొడ్డబళ్లాపురం: ఈనెల చివరినాటికి కెంపేగౌడ ఎయిర్‌పోర్టులో ఇందిరా క్యాంటీన్‌ ఏర్పాటు చేయడానికి బీబీఎంపీ ఏర్పాట్లు చేస్తోంది. నిత్యం 2 వేల మందికి కనీసం ఆహారం అందించే లక్ష్యంతో బీబీఎంపీ ఇందిరా క్యాంటీన్‌ ఏర్పాటు చేస్తోంది. ఈ క్యాంటీన్‌ వల్ల ఎక్కువగా క్యాబ్‌ డ్రైవర్లు, బీఎంటీసీ బస్సు డ్రైవర్లు, కార్మికులు లబ్ధి పొందుతారని సమాచారం. క్యాంటీన్‌ ఏర్పాటుకు సుమారు రూ.1.35 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఎయిర్‌పోర్టులో ఇందిరా క్యాంటీన్‌ తెరవాలని చాలా రోజులుగా క్యాబ్‌ డ్రైవర్ల అసోసియేషన్‌ డిమాండు చేస్తోంది. ఎయిర్‌ పోర్టులోని 1వ టర్మినల్‌లోని పార్కింగ్‌–7 వద్ద క్యాంటీన్‌ ఏర్పాటు చేస్తున్నట్లు బీబీఎంపీ ఆరోగ్యశాఖ అధికారి సిరాజ్‌ అహ్మద్‌ తెలిపారు.

నకిలీ ఉపాధ్యాయుడి బాగోతం

- 26 ఏళ్ల తరువాత గుర్తింపు
- విధుల నుంచి సస్పెండ్‌

మైసూరు: నకిలీ దాఖలాలు సృష్టించి మృతి చెందిన తన తమ్ముడు ఉద్యోగాన్ని పొందిన టీచర్‌ బాగోతం 26 ఏళ్ల తరువాత బయటపడింది. వెంటనే స్పందించిన జిల్లా అధికారులు అతన్ని విధుల నుంచి సస్పెండ్‌ చేశారు. లక్ష్మణ్‌గౌడ సస్పెండైన టీచర్‌. వివరాలు...కేఆర్‌నగర తాలూకా డీకే కొప్పలు గ్రామానికి చెందిన రామేగౌడకు ఇద్దరు కుమారులు. ఇందులో లోకేశ్‌ ఉపాధ్యాయుడు. ఇతను 1992లో మరణించాడు. ఉద్యోగం వచ్చి విధుల్లో చేరకనే మృతి చెందాడు. ఇక్కడే అన్న తన తెలివి తేటలు ప్రదర్శించి నకిలీ దాఖలాలు సృష్టించి తానే లోకేశ్‌ అని ఉద్యోగం పొందాడు. దాదాపు 26 ఏళ్ల పాటు ఉద్యోగం వెలగబెట్టాడు. ఇదిలా ఉంటే చనిపోయిన లోకేశ్‌ వివాహితుడు. ఈ క్రమంలో కుటుంబంలో మనస్పర్థలు రావడంతో లోకేశ్‌ భార్య తన భర్త 1992లోనే చనిపోయాడని విద్యాశాఖ అధికారులకు తెలిపింది. ఇదే సమయంలో రాజు అనే వ్యక్తి లోకాయుక్తకు, విద్యాశాఖకు ఫిర్యాదు చేశాడు. వెంటనే రంగంలోకి దిగిన అధికారులు విచారణ చేపట్టి ప్రస్తుతం ఉద్యోగం ఉన్న లక్ష్మణగౌడను విధుల నుంచి సస్పెండ్‌ చేశారు. ఇప్పటి వరకు తీసుకున్న జీతం మొత్తం చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.

ఏటీఎస్‌ అధికారుల అదుపులో భట్కళ మహిళ

బనశంకరి: ఐసిస్‌ అనుమానిత ఉగ్రవాదితో సంబంధాలు కలిగి ఉందనే ఆరోపణలతో ఉత్తరకన్నడ జిల్లా భట్కళ్‌ పట్టణానికి చెందిన ఒక మహిళను ముంబై ఏటీఎస్‌ అధికారులు గురువారం అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు. ఉగ్రవాదులతో సంబంధాలు నెరుపుతున్నారనే ఆరోపణలపై మహారాష్ట్రలోని నాసిక్‌ టిడ్కో కాలనీకి చెందిన హుసేన్‌ అబ్దుల్‌అజీజ్‌షేక్‌(32)ను గత నెలలో ఏటీఎస్‌ అధికారులు అరెస్ట్‌ చేశారు. సిమ్‌కార్డు, మొబైల్‌ఫోన్‌, పెన్‌డ్రైవ్‌, ల్యాప్‌టాప్‌ స్వాధీనం చేసుకున్నారు. అతని సెల్‌ఫోన్‌లో భటకళకు చెందిన మహిళ వివరాలు ఉండటంతో అధికారులు భట్కళ పట్టణానికి చేరుకుని స్థానిక పోలీసుల సహకారంతో ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అబ్దుల్‌ హుసేన్‌ను ఆమె భట్కళకు పిలిపించి లాడ్జీలో గడిపినట్లు ఏటీఎస్‌ దర్యాప్తులో తేలింది. పలు పర్యాయాలు అతని బ్యాంకు ఖాతాకు రూ.4 లక్షల నుంచి రూ. 5 లక్షల నగదు బదిలీ చేసినట్లు అధికారుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

వ్యక్తి అనుమానాస్పద మృతి

చిక్కబళ్లాపురం: నగర పరిధిలోని జడలతిమ్మనహళ్లి రైల్వే గేట్‌ పట్టాలపై ఓ మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇతన్ని గుంతప్పనహళ్లికి చెందిన రవి (40)గా గుర్తించారు. వివాహితుడైన ఇతను మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. తిర్నహళ్లి క్రాస్‌ వద్ద ఓ ఫ్యాక్టరీలో సెక్యూరిటీగా పనిచేసేవాడు. ఇదిలా ఉంటే రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ఎవరైనా చంపి ఇక్కడ పడేశారా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఏఎస్పీకి సన్మానం

శివమొగ్గ: రాష్ట్రపతి సేవా పతకం పొందిన శివమొగ్గ జిల్లా అదనపు ఎస్పీ అనిల్‌ కుమార్‌ భూమారెడ్డిని గణతంత్ర వేడుకల సందర్భంగా పలువురు జిల్లా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈయన 1994లో ఎస్‌ఐగా పోలీసు శాఖలో చేరి అంచలంచెలుగా ఎదిగి ఏఎస్పీ స్థాయికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఎస్పీ మిథున్‌కుమార్‌ పలువురు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు కరువు పరిహారం ఇచ్చాం

మండ్య: రాష్ట్రంలో కరువు పరిస్థితుల నేపథ్యంలో పంట నష్టపోయిన రైతులకు రూ. 2 వేల కోట్ల వరకు నష్టపరిహారం ఇచ్చామని, బాధిత రైతుల ఖాతాలకు నేరుగా జమ చేశామని మండ్య జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి చెలువరాయస్వామి అన్నారు. శుక్రవారం గణతంత్ర వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు.

రాజ్యాంగ నిర్మాత కృషి అమోఘం

- గణరాజ్యోత్సవ వేడుకల్లో వక్తలు
- ఎల్లెడలా త్రివర్ణ పతాక రెపరెపలు

సాక్షి బళ్లారి: దేశ చరిత్రలో భారతీయులందరికీ రెండే రెండు గొప్ప పండుగలని, ఒకటి దేశానికి స్వాతంత్య్రం లభించిన ఆగస్టు 15 కాగా, రెండోది భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26 అని, ఈ రెండు ప్రతి ఒక్కరూ ఎన్నటికీ మరిచిపోలేని రోజులని జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని విమ్స్‌ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మువ్వన్నెల జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడారు. రాజ్యాంగ రచనకు డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ చేసిన కృషి అమోఘమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారిని సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్‌ శ్వేత, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్‌ మిశ్రా, ఎస్పీ రంజిత్‌ కుమార్‌, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మూడు రంగుల జెండా రెపరెపలాడింది. నగరంలోని మోతీ సర్కిల్‌ వద్ద 150 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను మంత్రి నాగేంద్ర ఎగరవేయగా, నగరంలోని ప్రముఖ కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రంగుల జెండాను ఎగరవేసి పండుగలా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

మోకా రోడ్డు వాజ్‌పేయి లేఔట్‌లోని జిల్లా బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు జరిగాయి. శుక్రవారం ఉదయం జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌ నాయుడు ఆధ్వర్యంలో మూడు రంగుల జెండాను ఎగరవేసి గణతంత్ర వేడుకలను పండుగలా ఆచరించారు. ఎమ్మెల్సీ వైఎం.సతీష్‌, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, బీజేపీ ప్రముఖులు ఐనాథ్‌రెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస్‌ మోత్కూర్‌ తదితరులు పాల్గొన్నారు.



బళ్లారిలో అంబేడ్కర్‌ చిత్రపటానికి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి పూజలు



హొసపేటెలో మాట్లాడుతున్న మంత్రి జమీర్‌ అహమ్మద్‌

దేశ చరిత్రలో ముఖ్యమైన రోజు

హొసపేటె: జనవరి 26 దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన రోజు అని, పాలనా వ్యవస్థను స్వీకరించి ఈ చారిత్రాత్మక గణతంత్ర విధానాన్ని అవలంభించిన శుభదినమని విజయనగర జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి జమీర్‌ అహమ్మద్‌ ఖాన్‌ తెలిపారు. శుక్రవారం నగరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప మానవతావాది భారతరత్న డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్‌, ఎస్పీ హరిబాబు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, అదనపు జిల్లాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత, అభివృద్ధికి కట్టుబడాలి

రాయచూరు రూరల్‌: దేశ ఐక్యతకు యువత కంకణబద్దులు కావాలని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్‌ పాటిల్‌ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మహాత్మా గాంధీ క్రీడాంగణంలో 75వ గణతంత్ర దినోత్సవంలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సార్వభౌమత్వానికి ఎలాంటి ధోకా రాకుండా డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ 1946లో రాజ్యాంగాన్ని రచించారని, 1950లో పూర్తి సార్వభౌమత్వంతో కూడిన దేశంగా రూపాంతరం చేశారన్నారు. ఎమ్మెల్యే బసన గౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, జిల్లాధికారి చంద్ర శేఖర్‌ నాయక్‌, ఏడీసీ దురుగేష్‌, ఎస్పీ నిఖిల్‌, జెడ్పీ సీఈఓ రాహుల్‌ పాండే తుకారాం, ఏసీ మెహబూబిలున్నారు. జాతీయ పతాకాన్ని ఎగుర వేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సెక్రటేరియట్‌

కలబుర్గిలో కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సెక్రటేరియట్‌ ఏర్పాటుపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చిస్తామని కలబుర్గి జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి ప్రియాంక్‌ ఖర్గే పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కలబుర్గిలోని సర్దార్‌ వల్లబాయి పటేల్‌ క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. వెనుక బడిన కళ్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా ఈ ఏడాది రూ.5000 కోట్లు కేటాయించారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్‌–371(జె) కింద ఉప కార్యాలయం కలబుర్గిలో ఏర్పాటు చేస్తామన్నారు. 137 పడకల జయదేవ హృద్రోగ ఆస్పత్రికి రూ.182.65 కోట్లు, 200 పడకల కలబుర్గి ఆస్పత్రిలో తల్లీబిడ్డల ఆస్పత్రి, సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.162.80 కోట్లల కేటాయించారన్నారు. ఎమ్మెల్యేలు బీఆర్‌ పాటిల్‌, అల్లమ ప్రభు, తిప్పణప్ప, కనీజా ఫాతిమా, జిల్లాధికారిణి ఫౌజియా తరన్నుమ్‌, ఏసీ ఆశప్పలున్నారు.



బళ్లారిలో భరతమాత చిత్రపటానికి పూజలు

సిరుగుప్పలో..

సిరుగుప్ప: నగరంలోని క్రీడాంగణంలో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్‌ విశ్వనాథ్‌ మాట్లాడుతూ చాలామందికి జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం గురించి తెలియదన్నారు. దేశంలో అనేక కులమతాలవారు కలిసి ఒక్కటిగా జీవించేలా రాసిన మన రాజ్యాంగాన్ని ప్రవేశ పెట్టిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే బీఎం నాగరాజ్‌ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ సామరస్యంగా కలిసిమెలసి శాంతియుతంగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు.

గంగావతిలో..

గంగావతి: భారత రాజ్యాంగాన్ని ప్రజలకు అంకితం చేసిన రోజును మనం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన నగరంలోని కనకగిరి రోడ్డులోని తాలూకా క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్‌ గౌరవ వందనాన్ని అందుకొని మాట్లాడారు. వందలాది ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఎంతో మంది ప్రాణ త్యాగ ఫలితంగా అయోధ్య రామమందిరాన్ని నిర్మించి ప్రారంభించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందన్నారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తున్నానన్నారు. గంగావతి నగరాభివృద్ధికి తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతానన్నారు.

జాతరకు వెళ్లి వస్తుండగా మృత్యుపంజా

- చెరకులోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ ట్రాలీని ఢీకొన్న కారు
- నలుగురు మృతి
- బాగలకోటె జిల్లాలో ఘోర దుర్ఘటన





మృతులు వీరే(ఫైల్‌)

సాక్షి బళ్లారి: బనశంకరీదేవి జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని వస్తుండగా మృత్యువు పంజా విసిరి నలుగురిని బలిగొంది. ఈ ఘోర దుర్ఘటన శుక్రవారం తెల్లవారుజామున బాగలకోటి జిల్లా బీళగి పోలీసు స్టేషన్‌ పరిధిలో జరిగింది. వివరాలు..విజయపుర జిల్లా బసవనబాగేవాడి తాలూకా హొనగనహళ్లి గ్రామానికి చెందిన కామాక్షి బడిగేర్‌(35), కల్లప్ప కొటగి(34), మల్లికార్జున పూజారి(24), తుకారాం తోళవాడ(30)లు బాదామిలో గురువారం జరిగిన బనశంకరి జాతరకు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి తిరిగి వస్తూ హుబ్లీ–షోలాపూర్‌ జాతీయ రహదారిపై తుమ్మరమట్టి క్రాస్‌ సమీపంలో చెరకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. కారు ట్రాక్టర్‌ చక్రాల కిందకు దూసుకెళ్లడంతో వాహనం నుజ్జయ్యింది. స్థానికులు వచ్చి కారును బయటకు తీయగా అందులో ప్రయాణిస్తున్న నలుగురూ విగతజీవులుగా కనిపించారు. బాగల్‌కోటె ఎస్పీ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బీళగి తాలూకా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుల బంధువులు ఆస్పతికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన మరవక ముందే తాజాగా కారు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం ఆ ప్రాంత వాసులను తీవ్రంగా కలిచివేసింది.



ట్రాక్టర్‌ ట్రాలీ కిందకు దూసుకెళ్లిన కారు



కారులో చిక్కుకున్న మహిళ మృతదేహం

రైతు, కార్మిక విధానాలపై నిరసన



ఆందోళన చేపట్టిన రైతు సంఘం కార్యకర్తలు

రాయచూరు రూరల్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సంయుక్త పోరాట కర్ణాటక, జేసీటీయూ డిమాండ్‌ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షులు కరియప్ప హచ్చొళ్లి మాట్లాడారు. ఏపీఎంసీ, కార్మిక, విద్యుత్‌ చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు నరేగ పనులను 200 రోజులకు పెంచాలన్నారు. రాష్ట్రంలో కరువు సహాయం, పరిహారం అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కరువు సమయంలో రాజకీయాలు చేస్తూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల జీవితాలతో చెలగాటం ఆడటం మానుకోవాలని ఒత్తిడి చేశారు.




బాగలకోటెలో నిర్వహిస్తున్న మూడు రోజుల పక్షుల పండగలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్ల సందడి ఇది. కృష్ణానది సమీపంలో ఎగిరే పక్షుల సమూహాలను ఫొటో తీయడానికి వేచి ఉన్న ఫొటోగ్రాఫర్లు.

ఫలపుష్ప ప్రదర్శన అదుర్స్‌



వీణ ఆకారంలో పుష్ప ఆకృతి

చిక్కబళ్లాపురం: జిల్లా ఉద్యానశాఖ, జిల్లా పాలక మండలి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సర్‌.ఎం.వీ క్రీడా మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫల పుష్ప ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. జిల్లా ఇన్‌ చార్జ్‌ మంత్రి డాక్టర్‌ ఎంసీ సుధాకర్‌ ఫల పుష్ప ప్రదర్శనను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది ఆదర్శ రైతులు ఉన్నారని, వారు కొత్త కొత్త పంటల సాగుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. కాగా కాయగూరలతో రూపొందించిన విఘ్నేశ్వరుడు, వివిధ పుష్పాలతో వీణ, ఇండియా గేట్‌ ఆకృతులు ఆకట్టుకున్నాయి.



ఫలాలతో వినాయకుడు



ఆకులతో జాతీయ జెండా



పుష్పాలతో సీతాకోక చిలుక

కోలారు వార్తలు...

హక్కుల కల్పనే రాజ్యాంగ ఆశయం

- వాడవాడలా గణతంత్ర వేడుకలు
- త్రివర్ణ పతాక రెపరెపలు

కోలారు: గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య స్టేడియంలో వైభవంగా నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జ్‌ మంత్రి భైరతి సురేష్‌ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీస్‌ ధ్వజవందనాన్ని స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. దేశంలోని ప్రతి పౌరుడికి హక్కులను కల్పించడమే భారత రాజ్యాంగ ముఖ్య ఆశయమన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్‌, ఎంపీ మునిస్వామి, ఎమ్మెల్సీ అనిల్‌కుమార్‌, జిల్లాధికారి అక్రంపాషా, జెడ్పీ సీఈఓ పద్మ, డిప్యూటీ కలెక్టర్‌ శంకర్‌ వణిక్యాల్‌, ఎస్పీ నారాయణ తదితర అధికారులు పాల్గొన్నారు.

పాత్రికేయుల భవనంలో..

నగరంలోని పాత్రికేయుల భవనంలో శుక్రవారం రిపబ్లిక్‌ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బీవీ గోపినాథ్‌ జాతీయ పతాకాన్ని ఉదయం 8 గంటలకు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాత్రికేయులు కేఎస్‌ గణేష్‌, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌, కోశాధికారి సురేష్‌, పాత్రికేయులు మంజునాథ్‌, చంద్రు తదితరులు పాల్గొన్నారు.

కేజీఎఫ్‌లో..

కేజీఎఫ్‌ : నగరంలోని మున్సిపల్‌ మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రూపా శశిధర్‌ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి పుష్పాంజలి సమర్పించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ రచించిన రాజ్యాంగ ఆశయాలకు కట్టుబడి జీవించాలన్నారు. కేజీఎఫ్‌ ప్రాంతంలో త్వరలో పరిశ్రమల ఏర్పాటుతో నిరుద్యోగ సమస్య దూరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ శాంతరాజు, తహసీల్దార్‌ నాగవేణి తదితర అధికారులు పాల్గొన్నారు.



కోలారులో ధ్వజవందనం స్వీకరిస్తున్న మంత్రి భైరతి సురేష్‌, అధికారులు

భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరు గౌరవించాలి

మాలూరు: అత్యున్నతమైన భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని ఎమ్మెల్యే కేవై నంజేగౌడ తెలిపారు. శుక్రవారం నగరంలోని బాలుర జూనియర్‌ కళాశాల మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ దేశానికి అందించిన అత్యుత్తమ రాజ్యాంగం సక్రమంగా అమలు అయ్యేలా చూడటం ప్రభుత్వంతో పాటు ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం వివిధ రంగాల్లోని సాధకులను సన్మానించారు. తహసీల్దార్‌, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



దేశభక్తి గీతానికి విద్యార్థుల సామూహిక నృత్య ప్రదర్శన

శ్రీనివాసపురంలో..

శ్రీనివాసపురం: 75వ రిపబ్లిక్‌ దినోత్సవ వేడుకలను పట్టణంలో శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఎమ్మెల్యే జీకే వెంకటశివారెడ్డి పోలీస్‌ ధ్వజవందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పట్టణ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు అన్ని హక్కులను అందించిందన్నారు. అంబేడ్కర్‌ సూచించిన రాజ్యాంగ అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్‌ సుధీంద్రతో పాటు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముళబాగిలులో..


నగరంలో గణతంత్ర్య దినోత్సవ వేడుకలను వేడుకగా నిర్వహించారు. నగరంలోని నేతాజీ మైదానంలో ఎమ్మెల్యే సమృద్ధి మంజునాథ్‌ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నగర ప్రజలకు గణతంత్ర దినోత్సవ సందేశాన్ని అందించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాన్ని నిర్వహించారు.



కోలారులో జాతీయ పతాకానికి వందనం చేస్తున్న దృశ్యం



కేజీఎఫ్‌లో గాంధీజీ విగ్రహానికి ఎమ్మెల్యే రూపా శశిధర్‌ పుష్పాంజలి



మాలూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మత విద్వేషాల చిచ్చు తగదు

కోలారు: మందిరం, మసీదుల పేరుతో మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టడాన్ని బీజేపీ మానుకోవాలని ఇన్‌చార్జ్‌ మంత్రి భైరతి సురేష్‌ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడు అందరికీ దేవుడన్నారు. దేవుడిని రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు. వీటన్నింటికీ ప్రజలే సమాధానం చెబుతారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జేడీఎస్‌ పొత్తు పెట్టుకోవడం వల్ల కాంగ్రెస్‌ పార్టీ లాభపడుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో 15 నుంచి 20 సీట్లు గెలుచుకొంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కోలారులో కాంగ్రెస్‌ జెండా ఎగురుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నీచ కృత్యాలకు పాల్పడకుండా సీఎం సిద్దరామయ్య, డీసీఎం శివకుమార్‌తో పాటు తాను కూడా బలంగా ఉన్నామన్నారు. నిధుల కొరత మాట లేకుండా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు చేస్తామన్నారు. జిల్లా తరఫున కోలారుకు మెడికల్‌ కాలేజీ, రింగ్‌రోడ్డు నిర్మాణానికి మరికొద్ది రోజుల్లో జరుగనున్న బడ్జెట్‌ సమావేశాల్లో కేటాయింపులు చేస్తామన్నారు. మ్యాంగో ప్రాసెస్‌ ప్లాంట్‌ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు.



మాట్లాడుతున్న మంత్రి భైరతి సురేష్‌

క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మ రథోత్సవం


భక్తజన సంద్రం మధ్య రథోత్సవం

గౌరిబిదనూరు: తాలూకా అలకాపురంలో గురువారం సాయంత్రం చన్నసోమేశ్వరుని వార్షిక బ్రహ్మరథోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే పుట్టస్వామి గౌడ స్వయంగా తేరును లాగారు. కార్యక్రమంలో కమిషనర్ గీత, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

ఆక్రమణల తొలగింపు


జేసీబీలతో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం కాడు బీసనహళ్లి పరిధిలో ఆక్రమణల తొలగింపునకు కేఐడీబీ అధికారులు చర్యలు చేపట్టారు. వందకుపైగా నివాసాలను శుక్రవారం జేసీబీలతో కూల్చివేయించారు. కేఐడీబీ స్థలంలో 20 సంవత్సరాల క్రితం కొందరు భవంతులు నిర్మించారు. వాటిని తొలగించాలని పలుమార్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. స్పందన లేకపోవడంతో అధికారులు నివాసాలను నేలమట్టం చేయించారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

గౌరిబిదనూరు: నగరంలోని బైపాస్ రోడ్డులో అన్నదమ్ములపై దాడి చేసి బైక్‌ను ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. బైపాస్ రస్తాలో వీర్లగొల్లహళ్లికి చెందిన ఉదయ్, గణేశ్‌లు రాత్రి 10 గంటల సమయంలో నగరంలోని సుమంగళి కాలనీకి చెందిన మోసీన్ (20), రోషన్ (28)లు దాడి చేసి, గాయపరిచి బైక్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు.

కలకలం సృష్టించిన సూట్‌కేస్



దొడ్డబళ్లాపురం: రిపబ్లిక్ డే నాడు దావణగెరె పట్టణంలో ఓ సూట్‌కేస్ కలకలం సృష్టించింది. రిపబ్లిక్‌డే కార్యక్రమం జరుగుతున్న ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానానికి కూతవేటు దూరంలో అపరిచిత సూట్‌కేస్ ఒకటి కనిపించింది. దీన్ని చూసిన స్థానికులు దూరంగా నిలబడి భయాందోళనతో చూస్తూ ఉండిపోయారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకూ ఆ సూట్‌కేస్ అలాగే ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి సూట్‌కేస్‌ను పరిశీలించారు. అయితే అందులో ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. తెరచి చూడగా లోపల ఏమీ లేదు.

మైసూరు ఫెస్ట్ చిత్రసంత ప్రారంభం


చిత్రసంత వద్ద సందర్శకుల సందడి

మైసూరు: మన సంస్కృతి, కళ, సాంప్రదాయాలు, ధార్మికత గురించి కేవలం మనకు తెలిస్తే సరిపోదని, ఎక్కడికి వెళ్లిన అందరూ చర్చించుకునే విధంగా ఉండాలని మంత్రి మహదేవప్ప అన్నారు. శుక్రవారం మైసూరు నగరంలోని మానస గంగోత్రి క్లాక్‌టవర్ వద్ద రాష్ట్ర పర్యాటక శాఖ, మైసూరు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మైసూరు ఫెస్ట్ చిత్ర సంతను ఆయన ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చి చిత్రాలు, కళాకృతులను ప్రదర్శించారు.

విద్యార్థుల చేతుల్లో కమలం పూలు

- కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆగ్రహం

దొడ్డబళ్లాపురం: విద్యార్థుల చేతిలో కమలం పూలు చూసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉపాధ్యాయురాలిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన హాసన్‌లో చోటుచేసుకుంది. రిపబ్లిక్‌డే సందర్భంగా హాసన్ పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల చేత నృత్య ప్రదర్శన చేయించారు. ఈ క్రమంలో విద్యార్థుల చేతుల్లో కమలం పూలు ఇవ్వడం పట్ల అరసీకెరె తాలూకా ఎమ్మెల్యే శివలింగేగౌడ అభ్యంతరం వ్యక్తం చేసారు. అక్కడే ఉన్న ఉపాధ్యాయురాలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల చేతికి కమలం పూలు ఇవ్వడం పట్ల మీ ఉద్దేశమేంటని ఊగిపోయారు. దీంతో అంతే ఘాటుగా స్పందించిన ఉపాధ్యాయురాలు కమలం పువ్వు మన జాతీయ చిహ్నాల్లో ఒకటని వివరణ ఇచ్చారు. ఏకవచనంతో మాట్లాడ్డం పట్ల ఉపాధ్యాయురాలు కూడా అభ్యంతరం వ్యక్తం చేసారు. అందుకు ఎమ్మెల్యే కూడా నోటీస్ ఇస్తానని వార్నింగ్ ఇచ్చారు. ఇంతలో కలుగజేసుకున్న ఇతర అధికారులు, నాయకులు ఇద్దరికీ సర్ది చెప్పారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



బెంగళూరు మానెక్‌షా మైదానంలో జవాన్లు బైక్‌లతో అబ్బురపరిచిన దృశ్యం, అగ్ని వలయం నుంచి దూసుకువస్తున్న మరో జవాన్


ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

- అబ్బురపరచిన సాయుధ దళాల కవాతు
- వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు
- పులకించిన మానెక్‌షా మైదానం

శివాజీనగర: నగరంలోని ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా పరేడ్ మైదానంలో గణతంత్ర దినోత్సవం కనుల పండువగా జరిగింది. గవర్నర్...జాతీయ పతాకావిష్కరణ గావించగానే సైనిక బలగాలు, ఎన్‌సీసీ, పోలీస్, వివిధ పాఠశాలల బృందాలు ఆకర్షణీయమైన కవాతు నిర్వహించారు.

అబ్బురం, సాహసం : మానెక్‌షా మైదానంలో వివిధ దళాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. సైనిక దళం, బీఎస్‌ఎఫ్ దళం, ఎక్సైజ్ దళం, హోంగార్డు, అగ్నిమాపక దళం, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగ బాలలు నిర్వహించిన కవాతు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ప్రసంగం అనంతరం శంకర్ భారతిపుర బృందంచే నాడ గీత, రైతు గీతం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా బెంగళూరులోని ఏహెచ్ఇ సెంటర్, కాలేజీ బృందం బాస్రో రాజసింగం కామరాజ్ నేతృత్వంలో ద్విచక్ర వాహనాల్లో సాహస ప్రదర్శన అబ్బురపరిచింది. అనంతరం గవర్నర్ విజేత బృందాలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బెంగళూరు నగర జిల్లాధికారి కే.ఏ.దయానంద, బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద పాల్గొన్నారు.

శివాజీనగరలో...

శివాజీనగర: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శివాజీనగర ముద్దమ్మగార్డెన్‌లో శారదమాత బుద్ధి మాంద్య పిల్లల పాఠశాలలో నిర్వాహకుడు పుట్టరామారాధ్య జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు మేరీ విమల, మహేశ్వరి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాదిగ దండోరా కార్యాలయంలో...

మాదిగ దండోరా, మాదిగ రిజర్వేషన్ పోరాట జన జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకల్లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు సీ.క్రిష్టేగౌడ జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో మాదిగ దండోరా నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి సుధాకర్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ సంఘం ఆధ్వర్యంలో:

నేతాజీ సుభాష్ చంద్రబోస్ సంఘం ఆధ్వర్యంలో చిన్నప్పగార్డెన్‌లో గణతంత్ర వేడుకల్లో స్థానిక కాంగ్రెస్ నాయకుడు సీ.క్రిష్టేగౌడ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా స్వీట్స్ పంపిణీ చేశారు. ఎంఆర్‌ఎస్ పాళ్య అంబేడ్కర్ తెలుగు, కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సీ.క్రిష్టేగౌడ జాతీయ జెండాను ఎగురవేశారు.

రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలి

తుమకూరు: నూతన సమాజ నిర్మాణానికి పునాదులు వేసిన ప్రతిభాశాలి అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని హోం మంత్రి పరమేశ్వర్ అన్నారు. శుక్రవారం తుమకూరు గాంధీ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండా ఎగురవేసి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని, రాజ్యాంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సిద్దగంగ మఠంలో....

తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠంలో నిర్వహించిన గణతంత్ర ఉత్సవాల్లో హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం విద్యార్థులతో సరదాగా మాట్లాడారు. కార్యక్రమమంలో మఠాధ్యక్షుడు సిద్దలింగ స్వామీజీ, ఎమ్మెల్యేలు సురేష్‌గౌడ, జ్యోతి గణేష్, మేయర్ ప్రభావతి, జెడ్పీ సీఈఓ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణానికి చేతులు కలపాలి

గౌరిబిదనూరు: రాజ్యాంగ ఆశయాలను నెరవేర్చడానికి, దృఢమైన దేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని నేతాజీ క్రీడా మైదానంలో జాతీయ పండుగల ఆచరణా సమితి ఆధ్వర్యంలో జరిగిన గణతంత్ర దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ నేతృత్వంలో రచించిన మన రాజ్యాంగం జాతి ధర్మాల కలితంగా ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్ పత్రి, కమిషనర్ గీత, విద్యాశాఖాధికారి శ్రీనివాస మూర్తి, ఆరోగ్య శాఖాధికారి చంద్రమోహన్ రెడ్డి, సీపీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహళ్లి : మంగమ్మపాళ్య హరళకుంటెలోని సామసంద్రపాళ్య ప్రభుత్వ పాఠశాలలో కేపీసీసీ రాష్ట్ర పచార సమితి సంచాలకుడు కే.వాసుదేవ జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ ఎంతోమంది మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం లభించిందన్నారు. దేశాభివృద్ధికి యువత శ్రమించాలన్నారు. సమాజ సేవకుడు మురళీధర్ రెడ్డి దశరథ, హెచ్‌ఎం మునిరాజు పాల్గొన్నారు.

బొమ్మనహళ్లి : హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ అటల్ బిహారి వాజ్‌పాయ్ క్రీడా మైదానంలో శుక్రవారం గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. బీబీఎంపీ మాజీ కార్పొరేటర్ గురుమూర్తిరెడ్డి, హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ అసోసియేషన్ సభ్యులు, బీబీఎంపీ అధికారులు పాల్గొన్నారు.

బాగేపల్లి : పట్టణంలోని క్రీడా మైదానంలో గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే ఎస్.ఎన్. సుబ్బారెడ్డి హాజరై ఎన్‌సీసీ, పాఠశాల విద్యార్థుల నుంచి గౌరవవందనం స్వీకరించారు. తహసీల్దార్ ప్రశాంత్ కే. పాటిల్ జాతీయ జెండాను ఎగురు వేశారు. వివిధ రంగాల్లో సాధన చేసిన వారిని ఎమ్మెల్యే సత్కరించారు.

రాజ్యాంగ స్ఫూర్తి పొందాలి

శివాజీనగర: దేశ ప్రజలు రాజ్యాంగ స్ఫూర్తిని పొందాలని కర్ణాటక తెలుగు ప్రజా సమితి రాష్ట్రాధ్యక్షుడు బొందు రామస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం కర్ణాటక ప్రజా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవంలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్ర పటానికి నివాళి అర్పించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు.

దేశాభివృద్ధికి కృషి చేయాలి

మైసూరు: దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మైసూరు జిల్లా ఇన్‌చార్జ మంత్రి మహదేవప్ప అన్నారు. శుక్రవారం మైసూరు నగరంలోని బన్ని మంటపంలో పంజిన కవాతు మైదానంలో ఆయన జాతీయ జెండా ఎగుర వేసి మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది బలిదానాలు చేశారని గుర్తు చేశారు.

నైతిక విలువలతోనే సార్థకత

బనశంకరి: దేశభక్తి, నైతిక విలువలతోనే విద్యార్థుల జీవితానికి పరిపూర్ణత లభిస్తుందని సేవా భారత్ ట్రస్ట్ అధ్యక్షుడు బండి ఆదినారాయణరెడ్డి తెలిపారు. వివేక్‌నగర్‌లోని సేవా భారత్‌ట్రస్ట్ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణతంత్ర దినోత్సవంలో బండి ఆదినారాయణరెడ్డి పాల్గొని జాతీయజెండాను ఎగురవేసి మాట్లాడారు. వివేక్‌నగర్ ప్రభుత్వ తెలుగు ఉన్నత పాఠశాల, తెలుగు ప్రాథమిక పాఠశాల, కన్నడ, తమిళ పాఠశాలలను ట్రస్ట్ దత్తత తీసుకుని విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ఈ సందర్భంగా తెలుగు ఉన్నత పాఠశాల టాపర్‌గా నిలిచిన విద్యార్థిని పద్మావతిని సన్మానించారు. అదే విధంగా విద్యార్థినులు పీ.మౌనిక, ఎం.జీవితకు కూడా నగదు పురస్కారం అందజేసి అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు తిప్పేస్వామి, ఉపాధ్యాయుడు రామమోహన్ రెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రంగస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

హోసకోటెలో ..

కృష్ణరాజపురం: హోసకోటె నగరంలోని శ్రీ చన్నబైరెగౌడ క్రీడా మైదానంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడ పాల్గొని జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని సన్మానించారు.

అమ్మవారికి త్రివర్ణ శోభ

బనశంకరి: బనశంకరీదేవి జాతర మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం, అర్చనలు చేపట్టి విశేష పూజలు చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకం వర్ణంలో పూల అలంకరణ చేపట్టారు. అనంతరం ఉదయం 10 గంటలకు యాగశాలలో అర్చకులు శ్రీలలిత సహస్ర నామ హోమం చేపట్టి, మధ్యాహ్నం మహాపూర్ణాహుతి నిర్వహించారు.

బాప్టిస్ట్ చర్చిలో..

బనశంకరి: రామచంద్రాపుర తెలుగు బాప్టిస్ చర్చి (టీబీసీ)లో గణతంత్ర దినోత్సవం నిర్వహించారు. చర్చ్ ఫాదర్ రెవరెండ్ ఎంబీ.మోసెస్ జాతీయ జెండా ఎగురవేశారు.

చిక్కబళ్లాపురంలో...

చిక్కబళ్లాపురం: నగరంలోని సర్ ఎంవీ క్రీడామైదానంలో గణతంత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సుధాకర్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, హక్కులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, ఎస్పీ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులను స్మరించుకోవాలి

విజయపుర(బెంగళూరు గ్రామీణ): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన మహనుభావులను స్మరించుకోవాలని ఉప తహసిల్దార్ నిస్సార్‌అహ్మద్ అన్నారు. శుక్రవారం విజయ పట్టణంలో గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయజెండా ఎగురవేసి మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


సిద్దగంగ మఠంలో చిన్నారులతో కరచాలనం చేస్తున్న హోం మంత్రి


మాదిగ దండోరా కార్యాలయంలో..


గౌరిబిదనూరులో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎం.సతీష్‌రెడ్డి


బాగేపల్లిలో అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుబ్బారెడ్డి


సామసంద్రపాళ్యలో మహనీయుల చిత్రపటాలకు పూజలు


శారదమాత బుద్ధి మాంద్య పాఠశాలలో...


కవాతు పరిశీలిస్తున్న హోం మంత్రి


పద్మావతిని సన్మానిస్తున్న దృశ్యం


కవాతును పరిశీలిస్తున్న మంత్రి మహదేవప్ప


అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

గాయపడిన చిన్నారి మృతి

బనశంకరి: పాఠశాల భవనం మూడో అంతస్తుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడిన నాలుగేళ్ల చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. హెణ్ణూరు చెళ్లికెరెలోని భవనంలోని మూడో అంతస్తులో ప్రైవేటు ప్రీస్కూల్ నిర్వహిస్తున్నారు. కేరళకు చెందిన టెక్కీ దంపతులు జిటోటామిజనోసెఫ్, బినిటోదామస్ నాలుగేళ్ల కుమార్తె గియాన్నా ఇక్కడ చదువుతోంది. ఈనెల 22న మధ్యాహ్నం భోజన సమయంలో బాలిక మూడో అంతస్తు గోడపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ పైనుంచి కిందపడిపోయింది. తలకు తీవ్రగాయం కావడంతో హెబ్బాళలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడురోజులపాటు చికిత్స పొందుతూ శుక్రవారం చిన్నారి మృతిచెందింది. కాగా చిన్నారి కిందపడి తీవ్రంగా గాయపడేందుకు కారణమైన అసలైన విషయాన్ని పాఠశాల యాజమాన్యం దాచిపెట్టినట్లు ఆరోపణలున్నాయి. వైద్యులు చికిత్సలు అందించే సమయంలో ఆరా తీయగా బాలిక మూడో అంతస్తునుంచి పడినట్లు వెలుగు చూసింది. దీంతో చిన్నారి కుటుంబసభ్యులు హెణ్ణూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రిష్ణగిరి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సూళగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. తిరుపత్తూరు జిల్లా అత్తియూరు గ్రామానికి చెందిన ఇళయరాజ(42) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం సొంతపనిపై సూళగిరి వెళ్లాడు. అద్దగురికి బస్టాప్ వద్ద కాలినడకన వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనపై సూళగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందు తాగి...

కెలమంగలం: మద్యం మత్తులో పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి చెందిన ఘటన డెంకణీకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. కెలమంగలం సమీపంలోని హనుమంతతీర్థం గ్రామానికి చెందిన ముత్తురాజ్(55) మద్యానికి బానిసయ్యాడు. గురువారం మద్యం మత్తులో ఉన్న అతను ఇంటికి చేరుకొని పురుగుల మందు తాగాడు. క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చెందాడు.

టపాసుల గోదాములో భారీ అగ్ని ప్రమాదం


గోడౌన్‌లో చెలరేగుతున్న మంటలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ తంగదురై

- ఐదు గంటల పాటు శ్రమించి మంటలార్పిన ఫైర్ సిబ్బంది
- లక్షల్లో ఆస్తి నష్టం

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరు సమీపంలోని జీమంగలం నిర్వహిస్తున్న టపాకాయల గోదాములో గురువారం సాయంత్రం భారీ అగ్నిప్రమాదం సంభవించి లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగింది. హోసూరు నివాసి వడివేలు ఈ గోదాములో భారీగా టపాసులు నిల్వ చేశారు. గురువారం సాయంత్రం ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించి మంటలు చెలరేగి భారీగా పొగ కమ్ముకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బాగలూరు పోలీసులు, హోసూరు, రాయకోట అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని రాత్రి 10 గంటల వరకు శ్రమించి మంటలు ఆర్పివేశారు. అప్పటికే బాణాసంచా పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తు గోడన్‌లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. పొగలు ఆ ప్రాంతంలో కమ్ముకోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులెదుర్కొన్నారు. హోసూరు తహసీల్దార్, క్రిష్ణగిరి ఎస్పీ తంగదురై ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

హోసూరు వార్తలు..

వైభవంగా సాంస్కృతిక ప్రదర్శనలు


జెండా వందనం చేస్తున్న కలెక్టర్ శరయు


దేశ భక్తి గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆటల మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ శరయు, జిల్లా ఎస్పీ తంగదురై జాతీయ జెండాను ఎగురవేసి పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరింపజేశాయి. పోలీసులు, రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యానవన శాఖలతో పాటు వివిధ శాఖల్లో ఉత్తమ శ్రేణిలో పనిచేసిన 186 మంది ప్రభుత్వ అధికారులకు జ్ఞాపికలను అందజేశారు. అనంతరం 27 మంది లబ్ధిదారులకు రూ. 59.10 లక్షల విలువ చేసే సంక్షేమ ఫలాలను అందజేశారు. పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. అదనపు కలెక్టర్ వందనాకార్గ్, డీఆర్వో సాధనకురల్, అధికారులు భవంతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

హోసూరు: హోసూరులో సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సబ్‌కలెక్టర్ ప్రియాంక జాతీయ జెండా ఎగురవేశారు. ఉత్తమ సేవలందజేసిన ఉద్యోగులకు, అధికార్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ ఎస్.ఏ.సత్య జాతీయ జెండా ఎగురవేశారు. కమిషనర్ స్నేహ, ఉపమేయర్ ఆనందయ్య, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా బాలతోటనపల్లి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని హెలన్ అధ్యక్షతన జాతీయ జెండాను ఎగురవేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులందజేశారు. కార్యక్రమంలో పీటీఏ అధ్యక్షులు, ఎస్ఎంసి సభ్యులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పరమ పవిత్రం

బనశంకరి: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అత్యంత పవిత్రమైన గ్రంధమని వైద్యనిపుణుడు, విద్యావేత్త డాక్టర్ టీహెచ్. అంజనప్ప తెలిపారు. బనశంకరి మూడోస్టేజ్ ఐటీఐ లేఔట్‌లోని శ్రీకృష్ణ విద్యాసంస్థలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంజనప్ప హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. శ్రీకృష్ణ విద్యాసంస్థ అధ్యక్షుడు రుక్మాంగదనాయుడు మాట్లాడుతూ... రాజ్యాంగం ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగమని అన్నారు. సంస్థ ఉపాధ్యక్షురాలు జలజాక్షమ్మ, విద్యాసంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌పీ మనోహర్, పీజీ విభాగం డైరెక్టర్ ప్రొ.వేణుగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ఉషాకుమారి పాల్గొన్నారు.


అంజనప్పను సన్మానిస్తున్న దృశ్యం


బహుమతులు అందుకున్న విద్యార్థులు


హోసూరు కార్పొరేషన్ కార్యాలయంలో సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు

• తెలంగాణ

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌గా మహేందర్‌రెడ్డి బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ డీజీపీ ఎం.మహేందర్‌రెడ్డి శుక్రవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అలాగే నూతన సభ్యులు అనితా రాజేంద్ర, ప్రొఫెసర్ ఎస్.యాదయ్య, పాల్వాయి రజినీ కుమారి కూడా బాధ్యతలు చేపట్టారు.

ఆచారం..



ఖందేవ్ జాతరలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని ఖందేవ్ ఆలయంలో శుక్రవారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. తొడసం వంశస్తులు కొత్త కోడళ్లతో ప్రత్యేక భేటీ నిర్వహించారు. అనంతరం ఆ వంశస్తులు తయారు చేసిన నువ్వుల నూనెను కటోదాలు దేవుడికి నైవేద్యంగా సమర్పించారు. ఆచారం ప్రకారం అక్కడే ఆ వంశానికి చెందిన ఆడపడుచు మహారాష్ట్రలోని జివతి తాలూకా కొద్దేపూర్ గ్రామానికి చెందిన మెస్రం నాగుబాయి చందు రెండున్నర కిలోల నువ్వుల నూనె తాగి మొక్కు తీర్చుకుంది.

-నార్నూర్

మంగంపేట గనులపై దొంగరాతలా?

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంగా రామోజీరావు మరింత రెచ్చిపోతున్నారు. ప్రభుత్వంపై ఏదో ఒకలా బురదజల్లి ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. తద్వారా తన చంద్రబాబుకు మేలు చేయాలని ఆరాటపడుతున్నారు. అందులో భాగంగానే మంగంపేట బెరైటీస్ గనుల టెండర్లపైనా అడ్డగోలు రాతలు రాశారు. 'మంగంపేట ముగ్గురాయి గనుల్లో భారీ దోపిడీకి తొలగిన తెర' అంటూ అవాస్తవాలతో కూడిన కథనాన్ని శుక్రవారం ఈనాడులో అచ్చేశారు. నిబంధనల ప్రకారమే అంతా సక్రమంగా జరిగినా అబద్ధాలతో ఆ కథనాన్ని నింపేశారు. అన్నమయ్య జిల్లా మంగంపేటలో గనుల్లో ఏటా 30 లక్షల టన్నుల బెరైటీస్‌ను ఏపీఎండీసీ ఉత్పత్తి చేస్తోంది. ఇందులో సగటున 10 లక్షల టన్నులు 'ఎ' గ్రేడ్, 3 లక్షల టన్నులు 'బి' గ్రేడ్ కాగా, మిగిలిన 17 లక్షల టన్నులు 'సీ, డీ – డబ్ల్యూ (వేస్ట్)' గ్రేడ్‌లుగా ఉంటుంది. సీ, డీ గ్రేడ్ ఖనిజానికి డిమాండ్ తక్కువగా ఉండటంతో గత కొన్నేళ్లుగా వాటి నిల్వలు పెద్దఎత్తున పేరుకుపోయాయి. ఇప్పటి వరకు దాదాపు 80 లక్షల టన్నుల సీ, డీ, డబ్ల్యూ గ్రేడ్ బెరైటీస్ నిల్వలు అమ్ముడవకుండా ఉండిపోయింది. దాని విక్రయం, బెనిఫికేషన్ కోసం గతంలో పలుసార్లు టెండర్లు పిలిచినా సరైన స్పందన రాలేదు. ఈ నేపథ్యంలోనే మళ్లీ ఏపీఎండీసీ ఆ నిల్వల విక్రయానికి టెండర్లు పిలిచింది. సాధారణంగా ఏటా 20 లక్షల టన్నుల సీ, డీ, డబ్ల్యూ గ్రేడ్ ఖనిజానికి టెండర్లు పిలుస్తారు. కానీ కొనుగోలుదారుల నుంచి స్పందన రావడం లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఏడాదికి 20 లక్షల టన్నుల చొప్పున ఐదేళ్లకు ఒకేసారి కోటి టన్నుల ఖనిజానికి టెండర్లు పిలిచారు. ఈ వాస్తవం తెలియకుండా అభూత కల్పనలతో ఒకేసారి కోటి మెట్రిక్ టన్నులకు టెండర్లు పిలిచారంటూ మతి లేని కథనాన్ని ఈనాడు ప్రచురించింది. సీ, డీ గ్రేడ్ ఖనిజానికి రిజర్వు ధరను తగ్గించారంటూ మరో తప్పుడు ఆరోపణ చేసింది. నిజానికి రిజర్వు ధర నిర్ణయానికి సంబంధించి జీవో 262ను 2017లో చంద్రబాబు హయాంలోనే విడుదల చేశారు. ఆ జీవోలోని నిబంధనలకు అనుగుణంగానే ఇప్పుడు రిజర్వు ధరను నిర్ణయించారు. అంతర్జాతీయ మార్కెట్‌కు తగ్గట్టు రేటును పెట్టారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
ABSTRACT

Andhra Pradesh Mineral Development Corporation Ltd., – Scientific fixation of Barytes Sale prices and establishment of a comprehensive Sales Policy in line with the international and domestic sales practices - Orders – Issued.

INDUSTRIES AND COMMERCE (MINES.II) DEPARTMENT

G.O.RT.No. 262 Dated: 24-08-2017
Read the following:-

1. G.O.Rt.No.22, Ind. & Com. (M III) Dept. dt.27.01.2015
2. G.O.Rt.No.163, Ind. & Com. (M III) Dept., dt.04.05.2015
3. From the VC & MD, M/s. APMDC Lr., No. APMDC/M&S/ BAR-GO/2016-17/524, Dt. 04.07.2017.

ORDER

In the G.O. first read above, orders were issued to M/s. Andhra Pradesh Mineral Development Corporation Ltd. to follow certain guidelines with regard to sale of Barytes through global tender at short intervals.

2. With the change in Barytes market environment, it was observed that certain clauses in G.O. 1st read above were not in line with the changed global market trend and required dynamic pricing system for Sale of Barytes and therefore amendments were issued to the G.o. first read above through G.O. second read above.

3. The Vice Chairman & Managing Director, M/s. Andhra Pradesh Mineral Development Corporation Ltd., vide reference third read above has stated that recently, there have been major changes in the global economic environment and the Crude Oil market has witnessed major impact as reflected in the sharp decline in the prices. Given that, Barytes demand and prices have also accordingly fallen significantly impacting the sales of Andhra Pradesh Mineral Development Corporation Limited. Considering the



5. Keeping in view of the importance and demand of the Barytes mineral and changed market environment, Government after careful examination of the proposal and in supersession of the orders issued in G.O. Rt.No.22, Industries & Commerce (M.III) Department, Dt.27.01.2015 as amended in G.O.Rt.No.163, Industries & Commerce (M.III) Department, Dt.04.05.2015, hereby issue the following orders directing the VC&MD, M/s. APMDC Ltd to act on the following issues forthwith:

(i) With the approval of the Board of M/s. Andhra Pradesh Mineral Development Corporation Ltd., the Vice Chairman & Managing Director, M/s. Andhra Pradesh Mineral Development Corporation Ltd. shall appoint a reputed Third Party Consulting Agency after following due procedure for determining various aspects of Barytes Sales Tender such as the base price of Barytes in line with international market, tender timing and duration, allocation percentage for export and domestic market, etc. The Board of APMDC shall review the recommendations of the appointed Consulting Agency and take final decisions on all the above mentioned aspects accordingly.

(ii) Depending on the market conditions and if need be, M/s. Andhra Pradesh Mineral Development Corporation Ltd. shall review the Barytes contract price after every 6 months period, even during a prescribed tender duration, and may accordingly increase or decrease the price in line with the prevailing international market conditions. The basis for price review shall be the trends in important market parameters related to the Barytes industry. These parameters, examples indicated below, shall be finalized and reviewed by the Board from time to time:

1. Crude Oil Prices.
2. Global Rig Count Data.
3. Exchange Rate fluctuations (USD – INR).
4. Barytes FOB prices of other countries obtained through market research
5. Barytes Market & Price analysis reports from a reputed Third Party Consulting

2017లో చంద్రబాబు హయాంలోనే విడుదల చేసిన జీవో

ఎంఎస్‌టీసీ పర్యవేక్షణలో టెండర్ల ప్రక్రియ

టెండర్ల ప్రక్రియను మినీరత్నగా కేంద్రం గుర్తించిన ఎంఎస్‌టీసీ పర్యవేక్షిస్తోంది. కేంద్ర నిబంధనల ప్రకారమే ధరావత్తు ఖరారు చేశారు. 17 రోజుల్లో టెండర్లను పూర్తి చేయాలనేది కూడా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే. టెండర్ డాక్యుమెంట్ ధరను ఖరారు చేసే క్రమంలో టెండర్ ప్రక్రియకు సంబంధించిన డాక్యుమెంటేషన్, కన్సల్టెన్సీ చార్జీలు, ప్రిపరేషన్, కమ్యూనికేషన్ చార్జీలు, ఎంఎస్‌టీసీ చెల్లింపులకయ్యే మొత్తాన్ని లెక్కించి ధర నిర్ణయించారు. సాధారణంగా ఏ సంస్థ అయినా అనుసరించే ఈ విధానాన్ని ఈనాడు మాత్రం అక్రమం అంటూ చిత్రీకరించడం విడ్డూరం. న్యాయ సమీక్షకు పంపలేదంటూ అవగాహనారాహిత్యాన్ని ఆ కథనంలో చూపించింది. రూ.100 కోట్లకుపైగా వ్యయం అయ్యే ప్రాజెక్టును నిర్వహించే టెండర్లను మాత్రమే న్యాయ సమీక్షకు పంపుతారు. బెరైటీస్ నిల్వలను విక్రయించేందుకు పిలిచిన టెండర్లలో వ్యయం ఎక్కడ ఉంది? ఇది న్యాయ సమీక్ష పరిధిలోకి రాదనే కనీస జ్ఞానం లేకుండా ఆ కథనాన్ని ప్రచురించినట్లు స్పష్టమవుతోంది. దుర్బుద్ధితోనే ఈ కథనం రాసినట్లు తెలుస్తోందని అధికారులు పేర్కొంటున్నారు.

న్యాయపరంగా చర్యలు తీసుకుంటాం

నాణ్యమైన బెరైటీస్‌తో పాటు సీ, డీ, డబ్ల్యూ గ్రేడ్ ఖనిజాన్ని ఎప్పటికప్పుడు విక్రయించేందుకు చేస్తున్న ప్రయత్నాలను దోపిడీగా చిత్రీకరించడం దారుణం. ఈ తప్పుడు కథనంపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటాం.

– వీజీ వెంకటరెడ్డి, వీసీ అండ్ ఎండీ, ఏపీఎండీసీ

ఆదుకున్న ప్రభుత్వం.. ఆలంబనగా నిలిచిన 'ఆసరా'

ఆసరా సంబరాలు ఊరూవాడ ఉవ్వెత్తున సాగుతున్నాయి. అక్కచెల్లెమ్మలు ఈ సంబరాల్లో సంతోషంగా పాలుపంచుకుని ప్రభుత్వం నుంచి చెక్కులు పొందుతున్నారు. మోసకారి పాలన నుంచి విముక్తి దొరికి, ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నామని సగర్వంగా చెబుతున్నారు. నాలుగు పర్యాయాలుగా క్రమం తప్పకుండా అనుకున్న సమయానికి నేరుగా బటన్ నొక్కి వారి బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు జమ కావడంతో మహిళలు కూరగాయల వ్యాపారాలు, కుట్టుమిషన్లు, ఎంబ్రాయిడరీ, పాల వ్యాపారం చేస్తూ దూసుకుపోతున్నారు. ఇదే తరహా పాలన భవిష్యత్‌లోనూ ఉంటే ఇంకా పెద్ద ఎత్తున వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టిస్తామని చెబుతున్నారు. సీఎం వైఎస్. జగన్ మాట ప్రకారం తాము అప్పుల ఊబి నుంచి బయటపడి కుటుంబాలకు చేదోడుగా ఉంటున్నామని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

ఎంబ్రాయిడరీ షాపు పెట్టుకున్నా



ఈ చిత్రంలో కనిపిస్తున్నామె పేరు లింగినేని అరుణోదయ. పల్నాడు జిల్లా చినకొదమగుండ్ల గ్రామం. వైఎస్సార్ ఆసరా నిధులతో ఎంబ్రాయిడరీ మిషన్ పెట్టుకుని తన కుటుంబానికి అండగా నిలిచింది. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.1.25 లక్షలు వచ్చింది. గతంలో ఈమె భర్త జిరాక్స్ మిషన్ పెట్టుకుని కుటుంబాన్ని అతి కష్టం మీద పోషించేవాడు. ఆర్థికంగా ఎదగాలనే పట్టుదలతో ఉన్న ఆమెకు వైఎస్సార్ ఆసరా అండనిచ్చింది. రూ.3.5 లక్షలతో ఎంబ్రాయిడరీ మిషన్ కొనుగోలు చేసి మూడేళ్ల కిందట ఎంబ్రాయిడరీ వర్క్ ప్రారంభించింది. తీసుకున్న రూ.2 లక్షల బ్యాంక్ రుణం ఆసరా ద్వారా మాఫీ లభిస్తుండడంతో మిషన్ కొనుగోలు చేసింది. మరో ఇద్దరికి పని కూడా కల్పిస్తోంది. అద్దె ఇంట్లో, అద్దె షాపులో ఉంటున్నామని భవిష్యత్తులో సొంత ఇల్లు సొంత షాపు ఉండాలని ఇద్దరం కష్టపడతామని చెబుతోంది.

షాపు నిండా పథకాలే



ఈమె పేరు గాలి సముద్రమ్మ. అనకాపల్లి జిల్లా చీడికాడ గ్రామం. రెండేళ్ల క్రితం భర్త మృతి చెందారు. ఇద్దరు ఆడ పిల్లలు, ఒక బాబు ఉన్నారు. ఆమె సంతల్లో కూరగాయలు కొనుగోలు చేసి ఇంటింటికి వెళ్లి అమ్ముకునేది. వచ్చిన ఆదాయం కుటుంబ పోషణకు సరిపడేది కాదు. ఆరోగ్యం సహకరించేది కాదు. దీంతో దుకాణం తెరిచి కూరగాయల వ్యాపారం చేయాలనుకుంది. జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వారి అంబేద్కర్ గ్రూపునకు రూ. 3.14 లక్షలు రుణమాఫీ జరిగింది. నాలుగు దఫాలుగా ఆసరా క్రింద రూ 32 వేలు సముద్రమ్మ ఖాతాలో జమ అయింది. బ్యాంకు లింకేజీ నుంచి రూ. లక్ష, , స్త్రీ నిధి నుంచి మరో రూ. 50 వేలు తక్కువ వడ్డీకి అప్పుగా తీసుకుని కూరగాయల దుకాణం ప్రారంభించింది. దీనిపై వచ్చే ఆదాయంతో ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసింది. అలాగే చేయూత ద్వారా మూడు దఫాలుగా ఇప్పటి వరకు రూ. 56,250లు అందుకుంది. జగనన్న చేదోడు పథకం కింద రూ 10 వేలు వడ్డీలేని రుణం, నెల నెలా వితంతు పింఛను అందుతోంది. దీంతో ఎవరివద్ద చెయ్యి చాపకుండా దర్జాగా జీవిస్తోంది.

ఆసరా ఆదుకొంది



ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగనన్న మాకు రుణమాఫీ చేశాడు. మా రత్నశ్రీ స్వయం సహాయక గ్రూపునకు రూ.7,05,986 వైఎస్సార్ ఆసరాలో రుణ లబ్ధి చేకూరింది. తద్వారా ఒక్కొక్క సభ్యురాలికి రూ.17,598 రుణమాఫీ జరిగింది. అబద్ధపు హామీలతో చంద్రబాబు గతంలో మాకు న్యాయం చేయలేదు. నేడు జగనన్న నాలుగు పర్యాయాలు వైఎస్సార్ ఆసరా ద్వారా ఆదుకున్నాడు. సీఎం జగనన్న మేలు మర్చిపోలేం.

– గద్దం మేరీ కుమారి, కొత్తపేట, పాలకొల్లు మండలం, పశ్చిమగోదావరి జిల్లా

మేలు ఎన్నటికీ మరువబోము



సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో పొదుపు రుణాలను మాఫీ చేశారు. ప్రభుత్వం మా బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఆసరా నగదు మాకు ఎంతగానో ఉపయోగపడింది. నాలుగు విడతల్లో మొత్తం రూ.85,428 నగదు నా బ్యాంక్ ఖాతాలో జమ అయింది. జగనన్న చేసిన మేలు మా కుటుంబం ఎప్పటికీ మరిచిపోదు. జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాము.

– పి.వరమ్మ, గుడవళ్లూరు, కొండాపురం మండలం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

తొలిసారిగా వెలుగులోకి భక్తరామదాసు విగ్రహం!

కొత్త తెలంగాణ చరిత్ర బృందం ప్రకటన

నేలకొండపల్లి: శ్రీసీతారామచంద్రస్వామి భక్తుడు కంచర్ల గోపన్న (భక్త రామదాసు) విగ్రహం తొలిసారిగా వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్ అనే వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన సందర్భంలో ఆవరణలోని రావిచెట్టు వద్ద ఉన్న ఓ విగ్రహాన్ని గుర్తించారు. దీంతో ఆయన కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ రామోజు హరగోపాల్, కోకన్వీనర్ కట్టా శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి ఆ విగ్రహాన్ని పరిశీలించారు. అనంతరం అది రామదాసు విగ్రహమేనని చెబుతూ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. పోలీస్‌స్టేషన్ వద్ద వెలుగుచూసిన ఆ విగ్రహాన్ని ఎస్సై బి.సతీశ్ చేతుల మీదుగా రామదాసు పదోతరం వారసుడు కంచర్ల శ్రీనివాసరావుకు అప్పగించగా దానిని ధ్యానమందిరంలో ఏర్పాటు చేశారు. రామదాసు జయంతి ఉత్సవాల నాటికి ఈ విగ్రహం ప్రతిష్టాపనపై భద్రాచలం దేవస్థానం అధికారులు ప్రణాళిక రూపొందించాలని వారసులు కోరారు.

స్టేషన్‌కు ఎలా చేరింది?

నేలకొండపల్లిలో పాత సెంటర్‌గా పేరున్న రావిచెట్టు బజార్‌లో చాలా ఏళ్ల క్రితం పోలీస్‌స్టేషన్ ఉండేది. 1997లో నూతనంగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌కు పాత స్టేషన్ నుంచి ఫర్నిచర్, తాజాగా బయటపడిన విగ్రహాన్ని కూడా తీసుకొచ్చారు. ఈ క్రమంలో విగ్రహాన్ని స్టేషన్ ఆవరణలోని రావి చెట్టు తొర్రలో భద్రపర్చగా ఇన్నాళ్లూ ఎవరూ పట్టించుకోలేదు. అయితే, ఆ విగ్రహం పాత పోలీసుస్టేషన్‌కు ఎలా చేరింది? ఎవరు తీసుకొచ్చారనే అంశంపై ఎక్కడా రికార్డుల లేవని చెపుతున్నారు.

విగ్రహం ఎలా ఉందంటే..

కాసెపోసి కట్టిన ధోవతి, పైబట్ట లేకుండా అర్ధనగ్నంగా.. అంజలి ముద్రతో మొన కిందికి పెట్టిన కత్తి, మీసాలు, తల వెనక జారుముడి వేసుకున్న గోష్పాద శిఖతో విగ్రహం కనిపిస్తోంది. కుడి, ఎడమ భుజాలపై శంకుచక్రాలు ఉండడంతో వైష్ణవ భక్తునిగా తెలుస్తోంది. కాగా, ఈ విగ్రహం రాజోచిత ఆహార్యంతో లేనందున అక్కన్న, మాదన్నలది కాదని, వారి మేనల్లుడు భక్త రామదాసుదేనని కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



పోలీస్‌స్టేషన్‌లో గుర్తించిన విగ్రహం

31 నుంచి బీఈడీ వెబ్ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఏపీ ఎడ్‌సెట్ తొలి దశ ప్రవేశాలకు ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 6 వరకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యా మండలి శుక్రవారం తెలిపింది. బీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థులు 31 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొంది.

'గగన్‌యాన్'కు రెడీ

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ వెల్లడి



సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఈ ఏడాదిని గగన్‌యాన్ ప్రాజెక్టు సంవత్సరంగా పరిగణిస్తోందని, మరిన్ని ప్రయోగాలు చేపట్టనున్నామని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్) డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలిపారు. శుక్రవారం షార్‌లో 75వ గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2025 నాటికి మానవ సహిత ప్రయోగాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. చంద్రయాన్-3, ఆదిత్య ఎల్-1 ప్రయోగాలతో 2023 ఇస్రో చరిత్రలో గుర్తుండిపోతుందన్నారు. ఈ ప్రయోగాలకు సంబంధించి ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్‌కు మ్యాన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రావడం ఇస్రోకు గిఫ్ట్ అని పేర్కొన్నారు. న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని పంపిన ఎల్‌వీఎం మార్క్-3 రాకెట్, ల్యాండర్, రోవర్‌ను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కొత్త ఏడాదికి కానుకగా పీఎస్‌ఎల్‌వీ సీ58 ప్రయోగం నిర్వహించామని తెలిపారు. ఫిబ్రవరి రెండోవారంలో ఇన్‌శాట్-3 డీఎస్ ప్రయోగం నిర్వహించనున్నామని, ఈ ఏడాది మరో పది ప్రయోగాలకు సిద్ధమవుతున్నామని చెప్పారు.

పొత్తులో కొత్త 'డ్రామా'

ఓటు బదిలీ కోసం బాబు, పవన్ మరో నాటకం

- చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ రెండు సీట్ల పోటీ ప్రకటన
- పవన్ రెండు చోట్ల ఓడినప్పుడూ రాజోలులో జనసేన గెలిచింది
- ఈసారి రాజోలులో ఆ పార్టీ పోటీ చేయడం ఏమైనా విచిత్రమా?
- రాజానగరాన్ని టీడీపీ ముందే వదిలేసింది
- పవన్ చెప్పింది ఈ రెండు నియోజకవర్గాల్లో పోటీ గురించే
- ఇక్కడ డ్రామా బయటపడిందంటున్న పరిశీలకులు
- ఇప్పటికీ తేలని జనసేన – టీడీపీ సీట్ల సర్దుబాటు
- మండపేట, అరకుకు అభ్యర్థులను ప్రకటించిన చంద్రబాబు
- టీడీపీ ఏకపక్ష వైఖరిపై కోపంగా ఉన్న జనసేన నాయకులు
- వారిని శాంతింపజేయడానికి పోటీ ప్రకటన బిల్డప్
- సొంత నాయకులను, అభిమానులను నమ్మించడానికి పవన్ పాట్లు
- సర్దుకుపోవాల్సిందేనని, బాబు పార్టీలో పరిస్థితిని అర్థం చేసుకోవాలంటూ హిత వచనాలు
- సీఎం పదవిలో వాటా లేదన్న లోకేశ్ వ్యాఖ్యలనూ పెద్ద మనస్సుతో వదిలేశానని వెల్లడి



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: జనసేన –టీడీపీ పొత్తులో ఉన్నప్పుడు కుప్పం నియోజకవర్గం నుంచి తెలుగు దేశం పార్టీనే పోటీ చేస్తుందని చంద్రబాబు ప్రకటన చేయడం ఎంత హాస్యాస్పదంగా ఉంటుందో.. రాజోలు, రాజానగరం స్థానాల్లో జనసేనే పోటీ చేస్తుందని పవన్ కళ్యాణ్ ప్రకటించడం అంతకన్నా హాస్యాస్పదమని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. 2019 ఎన్నికల్లో పవన్ స్వయంగా పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయినప్పటికీ, ఒక్క రాజోలులోనే జనసేన గెలిచింది. అలాంటి రాజోలు స్థానంలో జనసేన పోటీ చేయడం ఏమైనా విచిత్రమా? రాజానగరం నియోజకవర్గాన్ని టీడీపీ ఇప్పటికే జనసేనకు వదిలేసింది. పవన్ పోటీ చేస్తున్నట్లు చెప్పింది కూడా ఈ రెండు నియోజకవర్గాలే. ఇక్కడే డ్రామా మొత్తం బయటపడిపోయిందని పరిశీలకులు చెబుతున్నారు. మండపేట, అరకు నియోజకవర్గాలకు చంద్రబాబు ఏకపక్షంగా టీడీపీ అభ్యర్థులను ప్రకటించడానికి కౌంటర్‌గా, గుణపాఠం చెబుతున్నట్లుగా పవన్ ఈ ప్రకటన చేయలేదన్నది సుస్పష్టమని అంటున్నారు. కేవలం పార్టీ నేతలు, అభిమానుల ముందు బిల్డప్ ఇవ్వడానికే పవన్ రెండు నియోజకవర్గాలపై ఈ హాస్యాస్పద ప్రకటన చేశారని, దీని వెనుకా చంద్రబాబే ఉన్నారని రాజకీయ పరిశీలకులు, జనసేన నేతలు కూడా చెబుతున్నారు. టీడీపీ – జనసేనల మధ్య పొత్తు ఖరారై నాలుగు నెలలు దాటింగి. ఇప్పటికీ రెండు పార్టీల మధ్య సీట్ల గొడవ సాగుతూనే ఉంది. సీట్ల కేటాయింపుపై బాబు-పవన్ ఉమ్మడిగా ప్రకటన చేయాలని ఇప్పటికి రెండుసార్లు నిర్ణయించి, విఫలమయ్యారు. ఇంకో పక్క మా సీటు మీరెలా అడుగుతారంటూ నియోజకవర్గాల్లో టీడీపీ –జనసేన నాయకులు గొడవలు పడుతున్నారు. రెండు పార్టీల మధ్య సీట్ల పంచాయితీ తేలకపోయినప్పటికీ మండపేట, అరకు నియోజకవర్గాల్లో టీడీపీ పోటీ చేస్తున్నట్టు ఆ రెండు చోట్లా సభలు పెట్టి మరీ చెప్పారు. అభ్యర్థులను కూడా ఆ సభల్లోనే ప్రకటించారు. బాబు తీరుపై జనసేన నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. ముఖ్యంగా మండపేట నేతలు పవన్‌ను కలిసి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జనసేన శ్రేణుల్లో అసంతృప్తిని చల్లార్చడానికి చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ శుక్రవారం నాటి ప్రకటన చేశారని చర్చ సాగుతోంది. సీట్ల కేటాయింపులో జరుగుతున్న ఆలస్యం, టీడీపీ ఏకపక్ష వైఖరి కారణంగా క్షేత్రస్థాయిలో రెండు పార్టీల మధ్య పెద్ద స్థాయిలో నెలకొన్న విభేదాలను తగ్గించి, అన్ని చోట్లా ఎలాంటి ఇబ్బంది లేకుండా జనసేన ఓట్లు టీడీపీకి బదలాయించడం కోసమే బాబు, పవన్ వ్యూహాత్మకంగా ఈ నాటకాన్ని మొదలుపెట్టి ఉండవచ్చని పరిశీలకులు అంటున్నారు. దీనికి 'టిట్ ఫర్ టాట్'గా కలరింగ్ ఇవ్వడం ఆ ఇద్దరికే చెల్లిందంటున్నారు.

పొత్తులకు ఎన్నెన్ని ఎత్తులో..

నమ్మించి నట్టేట ముంచడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబును పవన్ విశ్వసిస్తున్నారని జనసేన నేతలూ నమ్మడంలేదు. పొత్తుల కోసం మొదటి నుంచి వెంపర్లాడుతూ మరోవైపు అలాంటిదేమీ లేదన్నట్లు బాబు, పవన్ చెబుతూ వచ్చారు. ఈ డ్రామాను ఇరు పార్టీల వారితో పాటు రాష్ట్ర ప్రజలూ ఏ దశలోనూ విశ్వసించలేదు. ఈ దశలోనే స్కిల్ స్కాంలో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబుతో ములాఖత్ మాటున పవన్ పొత్తు ప్రకటనా నాటకమన్న విషయం అప్పట్లోనే తేటతెల్లమైంది. బాబు అరెస్టుతో టీడీపీ పనైపోయిందని, పొత్తు ఉంటే జనసేనకు టీడీపీ అత్యధిక సంఖ్యలో సీట్లను కేటాయించే అవకాశం ఉందని నమ్మి ఆ పార్టీ నాయకులు కూడా కలిసిపోయేందుకు రెడీ అయ్యారు. జనసేన 68 సీట్లను టీడీపీ ముందు ప్రతిపాదించి, కనీసం 45 స్థానాల్లో పోటీ చేయాలని ఆశపడుతోంది. అందులో సగం సీట్లు కూడా జనసేనకు ఇచ్చేందుకు టీడీపీ సుముఖంగా లేదని చర్చ సాగుతోంది. క్రమంగా టీడీపీ ముసుగు తొలగి, మోసపూరిత వైఖరి బయట పడుతుండటంతో జనసేన నాయకుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. వారంతా చంద్రబాబు, టీడీపీ మోసపూరిత వైఖరి గురించి మాట్లాడుతుంటే.. జనసేన అధినేత పవన్ మాత్రం సర్దుకుపోవాలన్న మాటలే వినిపిస్తున్నారు. పొత్తులో ఎలాంటి పరిస్థితులు ఉన్నా జనసేన సర్దుకపోవాల్సిందేనని, భరించాల్సిందేనని సొంత పార్టీ నేతలకు పదేపదే చెబుతున్నారు. శుక్రవారంనాటి సమావేశంలోనూ.. ముందుగా రెండు నియోజకవర్గాలపై ఓ బిల్డప్ ప్రకటన చేసి, చివరికి వచ్చేసరికి సర్దుకుపోవాల్సిందేనన్న టీడీపీ సందేశాన్నే ఇచ్చారు. సీట్ల కేటాయింపు తేలక మునుపే చంద్రబాబు మండపేట, అరకు అభ్యర్థులను ప్రకటించడంపై సొంత పార్టీ నేతలకు క్షమాపణలు చెబుతూనే.. వాళ్ల పార్టీలో ఉన్న పరిస్థితిని మనమే అర్థం చేసుకోవాలంటూ చంద్రబాబుకు వంతపాడారు.

సీఎం పదవి లేదన్న లోకేశ్‌కూ జీ హుజూరే!

టీడీపీ –జనసేన పొత్తు ఉన్నప్పటికీ, సీఎం పదవిలో పవన్ కళ్యాణ్‌కు వాటా లేదంటూ గతంలో లోకేశ్ చేసిన వ్యాఖ్యలకు సైతం తాజాగా జనసేన అధినేత జీహుజూర్ అనేశారు. నెల క్రితం లోకేశ్ ఓ మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'చాలా స్పష్టంగా చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి. దేర్ ఈజ్ నో సెకండ్ థాట్ (రెండో మాటే లేదు)' అని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై అప్పట్లో జనసేన పార్టీలో పెద్ద దుమారమే రేగింది. ఇన్నాళ్లూ దానిపై ఒక్కసారి కూడా మాట్లాడని పవన్.. శుక్రవారం పార్టీ నేతల సమావేశంలో స్పందించారు. పెద్ద మనస్సుతో ఆ వ్యాఖ్యలను తానే పట్టించుకోకుండా వదిలేశానని వివరించారు. 2024లో జగన్ ప్రభుత్వం రాకుండా ఉండేందుకు, రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఇలాంటి వాటన్నింటికీ నన్ను చాలా సార్లు రెస్పాండ్ కానీయకుండా చేస్తోందంటూ వంకలు చెప్పారు.

ఎమ్మెల్యే సీట్లను పక్కనపెట్టి.. వార్డు పదవుల వాటా చర్చ

రెండు నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో జనసేనకు ఎన్ని సీట్లు ఎక్కడెక్కడ టీడీపీ కేటాయిస్తుంది, సీఎం పదవిలో వాటా ఉంటుందా అని జనసేన నేతలు ఉత్కంఠతో ఉంటే.. పవన్ మాత్రం వీటి ఊసెత్తకుండా ఎప్పుడో రెండు మూడేళ్ల తర్వాత జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనకిన్ని సీట్లు వస్తాయంటూ పార్టీ నేతలను పక్కదారి పట్టించేలా మాట్లాడుతున్నారు. అసెంబ్లీ సీట్లెన్ని వస్తాయో చెప్పకుండా.. ఈ ఎన్నికల తర్వాత కామన్ పొలిటికల్ ప్రోగ్రాం పెట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో పంచాయతీలు మొదలు కార్పొరేషన్ వరకు జనసేన ఖచ్చితంగా మూడో వంతు సీట్లను తీసుకుంటుందంటూ పార్టీ నేతలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. కేవలం ఎమ్మెల్యే సీట్ల దగ్గర తాను ఆగిపోవడం లేదంటూ నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, చంద్రబాబు ఏమిటో తెలిసిన జనసేన నేతలు పవన్ మాటలను నమ్మడంలేదు. ఇదంతా అసెంబ్లీ సీట్ల కేటాయింపుల వ్యవహారం నుంచి జనసేన నేతలు, అభిమానులను పక్కదారి పట్టించే ప్రయత్నమేనని, చంద్రబాబు డైరెక్షన్‌లోనే పవన్ ఇలా మాట్లాడుతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. చివరివరకు ఇలా సాగదీసి, ఎన్నికల ముంగిట్లో ఓ నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలను జనసేనకు విదిలిస్తారన్నది సుస్పష్టమని చెబుతున్నారు. కేవలం జనసేన ఓట్లు టీడీపీకి పడటానికే చంద్రబాబు ఇలా జనసేన నేతలు, అభిమానులకు పవన్‌తో చెప్పిస్తున్నారని విశ్లేషిస్తున్నారు.

మద్యానికి డబ్బు ఇవ్వలేదని తండ్రి కాల్పులు!

• కుమారుడి మృతి

శివాజీనగర: మద్యానికి బానిసైన ఓ వ్యక్తిని గదిలో బంధించగా కోపంతో లైసెన్స్‌డ్ గన్‌తో తలుపులపై కాల్చాడు. అయితే ఆ తూటా దూసుకొచ్చి కుమారుడికి తగిలి మృతి చెందిన ఘటన బెంగళూరు నగరం కామాక్షిపాళ్య ఒకటో మెయిన్ రోడ్డులో జరిగింది. పశ్చిమ విభాగం డీసీపీ ఎస్.గిరీశ్ శుక్రవారం వివరాలు వెల్లడించారు. కొడుగుకు చెందిన నర్తన్ బోపణ్ణ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. తల్లిదండ్రులతో కలిసి కరేకల్ ఒకటో మెయిన్ రోడ్డు 2వ క్రాస్‌లోని ఇంటిలో నివాసం ఉంటున్నారు. తల్లి అనారోగ్యంతో మంచం పట్టింది. తండ్రి సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. తాగేందుకు డబ్బు ఇవ్వాలని కుమారుడిని పీడించేవాడు. గురువారం సాయంత్రం కూడా డబ్బులు డిమాండ్ చేయడంతోపాటు తనయుడిపై దాడికి యత్నించాడు. దీంతో నర్తన్ తండ్రిని గదిలో పెట్టి తలుపులు వేశాడు. దీంతో తనయుడిని దూషిస్తూ కొద్దిసేపు తర్వాత చల్లబడినట్లు కనిపించాడు. తర్వాత గదిలోనే ఉన్న లైసెన్స్‌డ్ గన్ బయటికి తీసి తలుపుల గడియను పేల్చాడు. బుల్లెట్ తలుపులను బద్దలు కొట్టుకుని దూసుకొచ్చి బయట ఉన్న నర్తన్ బొపణ్ణ తొడలోకి చొచ్చుకెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతను సోదరికి ఫోన్ చేసి తండ్రి అకృత్యాన్ని వివరించాడు. దీంతో సోదరి బంధువు బసవేశ్వరనగర సుప్త ఆస్పత్రికి తరలించగా గురువారం రాత్రి మృతి చెందాడు. మరో వైపు నిందితుడు సురేష్ ఇంటిలో రక్తాన్ని శుభ్రం చేసి సాక్ష్యం నాశనం చేసేందుకు యత్నించాడు. కామాక్షిపాళ్య సీఐ నాగేశ్ ఘటన స్థలానికి చేరుకుని సురేష్‌ను అరెస్ట్ చేసి ఎస్‌బీబీఎల్ గన్ స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ఈ పులి బంగారం!

పులి అనగానే లేత, ముదురు పసుపుపచ్చ రంగులో, నల్లటి చారలతో గంభీరంగా ఉన్న రూపం గుర్తుకువస్తుంది. కొన్నిచోట్ల తెల్ల పులులు కూడా ఉంటాయి. కానీ బంగారు వర్ణంలో ఉండే పెద్దపులిని చూశారా? అలాంటి చాలా అరుదైన ఓ 'బంగారు' పులి ఇటీవల అస్సాంలోని కజిరంగా అభయారణ్యంలో కనిపించింది. వన్యమృగాలను చిత్రీకరించేందుకు కజిరంగాలో తిరుగుతున్న గౌరవ్ రామ్ నారాయణ్ అనే వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ దీనిని చిత్రీకరించాడు. ఈ 'బంగారు' పులులు ప్రఖ్యాత రాయల్ బెంగాల్ టైగర్ జాతికి చెందినవే. జన్యు ఉత్పరివర్తనం వల్ల వీటి శరీరంపై నలుపు రంగు కాకుండా.. నారింజ/ముదురు గోధుమ రంగు చారలు ఏర్పడుతాయి. మిగతా భాగం బంగారు వర్ణంలో మెరుస్తుంటుంది. మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి పులులు 30 ఉండగా.. అందులో నాలుగు కజిరంగ రిజర్వ్‌లోనే ఉండటం గమనార్హం.



▲ ఇక ప్రపంచంలోనే అత్యంత అరుదైన 'మెలానిస్టిక్ టైగర్లు (నల్ల పులులు)' మనదేశంలోనే ఉన్నాయి. ఒడిశాలోని సిమిలిపల్ అభయారణ్యంలో మాత్రమే కనిపించే ఈ పులులకు గోధుమ రంగు చర్మంపై దట్టమైన నలుపు చారలు ఉంటాయి.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
శనివారం ॥ 27-1-2024


పర్బతి బారువా

స్త్రీలు జీవానికి జన్మనివ్వడమే కాదు.. జీవాన్ని కాపాడతారు కూడా!
ఈసారి భారత ప్రభుత్వం ప్రకటించిన పద్మశ్రీలలో కొందరు
అసామాన్యమైన స్త్రీలు తమ జీవితాన్ని, కళ, పర్యావరణం, సేంద్రియ వ్యవసాయం,
ఔషధ మొక్కలు వీటన్నిటిలోని జీవాన్ని కాపాడుకుంటూ రావడం కనిపిస్తుంది.
ఏనుగుల కోసం జీవితాన్ని అంకితం చేసిన పర్బతి బారువా...
లక్షలాది మొక్కలు నాటి ఆకుపచ్చదనం నింపిన చామి ముర్ము...
విస్మరణకు గురైన ఔషధ మూలికలకు పూర్వ వైభవాన్ని తెచ్చిన యానుంగ్...
కొబ్బరి తోటలు తీయటి కాయలు కాచేలా చేస్తున్న అండమాన్ చెల్లమ్మాళ్...
గోద్నా చిత్రకళకు చిరాయువు పోసిన శాంతిదేవి పాశ్వాన్...
వీరందరినీ పద్మశ్రీ వరించి తన గౌరవం తాను పెంచుకుంది.

పురస్కారం

అసామాన్య పద్మశ్రీలు




చామి ముర్ము

ఏనుగుల రాణి

భారతదేశ తొలి మహిళా మావటి పర్బతి బారువాకు భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' ప్రకటించింది. ఆమె పరిచయం.

ఇది సంతోషించదగ్గ విషయం.

అస్సాంలో, పశ్చిమ బెంగాల్‌లో, ఒరిస్సాలో ఎక్కడైనా అటవీ ఏనుగులు అదుపు తప్పి, తల తిక్కగా వ్యవహరిస్తూ ఉంటే పర్బతి బారువాకు పిలుపు వచ్చేది... వచ్చి వాటిని కాస్త పట్టుకోమని, మాలిమి చేయమని. ఇన్నేళ్లకు 69 ఏళ్ల వయసులో ఈ 'ఏనుగుల రాణి'కి, ఏనుగుల కోసం జీవితాన్ని అంకితం చేసిన రుషికి భారత ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' స్వీకరించమని పిలుపు వచ్చింది. మన దేశంలోనే కాదు ఆసియాలోనే ప్రమాదస్థాయిలో పడిపోతున్న గజరాజుల సంరక్షణకు, వాటిని ఎలా కనిపెట్టుకోవాలో తెలిపే జ్ఞానాన్ని సముపార్జించి పంచినందుకు ఆమెకు ఈ పురస్కారం ఇవ్వడం సంతోషించాల్సిన సంగతి.

కళ్లు తెరవగానే ఏనుగు

'నాకు ఊహ తెలిసిన వెంటనే నా కళ్ల ఎదురుగా ఏనుగు ఉంది' అంటుంది పర్బతి. అస్సాంలోని ధుబ్రీ జిల్లాకు చెందిన గౌరిపూర్ సంస్థానం పర్బతి కుటుంబీకులది. పర్బతి తండ్రి రాజా ప్రతాప్ చంద్ర బారువా సంస్థానం మీద వచ్చే పరిహారంతో దర్జాగా జీవిస్తూ 40 ఏనుగులను సాకేవాడు. అంతేకాదు అతనికి ఏనుగులతో చాలా గొప్ప, అసామాన్యమైన అండర్‌స్టాండింగ్ ఉండేది. వాటి ప్రతి కదలికకూ అతనికి అర్థం తెలుసు. మహల్‌లో ఉండటం కన్నా కుటుంబం మొత్తాన్ని తీసుకుని అడవుల్లో నెలల తరబడి ఉండటానికి ఇష్టపడే రాజా ప్రతాప్ తన తొమ్మిది మంది సంతానంలో ఒకతైన పర్బతికి ఏనుగుల మర్మాన్ని తెలియచేశాడు. 9 ఏళ్ల వయసు నుంచే పర్బతి ఏనుగులతో స్నేహం చేయడం మొదలుపెట్టింది. 16 ఏళ్ల వయసులో మొదటిసారి అటవీ ఏనుగును పట్టి బంధించగలిగింది. అది చూసి తండ్రి మెచ్చుకున్నాడు.



కష్టకాలంలో ఏనుగే తోడు

1970లో భారత ప్రభుత్వం (విలీనం చేసుకున్న) సంస్థానాలకిచ్చే భరణాన్ని ఆపేయడంతో పర్బతి తండ్రి పరిస్థితి కష్టాల్లో పడింది. రాబడి లేకపోవడంతో ఏనుగులే అతని రాబడికి ఆధారం అయ్యాయి. ఏనుగులను అమ్మి, టింబర్ డిపోలకు అద్దెకిచ్చి జీవనం సాగించాడు. ఆ సమయంలో పర్బతి ఏనుగుల గురించి మరింత తెలుసుకుంది. ఇంకా చెప్పాలంటే ఏనుగు కళ్లను చూసి దాని మనసులో ఏముందో చెప్పే స్థితికి పర్బతి చేరుకుంది. ఏనుగుల ప్రవర్తనకు సంబంధించిన ఆమె ఒక సజీవ ఎన్‌సైక్లోపిడియాగా మారింది.

క్వీన్ ఆఫ్ ఎలిఫెంట్స్

బీబీసీ వారు 'క్వీన్ ఆఫ్ ఎలిఫెంట్స్' పేరుతో పర్బతి మీద డాక్యుమెంటరీ తీయడంతో ఆమె గురించి లోకానికి తెలిసింది. ఉదయం నాలుగున్నరకే లేచి ఏనుగుల సంరక్షణలో నిమగ్నమయ్యే పర్బతి దినచర్యను చూసి సలాం చేయాల్సిందే. 'ఏనుగును మాలిమి చేసుకోవాలంటే ముందు దాని నమ్మకం, గౌరవం పొందాలి. లేకుంటే ఏనుగులు మావటీలను చంపేస్తాయి. వాటికి జ్ఞాపకశక్తి ఎక్కువ. ఒక ఏనుగు తనను ఇబ్బంది పెడుతున్న మావటిని అతను నిద్రపోతున్నప్పుడు వెతికి మరీ చంపింది' అంటుంది పర్బతి. కాని నమ్మకం పొందితే ఏనుగుకు మించి గొప్ప స్నేహితుడు లేదని అంటుంది. 'ఒకో ఏనుగు రోజుకు 250 కిలోల పచ్చగడ్డి తింటుంది. దానికి అనారోగ్యం వస్తే ఏ మొక్క తింటే ఆరోగ్యం కుదుటపడుతుందో ఆ మొక్కను వెతికి తింటుంది. అది తినే మొక్కను బట్టి దాని ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని వైద్యం చేయించాలి' అంటుందామె. 'ఎవరికైనా విశ్రాంతి ఉంటుంది కాని మావటికి కాదు. మావటి పని డ్రైవర్ ఉద్యోగం కాదు. కారు గ్యారేజ్‌లో పెట్టడానికి. జీవంతో నిండిన ఏనుగుకు మావటి అనుక్షణం తోడు ఉండాలి' అంటుందామె.

అస్సాం అటవీశాఖలో 'చీఫ్ ఎలిఫెంట్ వార్డెన్'గా పని చేసిన ఆమె ఇప్పుడు పర్యావరణ సంరక్షణ కోసం పని చేస్తోంది.


చెల్లమ్మాళ్

నారియల్ అమ్మ

దక్షిణ అండమాన్‌లోని రంగచాంగ్‌కు చెందిన 67 ఏళ్ల కామాచీ చెల్లమ్మాళ్ సేంద్రియ కొబ్బరి తోటల పెంపకంలో చేసిన విశేష కృషికి 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైంది. దక్షిణ అండమాన్‌లో 'నారియల్ అమ్మ'గా ప్రసిద్ధి చెందింది. వర్షాకాలం తరువాత నేలలో తేమను సంరక్షించడానికి కొబ్బరి ఆకులు, పొట్టు మొదలైన వాటితో సేంద్రియ ఎరువు తయారుచేసింది. 'నాకు పద్మశ్రీ ప్రకటించారు అని ఎవరో చెబితే నేను నమ్మలేదు. అయోమయానికి గురయ్యాను. అండమాన్‌లోని ఒక మారుమూల గ్రామంలో నివసించే నాకు ఇలాంటి ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్ ఎందుకు ప్రకటిస్తారు అనుకున్నాను. ఆ తరువాత నేను విన్న వార్త నిజమే అని తెలుసుకున్నాను' అంటున్న చెల్లమ్మాళ్ ఆగ్రో-టూరిజంపై ప్రత్యేక దృష్టి పెడుతుంది. తమ ప్రాంతంలోని రకరకాల పంటలు, సుగంధ ద్రవ్యాల తోటలు, చేపల పెంపకం...మొదలైనవి ఆగ్రో-టూరిజానికి ఊతం ఇస్తాయి అని చెబుతుంది చెల్లమ్మాళ్.

ఆది రాణి

అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన యానుంగ్ జమెహ్ లెగో ఆది తెగ సంప్రదాయ వైద్య విధానాన్ని పునరుద్ధరించడంలో చేసిన కృషికి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైంది. అరుణాచల్‌ప్రదేశ్‌లోని తూర్పు సియాంగ్ జిల్లాకు చెందిన 58 సంవత్సరాల యానుంగ్‌ను అభిమానులు 'ఆది రాణి' అని పిలుచుకుంటారు. లక్షమందికి పైగా ఔషధమూలికలపై అవగాహన కలిగించించిన యానుంగ్ ఏటా 5,000 ఔషధ మొక్కలను నాటుతుంది. ప్రతి ఇంటిలో హెర్బల్ కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేసుకునేలా కృషి చేస్తోంది. ఆర్థికపరిమితులు ఉన్నప్పటికీ విస్మరణకు గురైన ఆది తెగ సంప్రదాయ వైద్య వ్యవస్థను, సాంప్రదాయ జ్ఞానాన్ని సజీవంగా ఉంచడానికి తన జీవితాన్ని అంకితం చేసింది యానుంగ్.


యానుంగ్ జమెహ్ లెగో


శాంతిదేవి పాశ్వాన్

అవమానాలను అధిగమించి

గోద్నా చిత్రకళలో చేసిన విశేష కృషికి బిహార్‌లోని మధుబని జిల్లా లహేరిఆగంజ్ ప్రాంతానికి చెందిన శాంతిదేవి పాశ్వాన్ ఆమె భర్త శివన్ పాశ్వాన్‌లు పద్మశ్రీ పురస్కారానికి ఎంపిక అయ్యారు. గోద్నా చిత్రకళ ద్వారా ఈ దంపతులు ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందారు. అమెరికా నుంచి జపాన్ వరకు వీరి చిత్రాలను ప్రదర్శించారు. తన కులం కారణంగా ఎన్నో అవమానాలకు గురైన శాంతిదేవి, వాటిని అధిగమించి జీ20 సదస్సులో పాల్గొనే స్థాయి వరకు ఎదిగింది. శాంతిదేవి, శివన్ పాశ్వాన్ దంపతులు ఇరవైవేల మందికి పైగా గోద్నా చిత్రకళలో శిక్షణ ఇచ్చారు.

మొక్కవోని ఆత్మస్థైర్యం

'మొక్కలు నాటడానికి నువ్వు ఏమైనా కలెక్టర్ వా!' అని ఊరి మగవాళ్లు చామిని వెక్కిరించేవాళ్లు. మొక్కలు నాటడం అనే పుణ్యకార్యం వల్ల ఉత్త పుణ్యానికే ఇంట్లో గొడవలు మొదలయ్యాయి. ఇంటి నుంచి బయటికి వచ్చిన చామి కూలి పనులు చేసుకుంటూనే 36 ఏళ్ల రెక్కల కష్టంతో 28 లక్షలకు పైగా మొక్కలు నాటింది. ఝార్ఖండ్‌కు చెందిన చామి ముర్ము 'పద్మశ్రీ' పురస్కారానికి ఎంపికైంది....

తన గ్రామం భుర్సాకు 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక సమావేశానికి హాజరు కావడం ద్వారా పర్యావరణ కార్యకర్తగా చామీ ముర్ము ప్రయాణం ప్రారంభమైంది. 'మా ప్రాంతంలో ఎటు చూసినా బంజరు భూములు కనిపించేవి. బాధగా అనిపించేది. ఇలాంటి పరిస్థితిలో మొక్కలు నాటాలని నిర్ణయించుకున్నాను. అయితే మొక్కలు నాటడం మా ఊరిలోని మగవాళ్లకు నచ్చలేదు. ఇంట్లో కూడా గొడవలు జరిగాయి. ఈ గొడవల వల్ల సోదరుడి ఇంటికి వెళ్లాను. అతడితో కలిసి రోజూ కూలి పనులకు వెళ్లేదాన్ని. ఒకవైపు జీవనోపాధిపై దృష్టి పెడుతూనే మరోవైపు ప్రకృతికి మేలు కలిగించే పనులు చేయడం ప్రారంభించాను' అంటుంది చామీ ముర్ము. పదో తరగతి వరకు చదువుకున్న చామి మొక్కలు నాటడం, చెట్ల పరిరక్షణ కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నందుకు కొంతమందికి అకారణంగా శత్రువు అయింది. 1996లో చామి నాటిన మొక్కలను ధ్వంసం చేశారు కొందరు. 'ఇక ఆపేద్దాం. ఎందుకు లేనిపోని గొడవలు' అని కొందరు మహిళలు చామిని వెనక్కి లాగే ప్రయత్నం చేశారు. అయితే చామి మాత్రం ఆనాటి నుంచి రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం ప్రారంభించింది. ఆమె ఉత్సాహం ముందు ప్రతికూలశక్తులు తోక ముడిచాయి.

'నన్ను నేను ఒంటరిగా ఎప్పుడూ భావించలేదు. నాకు పెద్ద కుటుంబం ఉంది. నేను నాటిన 28 లక్షలకుపైగా మొక్కలు నా బంధువులే' అంటుంది చామి. ఝార్ఖండ్‌లోని వెనబడిన జిల్లా అయిన సరైకెలా ఖరావాన్‌లో రైతులు వ్యవసాయం కోసం వర్షంపై ఆధారపడతారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సాగునీటి అవసరాల కోసం వాటర్‌షెడ్‌లను నిర్మించడానికి చామి కృషి చేస్తోంది. 2,800 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేసింది. వేలాది మంది మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు పొందేలా, సొంత వ్యాపారం ప్రారంభించేలా చేసింది.

తనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించడంపై స్పందిస్తూ 'ఈ అవార్డు రావడం గౌరవంగా భావిస్తున్నాను. పర్యావరణ స్పృహతో మొదలైన నా ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి స్ఫూర్తి ఇస్తుంది' అంటుంది చామి.

ఒంటరిగా అడుగులు మొదలు పెట్టినప్పటికీ అంకితభావం కలిగిన వ్యక్తులు సమాజంపై సానుకూల ప్రభావం చూపించగలరు అని చెప్పడానికి చామీ ముర్ము ప్రయాణం బలమైన ఉదాహరణ. పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చామీ ముర్ము పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తోంది. టింబర్ మాఫియాపై పోరాడిన చామీ ముర్మును 'లేడీ టార్జన్ ఆఫ్ ఝార్ఖండ్' అని అభిమానులు పిలుచుకుంటారు.

---

* సేవ

పేదలకు అభయం

బాలచంద్రుని ఆనంద నిలయం

పరాన్న జీవులుగా కాదు.. పరమాత్మ జీవులుగా మనమంతా ఎదగాలి' అంటారు సుంకు బాలచంద్ర. పదిహేడేళ్లుగా సేవారంగంలో వేలాది మందికి అండగా ఉంటున్నారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ఉంటున్న యాభై ఏళ్ల బాలచంద్ర. అభయ ఆనంద నిలయం పేరుతో నిరుపేదలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ఉద్యోగం చేస్తూ వచ్చిన ఆదాయాన్ని పేదలకు పంచుతూ మొదలుపెట్టిన సేవా మార్గం ఇప్పుడు ఎంతో మందికి నీడనిస్తుంది. అనాథ వృద్ధులను చేరదీస్తూ, విద్యార్థుల చదువుకు అవసరాలను సమకూరుస్తూ, రోగులకు వైద్యచికిత్సను అందజేస్తూ, నిరుద్యోగుల ఉపాధికి కావల్సిన నైపుణ్యాలను అందిస్తున్నారు. స్కూల్ పిల్లలను కలుస్తూ, వారి ప్రశ్నలకు సమాధానాలను పుస్తక రూపంలో తీసుకువచ్చారు. పది వేల రూపాయలతో మొదలుపెట్టిన సేవా మార్గం నేడు ఎంత మందికి చేరవయ్యిందో తెలియజేస్తూ మనం తలుచుకుంటే సమాజంలో పేదరికం, కష్టాలు, కన్నీళ్లు లేకుండా చేయచ్చు అని వివరిస్తున్నారు. పద్దెనిమిదవ వసంతంలోకి అడుగు పెడుతున్న తన సేవా ప్రస్థానాన్ని ఇలా ముందుంచారు.


సుంకు బాలచంద్ర

''ఎనిమిదేళ్ల క్రితం ఓ రోజు నాగర్‌కర్నూలు నుంచి ఫోన్ వస్తే అక్కడకు వెళ్లాను. ఎనభై ఏళ్ల ముసలాయన బాగోగులు చూడలేక వారి పిల్లలు ఇంటి నుంచి అతన్ని రోడ్డు మీదకు తోసేస్తే కొన్ని రోజులుగా చెత్త కుప్ప వద్ద ఉన్నాడు. అతన్ని ఆశ్రమానికి తీసుకువచ్చిన ఆరునెలలకు ఆయన భార్య కూడా వచ్చింది. ఇద్దరూ ఎనిమిదేళ్లపాటు నాతోనే ఉన్నారు. నాకు కరోనా వచ్చి ఆసుపత్రిలో ఉంటే ఆవిడ బెంబేలెత్తిపోయి తన మెడలో ఉన్న మంగళసూత్రాలు, కమ్మలు ఇచ్చి 'అమ్మి, ఆ బాబును బతికించదయ్యా' అని వేడుకుంది. కోలుకుని వచ్చాక విషయం తెలిసి కళ్ల నీళ్లు వచ్చాయి.

• • •

పన్నెండేళ్ల క్రితం పాతికేళ్లమ్మాయి రోడ్డు ప్రమాదంలో హిప్‌బాల్ దెబ్బతిని మంచానికి పరిమితం అయ్యింది. హైదరాబాద్ గాంధీ నగర్‌లో ఉండే ఆమెను గుండె నొప్పితో బాధపడే తల్లి తప్ప చూసుకునేవారు ఎవరూ లేరు. నాలుగైదేళ్లు ఆ అమ్మాయి బెడ్‌మీదే ఉండిపోయింది. ఆమెకు పలుమార్లు ఆపరేషన్ చేయిస్తే ఏడెనిమిదేళ్లకు కోలుకుంది. ఇప్పుడు పెళ్లి చేసుకొని కుటుంబంతో సంతోషంగా ఉంది.

• • •

మా అమ్మాయి బాగా చదువుకుంటుంది. డాక్టర్ కావాలన్నది తన కల. కానీ, చదివించే స్థోమత మాకు లేదని బాధపడుతూ వచ్చారు ఒక మ్మాయి తల్లిదండ్రులు. ఆ బిడ్డ ఈ రోజు డాక్టర్ అయి పేదలకు సేవలందిస్తోంది.

ఈ పదిహేడేళ్లలో ఇలాంటి కథనాలు ఎన్నో... స్వచ్ఛందంగా ఎంతో మంది కదిలివచ్చి 'అభయ ఫౌండేషన్'తో చేయీ చేయీ కలిపారు.


విద్యార్థులతో...

ఉపనయనం డబ్బులతో...

పుట్టి పెరిగింది అనంతపురం జిల్లా తాడిపత్రిలో. బీఎస్సీ ఎల్‌ఎల్‌బీ చేశాను. ఇరవై నాలుగేళ్ల క్రితం నాకు ఉపనయనం చేసినప్పుడు బంధువుల ద్వారా పది వేల రూపాయలు వచ్చాయి. ఆ డబ్బుతో నలుగురికి మేలు కలిగే పని చేయాలనుకుంటున్నాను అని మా కుటుంబంలో అందరికీ చెప్పాను. అందరూ సరే అన్నారు. వారందరి మధ్యనే 'అభయ' అనే పేరుతో ఫౌండేషన్‌ను ఏర్పాటు చేస్తున్నాను అని, తమకు తోచిన సాయం అందిస్తూ ఉండమని కోరాను. అక్కణ్ణుంచి హైదరాబాద్ వచ్చి, ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాలు చేశాను. నా ఖర్చులకు పోను మిగతా జీతం డబ్బులు, బంధుమిత్రులు ఇచ్చిన దానితో ఫుట్‌పాత్‌ల మీద ఉండే నిరాశ్రయులకు సాయం చేస్తూ ఉండేవాణ్ని.


మహిళలకు ఉపాధి శిక్షణ...


అవగాహనా కార్యక్రమంలో...

నైపుణ్యాల వెలికితీత..

ఏ మనిషి అయినా ఎవ్వరి మీదా ఆధారపడకుండా బతకాలి. అందుకు తగిన నైపుణ్యం కూడా ఉండాలి. దీంతో వారాంతాలు స్కిల్ ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేస్తుండేవాడిని. చదువుకున్న రోజుల్లో నేను మా బంధువుల నుంచి పుస్తకాలు, ఫీజులు, బట్టల రూపంలో సాయం పొందాను. వారందరిలోనూ ఒక ఎక్సెప్షన్ చూశాను. నాలాగే ఎంతో మంది సాయం కోసం ఎదురుచూస్తుండవచ్చు అనే ఆలోచనతో విద్యార్థుల చదువుకు ఊతంగా ఉండాలనుకున్నాను. పుట్టి పెరిగిన జిల్లాతో పాటు ఇప్పుడు దాదాపు 17 రాష్ట్రాలలో నిరుపేద విద్యార్థుల చదువుకు అండగా ఉండటం అదృష్టంగా భావిస్తున్నాను. తెలుగు రాష్ట్రాలతో పాటు మరో మూడు రాష్ట్రాల్లో 12 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలకు శిక్షణ ఇస్తున్నాం. వీరిలో మహిళలూ ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. కర్ణాటక రాష్ట్రంలో నాదస్వరం స్కూల్‌ను కూడా ఏర్పాటు చేశాం. ఏ వృత్తుల వారికి ఆ వృత్తులలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, వారి కాళ్ల మీద వారు నిలబడేలా సాయంగా ఉంటున్నాం.

సేవకు చేయూత

ఒక మంచి పని చేస్తే ఎంత దూరమున్న వారినైనా ఆకట్టుకుంటుందని ఓ సంఘటన నాకు అర్థమయ్యేలా చేసింది. పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో ఒక సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాం. అక్కడకు 75 ఏళ్ల ఆవిడ వచ్చి 'నేనూ మీ సేవలో పాలు పంచుకుంటాను, నెలకు 5వేల రూపాయలు ఇవ్వగలను' అంది. ఆశ్చర్యంగా చూస్తే 'నేను రిటైర్డ్ ప్రిన్సిపాల్‌ను. 20 వేల రూపాయల పెన్షన్ వస్తుంది. ప్రతి నెలా ఐదు వేల రూపాయలు సేవకు నా జమ' అంది. నోటమాటరాలేదు. ఎక్కడ సేవ రూపంలో వెళితే అక్కడకు పది, వంద రూపాయలు సాయం అందించినవారున్నారు. ఇంతమందిలో మానవత్వం ఉంటే ఇక మనకు కొరతేముంది అనుకున్నాను. ఎవరికి సాయం అందిందో తిరిగి వాళ్లు ఎంతో కొంత సాయం అందిస్తూ వచ్చారు. కొంతమంది పిల్లలు తమ కిడ్డీ బ్యాంకులో దాచుకున్న డబ్బును కూడా సాయంగా ఇచ్చారు.

స్వచ్ఛందంగా ముందుకు..

నేపాల్ కరువైనా, ఉత్తరాఖండ్ వరదలైనా, ఆంధ్ర, తమిళనాడు, కేరళలలో అకాల వర్షాలు ముంచెత్తినా.. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సాయం అవసరమున్నవారికి అండగా ఉంటే చాలు అన్న తపన నన్ను చాలా మందికి చేరువ చేసింది. నాతో పాటు ఎలాంటి స్టాఫ్ లేదు. ప్రత్యేకించి ఆఫీసు లేదు. అందరూ స్వచ్ఛందంగా తమ చేయూతను ఇస్తున్నారు. దీనికి నేను చేస్తున్నదల్లా సాయం చేసే చేతులను కలపడం. ఈ సేవా ప్రస్థానంలో ఇప్పుడు వేల మంది జమ కూడారు.

అంతా నా కుటుంబమే!

సేవ మార్గమే నా ప్రయాణం కాబట్టి, పెళ్లి, కుటుంబం వద్దనుకున్నాను. హైదరాబాద్‌లో ఒక ఫ్లాట్ ఉంది. ఇటీవల ఆ ఇంటిని అభయ ఫౌండేషన్‌కు ఇచ్చేశాను. ఆరేళ్ల క్రితం ఇబ్రహీంపట్నంలో వృద్ధులకు, వైద్య సాయం అవసరమైన పేదలకు అభయ ఆనంద నిలయం ఏర్పాటు చేశాను. నేను మరణించేదాకా, మరణించాక కూడా నలుగురిని బతికించే ప్రయత్నం చేయాలన్నది తపన. ఈ ప్రయాణంలో ఎన్నో ఆవేదనలు చుట్టుముట్టాయి. ఎందరి కష్టాలనో దగ్గరుండి చూసి, దుఃఖం కలిగేది. చేసే ప్రతి పనినీ దైవాంశగా భావిస్తూ వచ్చాను.

పిల్లల కోసం కంపాస్

రేపటి తరం బాగుండాలంటే విద్యార్థుల్లో మానవతా స్పృహ కలగాలి. అందుకే, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చిన్నారులకు మన దేశ నాయకుల గురించి, సంస్కార పాఠాలు అందించే ప్రయత్నం చేస్తున్నాను. పిల్లలు అడిగిన ఎన్నో ప్రశ్నలకు సమాధానంగా 'కంపాస్'అనే పేరుతో పుస్తకం తీసుకువచ్చాను. సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతి రోజూ ఉదయం నుంచి 10 వేల మందికి టచ్‌లో ఉంటాం. నేను కోరేది ఒక్కటే ... వాలంటీర్లుగా వారంలో ఒక్క రోజు మాకివ్వండి. సేవా మార్గంలో తోడవ్వండి. అంకితభావంతో ఉన్న యువత ఇలాంటి సంస్థలలో పనిచేయడం వల్ల వారిలో జీవన నైపుణ్యాలు పెరుగుతాయి. సమాజం బాగుండాలంటే యువత చేతులు ఏకమవ్వాలి'' అని తెలియజేస్తున్నారు బాలచంద్ర.

– నిర్మలారెడ్డి



నడుము నొప్పా? సింపుల్‌గా ఇలా తగ్గించుకోండి!

నడుంనొప్పి ఉన్నవారు ఆ బాధ బయటకు చెప్పుకోలేరు. చాలా ఇబ్బంది పడుతుంటారు. తరచు పడకకే పరిమితం అయిపోవలసి వస్తుంటుంది. నొప్పి వచ్చినప్పుడల్లా సింపుల్‌గా ఒక పెయిన్ కిల్లర్‌ను వేసేసుకుంటూ ఉంటారు. అయితే ఆ మాత్ర నొప్పితోపాటు క్రమంగా మనల్నీ కిల్ చేస్తుంటుందన్న విషయాన్ని మరచిపోవద్దు. నడుంనొప్పి తగ్గించుకునేందుకు కొన్ని చిట్కాలు పాటిస్తే చాలు... సింపుల్‌గా తగ్గిపోతుంది. ఆ చిట్కాలేమిటో చూద్దాం...

బాగా నడుము నొప్పిగా ఉన్నవారు తగ్గించుకోవాలంటే ముందు ఒత్తిడిని తగ్గించుకోవాల్సి ఉంటుంది. వెన్నెముక కండరాలు బలోపేతం చేయడంతోపాటు, కొన్ని రోజువారీ అలవాట్లను మార్చుకోవడం వల్ల నడుము నొప్పి నుంచి ఉపశమనం పొందే వీలుంటుంది. చిన్న చిన్న టిప్స్‌తో నడుం నొప్పిని తగ్గించుకోవచ్చు. పడుకునే సమయంలో వెనుక భాగంపై ఒత్తిడి పడుతుంది. నడుంనొప్పి ఎక్కువగా ఉన్నవారు మోకాళ్ళ కింద దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల, కాళ్ళు ఎత్తుగా పెట్టడం వల్ల నడుంపై ఒత్తిడి తగ్గి కాస్త రిలీఫ్ గా ఉంటుంది.

సరైన శిక్షణతో వ్యాయామం... నడుం నొప్పి నుంచి ఉపశమనం

నడుంనొప్పిని తగ్గించుకోవడంలో వ్యాయామం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక వ్యాయామం చేసే సమయంలో నడుముకు సంబంధించిన ముఖ్యమైన కండరాలపై దృష్టి సారించి సరైన శిక్షణతో వ్యాయామం చేయడం వల్ల, ముఖ్యంగా కండరాలను సాగదీసే స్ట్రెచ్ ఎక్సర్‌సైజులు చేయడంవల్ల ఫలితం ఉంటుంది. వెన్ను సంబంధిత గాయాల ప్రమాదాన్ని తగ్గించడంలో వ్యాయామం సహాయపడుతుంది. నడుం నొప్పి తగ్గడం కోసం వారానికి కనీసం రెండుసార్లు నడుమును బలపరిచే వ్యాయామాలను చేయండి.

కాల్షియం, విటమిన్ డి

ఎముకలు బలంగా ఉన్నప్పుడు నడుము నొప్పి వంటి సమస్యలు ఎక్కువ బాధించవు. బలహీనమైన ఎముకలు ఉన్నప్పుడు కచ్చితంగా నడుంనొప్పి ఇబ్బంది పెడుతుంది. కాల్షియం, విటమిన్ డి పుష్కలంగా తీసుకోవడం ద్వారా వెన్నెముకలోని ఎముకలకు బలం చేకూరుతుంది. అందుకే తప్పనిసరిగా కాల్షియం, విటమిన్ డి తీసుకోవడం మర్చిపోకండి. పాలు, పెరుగు, ఆకుకూరలు, విటమిన్ సప్లిమెంట్లు వంటి వాటిలో విటమిన్ డి ఉంటుంది.

చెప్పుల విషయంలో జాగ్రత్త

నడుంనొప్పిని నివారించడం కోసం చెప్పుల విషయంలో కూడా జాగ్రత్త వహించండి. ఎత్తు మడమల చెప్పులు ఎక్కువగా వేసుకునే వారికి నడుంనొప్పి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అందుకే తక్కువ మడమ ఉన్న చెప్పులను ధరించండి. ఇవి మన నడుంపై ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒక్క అంగుళం కంటే తక్కువ మడమ ఉంటేనే ఫలితం బాగుంటుంది.

సరైన పొజిషన్

ఆఫీసులో కూర్చున్నప్పుడు, నిలబడి ఉన్నప్పుడు సరైన భంగిమ పద్ధతులను పాటించండి. మనం కూర్చునే విధానం బట్టి కూడా నడుము నొప్పి వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే కూర్చున్నా, నిల్చున్నా కచ్చితంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రత్యేకించి ప్రతిరోజూ గంటల తరబడి కంప్యూటర్ ముందు పని చేసేవారు మంచి కుర్చీని ఎంపిక చేసుకొని కూర్చోవాలి. లేదంటే నడుం నొప్పి ఎక్కువ అయ్యే ప్రమాదం ఉంటుంది.

బరువు తగ్గించుకోవడం

నడుం నొప్పికి మరొక కారణం విపరీతమైన బరువు. ఎక్కువ బరువు ఉన్న వారిలోనూ నడుమునొప్పి విపరీతంగా వస్తుంది. బరువు తగ్గితే సహజంగానే నడుం నొప్పి నుండి కూడా కాస్త ఉపశమనం లభిస్తుంది. కాబట్టి బరువు తగ్గటం పై కూడా ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టడం అవసరం. ప్రతిరోజు వ్యాయామం చేయడంతో పాటు, చిన్న చిన్న మార్పులతో నడుం నొప్పి ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. మందులతోనే నడుము నొప్పి తగ్గాలని చూడకుండా, పై చిట్కాలు పాటించి చూడండి. కచ్చితంగా విపరీతమైన బాధ నుండి కాస్తయినా ఉపశమనం పొందుతారు.

లవంగం టీ తాగండి!

భారతీయులు ఎక్కువగా వినియోగించే సుగంధ ద్రవ్యాల్లో లవంగాలు ఒకటి. శీతాకాలంలో చాలామందిలో రోగ నిరోధక శక్తి తగ్గడం వల్ల అనేకరకాల ఇన్ఫెక్షన్లు వస్తూ ఉంటాయి. ముఖ్యంగా చాలామంది జలుబు దగ్గు సమస్యల బారిన పడుతూ ఉంటారు. అయితే ఇలాంటి సమస్యలతో బాధపడేవారు ప్రతిరోజూ లవంగాల టీని తాగాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇందులో ఉండే సుగుణాలు గొంతునొప్పి, కఫం వంటి సమస్యల నుంచి కూడా సులభంగా ఉపశమనం కలిగిస్తాయి.

శరీర ఉష్ణోగ్రతలు అదుపులో ఉంటాయి

కొంతమందిలో వాతావరణంలోని తేమ పరిమాణాలు తగ్గడం పెరగడం కారణంగా శరీరంలోని ఉష్ణోగ్రతలు పెరుగుతూ.. తగ్గుతూ ఉంటాయి. దీని కారణంగా జ్వరం ఇతర అనారోగ్య సమస్యల బారిన పడతారు. అయితే చలి కాలంలో తరచుగా ఇలాంటి సమస్యలతో బాధపడేవారు తప్పకుండా లవంగాలతో తయారుచేసిన టీని తాగాల్సి ఉంటుంది.

దగ్గు నుంచి ఉపశమనం

శీతాకాలంలో చాలామందిని వేధించే సమస్యల్లో దగ్గు కూడా ఒకటి.. ఈ దగ్గు కారణంగా చాలామంది ఊపిరితిత్తుల సమస్యల బారిన కూడా పడుతున్నారు. కాబట్టి ఈ సమస్య నుంచి ఉపశమనం పొందడానికి తప్పకుండా లవంగాలతో తయారు చేసిన టీని తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు దగ్గు నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా శరీరంలో కఫాన్ని తొలగించేందుకు కూడా సహాయపడతాయి.

జీర్ణక్రియ మెరుగు పడుతుంది

కొంతమందిలో చలి కారణంగా సంబంధిత సమస్యలు కూడా వస్తున్నాయి. ఈ సమయంలో చాలామందిని వేధించే సమస్య జీర్ణ క్రియ మందగించడం. అయితే దీనికి కారణంగా చాలామందిలో మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు కూడా వస్తున్నాయి ఈ సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందడానికి తప్పకుండా లవంగాలతో తయారు చేసిన టీని తీసుకోండి.







కంటి పాపను కాపాడుకుందాం...

ఈ రోజుల్లో కొంతమందికి చిన్న వయసులోనే కళ్లజోళ్లు వచ్చేస్తున్నాయి. సరైన ఆహారం తీసుకోకపోవడం వలన గాని, కొన్ని అలవాట్ల వల్ల గాని కంటి చూపు మందగిస్తుంది. సైట్ వచ్చిన తరువాత బాధపడడం కన్నా రాకుండా కాపాడుకోవడం ఎంతో ముఖ్యం. సైట్ వచ్చిన వారికి మాత్రమే కాదు, భవిష్యత్తులో సైట్ రాకుండా కళ్ళను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తినవలసిన ఆహార పదార్థాల గురించి తెలుసుకుందాం. కళ్లను కాపాడుకుందాం.

పోషకాల లోపం

- కావలసినన్ని విటమిన్లు, పోషకాలు అందకపోతే కంటి చూపు మందగిస్తుంది. కాబట్టి కంటి చూపును పెంచే ఆహార పదార్థాలను విరివిగా తీసుకోండి.
- విటమిన్ – సి ఎక్కువగా ఉండే నిమ్మ, నారింజ, ద్రాక్ష, స్ట్రాబెర్రీ బాగా తీసుకోవాలి. ఇవి కంటికి మాత్రమే కాదు చర్మానికి కూడా ఎంతగానో ఉపయోగపడతాయి.
- వీటితో పాటుగా చేపలు, గుడ్లు, బాదం పప్పు, పాల పదార్థాలు, క్యారట్, చిలకడదుంపలు వీటన్నిటిలోను విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వీటిని ఎక్కువగా ఆహారంలో ఉండేలా చూసుకోండి.
- చత్వారం వంటివి ఉన్న పెద్దవారికే కాదు.. పిల్లలకు కూడా నేత్ర పరీక్ష అవసరం. చూపు సమస్యలను ముందే గుర్తించకపోతే పిల్లలు చదువుల్లో వెనకబడటమే కాదు.. శారీరకంగా, మానసికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది. మధుమేహం, హైబీపీ ఉన్న వారికి కంట్లోని రెటీనా పొరలో మార్పులు వస్తుంటాయి, నీటి కాసుల వంటి ప్రమాదకర సమస్యలకు కూడా ముందస్తుగా ఎలాంటి లక్షణాలూ ఉండవు. కాబట్టి ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒకసారి నేత్ర పరీక్ష చేయించుకోవాలి.



హెల్త్ టిప్స్



- బరువును అదుపులో ఉండాలంటే.. ప్రతిరోజూ రెండు చెంచాల మెంతులు రాత్రి నానబెట్టి.. తెల్లవారు జామున ఆ నీటిని తాగితే మంచి ఫలితం ఉంటుంది.



- గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు పొడి వేసి ఉదయం, సాయంత్రం తాగితే జలుబు త్వరగా తగ్గుతుంది. పసుపును నీటిలో కలిపి ముద్ద చేసి లేదా లేత వేపాకు గుజ్జుతో కానీ కలిపి చర్మంపై రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. బెణికినప్పుడు నొప్పికి, గాయాలకు, కీళ్లవద్ద కొంచెం వాపు, నొప్పికి సున్నం, పసుపు కలిపి తేలికగా రుద్దితే మంచి ఉపశమనం కలుగుతుంది.
- పచ్చివెల్లుల్లి తినడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది. వెల్లుల్లిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు కీళ్ళనొప్పుల్ని తగ్గిస్తాయి.



- మినపప్పు వెన్నుపూసకు బలాన్నిస్తుంది. అంతేకాదు మినపప్పులో ఉండే విటమిన్లు, ప్రోటీన్స్ శరీరానికి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. ఎముకల బలానికి ఇవి ఉపయోగపడతాయి. అందుకే వారానికి రెండుసార్లు వంటల్లో మినపప్పును చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు. అలాగే ఆవాలు గుండెకు మేలు చేస్తాయి. శరీరానికి కావలసిన విటమిన్లు అందిస్తాయి.

సినిమా



రవితేజ

ఈగల్... ఆన్ హిజ్ వే!

రవితేజ హీరోగా నటించిన యాక్షన్ ఫిల్మ్ 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తుండగా, కావ్యా థాపర్ మరో కథానాయిక. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల, అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రధారులు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఫిబ్రవరి 9న విడుదల కానుంది. శుక్రవారం (జనవరి 26) రవితేజ పుట్టిన రోజు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని 'ఈగల్' సినిమాలోని 'ఈగల్స్ ఆన్ హిజ్ వే.. ఇట్స్ టైమ్ టు డై...' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. సంగీత దర్శకుడు దేవ్ జాంద్ నేతృత్వంలో ఈ పాటకు ఇంగ్లిష్ లిరిక్స్ రాసిన జార్జినా మాథ్యూయే ఆలపించారు. ఈ సంగతి ఇలా ఉంచితే... రవితేజ బర్త్ డే సందర్భంగా ఆయన హీరోగా నటిస్తున్న మరో చిత్రం 'మిస్టర్ బచ్చన్' నుంచి కూడా ఓ కొత్త పోస్టర్ విడుదలైంది.

మళ్లీ మాస్ కాంబో

ఎనిమిదేళ్ల క్రితం విడుదలైన 'సరైనోడు' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. అల్లు అర్జున్ హీరోగా నటించిన ఈ సినిమాకు బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. గీతా ఆర్ట్స్ పతాకంపై ఈ పక్కా మాస్ మూవీని అల్లు అరవింద్ నిర్మించారు. కాగా 'సరైనోడు' తర్వాత నిర్మాత అల్లు అరవింద్– దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ మాస్ కాంబో గురించిన అధికారిక ప్రకటన శుక్రవారం వెల్లడైంది. అయితే ఈ సినిమాలో అల్లు అర్జున్ హీరోగా నటిస్తారా? లేక మరో హీరో ఎవరైనా నటిస్తారా? అనే విషయంపై సరైన స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలను త్వరలోనే వెల్లడించనున్నట్లుగా మేకర్స్ తెలిపారు.



బోయపాటి శ్రీను, అల్లు అరవింద్

నితిన్ రాబిన్ హుడ్

'భీష్మ' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రానికి 'రాబిన్ హుడ్' టైటిల్ ఖరారైంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటించనున్నారట. శుక్రవారం (జనవరి 26) రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'డబ్బు చాలా చెడ్డది... రూపాయి రూపాయి నువ్వు ఏం చేస్తావ్ అంటే... అన్న దమ్ముల మధ్య అక్క చెల్లెళ్ల మధ్య చిచ్చు పెడతానంటది.. అన్నట్టే చేసింది... దేశమంత కుటుంబం నాది... ఆస్తులున్నోళ్లంతా నా అన్న దమ్ములు... ఆభరణాలేసుకున్నోళ్లంత నా అక్క చెల్లెళ్ళు... అవసరం కొద్ది వాళ్ల జేబుల్లో చేతులు పెడితే... ఫ్యామిలీ మెంబర్ అని కూడా చూడకుండా నా మీద కేసులు పెడుతున్నారు... అయినా నేను హర్ట్ అవ్వలేదు... ఎందుకంటే అయినవాళ్ల దగ్గర తీసుకోవడం నా హక్కు... మై బేసిక్ రైట్. బికాజ్ ఇండియా ఈజ్ మై కంట్రీ. ఆల్ ఇండియన్స్ ఆర్ మై బ్రదర్స్ అండ్ సిస్టర్స్' అంటూ నితిన్ చెప్పే డైలాగ్స్ ఈ వీడియోలో ఉన్నాయి. రాజేంద్ర ప్రసాద్, 'వెన్నెల' కిశోర్ తదితరులు కీలక పాత్రల్లో నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.



నితిన్



విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్

డేట్ ఫిక్స్

'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ ఏప్రిల్ 5కు ఖరారైనట్లుగా తెలిసింది. హిట్ ఫిల్మ్ 'గీతగోవిందం' (2018) తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న సినిమా ఇది. ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ఫిబ్రవరి 20 కల్లా పూర్తి కానుందని తెలిసింది. ఫిబ్రవరిలో ఓ పాటను విడుదల చేసి, ఈ సినిమా ప్రమోషన్స్‌ను ఆరంభించాలనుకుంటున్నారు. ఇక ఈ సినిమాను తొలుత సంక్రాంతికి విడుదల చేయాలనుకున్నారు. కుదరకపోవడంతో మార్చిలో రిలీజ్‌కు ప్లాన్ చేశారు. ఫైనల్‌గా 'ఫ్యామిలీ స్టార్' సినిమా రిలీజ్ డేట్ ఏప్రిల్ 5కు ఫిక్స్ అయినట్లుగా తెలుస్తోంది. అదే తేదీకి ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న 'దేవర' విడుదల కావాల్సి ఉంది. అయితే ఆ సినిమా విడుదల వాయిదా పడటంతో ఏప్రిల్ 5కి 'ఫ్యామిలీ స్టార్' రిలీజ్‌ని ఫిక్స్ చేశారని సమాచారం.

జోడీ రిపీట్?



ఆలియా భట్, రామ్‌చరణ్

రాజమౌళి దర్శకత్వంలోని 'ఆర్ఆర్ఆర్' (రౌద్రం..రణం..రుధిరం) సినిమాలో రామ్‌చరణ్, ఆలియా భట్ ఓ జంటగా నటించి మెప్పించారు. ఈ ఇద్దరూ మళ్లీ జోడీ కట్టనున్నారనే టాక్ ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సన దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్ర కోసం ఇప్పటివరకు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఆలియా భట్ పేరు వినిపిస్తోంది. మరి.. రామ్ చరణ్, ఆలియా భట్ జోడీ రిపీట్ అవుతుందా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుందని తెలిసింది. రామ్‌చరణ్ బర్త్ డే (మార్చి 27) సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలయ్యే అవకాశం ఉందని టాక్. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ ఓ కీలక పాత్రలో నటించనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ స్వరకర్త. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌లతో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు.



రకుల్ ప్రీత్ సింగ్



జాకీ భగ్నానీ

పసందైన పాటలతో పెళ్లి

బాలీవుడ్ హీరో–నిర్మాత జాకీ భగ్నానీ, హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ ఇప్పుడు ఓ హాట్ టాపిక్. ఈ ఇద్దరూ భార్యాభర్తలుగా మారి, తమ జీవితాల్లో కొత్త అధ్యాయాన్ని ఆరంభించాలనుకుంటున్నారనే వార్త వినిపిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే నెల 22న గోవాలో కుటుంబ సభ్యులు, బాగా దగ్గర స్నేహితులు, సన్నిహితుల సమక్షంలో ఈ ఇద్దరి పెళ్లి జరగనుందని టాక్. కాగా.. పసందైన పాటలతో తమ పెళ్లిని ఆహ్లాదకరంగా జరుపుకోవాలని ప్లాన్ చేస్తున్నారట జాకీ–రకుల్. వెడ్డింగ్ వీడియోగ్రాఫర్ విశాల్ పంజాబీని నియమించారట. విరాట్ కోహ్లీ–అనుష్కా శర్మ, రణ్‌వీర్ సింగ్–దీపికా పదుకోన్, సిద్ధార్థ్ మల్హోత్రా–కియారా అద్వానీ వంటి స్టార్స్ వివాహ వేడుకలకు వీడియోగ్రాఫర్‌గా వ్యవహరించినది విశాల్ పంజాబీయే. వివాహ వేడుకల కోసం ప్రత్యేకంగా సౌండ్ ట్రాక్స్ చేస్తుంటారట విశాల్. ఇప్పటికే బాగా హిట్టయిన ప్రేమ పాటలను రీ–క్రియేట్ చేయడంతో పాటు కొత్త ట్యూన్లు కూడా చేస్తుంటారట. ఇంకా పెళ్లి కోసం ప్రత్యేకంగా పాటలు తయారు చేయడానికి, పాడటానికి సంగీతదర్శకులు విశాల్–శేఖర్, గాయనీమణులు యాషికా సిక్కా, హర్షదీప్ కౌర్ వంటి వారిని కూడా జాకీ–రకుల్ సంప్రదించారని భోగట్టా. తమ డేటింగ్ నుంచి పెళ్లి, భవిష్యత్తుని ప్రతిబింబించేలా విశాల్ పంజాబీతో ఓ ట్రాక్ తయారు చేయిస్తున్నారని సమాచారం. ఫిబ్రవరి మొదటి వారానికి ఈ ట్రాక్ రెడీ అవుతుందట. ఇలా ప్రత్యేకమైన, పసందైన పాటలతో తమ వివాహాన్ని ఓ కమ్మని పాటలా తీపి గుర్తులా ఉండేలా ఈ జోడీ ప్లాన్ చేసుకుంటోందని టాక్.

వేసవిలో డీజే టిల్లు వస్తున్నాడు

వేసవికి థియేటర్స్‌లోకి వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు డీజే టిల్లు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన 'డీజే టిల్లు' (2022) మంచి హిట్ సాధించింది. ప్రస్తుతం ఈ సినిమా సీక్వెల్ 'డీజే టిల్లు స్క్వేర్'తో బిజీగా ఉన్నారు సిద్ధు జొన్నలగడ్డ. సీక్వెల్‌లో అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్. మల్లిక్ రామ్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కాగా ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేయాలనుకున్నారు. కొన్ని కారణాల వల్ల రిలీజ్‌ను మార్చి 29కి వాయిదా వేస్తున్నట్లుగా శుక్రవారం ప్రకటించారు మేకర్స్. ''కొన్ని అనుకోని పరిస్థితుల కారణంగా ఫిబ్రవరి 9న అనుకున్న విడుదలను వాయిదా వేస్తున్నాం. వేసవి సెలవులను దృష్టిలో పెట్టుకొని చిత్రాన్ని మార్చి 29న విడుదల చేయాలని నిర్ణయించాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



సిద్ధు జొన్నలగడ్డ

సాక్షి బిజినెస్
శనివారం
27-1-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (గురువారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
360	102
70,701	21,353

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	15,471	▽	41
డోజోన్స్	38,089	△	39
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,635	△	105
డాక్స్	16,691	△	54
షాంఘై	2,910	△	4
నికాయ్	35,751	▽	492

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.63	107.21
€	యూరో	ఎస్‌బీఐ	89.49	91.85
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.58	56.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.92	55.85
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.19	62.63
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.73	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.47	12.54

బైజూస్‌పై దివాలా పిటిషన్

ఎన్‌సీఎల్‌టీలో దాఖలు చేసిన టర్మ్ లోన్–బీ రుణదాతలు



న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్‌పై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)–బెంగళూరులో దివాలా పిటిషన్ దాఖలైంది. కంపెనీకి 1.2 బిలియన్ డాలర్ల మేర టర్మ్ లోన్–బీ (టీఎల్‌బీ) ఇచ్చిన రుణదాతల్లో 80 శాతం సంస్థలు కలిసి గ్లాస్ ట్రస్ట్ కంపెనీ ద్వారా దీన్ని దాఖలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, దివాలా పిటిషన్ విషయం ఇంకా బహిరంగంగా వెల్లడి కాలేదు. బైజూస్ ఈ వ్యవహారమంతా నిరాధారమైనదని పేర్కొంది. రుణదాతల చర్యలపై అమెరికా కోర్టుల్లో పలు కేసులు నడుస్తుండగా ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించడం సరికాదని వ్యాఖ్యానించింది. అనుబంధ సంస్థలను విక్రయించడం ద్వారా వచ్చే నిధులతో రుణాలను తీర్చేసుకునేందుకు టీఎల్‌బీ రుణదాతలతో చర్చలు జరుపుతున్నట్లు బైజూస్ చెబుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. బ్యాంకులు కాకుండా సంస్థాగత ఇన్వెస్టర్లు ఇచ్చిన రుణాన్ని టీఎల్‌బీ లోన్‌గా వ్యవహరిస్తున్నారు. వడ్డీ రేట్లు తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు బైజూస్ అమెరికా విభాగం ఆల్ఫా 2021లో టీఎల్‌బీ తీసుకుంది. అయితే, కంపెనీ 500 మిలియన్ డాలర్ల మొత్తాన్ని నిబంధనలకు విరుద్ధంగా ఇతర అనుబంధ సంస్థలకు బదలాయించిందని, రుణ చెల్లింపులను వేగవంతం చేయాలని రుణదాతలు అమెరికాలోని డెలావేర్ కోర్టును ఆశ్రయించారు. దీన్ని న్యాయస్థానంలో సవాలు చేసిన బైజూస్.. రుణదాతలతో వివాదాన్ని పరిష్కరించుకునే ప్రయత్నాల్లో ఉంది.


కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-1-2024	
విశాఖ	565-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
రిటైల్ ధర (డజను)	72.00
26-1-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

ఇక మేడిన్ ఇండియా హెలికాప్టర్లు!

ఎయిర్‌బస్, టాటా గ్రూప్ జట్టు

- తయారీ యూనిట్‌కు రెడీ
- 24 నెలల్లోగా దేశీ హెలికాప్టర్ డెలివరీ



ముంబై: దేశీ డైవర్సిఫైడ్ దిగ్గజ గ్రూప్ టాటాతో ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ చేతులు కలిపింది. ఇరు సంస్థలు దేశీయంగా హెలికాప్టర్స్ తయారీకి భాగస్వామ్య కంపెనీ(జేవీ)ని ఏర్పాటు చేయనున్నాయి. టాటా గ్రూప్‌తో జత కట్టడం ద్వారా హెలికాప్టర్స్ తయారీలో తుది అసెంబ్లీ లైన్ (ఎఫ్ఏఎల్) యూనిట్‌ను నెలకొల్పనున్నట్లు ఎయిర్‌బస్ హెలికాప్టర్ ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ ప్లాంటు ద్వారా పౌర విమాన శ్రేణిలో దేశీయంగా ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్లను రూపొందించనున్నట్లు పేర్కొంది. వీటిలో కొన్నింటిని పొరుగు దేశాలకు సైతం ఎగుమతి చేయనున్నట్లు తెలియజేసింది. వెరసి దేశీయంగా హెలికాప్టర్ తయారీకి ప్రైవేట్ రంగంలో తొలి ఎఫ్ఏఎల్‌ను నెలకొల్పనున్నట్లు వెల్లడించింది. ఇది భారత ప్రభుత్వం చేపట్టిన ఆత్మనిర్భర్ కార్యక్రమానికి భారీస్థాయిలో ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు వివరించింది.

డెలివరీలవరకూ..

భాగస్వామ్యంలో భాగంగా ఎయిర్‌బస్ హెలికాప్టర్స్‌తో కలసి టాటా గ్రూప్ అనుబంధ సంస్థ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్) ఎఫ్ఏఎల్‌ను ఏర్పాటు చేయనుంది. ఫ్రెంచ్ ప్రెసిడెంట్ ఇమాన్యుయెల్ మేక్రన్ రెండు రోజుల భారత పర్యటన సందర్భంగా ఎయిర్‌బస్ హెలికాప్టర్ తాజా ప్రకటన జారీ చేసింది. గణతంత్ర దినోత్సవాలలో ప్రధాన అతిథిగా పాల్గొనేందుకు మేక్రన్ భారత్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. కాగా.. ప్రధాన విడిభాగాల అసెంబ్లీలు, ఏవియానిక్స్, మిషన్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ నియంత్రణల ఇన్‌స్టలేషన్, హైడ్రాలిక్ సర్క్యూట్లు, విమాన కంట్రోళ్లు, ఇంధన వ్యవస్థతోపాటు ఇంజిన్ కూర్పు తదితరాలను జేవీ నిర్వహించనున్నట్లు ఎయిర్‌బస్ హెలికాప్టర్స్ వివరించింది. అంతేకాకుండా భారత్ తదితర ప్రాంతాలలో హెచ్125ల టెస్టింగ్, క్వాలిఫికేషన్‌తో సహా.. డెలివరీలను సైతం చేపట్టనున్నట్లు పేర్కొంది. 24 నెలల్లోగా ఎఫ్ఏఎల్ ఏర్పాటవుతుందని, 2026లో దేశీయంగా తయారైన తొలి (మేడిన్ ఇండియా) హెచ్125లను డెలివరీ చేసే వీలున్నట్లు అంచనా వేసింది. తయారీ యూనిట్ ఏర్పాటుచేసే ప్రాంతాన్ని సంయుక్తంగా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించింది.

కీలక పాత్ర...

జాతి నిర్మాణంలో హెలికాప్టర్లు కీలక పాత్ర పోషిస్తాయని ఎయిర్‌బస్ సీఈవో గిలామ్ ఫారీ పేర్కొన్నారు. నవ భారత సామర్థ్యాలపై గల నమ్మకానికి మేడిన్ ఇండియా పౌర హెలికాప్టర్ ప్రతీకగా ఉంటుందని అభివర్ణించారు. తద్వారా దేశీయంగా హెలికాప్టర్ మార్కెట్‌కున్న భారీ అవకాశాలకు తెరతీస్తుందని అభిప్రాయపడ్డారు. దేశీయంగా ప్రయివేట్ రంగంలో తొలి హెలికాప్టర్ అసెంబ్లీ యూనిట్ ఏర్పాటుకు సంతోషిస్తున్నట్లు టాటా సన్స్ చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ పేర్కొన్నారు. తుది అసెంబ్లీ లైన్ ద్వారా ప్రపంచంలోనే ఎయిర్‌బస్‌కు చెందిన అత్యుత్తమ హెచ్125 సింగిల్ ఇంజిన్ హెలికాప్టర్‌ను భారత్‌తో పాటు, ఇతర మార్కెట్లకు కూడా అందించనున్నట్లు తెలియజేశారు.

ఎస్‌బీఐ కార్డ్ లాభం ప్లస్

క్యూ3లో రూ. 549 కోట్లు



న్యూఢిల్లీ: క్రెడిట్ కార్డుల దిగ్గజం ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. అక్టోబర్–డిసెంబర్ (క్యూ3)లో నికర లాభం 8 శాతం వృద్ధితో రూ. 549 కోట్లను తాకింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 509 కోట్లు ఆర్జించింది. పీఎస్‌యూ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ ప్రమోట్ చేసిన కంపెనీ మొత్తం ఆదాయం సైతం రూ. 3,656 కోట్ల నుంచి రూ. 4,742 కోట్లకు ఎగసింది. అయితే నిర్వహణ వ్యయాలు 23 శాతం పెరిగి రూ. 2,426 కోట్లకు చేరాయి. గత క్యూ3లో ఇవి రూ. 1,974 కోట్లుగా నమోదయ్యాయి. స్థూల మొండిబకాయిలు (ఎన్‌పీఏలు) 2.22% నుంచి 2.64 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.8% నుంచి 0.96 శాతానికి పెరిగాయి. దీంతో అనుకోని నష్టాలు, మొండి రుణాల వ్యయాలు రూ. 533 కోట్ల నుంచి రూ. 883 కోట్లకు పెరిగాయి. కాగా.. డిసెంబర్‌కల్లా కనీస మూలధన నిష్పత్తి 23.1 శాతంగా నమోదైంది. 2023 మార్చిలో 18.4 శాతం సీఏఆర్ సాధించింది.

వదంతులపై స్పందించే గడువు పెంపు

- లిస్టెడ్ కంపెనీలకు సెబీ వెసులుబాటు
- జూన్ 1 నుంచి అమలు



న్యూఢిల్లీ: స్టాక్ మార్కెట్లో వ్యాపించే వదంతులపై తప్పనిసరిగా స్పందించాల్సిన గడువును క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా పొడిగించింది. దీంతో టాప్–100 లిస్టెడ్ కంపెనీలకు వెసులుబాటు లభించింది. వెరసి మార్కెట్లో పుట్టే రూమర్లను ధ్రువ పరచడం, ఖండించడం లేదా స్పష్టతనివ్వడం వంటి చర్యలను తప్పనిసరిగా చేపట్టాలనే నిబంధన అమలుకు మరింత గడువు లభించింది. సెబీ ప్రతిపాదిత ఈ నిబంధనలు తొలుత టాప్ ర్యాంక్‌లోని 100 లిస్టెడ్ కంపెనీలకు అమలుకానున్న సంగతి తెలిసిందే. మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ)రీత్యా అగ్రభాగంలో నిలిచే 100 కంపెనీలు 2024 ఫిబ్రవరి 1 నుంచి రూమర్లపై తప్పనిసరిగా స్పందించాలంటూ సెబీ ఇంతక్రితం గడువు విధించింది. తాజాగా ఈ డెడ్‌లైన్‌ను జూన్ 1వరకూ పొడిగిస్తూ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ బాటలో మార్కెట్ విలువలో టాప్–250 ర్యాంకు లిస్టెడ్ కంపెనీలకు రూమర్లపై స్పందించాల్సిన నిబంధనలు 2024 డిసెంబర్ 1 నుంచి అమలుకానున్నాయి. నిజానికి 2024 ఆగస్ట్ 1 నుంచి నిబంధనలు అమలు చేయవలసిందిగా టాప్–250 సంస్థలను సెబీ గతంలో ఆదేశించింది. లిస్టెడ్ కంపెనీలు కార్పొరేట్ పాలనను మరింత పటిష్టంగా అమలు చేసే లక్ష్యంతో సెబీ తాజా నిబంధనలకు తెరతీసిన విషయం విదితమే.

ఈ కామర్స్ ఎలిఫెంట్ ఫ్లిప్‌కార్ట్

- 48 శాతం మార్కెట్ వాటా
- వేగంగా విస్తరిస్తున్న మీషో
- అలియన్స్ బెర్న్‌స్టీన్ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ: దేశ ఈ కామర్స్ మార్కెట్లో ఫ్లిప్‌కార్ట్ తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. 48 శాతం మార్కెట్ వాటాతో వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్ మొదటి స్థానంలో ఉన్నట్లు అలియన్స్ బెర్న్‌స్టీన్ తాజా నివేదిక వెల్లడించింది. అదే సమయంలో జపాన్ సాఫ్ట్‌బ్యాంక్ పెట్టుబడులు కలిగిన మీషో వేగంగా చొచ్చుకుపోతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ఫ్లిప్‌కార్ట్ 21 శాతం మేర యూజర్లను పెంచుకోగా, మీషో 32 శాతం కొత్త యూజర్లను జోడించుకుంది. అదే సమయంలో అమెజాన్ యూజర్ల వృద్ధి 13 శాతానికే పరిమితమైంది. '2022–23 సంవత్సరంలో భారత ఈ–కామర్స్‌లో 48 శాతం వాటాతో ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ లీడర్‌గా ఉంది. పరిశ్రమ కంటే వేగంగా ఫ్లిప్‌కార్ట్ వృద్ధి చెందుతోంది. మొబైల్స్, వస్త్రాలు ఫ్లిప్‌కార్ట్‌కు రెండు పెద్ద విభాగాలుగా ఉన్నాయి. మొబైల్స్‌లో 50 శాతం, వస్త్రాల్లో 30 శాతం వాటా కలిగి ఉంది. ఆన్‌లైన్ స్మార్ట్ ఫోన్లలో 48 శాతం, ఆన్‌లైన్ ఫ్యాషన్ విభాగంలో 60 శాతం చొప్పున మార్కెట్ వాటా ఫ్లిప్‌కార్ట్ కలిగి ఉంటుందని అంచనా' అని ఈ నివేదిక తెలిపింది.

చిన్న పట్టణాలపై మీషో గురి

జీరో కమీషన్ నమూనాలో ద్వితీయ శ్రేణి, చిన్న పట్టణాలపై మీషో వ్యూహాత్మకంగా దృష్టి సారించడం ద్వారా మార్కెట్ వాటాను వేగంగా పెంచుకుంటున్నట్టు బెర్న్‌స్టీన్ నివేదిక వెల్లడించింది. భారత్‌లో ఈ కామర్స్ యాప్ డౌన్‌లోడ్‌లలో 48 శాతం మేర మీషోనే ఉంటున్నట్టు పేర్కొంది. 'గడిచిన 12 నెలల్లో మీషో ఆర్డర్ల పరిమాణం 43 శాతం మేర పెరిగింది. ఆదాయంలో 54 శాతం వృద్ధి నెలకొంది. మళ్లీ, మళ్లీ కొనుగోలు చేసే కస్టమర్లు 80 శాతంగా ఉన్నారు. మీషోలో 80 శాతం విక్రేతలు రిటైల్ వ్యాపారవేత్తలు కాగా, ప్లాట్‌ఫామ్‌పై 95 శాతం కొనుగోళ్లు అన్‌బ్రాండెడ్‌వే ఉంటున్నాయి. నెలవారీ 12 కోట్ల సగటు యూజర్లతో మీషో భారత్‌లో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఈ–కామర్స్ కంపెనీ. ప్రస్తుతం మీషో స్థూల వాణిజ్య విలువ (జీఎంవీ) 5 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ'అని ఈ నివేదిక వెల్లడించింది.

ఫ్యాషన్‌లో మింత్రా టాప్...

ఫ్యాషన్ ఈ–కామర్స్‌లో రిలయన్స్‌కు చెందిన అజియో 30 శాతం మార్కెట్ వాటా కలిగి ఉన్నట్టు బెర్న్‌స్టీన్ నివేదిక తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సంస్థ మింత్రా ఈ విభాగంలో 50% మార్కెట్ వాటాతో మొదటి స్థానంలో ఉంది. 2023 డిసెంబర్‌లో పోటీ సంస్థల కంటే మింత్రాయే మెరుగ్గా 25 శాతం మేర వృద్ధిని నమోదు చేసింది. ఈ–గ్రోసరీలో బ్లింకిట్ చాలా వేగంగా వృద్ధి చెందుతోంది. ఉత్పత్తుల శ్రేణి, కస్టమర్లకు చేరువ విషయంలో జెప్టో బ్లింకిట్‌తో పోలిస్తే వెనుకనే ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. బ్లింకిట్ 40 శాతం వాటాతో మొదటి స్థానంలో ఉంటే, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ 37–39% వాటా, జెప్టో 20% వాటాతో తర్వాతి రెండు స్థానాల్లో ఉన్నాయి.

సాక్షి స్పోర్ట్స్



ఫైనల్లో భారత మహిళల హాకీ జట్టు

మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు ఫైనల్లోకి దూసుకెళ్లింది. మస్కట్‌లో శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి రజని కెప్టెన్సీలోని భారత జట్టు 6–3తో దక్షిణాఫ్రికాపై నెగ్గింది. ఫైనల్లో నెదర్లాండ్స్‌తో భారత్ ఆడుతుంది. సెమీఫైనల్లో భారత్ తరఫున అక్షత, మరియానా, ముంతాజ్, రుతుజా, జ్యోతి అజ్మీనా ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యెండల సౌందర్య భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తోంది.

క్వార్టర్ ఫైనల్లో కిరణ్ జార్జి పరాజయం

ఇండోనేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత ప్లేయర్ కిరణ్ జార్జి పోరాటం ముగిసింది. జకార్తాలో శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 36వ ర్యాంకర్ కిరణ్ జార్జి 14–21, 6–21తో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయాడు.



మొదటి టెస్టు మన చేతుల్లోకి...

- భారత్ ప్రస్తుత ఆధిక్యం 175 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో 421/7
- కేఎల్ రాహుల్, జడేజా అర్ధ సెంచరీలు
- రాణించిన కేఎస్ భరత్, అక్షర్ పటేల్

భారత్, ఇంగ్లండ్ తొలి టెస్టు ఊహించిన దిశలోనే సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోరుకే ఇంగ్లండ్‌ను కట్టడి చేసిన టీమిండియా రెండో రోజు తమ బ్యాటింగ్ సత్తా చూపించింది. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా చక్కటి అర్ధసెంచరీలకు తోడు శ్రేయస్ అయ్యర్, కేఎస్ భరత్, అక్షర్ పటేల్ సమయోచిత సహకారం జట్టును భారీ ఆధిక్యంలో నిలిపాయి. శుక్రవారం 3.47 రన్‌రేట్‌తో 87 ఓవర్లలోనే 302 పరుగులు సాధించిన టీమిండియాకు టెస్టుపై పట్టు చిక్కింది. పేలవ బౌలింగ్‌తో భారత్‌ను నిలువరించడంలో విఫలమైన ఇంగ్లండ్ ఇప్పటికే దాదాపుగా చేతులెత్తేసింది. రెండో రోజు ఒక రనౌట్‌ను మినహాయిస్తే ఆ జట్టు ఐదు వికెట్లే తీయగలిగింది. మరో మూడు వికెట్లతో భారత్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకునే అవకాశం ఉండగా... ఇంగ్లండ్ ఎంతవరకు పోరాడుతుందనేది చూడాలి.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్లీ 23; రాహుల్ (సి) రేహన్ (బి) హార్లీ 86; శ్రేయస్ (సి) హార్లీ (బి) రేహన్ 35; జడేజా (బ్యాటింగ్) 81; భరత్ (ఎల్బీ) (బి) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 35; ఎక్స్‌ట్రాలు 15; మొత్తం (110 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి) 421. వికెట్ల పతనం: 1–80, 2–123, 3–159, 4–223, 5–288, 6–356, 7–358. బౌలింగ్: వుడ్ 13–0–43–0, హార్లీ 25–0–131–2, లీచ్ 25–6–54–1, రేహన్ 23–3–105–1, రూట్ 24–2–77–2.



జడేజా

సాక్షి, హైదరాబాద్: బ్యాటింగ్ బలంతో భారత జట్టు ఇంగ్లండ్‌పై తొలి టెస్టులో ఆధిపత్యాన్ని కొనసాగించింది. మ్యాచ్ రెండో రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 110 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 421 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (123 బంతుల్లో 86; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), రవీంద్ర జడేజా (155 బంతుల్లో 81 బ్యాటింగ్; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు సాధించగా... కోన శ్రీకర్ భరత్ (81 బంతుల్లో 41; 3 ఫోర్లు), అక్షర్ పటేల్ (62 బంతుల్లో 35 బ్యాటింగ్; 5 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయస్ అయ్యర్ (63 బంతుల్లో 35; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ఇప్పటికే భారత్ 175 పరుగుల ఆధిక్యంలో ఉండగా... క్రీజ్‌లో ఉన్న జడేజా, అక్షర్ ఎనిమిదో వికెట్‌కు అభేద్యంగా 63 పరుగులు జోడించారు. ఈ ఇన్నింగ్స్‌లో భారత్ ఐదు అర్ధసెంచరీ భాగస్వామ్యాలు నమోదు చేయగా... మూడింటిలో జడేజా ఉన్నాడు. భారత్ టాప్–5 బ్యాటర్లంతా దూకుడుగా ఆడబోయి అటాకింగ్ షాట్లకే వెనుదిరగడం విశేషం.



రాహుల్



భరత్

సమష్టి బ్యాటింగ్‌తో...

ఓవర్‌నైట్ స్కోరు 119/1తో ఆట కొనసాగించిన భారత్ తొలి ఓవర్లోనే యశస్వి జైస్వాల్ (74 బంతుల్లో 80; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) వికెట్ కోల్పోయింది. క్రీజ్‌లో ఉన్నంత సేపు ఇబ్బందిగానే కనిపించిన శుబ్‌మన్ గిల్ (66 బంతుల్లో 23; 2 ఫోర్లు) కూడా ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. అయితే రాహుల్, శ్రేయస్ కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 64 పరుగులు జోడించారు. శ్రేయస్ భారీ స్కోరు చేయడంలో విఫలం కాగా... 72 బంతుల్లో రాహుల్ హాఫ్ సెంచరీ పూర్తయింది. వుడ్ ఓవర్లో అతను కొట్టిన మూడు ఫోర్లు హైలైట్‌గా నిలిచాయి. రేహన్ ఓవర్లో రాహుల్ రెండు సిక్సర్లు బాదడంతో భారత్ ఆధిక్యంలోకి వచ్చింది. అయితే అతను సెంచరీ చాన్స్‌ను పోగొట్టుకున్నాడు. రాహుల్ పెవిలియన్‌కు చేరిన సమయంలో భారత్ 42 పరుగుల ఆధిక్యంలో మాత్రమే ఉంది. దాంతో చివరి వికెట్లు తీయగలమని ఇంగ్లండ్‌కు ఆశ కలిగింది. కానీ జడేజా వాటిని వమ్ము చేశాడు. ముందుగా భరత్‌తో, ఆ తర్వాత అక్షర్ పటేల్‌తో అతను రెండు కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. కొన్ని చక్కటి షాట్లు ఆడిన ఆంధ్ర ఆటగాడు భరత్ పెద్ద స్కోరు సాధించే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. 84 బంతుల్లో జడేజా అర్ధసెంచరీ చేశాడు. జడేజాతో సమన్వయలోపంతో అశ్విన్ (1) రనౌట్ కావడం ఒక్కటే కాస్త నిరాశపర్చింది. తన బ్యాటింగ్ ప్రతిభను ప్రదర్శిస్తూ అక్షర్ కూడా చెలరేగడంతో ఇంగ్లండ్ బౌలర్లు బేలగా చూస్తుండిపోయారు. హార్లీ వేసిన చివరి ఓవర్లో అక్షర్ వరుసగా 4, 6, 4 బాది రోజును ముగించాడు.

తన్మయ్ తడాఖా

160 బంతుల్లో 33 ఫోర్లు, 21 సిక్స్‌లతో 323 నాటౌట్

- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా తన్మయ్ రికార్డు
- హైదరాబాద్ 48 ఓవర్లలో 529/1
- అరుణాచల్‌ప్రదేశ్‌తో రంజీ ట్రోఫీ మ్యాచ్



తన్మయ్

సాక్షి, హైదరాబాద్: దేశవాళీ క్రికెట్‌లో అనామక అరుణాచల్ ప్రదేశ్ బౌలర్లపై హైదరాబాద్ ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్ (160 బంతుల్లో 323 బ్యాటింగ్, 33 ఫోర్లు, 21 సిక్స్‌లు), కెప్టెన్ రాహుల్ సింగ్ గహ్లోత్ (105 బంతుల్లో 185; 26 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్‌లో భాగంగా సొంతగడ్డపై జరుగుతున్న నాలుగు రోజుల లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలిరోజు 'సూపర్‌ఫాస్ట్' ప్రదర్శన కనబరిచింది. ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 48 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 529 పరుగులు సాధించింది. ప్రస్తుతం హైదరాబాద్ 357 పరుగుల ఆధిక్యంలో ఉంది. ముందుగా అరుణాచల్ ఇన్నింగ్స్‌ను కూల్చడం మొదలు, హైదరాబాద్ బ్యాటింగ్ అంతా మెరుపు వేగంతో సాగిపోయింది. తూంకుంటలోని నెక్స్‌జెన్ క్రికెట్ అకాడమీ గ్రౌండ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అరుణాచల్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 39.4 ఓవర్లలో 172 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ తెచీ డోరియా (127 బంతుల్లో 97 నాటౌట్; 12 ఫోర్లు, 4 సిక్సర్లు) ఒంటరి పోరాటం చేశాడు. హైదరాబాద్ బౌలర్లు సీవీ మిలింద్ (3/36), కార్తికేయ (3/28), తనయ్ త్యాగరాజన్ (2/53) అరుణాచల్ జట్టును కట్టడి చేశారు.



రాహుల్

తొలి వికెట్‌కు 449 పరుగుల భాగస్వామ్యం

అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన హైదరాబాద్ ఓపెనర్లు తన్మయ్, రాహుల్ అరుణాచల్ బౌలర్లపై విధ్వంసరచన చేశారు. ఇద్దరూ చెలరేగిన తీరుతో ప్రతీ ఓవర్ హైలైట్స్‌ను తలపించింది. తన్మయ్‌తో రాహుల్ తొలి వికెట్‌కు 40.2 ఓవర్లలో 449 పరుగుల భాగస్వామ్యం జోడించాక అవుటయ్యాడు. రాహుల్ అవుటయ్యాక కూడా తన్మయ్ తన జోరు కొనసాగించాడు. ఈ క్రమంలో రంజీ ట్రోఫీలో ఫాస్టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన భారత క్రికెటర్‌గా తన్మయ్ నిలిచాడు. తన్మయ్ 119 బంతుల్లో డబుల్ సెంచరీ చేయగా... 1985లో బరోడా జట్టుపై రవిశాస్త్రి (ముంబై) 123 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించాడు. డబుల్ సెంచరీ పూర్తయ్యాక కూడా తన్మయ్ విధ్వంసం కొనసాగింది. ఈ క్రమంలో తన్మయ్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ 'ట్రిపుల్ సెంచరీ' సాధించిన బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పాడు. తన్మయ్ 147 బంతుల్లో 'ట్రిపుల్ సెంచరీ' సాధించి ... 2017లో దక్షిణాఫ్రికా దేశవాళీ క్రికెట్‌లో 191 బంతుల్లో 'ట్రిపుల్ సెంచరీ' చేసిన మార్కో మరైస్ రికార్డును బద్దలు కొట్టాడు. అంతేకాకుండా రంజీ ట్రోఫీ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. ఇప్పటికి తన్మయ్ 21 సిక్స్‌లు కొట్టగా... జార్ఖండ్ ప్లేయర్ ఇషాన్ కిషన్ (2016లో ఢిల్లీపై 14 సిక్స్‌లు), హిమాచల్‌ప్రదేశ్ ఆటగాడు శక్తి సింగ్ (1990లో హరియాణాపై 14 సిక్స్‌లు) పేరిట ఉన్న రికార్డు తెరమరుగైంది.

విహారి, భుయ్ సెంచరీలు



రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కోలుకుంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 277 పరుగులు సాధించింది. 41 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును హనుమ విహారి (119 బ్యాటింగ్; 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ రికీ భుయ్ (120; 14 ఫోర్లు) సెంచరీలతో ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 231 పరుగులు జోడించారు. విహారి, కరణ్ షిండే (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

జొకోవిచ్‌కు సినెర్ షాక్

- సెమీస్‌లో ఓడిన డిఫెండింగ్ చాంప్
- జ్వెరెవ్‌పై గెలుపుతో ఫైనల్లో మెద్వెదెవ్



జొకోవిచ్



సినెర్

మెల్‌బోర్న్: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ విభాగంలో కొత్త చాంపియన్ అవతరించడం ఖాయమైంది. డిఫెండింగ్ చాంపియన్, 10 సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గిన సెర్బియా దిగ్గజం జొకోవిచ్ ఈసారి సెమీఫైనల్ అడ్డంకిని దాటలేకపోయాడు. ప్రపంచ నాలుగో ర్యాంకర్, ఇటలీకి చెందిన 22 ఏళ్ల యానిక్ సినెర్ ధాటికి జొకోవిచ్ సెమీఫైనల్లో నిష్క్రమించాడు. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో సినెర్ 3 గంటల 22 నిమిషాల్లో 6–1, 6–2, 6–7 (6/8), 6–4తో జొకోవిచ్‌ను బోల్తా కొట్టించి తన కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్లోకి దూసుకెళ్లాడు. జొకోవిచ్‌తో జరిగిన మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో ఆడిన సినెర్ తొమ్మిది ఏస్‌లు సంధించి, 31 విన్నర్స్ కొట్టాడు. జొకోవిచ్ సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసిన సినెర్ తన సర్వీస్‌లో ఒక్కసారి కూడా బ్రేక్ పాయింట్ అవకాశమే ఇవ్వలేదు. మరోవైపు జొకోవిచ్ 54 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు. ఆదివారం జరిగే ఫైనల్లో మూడో సీడ్ మెద్వెదెవ్ (రష్యా)తో సినెర్ తలపడతాడు. రెండో సెమీఫైనల్లో మెద్వెదెవ్ 4 గంటల 18 నిమిషాల్లో 5–7, 3–6, 7–6 (7/4), 7–6 (7/5), 6–3తో ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ)పై అద్భుత విజయం సాధించి ఈ టోర్నీలో మూడోసారి, ఓవరాల్‌గా ఆరోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నాడు.

పోరుకు 'సిద్ధం'!

నేడు 'భీమిలి'లో ఎన్నికల శంఖారావాన్ని పూరించనున్న సీఎం జగన్

34 నియోజకవర్గాల నుంచి భారీఎత్తున హాజరుకానున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు


సంగివలసలో సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం/తగరపువలస (విశాఖ జిల్లా) : రాష్ట్రంలో రానున్న ఎన్నికల కురుక్షేత్ర యుద్ధంలో 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావాన్ని పూరించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్ సిద్ధమయ్యారు. ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ఒంటరిగా ఎదుర్కోలేక జనసేన సహా వివిధ పార్టీల జెండాలతో జతకట్టి.. కుటుంబాలను చీల్చుతూ పన్నుతున్న కుట్రలు, కుతంత్రాలను చిత్తుచేసి, విజయభేరి మోగించడానికి.. పార్టీ శ్రేణులను సిద్ధంచేయడానికి ఆయన నడుం బిగించారు. ఇందుకు 'సిద్ధం' పేరుతో రాష్ట్రంలో నాలుగు ప్రాంతాల్లో నాలుగుచోట్ల పార్టీ శ్రేణులతో భారీ బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మొదటి సభను ఉత్తరాంధ్రలోని విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం సంగివలసలో శనివారం నిర్వహిస్తున్నారు. ఈ సభకు ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి భారీఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకానున్నారు. సుమారుగా 15 ఎకరాల స్థలంలో ఈ భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభలో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగిస్తారు. అంతేకాక.. నియోజకవర్గాల వారీగా పలువురు కార్యకర్తలతో కూడా సీఎం ముఖాముఖి మాట్లాడనున్నారు. ఇక మ.3.30 గంటల నుంచి సా.5 వరకూ ఈ బహిరంగ సభ జరుగుతుంది.

కదనరంగంలో ముందడుగు..

ఎన్నికల పరుగు పందెంలో ఎవరి అడుగు ముందుపడితే విజయం వారినే వరిస్తుందంటూ రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు. ఓ వైపు పొత్తులో ఎవరు ఏ స్థానాల్లో పోటీచేయాలన్నది తేల్చుకోలేక.. పోటీ చేయడానికి అభ్యర్థులు దొరక్క, మరోవైపు బీజేపీని జతచేసుకునేందుకు పాకులాడుతూ టీడీపీ–జనసేన సతమతమవుతున్నాయి. మరోవైపు.. జనబలమే గీటురాయిగా.. సామాజిక న్యాయం చేకూర్చడంలో మరో అడుగు ముందుకేస్తూ శాసనసభ, లోక్‌సభ స్థానాల సమన్వయకర్తలను సీఎం జగన్ మారుస్తున్నారు. ఇప్పటికే 58 శాసనసభ, 10 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను నియమించారు. గత ఎన్నికల కంటే మెరుగైన ఫలితాల కోసం అవసరమైన చోట్ల సమన్వయకర్తలను మార్చడంపై కసరత్తు కొనసాగిస్తూనే.. ఎన్నికల శంఖారావాన్ని పూరించడం ద్వారా సీఎం జగన్ కదనరంగంలో దూసుకుపోతున్నారని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

ప్రతి ఇంటా విప్లవాత్మక మార్పు..

ఇక ప్రజా సంకల్ప పాదయాత్రలో తాను గుర్తించి, ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలను రెండు పేజీలతో మేనిఫెస్టోగా వైఎస్ జగన్ రూపొందించి 2019 ఎన్నికలకు వెళ్లారు. ఆ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి.. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతం హామీలను అమలుచేశారు. ఇప్పటికి 99.5 శాతం హామీలు అమలుచేశారు. గత 56 నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా అర్హతే ప్రామాణికంగా.. పారదర్శకంగా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో రూ.2.53 లక్షల కోట్లు.. నాన్ డీబీటీ రూపంలో రూ.1.68 కోట్లు వెరసి రూ.4.21 లక్షల కోట్ల ప్రయోజనాన్ని పేదలకు చేకూర్చారు. ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేరాయి. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తెచ్చారు. సీఎం జగన్ సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రతి ఇంటా, ప్రతి గ్రామం, ప్రతి నియోజకవర్గంలో కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. ఇదే అంశాన్ని గుర్తుచేస్తూ ప్రభుత్వంవల్ల మంచి జరిగిందని భావిస్తేనే తనకు అండగా నిలబడాలని ప్రజలకు సీఎం జగన్ పిలుపునిస్తున్నారు. ఇదే అంశాన్ని పార్టీ శ్రేణులకు వివరించి.. ప్రతి ఇంటికీ చేసిన మంచిని చాటిచెప్పి.. మరింత మంచి చేసేందుకు ఆశీర్వదించాలని కోరాలని దిశానిర్దేశం చేయనున్నారు.

2022, మే 11 నుంచే గడప గడపకూ..

నిజానికి.. సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలన ద్వారా ప్రతి ఇంట్లో వచ్చిన మార్పును గుర్తుచేసి.. మరింత మంచి చేయడానికి ఆశీర్వదించాలని కోరేందుకు 2022, మే 11న 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారు. ప్రభుత్వం చేసిన మంచి కళ్లెదుటే కన్పిస్తున్నప్పుడు 175కు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం సుసాధ్యమేనని 'గడప గడపకూ మన ప్రభుత్వం' వర్క్‌షాప్‌లలో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు జగన్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అలాగే, ప్రతి ఇంటికీ చేసిన మంచిని వివరించడానికి చేపట్టిన 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలో 80 శాతం ప్రజలు 'మా నమ్మకం నువ్వే జగన్' అంటూ నినదించి, ప్రభుత్వానికి మద్దతు పలికారు. ఇది జాతీయ మీడియా సంస్థలు నిర్వహించిన సర్వేల్లో ప్రస్ఫుటితమైంది. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 25కు 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం తథ్యమని టైమ్స్ నౌ వంటి ప్రముఖ జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే గడాది అక్టోబరు 10న విజయవాడలో పార్టీ ప్రతినిధుల సదస్సు నిర్వహించి 175కు 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా చేపట్టాల్సిన చర్యలపై సీఎం వైఎస్ జగన్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

బహిరంగసభకు ఏర్పాట్లు పూర్తి..

మరోవైపు.. గత మూడ్రోజులుగా జరుగుతున్న 'సిద్ధం' బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సభా ఏర్పాట్లను శుక్రవారం సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు కోలా గురువులు, శ్రీకాకుళం జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు, ఎమ్మెల్సీలు పెనుమత్స సురేష్, వరుదు కల్యాణి, విశాఖ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్, సాంస్కృతిక శాఖ చైర్మన్ వంగపండు ఉష పరిశీలించారు. హెలికాప్టర్ ట్రయల్ రన్ కూడా పూర్తయింది. సుమారు 3 వేలకు పైగా పోలీసులు శుక్రవారం సాయంత్రానికే సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.

సీఎం పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి శనివారం మ.2.05 గంటలకు బయల్దేరి 3 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో సభాస్థలికి చేరుకుంటారు. సభానంతరం తిరిగి హెలికాప్టర్‌లో విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరానికి బయల్దేరుతారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకునేందుకు ప్రజలు 'సిద్ధం'

వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై చంద్రబాబు, పవన్ తదితర ప్రతిపక్ష నేతలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టడానికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. సంగివలస జాతీయ రహదారి వద్ద జరగనున్న సభకు సంబంధించి ఏర్పాట్లను ఆయన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు సీఎం జగన్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేస్తారన్నారు. పక్క రాష్ట్రాల్లో ఆదరణ కోల్పోయిన నాయకులు ఇక్కడి ప్రజలకు సేవ చేయడానికి వచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సమర్థవంతంగా సంక్షేమాభివృద్ధి పథకాలు అమలుచేశారని.. ఆ నమ్మకంతోనే మళ్లీ ఆయననే ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. వారే వైఎస్సార్‌సీపీ క్యాంపెయినర్లన్నారు. ఈ సభకు రెండున్నర లక్షల మంది తరలిరానున్నారని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.

క్లుప్తంగా...

సీఎంకు మత్స్యకారుల వినూత్న స్వాగతం


సంఘీభావం తెలుపుతున్న మత్స్యకారులు

కొమ్మాది (భీమిలి): విశాఖ జిల్లా తగరపువలస సమీపంలోని సంగివలసలో ఉత్తరాంధ్ర వైఎస్సార్‌సీపీ నేతల భారీ బహిరంగ సభ (సిద్ధం)కు సీఎం వైఎస్ జగన్ హాజరుకానున్న నేపథ్యంలో మంగమారి బీచ్‌లో వెల్‌కం సీఎం సార్ అంటూ మత్స్యకారులు వినూత్నంగా స్వాగతం పలికారు. సముద్రం మధ్యలో జెండాలు పట్టుకుని, 300 పడవలతో వీరు సీఎంకు ముందస్తు స్వాగతం పలికారు. ఎన్నికల యుద్ధానికి తాము (మత్స్యకారులు) సిద్ధం అంటూ నినదించారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మత్స్యకారులు విషయంలో సీఎం జగన్ పెద్ద మనసు చాటుకున్నారని, మత్స్యవేట నిషేధ సమయంలో మత్స్యకార భృతితో ఆర్థిక భరోసా కల్పించారని చెప్పారు. శనివారం నిర్వహించనున్న సమావేశంలో మత్స్యకారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

సీఎం జగన్ స్ఫూర్తితో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలు

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



కపిలేశ్వరపురం: సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ స్ఫూర్తితో మండపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్సీ, మండపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణ ప్రధాన రహదారిలో విగ్రహాలను శుక్రవారం జిల్లాకు చెందిన మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోట త్రిమూర్తులు మాట్లాడుతూ మండపేటలో సుదీర్ఘకాలంగా పెత్తందారీతనం రాజ్యమేలుతోందని, సీఎం వైఎస్ జగన్ సీఎం అయ్యాక సంక్షేమ పథకాలతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర సామాజిక వర్గాల పేదలు లబ్ధి పొందుతున్నారన్నారు. విజయవాడలో సీఎం జగన్ ఆవిష్కరించిన అంబేడ్కర్ విగ్రహం తమకు స్ఫూర్తినిచ్చిందన్నారు. విగ్రహాల ఏర్పాటుతో ఆయా సామాజికవర్గాల వారికి ఆత్మస్థైర్యం కలుగుతుందని ఎమ్మెల్సీ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు, అమలాపురం ఎంపీ చింతా అనూరాధ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పదేళ్లుగా అభివృద్ధి ఆగిపోయింది: షర్మిల



గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కారణంగా రాష్ట్రంలో పదేళ్లుగా అభివృద్ధి ఆగిపోయిందని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. శుక్రవారం గుంటూరులో ఆమె.. ఉమ్మడి గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలతో ముఖాముఖీలో పాల్గొన్నారు. దేశంలో ఎక్కడైనా బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ అని, అదే ఆంధ్రప్రదేశ్‌లో బాబు, జగన్, పవన్ అని చెప్పారు. ఈ మూడు పార్టీల్లో ఏ పార్టీకి ఓటు వేసినా బీజేపీకి వేసినట్లే అన్నారు. ఏపీలో ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ లేని బీజేపీకి గత, నేటి పాలకులు బానిసలుగా మారిపోయారన్నారు. హోదా వాగ్దానంపై బీజేపీని ప్రశ్నించకుండా టీడీపీ, వైసీపీ ప్రజలను మోసగించారని చెప్పారు. రాజధాని లేదని, పోలవరం పూర్తికాలేదని, యువతకు ఉద్యోగాల్లేవని, జాబ్ కేలండర్‌పై మాటతప్పారని, మెట్రోరైలు లేని రాష్ట్రమని విమర్శించారు. ప్రస్తుతం ఏపీలో పాలకులు ప్రజలకు దూరంగా ఉంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు.

రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అత్యున్నతంగా మార్చారు


- సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు
- ప్రముఖ సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి


మాట్లాడుతున్న ఆర్.నారాయణమూర్తి

ఇరగవరం: 'రాష్ట్రంలో విద్యా వ్యవస్థను అత్యున్నతంగా మార్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు' అని ప్రముఖ సినీనటుడు, దర్శకుడు, నిర్మాత ఆర్.నారాయణమూర్తి అన్నారు. 'ప్రజా దీవెన' పేరిట యాత్ర చేపట్టిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం గోటేరు గ్రామంలో శుక్రవారం ఆర్.నారాయణమూర్తి కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం గోటేరులో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం ద్వారా భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని గొప్ప పని చేశారని ప్రశంసించారు. ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవడం వల్ల ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. చదువు అంటే కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్ కోసం ఉపయోగపడాలని సీఎం జగన్ భావిస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంగ్లిష్ వస్తేనే ఉద్యోగావకాశాలు దక్కుతున్నాయని, లేదంటే ఉద్యోగాలు రాని పరిస్థితి ఉందని తెలిపారు. తాను పేదవాడినని, బీసీ కులానికి చెందిన రైతు బిడ్డనని, ఆ రోజుల్లో తమకు చదువు పొందడం అంటే ఎంతో కష్టమైన విషయమని, ఇంగ్లిష్ విద్య కావాలంటే ఇంకా కష్టమైన పరిస్థితి అని వివరించారు. అప్పట్లో తమ తరంవారు తెలుగు మీడియంలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ ఇలా చదువుకున్నప్పటికీ ఉన్నత ఉద్యోగాలు సాధించే విషయంలో మాత్రం విఫలమయ్యామని ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం చిన్నిచిన్న ఉద్యోగాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందన్నారు. కానీ, ఇంగ్లిష్ మీడియంలో చదివినవారు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులు అయ్యారని వివరించారు. అందుకే ఇప్పుడు ఈ తరం పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం విద్యను ప్రవేశపెట్టిన సీఎం జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానని ఆర్.నారాయణమూర్తి చెప్పారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తనకు మంచి మిత్రుడని, సినీ పరిశ్రమలో ఎంతో మందికి ఆయన ఆర్థిక సాయం చేశారని తెలిపారు.

రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ

- టీడీపీ వారు ప్రత్యేక పరిస్థితుల్లో రెండు సీట్లు ప్రకటించారు
- మేమూ ప్రత్యేక పరిస్థితుల్లో రెండు సీట్లు ప్రకటిస్తున్నాం : పవన్ కళ్యాణ్



సాక్షి, అమరావతి : రాజోలు, రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పోటీ చేయబోతున్నట్టు ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటించారు. టీడీపీ–జనసేన పొత్తులో రెండు పార్టీల మధ్య సీట్ల కేటాయింపుపై ఒక పక్క చర్చలు కొనసాగుతున్న సమయంలోనే బాబు మండపేట, అరకు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడంపై పవన్ కళ్యాణ్ శుక్రవారం మంగళగిరి కార్యాలయంలో పార్టీ నేతల సమావేశంలో మాట్లాడారు. శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జాతీయ జెండా ఎగరవేసిన అనంతరం పవన్ మాట్లాడుతూ.. మనకు చెప్పకుండా బాబు మండపేట సీటును అనౌన్స్ చేయడంపై ఆ నియోజకవర్గ నేతలు తన వద్ద బాధపడ్డారని చెప్పారు. వారితో తానూ ఏకీభవించానని, మండపేట లాంటి నియోజకవర్గంలోనే మనకు 23 నుంచి 28 శాతం చాలా బలమైన ఓటు ఉందన్నారు. తాను నియోజకవర్గ నాయకుడిగా మాట్లాడితే, నియోజకవర్గ నాయకుడినే అవుతానని, రాష్ట్రాన్ని సంపూర్ణంగా చూడాలని వారికి చెప్పానన్నారు. పొత్తు ధర్మం ప్రకారం ఆ నియోజకవర్గాన్ని అలా ప్రకటించకుండా ఉండాల్సిందని, దానికి తాను క్షమాపణ చెబుతున్నానన్నారు. వచ్చే సమావేశంలో దానిని సరిదిద్దుతామని తెలిపారు. వాళ్లకు కొన్ని ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని, వాళ్లను కూడా అర్థం చేసుకోవాలని అన్నారు. టీడీపీ రెండు సీట్లు ప్రత్యేక పరిస్థితుల్లో ప్రకటించింది కాబట్టి, బాబుకు ఒత్తిడి ఉన్నట్లే, తనకూ ఒత్తిడి ఉంటుందనీ, దాన్ని తట్టుకోవడానికి రిపబ్లిక్ డే రోజున రాజోలు, రాజానగరం సీట్లను అనౌన్స్ చేస్తున్నా అని పవన్ ప్రకటించారు.

షర్మిలమ్మకు పరిణతి లేదు

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- పవన్ అధర్మాన్ని ఆశ్రయించాడు



తాడేపల్లిగూడెం : షర్మిలమ్మకు ఇంకా పరిణతి రాలేదని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆయన శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల తనను నమ్మిన నాయకులను, కార్యకర్తలను గాలికొదిలేసిందని చెప్పారు. ఎంతో ఉన్నతమైన కుటుంబం నుంచి వచ్చిన షర్మిల ఇప్పుడు చంద్రబాబు మాటలు వినడం చాలా దారుణమని, వారి కుటిల రాజకీయాలకు బలైపోతోందని తెలిపారు. చంద్రబాబు చెబితే నమ్మే స్థితిలో ప్రజలు లేరని, అందుకే షర్మిలమ్మను రాజకీయంగా వాడుకుంటున్నారని చెప్పారు. ఆంధ్ర రాష్ట్రానికి ఘోరమైన అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్ముతారా అని ప్రశ్నించారు. ఒక అన్నగా షర్మిలమ్మకు చెబుతున్నానని, దయచేసి చంద్రబాబు మాయ మాటలు నమ్మొద్దని సూచించారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. టీడీపీతో పొత్తు పెట్టుకొని పవన్ కళ్యాణ్ అధర్మాన్ని ఆశ్రయించాడని అన్నారు. ప్రజలను మోసం చేసే చంద్రబాబుతో పవన్ జతకట్టి తప్పుచేశాడన్నారు. వాళ్లలో వాళ్లు ఒప్పందాలు తప్పుకొని పార్టీ అభ్యర్థులను ప్రకటిస్తున్నారని తెలిపారు. తాము ప్రభుత్వ పరిపాలన నచ్చితేనే ఓటు వేయమని అడుగుతున్నామని, చంద్రబాబు ఏ రకంగా ఓటు అడుగుతాడని, పవన్ ఏమని ఓటు అడుగుతాడో చెప్పాలని నిలదీశారు. జనసేన, టీడీపీ కలలు పగటి కలలుగానే మిగిలిపోతాయన్నారు. సారా వ్యాపారం మొదలుపెట్టింది చంద్రబాబేనని, టీడీపీ హయాంలో తన వాళ్లకు ఇష్టమొచ్చినట్టు లిక్కర్ సిండికేట్‌లు ఇచ్చేశాడని మంత్రి చెప్పారు.

యాదవులు కనిపించడం లేదా బాబూ?

- 20 ఏళ్లుగా మాకు విలువే ఇవ్వలేదు
- తిరుపతి నేతల ఆగ్రహం


ఓ హోటల్లో సమావేశమైన యాదవ సామాజికవర్గ నేతలు

సాక్షి, తిరుపతి: టీడీపీలో బీసీలకు గుర్తింపు లేదని.. 20 ఏళ్లుగా తొక్కేస్తున్నారని యాదవ సామాజికవర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు బీసీలను గుర్తించిందిలేదని, ఏ రోజూ పిలిచి పక్కన కూర్చోబెట్టుకున్న దాఖలాలు లేవని బీసీ సామాజిక వర్గానికి చెందిన నేతలు అసహనం వ్యక్తం చేశారు. టికెట్ ఇవ్వకపోయినా.. కనీసం సర్వేలో అయినా తమ పేర్లు చేర్చడానికి కూడా ఇష్టం లేదా? అందుకు అర్హులం కాదా? చంద్రబాబుకు యాదవులు కనిపించలేదా? అంటూ ధ్వజమెత్తారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తిరుపతి టికెట్ విషయంపై యాదవ సామాజిక వర్గం నేతలు శుక్రవారం రాత్రి ఓ హోటల్లో సమావేశమయ్యారు. టీడీపీ అధిష్టానం నిర్వహించిన సర్వేలో యాదవ సామాజికవర్గం నేతల పేర్లు కానీ, బీసీల్లోని ఇతర వర్గాల చెందిన వారి పేర్లు లేకపోవడాన్ని తప్పుబట్టారు. టికెట్ తమకు ఇవ్వకపోయినా పర్లేదని, కనీసం సర్వేలో కూడా తమ వారి పేర్లు చేర్చడానికి కూడా ఇష్టం లేదా? అని చంద్రబాబుపై ధ్వజమెత్తారు. సర్వే జాబితాలో ఉన్న నాలుగు పేర్లు కేవలం బలిజ సామాజిక వర్గం వారివే ఉన్నాయని, ఆ లిస్ట్‌లో చివరనైనా తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్ లేదా ఇంకొకరి పేరు చేర్చటానికి కూడా పనికిరామా? అని ఆవేదన వ్యక్తంచేశారు. గత 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్నామని, ఇప్పటివరకు యాదవులకు గానీ, బీసీలోని ఇతరులకు గానీ తిరుపతిలో అవకాశం కల్పించకపోవడంపై మండిపడుతున్నారు. ఇన్నేళ్లుగా కేవలం బలిజ సామాజికవర్గం వారికే ఎమ్మెల్యే టికెట్ ఇస్తున్నారని, 20 ఏళ్ల చరిత్ర తీసుకుంటే వారు పార్టీలోకి ఎప్పుడు వచ్చారు? ఏమి తీసుకొచ్చారు? ఏం కష్టపడ్డారు? అని నిలదీశారు. మొదటి నుంచి తిరుపతిలో యాదవులు టీడీపీ కోసం కష్టపడుతున్నారని, ప్రతిపక్ష పార్టీలతో పోరాడుతున్నామని చెప్పారు. తమ సామాజికవర్గం వారంతా టీడీపీ కోసం పోరాటాలు చేసి దెబ్బలు తినడంతో పాటు కేసులు పెట్టించుకుని జైళ్లకు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయని, అటువంటి తాము చంద్రబాబుకు కనపించలేదా? అని యాదవ సామాజికవర్గ నేతలు నిలదీశారు. మేమూ కష్టపడుతున్నాం, పార్టీ కోసం చొక్కాలు చింపుకుంటున్నాం, మాకూ గుర్తింపు ఇవ్వండి అంటూ డిమాండ్ చేశారు.

పిలవకుండా ఎందుకొచ్చారు?

అమీనాబాద్ బీసీ సదస్సులో జనసేన నేతలపై టీడీపీ నేత ఫైర్


సదస్సు నుంచి తిరిగి వెళ్లిపోతున్న జనసేన నేతలు

కొత్తపల్లి : మేము మిమ్మల్ని పిలవలేదే.. ఎందుకొచ్చారు..పోయి జనాల్లో కింద కూర్చోండి.. అంటూ టీడీపీ నాయకులు జనసైనికులను అవమానించారు. ఓవైపు టీడీపీ–జనసేన పొత్తులతో ముందుకెళ్తున్నామంటూ అధినేతలు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. రెండు పార్టీల మధ్య విభేదాలు భగ్గుమంటున్నాయి. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి మండలం అమీనాబాద్‌లో శుక్రవారం టీడీపీ బీసీ సదస్సు నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు స్థానిక జనసేన పార్టీ బీసీ నేత కొండబాబు తమ పార్టీ నేతలతో కలిసి అక్కడకు వచ్చారు. మిత్రపక్షమైన తమకు ఆహ్వానం లేకుండా సదస్సు ఎలా నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది టీడీపీ సమావేశమని, జనసేనకు సంబంధం లేదని వర్మ స్పష్టం చేశారు. అయినా వచ్చారు కాబట్టి కింద జనంలో కూర్చోమంటూ ఆదేశించారు. కనీసం వేదికపై తమకు కుర్చీలు కూడా లేకుండా చేసి అవమానిస్తారా అంటూ నిర్వాహకుల తీరుపై జనసేన నేతలు మండిపడ్డారు. సదస్సులో గొడవ చేయకుండా వెళ్లిపొమ్మంటూ వర్మ ఆదేశించడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నేతలు.. టీడీపీ నేతల తీరును దుయ్యబట్టారు. ఈ సందర్భంగా జనసేన నేతలు మాట్లాడుతూ, ఒకపక్క ఇరు పార్టీల అధినేతలు మిత్రపక్షంగా కలిసి పని చేయాలంటూంటే.. ఇక్కడి టీడీపీ నేతలు మాత్రం నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

కాంగ్రెస్‌తో షర్మిల జతకట్టడం దుర్మార్గం

- వైఎస్సార్ కుటుంబాన్ని బజారుకీడ్చే ప్రయత్నం ఇది
- షర్మిలపై నా ఆరోపణలకు ఆధారాలు చూపిస్తా
- తాను కోరిన పని చేయనందుకే సీఎం జగన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు
- వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపక నాయకుడు కొండా రాఘవరెడ్డి



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌ను వ్యతిరేకించిన కాంగ్రెస్‌తో షర్మిల చేతులు కలపడం దుర్మార్గమని తెలంగాణకు చెందిన వైఎస్సార్‌టీపీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరైన కొండా రాఘవరెడ్డి విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు, దుష్టచతుష్టయం పన్నాగంలో షర్మిల పావుగా మారిందన్నారు. షర్మిల పదవులకోసం దుష్టరాజకీయాలు చేసే చంద్రబాబుతో కలిసి వైఎస్ కుటుంబ గౌరవాన్ని రోడ్డుకు తేవడం సరికాదని హితవు పలికారు. 'వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు విజయమ్మ, భారతమ్మ కలిశారు. విజయమ్మ పాదయాత్ర చేస్తే బాగుంటుందనే చర్చ వచ్చింది. విజయమ్మకు మోకాలు నొప్పులని, వైఎస్ జగన్ భార్యగా భారతమ్మ చేయాలన్న ప్రస్తావన వచ్చింది. కానీ, కుటుంబం కోసం నేను పాదయాత్ర చేస్తానని షర్మిల ముందుకు వచ్చింది. అక్కడే షర్మిల మదిలో విష బీజాలు పడ్డాయి. దీనిపై కుటుంబం, పార్టీ ఇంకా ఏం నిర్ణయం తీసుకోకముందే జైలు నుంచి బయటకు వస్తూనే తనకు తానుగానే పాదయాత్ర చేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటి నుంచి ఆమె తీరులో మార్పు ప్రారంభమైంది' అని విమర్శించారు. తన కుటుంబం చీలడానికి సీఎం వైఎస్ జగన్ కారణమని, తల్లి విజయమ్మను సాక్ష్యంగా చెప్పిన షర్మిల.. ధైర్యం ఉంటే ఇదే విషయాన్ని వైఎస్సార్ సమాధి వద్ద చెప్పాలన్నారు. షర్మిల భర్త అనిల్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ఓ పని కోసం సీఎం జగన్ దగ్గరకు వస్తే సహేతుకంగా లేకపోవడంతో ఆయన దానిని తిరస్కరించారన్నారు. మళ్లీ కొన్ని రోజులకు విజయమ్మను తీసుకొని షర్మిల రాగా.. తాను చేయలేనని సీఎం జగన్ నిస్వార్థంగా చెప్పేశారన్నారు.. అప్పటి నుంచి షర్మిల బ్లాక్ మెయిల్ ప్రారంభించారని పేర్కొన్నారు. 'తెలంగాణలో చాలా ప్రాంతాల్లో బ్రదర్ అనిల్ కుమార్, షర్మిల పేర్లతో భూములు ఉన్నాయి. వాటిని అమ్మగా రూ.100 కోట్లు వచ్చింది. వైఎస్సార్‌టీపీ కోసం దాన్ని ఖర్చు చేసి నష్ట పోయారు. వీరితో పాటు తెలంగాణలో 400 మంది నాయకులు వాళ్ల సొంత డబ్బు కోట్లాది రూపాయలు నష్టపోయారు. ఆ సమయంలో నరరూప రాక్షసుడు చంద్రబాబు తన యుక్తులు ప్రదర్శించారు. బ్రదర్ అనిల్ కుమార్‌ను వశపరుచుకుని పార్టీ పెట్టి నష్టపోయిన రూ.100 కోట్లు నేను ఇస్తాను. సీఎం జగన్‌ను బజారుకీడ్చండని చెప్పగా అదే డైరెక్షన్‌లో షర్మిల కాంగ్రెస్‌లో చేరిపోయారు' అన్నారు. పేదల గురించి తపనపడే జగన్ లాంటి నాయకుడిని కాపాడుకోవాలని, అవసరమైతే తాను ఏపీలో తిరిగి వాస్తవాలు ప్రజలకు వివరిస్తానన్నారు. కేసీఆర్‌పై సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వైఎస్సార్‌టీపీ నాయకులతో కలిసి షర్మిల ఢిల్లీ వెళ్లగా సీబీఐ అధికారులు అపాయింట్ మెంట్ ఇవ్వలేదని చెప్పారు. లాభం లేకపోవడంతో వేరే వ్యక్తుల ఫోన్ నుంచి వివేకానందరెడ్డి కేసులో సాక్ష్యం చెబుతాం అని సీబీఐ అధికారులకు మెసేజ్ చేయించి అపాయింట్‌మెంట్ పొందారన్నారు. షర్మిలపై తాను చేసిన ఆరోపణలకు ఆధారాలతో సహా నిరూపిస్తానన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో హక్కుల సాధన


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న బహుజన నాయకులు

1,216వ రోజు రిలే దీక్షలో బహుజన నేతలు

తాడికొండ: గణతంత్ర దినోత్సవం సాక్షిగా అంబేడ్కర్ స్ఫూర్తితో రాజ్యాంగబద్ధ హక్కులు సాధిస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,216వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో శుక్రవారం పలువురు మాట్లా డారు. బహుజనులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదిగితేనే నిజమైన స్వాతంత్ర్య ఫలాలు అందుతాయని గ్రహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని నేరుగా పేదలకు చేరవేసి ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని తెలిపారు. నేడు ఏపీలో రాజకీయ పదవులు, నామినేటెడ్ పదవులు, మంత్రులుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఉన్నత స్థాయి పదవుల్లో కొనసాగుతున్నారని, ఇదే పరిస్థితి మరికొన్ని రోజులు కొనసాగితే బహుజన రాజ్యాధికారం సాకారం సాధ్యమేనన్నారు. ఏపీ రాజకీయాలు, మూడు రాజధానులపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు అర్థరహితమని చెప్పారు. కులవాద, ప్యాకేజీ పార్టీలు, ఎల్లో మీడియా మాటలు విని ఏది పడితే అది మాట్లాడితే ఆమె రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడినట్టేనని అన్నారు. నాయకులు కారుమూరి పుష్పరాజు, మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, నూతక్కి జోషి తదితరులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
శనివారం : 27 : జనవరి : 2024


బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు సంగొళ్లి రాయణ్ణ వర్ధంతి సందర్భంగా శుక్రవారం బెంగళూరులో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

న్యూస్‌రీల్

కలబుర్గిలో బాలుడిపై దాష్టీకం

రాయచూరు రూరల్: కలబుర్గిలో బాలుడిని కొట్టి అర్ధనగ్నంగా ఊరేగించిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కలబుర్గి సర్దార్ వల్లబాయి పటేల్ క్రీడా మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఆచరిస్తుండగా, అక్కడి అశోక్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాస్టల్‌లో విద్యార్థులు ఓ బాలుడిపై ఉదయం అంబేడ్కర్ పూజలకు రాలేదనే కోపంతో దాడి చేసి దుస్తులను తొలగించి, కొట్టి అంబేడ్కర్ ప్రతిమను చేతిలో పెట్టి అర్ధనగ్నంగా ఊరేగించారు.

9 మందిపై క్రిమినల్ కేసులు

బనశంకరి: డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ముమ్మర తనిఖీలు చేపట్టిన బెంగళూరు నగర ట్రాఫిక్ పోలీసులు మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రధానంగా ప్రైవేటు బస్ డ్రైవర్లు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడ్డారు. 881 మంది బస్ డ్రైవర్లను పరీక్షించగా అందులో 9 మంది మద్యం మత్తులో ఉన్నట్లు తేలింది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ విభాగ జాయింట్ పోలీస్ కమిషనర్ అనుచేత్ తెలిపారు. తొమ్మిది మంది డ్రైవర్లపై క్రిమినల్ కేసు నమోదు చేసి డీఎల్ రద్దు చేయాలని ఆర్టీఓ అధికారులకు లేఖ రాశామని, బస్సుల యజమానులకు నోటీస్ ఇచ్చామని తెలిపారు.

గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి

- గాల్లోకి కాల్పులు జరిపిన కన్నడ సంఘం నాయకుడు

సాక్షి,బళ్లారి: గణతంత్ర వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. శుక్రవారం విజయపుర జిల్లా ఇండి తాలూకాలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహిస్తుండగా జెండా ఆవిష్కరణ అనంతరం కన్నడ సంఘాలకు చెందిన మల్లుగిన్ని అనే వ్యక్తి గన్‌తో గాల్లోకి కాల్పులు జరిపాడు. అయితే బుల్లెట్ అక్కడే ఉన్న జీపీ అధ్యక్షుడిపైకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఆయనకు ప్రాణాపాయం తప్పింది. పోలీసులు అప్రమత్తం అయ్యేలోపు కాల్పులు జరిపిన వ్యక్తి పరారయ్యాడు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి


విజయలక్ష్మి(ఫైల్)

మైసూరు : కట్నం వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా హూసకోటిలో చోటు జరిగింది. 12 సంవత్సరాల క్రితం మైసూరు తాలూకా బొమ్మనహళ్లికి చెందిన విజయలక్ష్మి(35)ని నంజనగూడు తాలూకాలోని హూసకోటికు చెందిన హరీష్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆ సమయంలో బంగారం కట్నంగా సమర్పించారు. అయితే అదనపు కట్నం తేవాలని భర్తతోపాటు అత్త మల్లిగమ్మ, మామ మహాదేవమూర్తి, మరిది రాఘవేంద్రలు వేధించేవారు. దీంతో పెద్దలు పంచాయితీ నిర్వహించి సర్ది చెప్పారు. అయినప్పటికీ వేధింపులు ఆపలేదు. దీంతో బిళిగెరె పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కూడా పంచాయితీ చేశారు. అయినా భర్త, అతని కుటుంబ సభ్యులు పద్ధతి మార్చుకోలేదు. వేధింపులు కొనసాడంతో విజయలక్ష్మి విషం తాగి ఆత్మహత్య చేసుకుంది.మృతురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో బిళిగెరి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సీఎం వద్దకు దూసుకొచ్చిన మైసూరువాసి

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

శివాజీనగర: మాణిక్ షా పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల సమయంలో సీఎం సిద్దరామయ్య వద్దకు ఓ వ్యక్తి దూసుకురాగా, అతన్ని పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మైసూరుకు చెందిన పరశురామ్ అనేవ్యక్తి కేపీఎస్‌సీ ఆర్డర్ ఆలస్యంపై సీఎం సిద్దరామయ్యకు వినతిపత్రం సమర్పించేందుకు వచ్చాడు. అయితే పోలీసులు అందుకు అవకాశం కల్పించకపోవటంతో పరశురామ్ సీఎం వద్దకు దూసుకొని వచ్చేందుకు ప్రయత్నించారని తెలిసింది.

అన్ని రంగాల్లో విశేష సాధన

- భారత రాజ్యాంగం దేశప్రగతికి దారిదీపం
- రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలి
- గణతంత్ర దిన వేడుకల్లో గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్


పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్


తుమకూరులో త్రివర్ణ పతాకం రెపరెపలు

శివాజీనగర: రాష్ట్రంలో అన్ని రంగాల సర్వతోముఖాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కలసికట్టుగా పని చేయటంతో పాటు శాంతి, సామరస్యతను కాపాడుకొని జాతీయ ఐక్యత కోసం శ్రమించాలని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని బెంగళూరులోని ఫీల్డ్‌మార్షల్ మానెక్ పరేడ్ మైదానంలో శుక్రవారం జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 75 సంవత్సరాల్లో రాష్ట్రం, దేశం అపూర్వ ప్రగతి సాధించిందన్నారు. 1950లో అద్భుత లిఖిత రాజ్యాంగాన్ని అనుసరించడమే ఇందుకు కారణమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, ఆయన బృందం సభ్యుల దూరదృష్టికి తాము రుణపడి ఉన్నామన్నారు. ఆయన తమకు ప్రగతి దారిలో నడిచేందుకు దారిదీపమయ్యారని గవర్నర్ తెలిపారు.

సమర్థంగా గ్యారంటీ పథకాల అమలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ఐదు గ్యారంటీ పథకాలు విజయవంతంగా కొనసాగిస్తోందని ప్రశంసలు కురిపించారు. భారతదేశ ప్రజలకు సమానత్వ అవకాశాలను కల్పించటంతో పాటు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడాల్నారు. భారత రాజ్యాంగ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం శ్రమిస్తుందన్నారు. యుగయుగాల నుంచి సమానవత్వం కలిగిన భారతదేశంలో విభిన్న మతాలు, సంస్కృతి, సంప్రదాయాలతో అలరారుతోందన్నారు. ఐక్యత విషయంలో భారత దేశం ప్రపంచానికే సందేశాన్ని ఇస్తోందన్నారు.

పథకాలు ప్రజలకు ఆసరా

అన్నభాగ్య, శక్తి, గృహజ్యోతి, గృహలక్ష్మి, యువనిధి పథకాలు రాష్ట్ర ప్రజల జీవితాలకు ఉపకారిగా ఉన్నాయని గవర్నర్ అన్నారు. రాష్ట్రంలో ఏర్పడిన కరువు ప్రభుత్వ విజయవంతంగా ఎదుర్కొందన్నారు. రైతుల కష్టాలను నివారించేందుకు ప్రతి రైతుకు రూ.2 వేల ఇన్‌పుట్ సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. సుమారు 30 లక్షల మంది రైతులకు రూ.580 కోట్లు విడుదల చేసే ప్రక్రియ జరిగిందన్నారు. కరువు పరిహార చర్యలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి నిధులను కోరిందన్నారు. రైతు సురక్షా ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకం కింద 6.77 లక్షల మంది రైతులకు రూ.459.59 కోట్లు పరిహార బీమా ఇచ్చినట్లు తెలిపారు.

జోరుగా కరువు నివారణ పనులు

కరువు పరిహారాల చర్యలను పర్యవేక్షించేందుకు ఎమ్మెల్యేల నేతృత్వంలో తాలూకా స్థాయి కార్యచరణ కమిటీలు ఏర్పాటు చేసినట్లు గవర్నర్ తెలిపారు. నరేగా పథకం కింద 2023 డిసెంబర్ ఆఖరు వరకు 63.13 లక్షల మందికి పనులు కల్పించినట్లు తెలిపారు. గ్రామీణ తాగునీటి పథకం ద్వారా 22.38 లక్షల ఇళ్లకు కొళాయి కనెక్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ఆరోగ్య కవచం పథకం కింద 262 కొత్త అంబులెన్స్‌లు ప్రభుత్వం సమకూర్చినట్లు గవర్నర్ తెలిపారు. ఉచిత డయాలసిస్ కోసం డయాలిసిస్ కేంద్రాలను 168 నుంచి 219కు పెంచే కార్యం ప్రగతిలో ఉందన్నారు. డాక్టర్ పునీత్‌రాజ్‌కుమార్ ఉదయ జ్యోతి పథకాన్ని జారీ చేసినట్లు తెలిపారు.

రైతులకు సర్కార్ అండ

రైతులకు ఈ సంవత్సరం అధిక రుణాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గవర్నర్ తెలిపారు. సుమారు 35 లక్షల మందికి పైగా రైతులకు రూ.25 వేల కోట్ల వరకు రుణాలను 2023–24వ సంవత్సరంలో పంపిణీ చేసే లక్ష్యం పెట్టుకొందన్నారు.

బెంగళూరు అభివృద్ధికి ప్రాధాన్యత:

బెంగళూరు సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పించినట్లు గవర్నర్ తెలిపారు. ప్రధాన రోడ్లను వైట్ ట్యాపింగ్ చేసేందుకు రూ.2 వేల కోట్లతో టెండర్ ప్రక్రియలు జరిగాయన్నారు. బెంగళూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఎంపికైన స్థలాల్లో సొరంగ మార్గాలను నిర్మించేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పథకాలు అమలు చేసిందన్నారు. వెనుకబడిన వర్గాల విద్యార్థుల అభివృద్ధికి చర్యలు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. స్వయం ఉపాధి చేపట్టే అల్పసంఖ్యాకులకు తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎం సిద్దరామయ్య, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.


మానెక్‌షా పరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమం


బెంగళూరులో విద్యార్థినుల నృత్య ప్రదర్శన


మహనీయుల వేషధారణలో విద్యార్థులు


కలబుర్గిలో జాతీయ జెండాకు చిన్నారుల జేజేలు

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

స్వాతంత్ర్యనంతరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన దినాన్ని పురస్కరించుకొని నిర్వహించే గణతంత్ర వేడుకలు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అంబరమంటాయి. ప్రజల్లో దేశభక్తి ఉప్పొంగింది. వాడవాడలా త్రివర్ణ పతాకాలు రెపరెపలాడాయి. మహనీయుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ నేతలు ఇచ్చిన ప్రసంగాలు ప్రజల్లో స్ఫూర్తి నింపాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, సాహస క్రీడలు ఉత్సాహాన్ని నింపాయి.

పదవుల పందేరం

కార్పొరేషన్లకు చైర్మన్ల నియామకం

బనశంకరి: కాంగ్రెస్ ప్రభుత్వం పదవుల పందేరం చేపట్టింది. 36 మంది ఎమ్మెల్యేలకు కార్పొరేషన్ పదవులను కట్టబెట్టింది. ఈమేరకు శుక్రవారం జాబితా విడుదల చేసింది. శాంతినగర ఎమ్మెల్యే ఎన్‌ఏ.హ్యారీస్‌కు బెంగళూరు అభివృద్ధి ప్రాధికార అధ్యక్ష పదవి(బీడీఏ), బేలూరుగోపాలకృష్ణను అటవీపరిశ్రమ మండలి అధ్యక్షుడిగా నియమించింది. శివలింగేగౌడకు కర్ణాటకగృహమండలి, నరేంద్రస్వామికి కాలుష్యనియంత్రణమండలి, హెచ్‌సీ.బాలకృష్ణకు కర్ణాటక రవాణాశాఖమండలి, వినయ్‌కులకర్ణికి బెంగళూరు జలమండలి, శ్రీనివాస్‌మానేకు డిప్యూటీ సీఎం రాజకీయసలహాదారుడిగా, అనిల్‌చిక్కమాధుకు జంగల్ లాడ్జి, విజయానందకాశప్పనవర్‌కు క్రీడా ప్రాధికార, రూపకళా హస్తకళల అభివృద్ధిమండలి అధ్యక్ష పదవులు కేటాయించారు. వీరికి మంత్రి వర్గస్థాయి సౌలభ్యాలు ఉంటాయని ప్రభుత్వ ఆదేశాల్లో తెలిపింది. కార్పొరేషన్ చైర్మన్ల అధికార అవధిని ఏడాదిగా నిర్ణయించారు.

డిమాండ్లకు ఓకే అంటే బీజేపీతో పొత్తు

- ఎమ్మెల్యే గాలి జనార్దనరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి

గంగావతి: తమ డిమాండ్లకు ఒప్పుకుంటే బీజేపీతో పొత్తు పెట్టుకుంటామని కల్యాణ రాజ్య ప్రగతి పక్ష పార్టీ వ్యవస్థాపకుడు, గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గంగావతిలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్టీ కార్యకర్తలు, నాయకులతో చర్చించి బీజేపీతో పొత్తుపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రధాని మోదీని మరోమారు ప్రధానిని చేసేందుకు బీజేపీకి మద్దతు ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అగ్రనేతలనుంచి పిలుపు వచ్చిందని, త్వరలో ఢిల్లీ వెళతానన్నారు.

సిద్ధాంతాలకు కట్టుబడితేనే పార్టీలో చేర్చుకోవాలి

- మల్లికార్జున ఖర్గే

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలోకి ఎవరినిపడితే వారిని తీసుకోరాదని, పార్టీకి కట్టుబడి ఉన్నవారిని మాత్రం చేర్చుకోవాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. శుక్రవారం కేపీసీసీ కార్యాలయంలో గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఎగురవేసి మాట్లాడారు. జగదీశ్ శెట్టర్ కాంగ్రెస్ వీడి బీజేపీలో చేరిన నేపథ్యంలో ఖర్గే వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకుంది. గుణం, సిద్ధాంతాల గురించి యోచించి పార్టీలోకి చేర్చుకోవాలి. ఎలాగొచ్చారో అలాగే వెళ్లారనేది ఉండరాదు. తమ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండి నడుచుకునే పార్టీ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో కలసికట్టుగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మ:

రాజ్యాంగం అమల్లో లేకపోతే ప్రజాస్వామ్యం ఉండేది కాదని, రాజ్యాంగ మార్పు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ప్రధాని ఆర్‌ఎస్‌ఎస్ చేతిలో కీలుబొమ్మ అని ఖర్గే మండిపడ్డారు. ఇదే సమయంలో డీసీఎం డీకే శివకుమార్ మాట్లాడుతూ...రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని, ఈ దిశగా అందరూ ఐక్యంగా పోరాటం చేపట్టాలన్నారు.

ఒంటరితనం వల్లే సొంత గూటికి శెట్టర్

హుబ్లీ: బీజేపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్‌లోకి చేరిన మాజీ సీఎం జగదీశ్ శెట్టర్‌ను జిల్లా కాంగ్రెస్‌లో నిర్లక్ష్యం చేశారా? బీజేపీపై తీవ్ర విమర్శలు చేశాక ఆ పార్టీ నేతలు తనపై మూకుమ్మడిగా దాడి చేసినా ఏ ఒక్క కాంగ్రెస్ నేత మద్దతు ఇవ్వలేదని శెట్టర్ ఒంటరితనం అనుభవించారా? ఇదే ఆవేదన ఆయనను తిరిగి బీజేపీ గూటికి చేరేలా చేసిందని స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల కాంగ్రెస్‌లో జరిగిన పరిణామాలు కూడా దీన్నే బలపరుస్తున్నాయి. మూడు దశాబ్దాల పాటు సంఘ్‌పరివార్, హిందుత్వం, బీజేపీకి పరమ కార్యకర్తగా ఉన్న శెట్టర్ ఎటువంటి షరతులకు, భేషజాలకు పోకుండా నాడు ఉన్న ఫళంగా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఆ పార్టీలో చేరిన తొలి రోజు నుంచే కాంగ్రెస్ నేతల కన్నా శెట్టరే బీజేపీని తిట్టిపోశారు. ఆయన బీజేపీ నేతలపై చేసిన విమర్శల ప్రభావం ఓటర్లపై కూడా పడిందన్నది సత్యం. ఇలా విమర్శలు చేస్తూ మూల కాంగ్రెస్ కన్నా బీజేపీ నేతలకు శెట్టర్ విరోధి అయ్యారు. ఇది ఎంతవరకు వెళ్లిందంటే బీజేపీ కేంద్ర మంత్రులు, ఎమ్మెల్యేలు మొదలు కార్పొరేటర్లు కూడా శెట్టర్‌పై మాటలతో విరుచుకుపడ్డారు. అయితే ఈ విమర్శలన్నింటినీ శెట్టర్ ఒంటరిగా భరించాడు. వీటిపై ఏ కాంగ్రెస్ నేత స్పందించలేదు. ఎదురుదాడి చేయలేదు. పైగా తనను సమర్థించలేదన్న బాధ శెట్టర్‌ను ఏకాకిని చేసిందని ఆప్తులు మదన పడుతున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు శెట్టర్‌కు ఎక్కువ గౌరవం ఇవ్వకపోయినా శెట్టర్ తమ వాడే అన్న అభిప్రాయం స్థానిక నేతలు, ప్రముఖులు, కార్యకర్తల్లో ఇసుమంతైనా కనిపించలేదని శెట్టర్ ఆత్మవిమర్శ చేసుకున్నారు. పైగా పార్టీ బలోపేతం, అసెంబ్లీ ఎన్నికల్లో క్రియాశీలకంగా కాంగ్రెస్ వారు పని చేయలేదు. ఇదే తన ఓటమికి కారణం అని శెట్టర్ దృఢ అభిప్రాయంతో ఉన్నట్లు చెబుతున్నారు. ఇటీవల ధార్వాడ లోక్‌సభ ఇన్‌చార్జి మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ ప్రైవేట్ హోటల్‌లో లోక్‌సభ టికెట్ ఆశావహుల దరఖాస్తులను స్వీకరణకు సమావేశం ఏర్పాటు చేసినా శెట్టర్‌కు ఆహ్వానం అందలేదు. ఓ మాజీ సీఎం, సీనియర్ నేత శెట్టర్‌ను ఆహ్వానించకుండా నిర్లక్ష్యం చేశారనే కారణాలతో రాష్ట్ర నేతలు ఏ ఒక్కరైనా జిల్లాలో ఒంటరినన్న భావనతో ఉన్న తనను ఊరడించకపోవడమే శెట్టర్ 9 నెలల్లోనే హఠాత్ నిర్ణయం తీసుకోడానికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఎవరు వీడినా పార్టీకి నష్టమేం లేదు

సాక్షి బళ్లారి: కాంగ్రెస్ పార్టీని ఎవరు వీడినా నష్టమేం లేదని, జనంలో పార్టీ చిరస్థాయిగా నిలిచిందని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ టికెట్ ఇవ్వకపోవడంతోనే శెట్టర్ కాంగ్రెస్‌లో చేరారన్నారు. తమ పార్టీలో ఆయన్ను ఎంతో గౌరవంగా చూశారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయినా సీనియారిటీని గుర్తించి ఎమ్మెల్సీని చేశారన్నారు. అలాంటి వ్యక్తి నమ్మకద్రోహం చేశారన్నారు. ఆయన పార్టీని వీడినంత మాత్రానా వచ్చే ఇబ్బంది ఏమీ లేదన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నా కేంద్రం సవతి తల్లి ధోరణి ప్రదర్శిస్తోందన్నారు. ఇప్పటి వరకు కేంద్రం నుంచి రాష్ట్రానికి కరువు సహాయం అందలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలపై చిన్నచూపు చూస్తోందన్నారు. రాష్ట్రానికి చెందిన మంత్రులు, కేంద్రానికి కరువు సహాయనిధి కోసం వెళితే వారు పిలిచి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. కరువును కూడా బీజేపీ రాజకీయం చేస్తోందన్నారు. రాష్ట్రానికి కరువు సహాయం అందించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు.

జాతరకు వెళ్లి వస్తుండగా మృత్యుపంజా

- చెరకులోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీకొన్న కారు
- నలుగురు మృతి
- బాగలకోటె జిల్లాలో ఘోర దుర్ఘటన


ట్రాక్టర్ ట్రాలీ కిందకు దూసుకెళ్లిన కారు

సాక్షి బళ్లారి: బనశంకరీదేవి జాతరకు వెళ్లి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని వస్తుండగా మృత్యువు పంజా విసిరి నలుగురిని బలిగొంది. ఈ ఘోర దుర్ఘటన శుక్రవారం తెల్లవారుజామున బాగలకోటె జిల్లా బీళగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు..విజయపుర జిల్లా బసవనబాగేవాడి తాలూకా హొనగనహళ్లి గ్రామానికి చెందిన కామాక్షి బడిగేర్(35), కల్లప్ప కౌటగి(34), మల్లికార్జున పూజారి(24), తుకారాం తోళవాడ(30)లు బాదామిలో గురువారం జరిగిన బనశంకరి జాతరకు వెళ్లారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి తిరిగి వస్తూ హుబ్లీ–షోలాపూర్ జాతీయ రహదారిపై తుమ్మరమట్టి క్రాస్ సమీపంలో చెరకు లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. కారు ట్రాక్టర్ చక్రాల కిందకు దూసుకెళ్లడంతో వాహనం నుజ్జయ్యింది. స్థానికులు వచ్చి కారును బయటకు తీయగా అందులో ప్రయాణిస్తున్న నలుగురూ విగతజీవులుగా కనిపించారు. బాగల్‌కోటె ఎస్పీ అమర్‌నాథ్‌రెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బీళగి తాలూకా ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుల బంధువులు ఆస్పతికి చేరుకొని కన్నీరుమున్నీరుగా విలపించారు. చిత్రదుర్గ జిల్లా చెళ్లకెరె తాలూకాలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందిన ఘటన మరవక ముందే తాజాగా కారు ప్రమాదంలో నలుగురు మృతి చెందడం ఆ ప్రాంత వాసులను తీవ్రంగా కలిచివేసింది.




మృతులు వీరే(ఫైల్)


నుజ్జయిన కారులో చిక్కుకున్న మృతదేహం

పుష్పసోయగం..జనసాగరం


గ్లాస్‌హౌస్‌లో పోటెత్తిన సందర్శకులు


బసవణ్ణ థీమ్ వద్ద ఫొటోలు తీసుకుంటున్న సందర్శకులు

బనశంకరి: గణతంత్రదినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్ ఉద్యానవనం గ్లాస్ హౌస్‌లో ఏర్పాటుచేసిన 215వ ఫలపుష్ప ప్రదర్శనకు సందర్శకులు పోటెత్తారు. బసవణ్ణ వచన సాహిత్య ఆధారిత థీమ్‌తో ఫ్లవర్‌షో ఏర్పాటు చేశారు. గ్లాస్‌హౌస్‌లో బసవణ్ణ అనుభవ మంటపం వెనుక బసవణ్ణ, అక్కమహాదేవి, అంబిగరచౌడయ్య, హరళయ్యతో పాటు శరణ విగ్రహాలు వివిధ రకాల పుష్పాల మధ్య సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సెలవురోజు కావడంతో విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పుష్పాల అందాలను వీక్షించారు. పుష్ప అందాలను తమ సెల్ఫోన్లలో బంధించి సందడి చేశారు.

క్లుప్తంగా

ఫిబ్రవరి 2, 3, 4 తేదీల్లో హంపీ ఉత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప, అధికారులు

హొసపేటె: ఫిబ్రవరి 2 నుంచి మూడు రోజుల పాటు హంపీ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గవియప్ప తెలిపారు. శుక్రవారం హంపీలో ఉత్సవాల ఏర్పాట్లు పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈసారి హంపీ ఉత్సవాలను నాలుగు వేదికల్లో నిర్వహిస్తున్నామన్నారు. వేదికల్లో రాష్ట్రంలో ఉన్న ప్రసిద్ధ కళాకారులు, కన్నడ సినీ గాయకులు, స్థానిక కళాకారులు తమ ప్రదర్శనలిస్తారన్నారు. ఉత్సవాల్లో గ్రామీణ క్రీడా పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలతో పాటు వంటల తయారీ తదితర పోటీలను నిర్వహిస్తారన్నారు. ఇప్పటికే వేదికల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయన్నారు. హంపీ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లాధికారి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూజ పరికరాల అందజేత



పరికరాలను అందిస్తున్న దృశ్యం

కంప్లి: కూరగాయల వ్యాపారం చేస్తున్న తన తల్లి హాలమ్మ ఆశయం మేరకు ఉపాధ్యాయిని విజయలక్ష్మి అశోక్ బాబూరావ్ శుక్రవారం తాను పని చేస్తున్న గోవిందగిరి గొల్లరహట్టి ప్రభుత్వ పాఠశాల అంగన్‌వాడీ కేంద్రానికి ఉచితంగా పూజ పరికరాలను అందించారు.

వైభవంగా వీరభద్రేశ్వర రథోత్సవం




సోగిలో రథాన్ని లాగుతున్న భక్తులు

కంప్లి: హూవినహడగలి తాలూకాలోని సోగి గ్రామంలో వీరభద్రేశ్వర స్వామి రథోత్సవం వైభవంగా జరిగింది. దేవస్థానం నుంచి పుష్పాలంకృత పల్లకీ ఊరేగింపులో ఉత్సవమూర్తిని రథారోహణ చేశారు. అనంతరం రథానికి సాంప్రదాయం ప్రకారం పూజలు జరిపి అనంతరం వీరభద్రేశ్వర స్వామి రథాన్ని లాగారు. భక్తులు వందలాది సంఖ్యలో పాల్గొని ముడుపులు చెల్లించుకున్నారు.

మటమారిలో..

రాయచూరు రూరల్: తాలూకాలోని మటమారిలో వీరభద్రేశ్వర జాతర రథోత్సవం వైభవంగా జరిగింది. గురువారం సాయంత్రం రథోత్సవాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. రథోత్సవంలో మటమారి మఠాధిపతి వీరభద్ర శివాచార్యులు, అభినవ రాచోటి శివాచార్యులు, శాంతమల్ల శివాచార్యులు, లోక్‌సభ సభ్యుడు రాజా అమరేశ్వర నాయక్, రూరల్ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్, భక్తులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు మద్దతుగా ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థులు

కంప్లి: అధ్యాపకులను నియమించి సక్రమంగా తరగతులను నిర్వహించాలని ఒత్తిడి చేస్తూ హడగలి పట్టణంలోని గుళిగి నాగరాజ్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు శుక్రవారం తరగతులు బహిష్కరించి కళాశాల వద్ద ధర్నా చేశారు. వేతనాలు పెంచాలని, తమ వివిధ డిమాండ్లు తీర్చాలని ఐటీఐ కళాశాల అతిథి ఉపన్యాసకులు, బోధకులు, సిబ్బంది చేపట్టిన ధర్నాతో తమ చదువుపై ప్రభావం పడుతుందని, ప్రభుత్వం స్పందించి అతిథి ఉపన్యాసకులు వేతనాల పెంచి, వారి డిమాండ్లు తీర్చాలని విద్యార్థులు ఒత్తిడి చేశారు.

విద్యార్థుల పర్యటనకు శ్రీకారం



పర్యటనను జెండా ఊపి ప్రారంభిస్తున్న దృశ్యం

కంప్లి: పర్యాటక శాఖ తరఫున హరపనహళ్లి తాలూకాలోని పాఠశాలలకు చెందిన 146 మంది విద్యార్థులకు కర్ణాటక దర్శన భాగ్యం లభించింది. బీఈఓ కార్యాలయం వద్ద సమన్వయ అధికారి హన్మంతప్ప, వ్యాయామ విద్యాధికారి షణ్ముఖప్ప పర్యటనను జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులకు పర్యటన కిట్లు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో వీక్షించిన ప్రాంతాలను గుర్తుంచుకోవాలని ఉపాధ్యాయుడు బీ.రాజశేఖర్ తెలిపారు.

రాజ్యాంగ నిర్మాత కృషి అమోఘం

- గణరాజ్యోత్సవ వేడుకల్లో వక్తలు
- ఎల్లెడలా త్రివర్ణ పతాక రెపరెపలు



బళ్లారిలో అంబేడ్కర్ చిత్రపటానికి మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యే భరత్‌రెడ్డి నివాళి



హొసపేటెలో మాట్లాడుతున్న మంత్రి జమీర్ అహమ్మద్

సాక్షి బళ్లారి: దేశ చరిత్రలో భారతీయులందరికీ రెండే రెండు గొప్ప పండుగలని, ఒకటి దేశానికి స్వాతంత్ర్యం లభించిన ఆగస్టు 15 కాగా, రెండోది భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26 అని, ఈ రెండు ప్రతి ఒక్కరూ ఎన్నటికీ మరిచిపోలేని రోజులని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీ.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని విమ్స్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మువ్వన్నెల జెండాను ఎగరవేసిన అనంతరం మాట్లాడారు. రాజ్యాంగ రచనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన కృషి అమోఘమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణించిన వారిని సన్మానించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మేయర్ శ్వేత, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, ఎస్పీ రంజిత్ కుమార్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. కాగా నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మూడు రంగుల జెండా రెపరెపలాడింది. నగరంలోని మోతీ సర్కిల్ వద్ద 150 అడుగుల ఎత్తులో జాతీయ జెండాను మంత్రి నాగేంద్ర ఎగరవేయగా, నగరంలోని ప్రముఖ కాలనీలు, ప్రభుత్వ కార్యాలయాలపై మూడు రంగుల జెండాను ఎగరవేసి పండుగలా గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకొన్నారు.

జిల్లా బీజేపీ కార్యాలయంలో..

మోకా రోడ్డు వాజ్‌పేయి లేఔట్‌లోని జిల్లా బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు జరిగాయి. శుక్రవారం ఉదయం జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ నాయుడు ఆధ్వర్యంలో మూడు రంగుల జెండాను ఎగరవేసి గణతంత్ర వేడుకలను పండుగలా ఆచరించారు. ఎమ్మెల్సీ వైఎం.సతీష్, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, బీజేపీ ప్రముఖులు ఐనాథ్‌రెడ్డి, వీరశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్లు శ్రీనివాస్ మోత్కూర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ చరిత్రలో ముఖ్యమైన రోజు

హొసపేటె: జనవరి 26 దేశ చరిత్రలో అత్యంత ముఖ్యమైన రోజు అని, పాలనా వ్యవస్థను స్వీకరించి ఈ చారిత్రాత్మక గణతంత్ర విధానాన్ని అవలంభించిన శుభదినమని విజయనగర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహమ్మద్ ఖాన్ తెలిపారు. శుక్రవారం నగరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగ నిర్మాత, గొప్ప మానవతావాది భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. అనంతరం వివిధ పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సంస్కృతి కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకొన్నాయి. ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్, ఎస్పీ హరిబాబు, జెడ్పీ సీఈఓ సదాశివ ప్రభు, అదనపు జిల్లాధికారి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత, అభివృద్ధికి కట్టుబడాలి

రాయచూరు రూరల్: భారత దేశ ఐక్యతకు, అభివృద్ధికి నేటి యువత కంకణబద్ధులు కావాలని రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం మహాత్మా గాంధీ క్రీడాంగణంలో 75వ గణతంత్ర దినోత్సవంలో పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. సార్వభౌమత్వానికి ఎలాంటి ధోకా రాకుండా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1946లో రాజ్యాంగాన్ని రచించారని, 1950లో పూర్తి సార్వభౌమత్వంతో కూడిన దేశంగా రూపాంతరం చేశారన్నారు. ఎమ్మెల్యే బసన గౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఏడీసీ దురుగేష్, ఎస్పీ నిఖిల్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఏసీ మెహబూబిలున్నారు. జాతీయ పతాకాన్ని ఎగుర వేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు.

కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సెక్రటేరియట్

కలబుర్గిలో కళ్యాణ కర్ణాటకకు ప్రత్యేక సెక్రటేరియట్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చిస్తామని కలబుర్గి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. ఆయన శుక్రవారం కలబుర్గిలోని సర్దార్ వల్లబాయి పటేల్ క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. వెనుక బడిన కళ్యాణ కర్ణాటక ప్రాంత అభివృద్ధికి ప్రత్యేకంగా ఈ ఏడాది రూ.5000 కోట్లు కేటాయించారన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్-371(జె) కింద ఉప కార్యాలయం కలబుర్గిలో ఏర్పాటు చేస్తామన్నారు. 137 పడకల జయదేవ హృద్రోగ ఆస్పత్రికి రూ.182.65 కోట్లు, 200 పడకల కలబుర్గి ఆస్పత్రిలో తల్లీబిడ్డల ఆస్పత్రి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రూ.162.80 కోట్లల్ కేటాయించారన్నారు. ఎమ్మెల్యేలు బీఆర్ పాటిల్, అల్లమ ప్రభు, తిప్పణప్ప, కనీజా ఫాతిమా, జిల్లాధికారిణి ఫౌజియా తరన్నుమ్, ఏసీ ఆశప్పలున్నారు.

సిరుగుప్పలో..

సిరుగుప్ప: నగరంలోని క్రీడాంగణంలో శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విశ్వనాథ్ మాట్లాడుతూ చాలామందికి జనవరి 26వ తేదీ గణతంత్ర దినోత్సవం గురించి తెలియదన్నారు. దేశంలో అనేక కులమతాలవారు కలిసి ఒక్కటిగా జీవించేలా రాసిన మన రాజ్యాంగాన్ని ప్రవేశ పెట్టిన రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బీఎం నాగరాజ్ మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ సామరస్యంగా కలిసిమెలసి శాంతియుతంగా జీవించే హక్కును రాజ్యాంగం కల్పించిందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డీఎస్పీ వెంకటేశులు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్‌ఇన్‌స్పెక్టర్లు, తాలూకా అధికారులు, ప్రముఖులు, ఆయా పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

గంగావతిలో..

గంగావతి: భారత రాజ్యాంగాన్ని ప్రజలకు అంకితం చేసిన రోజును మనం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన నగరంలోని కనకగిరి రోడ్డులోని తాలూకా క్రీడా మైదానంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ గౌరవ వందనాన్ని అందుకొని మాట్లాడారు. వందలాది ఏళ్ల సుదీర్ఘ పోరాటం, ఎంతో మంది ప్రాణ త్యాగ ఫలితంగా అయోధ్య రామమందిరాన్ని నిర్మించి ప్రారంభించిన ఘనత నరేంద్ర మోదీకే దక్కిందన్నారు. ఇందుకు ప్రధాని నరేంద్ర మోదీని అభినందిస్తున్నానన్నారు. గంగావతి నగరాభివృద్ధికి తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపుతానన్నారు. అనంతరం ఉత్తమ మార్కులు విద్యార్థులను సన్మానించి సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజ్, కమిషనర్ విరుపాక్షప్ప మూర్తి, డీఎస్పీ మహంతేష్‌గౌడ పాటిల్, టీపీ ఈఓ లక్ష్మీదేవి, బీఈఓ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి జిల్లా బీజేపీ కార్యాలయంలో భరతమాత చిత్రపటానికి పూజలు చేసిన నాయకులు



హొసపేటె గణతంత్ర వేడుకలో దేశభక్తి గీతానికి సామూహిక నృత్యం చేస్తున్న విద్యార్థులు



రాయచూరులో జెండావందనం చేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే, అధికారులు తదితరులు



కలబుర్గిలో గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ప్రియాంక్ ఖర్గే, అధికారులు





సిరుగుప్పలో జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ విశ్వనాథ్, ఎమ్మెల్యే, గంగావతిలో గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి, అధికారులు







బళ్లారిలో దేశభక్తి గీతాలకు వివిధ పాఠశాలల విద్యార్థుల సామూహిక నృత్య ప్రదర్శనలు

వేర్వేరు కేసుల్లో రూ.18 లక్షల వంచన

హుబ్లీ: వాణిజ్య నగరి హుబ్లీలో ఆన్‌లైన్ వంచకుల బారిన పడి ఇద్దరు రూ.18 లక్షలను పోగొట్టుకున్నారు. వివరాలు.. స్టార్ హోటల్ భవన నిర్మాణాలకు చిన్న ప్రమాణంలో డబ్బులు పెట్టుబడి పెడితే ఆ హోటల్‌లో వచ్చే ఆదాయంలో లాభాలు లభిస్తాయంటూ మహిళను నమ్మించి రూ.13.63 లక్షలను బదలాయించుకొని వంచించారు. మొబైల్‌లో లభించిన లింక్‌ను మహిళ ఓపెన్ చేసింది. ఇందులో ప్రపంచంలోనే నానా చోట్ల ఐబీఎస్ కంపెనీ స్టార్ హోటళ్లను నిర్మిస్తోంది. ఇందుకోసం అక్యూర్ అనే సంస్థ ద్వారా కనీస రికార్డులతో పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. కట్టడ నిర్మాణం అయ్యాక వచ్చే ఆదాయంలో అక్యూర్ సంస్థ ద్వారా పెట్టుబడి పెట్టిన వారికి హోటల్ కట్టడంలోని రూంల అద్దెల్లో లాభాలను ఇస్తామని చెప్పారు. ఈ క్రమంలో వంచకులు సదరు మహిళను ప్రేరేపించారు. ఆ తర్వాత గూగుల్, వాట్సాప్, టెలిగ్రామ్‌ల అడ్మిన్‌కు ఫోన్ చేసి చెక్ చేసుకున్నారు. ఈ వేళ సానుకూల స్పందన లభించింది. దీంతో పూర్తిగా నమ్మిన ఆమె 18 రోజుల్లో మొత్తం రూ.13,63,768 పెట్టుబడి పెట్టి మోసపోయినట్లు ఆ మహిళ సోదరి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరో కేసులో ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలు వస్తాయంటూ నమ్మించి ఓ వ్యక్తి రూ.4.38 లక్షలను బదలాయించుకొని వంచించారు. విద్యానగరకు చెందిన వివేక్ జిగళూరు బాధితుడు. వంచకులు అర్జున్ శర్మ ఫ్యాన్స్ గ్రూప్‌కు జాయింట్ చేశారు. సదరు గ్రూప్‌లో ఆన్‌లైన్ ట్రేడింగ్‌పై కురోటఫడ్స్ అప్లికేషన్ లింక్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఆ మేరకు ఈ ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెట్టాలని బాధితుడిని ప్రేరేపించి రూ.4.38 లక్షలను వంచకులు తమ ఖాతాలోకి బదలాయించుకున్నట్లుగా బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ రెండు ఘటనలపై సైబర్ క్రైం పోలీసులు కేసులు నమోదు చేసుకున్నారు.

ఫల పుష్ప ప్రదర్శనతో రైతుకు మేలు



ఫల పుష్ప ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

రాయచూరు రూరల్: నగరంలో ఫల పుష్ప ప్రదర్శనను రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ ప్రారంభించారు. శుక్రవారం నగరంలోని ఉద్యాన శాఖాధికారి కార్యాలయ అవరణంలో మూడు రోజుల పాటు జరిగే ఫల పుష్ప ప్రదర్శనను వీక్షించి ఆయన మాట్లాడారు. జిల్లాలో పండించే పండ్లు, పూలు, ఇతరత్ర ప్రదర్శనల ద్వారా రైతులకు ఆదాయం లభించేలా సహకారం అందించాలన్నారు. తోటల పెంపకాలను ప్రోత్సహించిన మరేగౌడ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బసనగౌడ, ఏపీఎంసీ అధ్యక్షుడు మల్లికార్జునగౌడ, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, జెడ్పీ సీఈఓ రాహుల్ పాండే తుకారాం, ఉద్యానవనాధికారి మహ్మద్ అలీలున్నారు.

ఆర్టికల్-371(జే)పై ప్రచారం చేయాలి

కళ్యాణ కర్ణాటకలోని విద్యార్థులకు ఆర్టికల్-371(జే)పై ప్రచారం చేసి తద్వారా కలిగే లబ్ధిని వివరించాలని మంత్రి శరణ ప్రకాష్ పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన మహాత్మా గాంధీ క్రీడాంగణంలో విలేకరులతో మాట్లాడారు. కళ్యాణ కర్ణాటకలో విద్య, ఉద్యోగ, ఆరోగ్య రంగాల్లో రిజర్వేషన్లతో కలిగే లాభాలను వివరించాలన్నారు. జిల్లాలో 32 మంది పీడీఓలపై చర్యలు చేపట్టామన్నారు. రిమ్స్ ఆస్పత్రిలో అవ్యవస్థపై అధికారులతో చర్చించి సరిచేస్తామన్నారు. తల్లీబిడ్డల ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖలో నెలకొన్న లోపాలను సవరించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ స్థలాల ఆక్రమణకారులపై చర్యలు చేపట్టి స్వాధీనపరుచుకోవాలని సూచించారు.

మత విద్వేషాల చిచ్చు తగదు



మాట్లాడుతున్న మంత్రి బైరతి సురేష్

కోలారు: మందిరం, మసీదుల పేరుతో మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టడాన్ని బీజేపీ మానుకోవాలని ఇన్‌చార్జ్ మంత్రి బైరతి సురేష్ అన్నారు. శుక్రవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడు అందరికీ దేవుడన్నారు. దేవుడిని రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు. వీటన్నింటికీ ప్రజలే సమాధానం చెబుతారన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌తో జేడీఎస్ పొత్తు పెట్టుకోవడం వల్ల కాంగ్రెస్ పార్టీ లాభపడుతుందని, లోక్‌సభ ఎన్నికల్లో 15 నుంచి 20 సీట్లు గెలుచుకొంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ కోలారులో కాంగ్రెస్ జెండా ఎగురుతుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నీచ కృత్యాలకు పాల్పడకుండా సీఎం సిద్ధరామయ్య, డీసీఎం శివకుమార్‌తో పాటు తాను కూడా బలంగా ఉన్నామన్నారు. నిధుల కొరత మాట లేకుండా అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయింపులు చేస్తామన్నారు. జిల్లా తరఫున కోలారుకు మెడికల్ కాలేజీ, రింగ్‌రోడ్డు నిర్మాణానికి మరికొద్ది రోజుల్లో జరుగనున్న బడ్జెట్ సమావేశాల్లో కేటాయింపులు చేస్తామన్నారు. మ్యాంగో ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఆయన హామీ ఇచ్చారు.

వాడవాడలా గణతంత్ర వేడుకలు



కన్నడ సంస్కృతి శాఖ కార్యాలయంలో జెండావిష్కరణ



ఎత్తినబూదిహాళ్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో జెండా ఆవిష్కరణ నిర్వహించిన దృశ్యం



పాఠశాలలో జెండా ఆవిష్కరణలో పాల్గొన్న ఆప్ నాయకులు, కార్యకర్తలు

బళ్లారిఅర్బన్: నగరంలో శుక్రవారం వాడవాడలా 75వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. జిల్లాధికారి, జిల్లా పంచాయతీ, కార్పొరేషన్, తాలూకా పంచాయతీ, ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలు, కళాశాలలో, వివిధ వీధుల్లో జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్, కేఆర్‌పీపీ, జేడీఎస్, ఆప్ కార్యాలయంలో జాతీయ నాయకుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ వేడుకలను జరిపారు. కన్నడ పర సంఘాల కార్యాలయాల ముందు కూడా జెండాలను ఆవిష్కరించారు.

పంట పొలం పరిశీలన



పొలంలో పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ నిపుణులు, అధికారులు

కంప్లి: బెళగోడు గ్రామ రైతు రామకృష్ణ తనకున్న 8 ఎకరాల పొలంలోని వరి పంటకు గంధకం కలిసిన ఎరువులు వేయగా పంట పెరుగుదల క్షీణించి, ఎండిపోయి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గంగావతి వ్యవసాయ పరిశోధన కేంద్రం వంగడాల అభివృద్ధి విభాగం సహాయ ప్రాధ్యాపకులు డాక్టర్ మహంతేష్ శివయోగి, కీటక నిపుణులు సుజయ్ మరళి, దడేసూగూరు వ్యవసాయ పరిశోధన కేంద్రం వ్యవసాయ నిపుణులు డాక్టర్ వైఎం రమేష్‌లు బెళగోడులోని పొలాన్ని పరిశీలించి రైతుకు తగిన సలహా సూచనలు అందించారు.

వేడుకగా బనశంకరి దేవి జాతర, రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయచూరు రూరల్: బాగల్‌కోట జిల్లా బాదామిలో వెలసిన బనశంకరి దేవి జాతర, రథోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం సాయంత్రం రథోత్సవాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్ర, గోవా, తెలంగాణల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు హాజరయ్యారు.

హంపీలో మెటల్ డిటెక్టర్ ప్రారంభం



మెటల్ డిటెక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ తదితరులు

హొసపేటె: విరుపాక్షేశ్వర ఆలయానికి రోజూ లక్షలాది భక్తులు వస్తున్నందున ఆలయ ప్రాంగణంలో భద్రతను పెంపొందించే దిశగా ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే గవియప్ప, జిల్లాధికారి దివాకర్ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ హంపీకి వచ్చే భక్తుల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు సంప్రదాయ దుస్తులు ధరించి భగవంతుని దర్శనం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. విరుపాక్షేశ్వరుని దర్శనానికి వెళ్లే భక్తులకు, పర్యాటకులకు పంచలను అందించారు. జిల్లా యంత్రాంగం సరికొత్తగా హజ్ యాత్రకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈసందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మహమ్మద్ అలీ అక్రమ్ షా, పర్యాటకులు పాల్గొన్నారు.

రైతు, కూలీ వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న వ్యవసాయ కూలీలు



ఆందోళన చేపట్టిన రైతు సంఘం కార్యకర్తలు



ట్రాక్టర్లతో ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

గంగావతి: రైతులు, కూలీకార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ కూలీల సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాలూకా పంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. కర్ణాటక ప్రాంత వ్యవసాయ కూలీల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రప్ప హొసకేర మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన పదేళ్లలో వ్యవసాయ కూలీలు, కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారిందన్నారు. అందువల్ల రైతులు, కూలీ కార్మికులు ఐక్యంగా ప్రభుత్వంపై పోరాటానికి సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమానికి సీఐటీయూ జిల్లాధ్యక్షుడు నిరుపాది, ఎస్ఎఫ్ఐ నేత బాలప్ప హులిహైదర్ తదితరులు నేతృత్వం వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలు నిరసిస్తూ ర్యాలీ

రాయచూరు రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సంయుక్త పోరాట కర్ణాటక, జేసీటీయూ డిమాండ్ చేసింది. శుక్రవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లాధ్యక్షులు కరియప్ప హచ్చొళ్లి మాట్లాడారు. ఏపీఎంసీ, కార్మిక, విద్యుత్ చట్టాలను ఉపసంహరించుకోవాలన్నారు. వ్యవసాయ కూలీలకు నరేగ పనులను 200 రోజులకు పెంచాలన్నారు. రాష్ట్రంలో కరువు సహాయం, పరిహారం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కరువు సమయంలో రాజకీయాలు చేస్తూ కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల జీవితాలతో చెలగాటం ఆడటం మానుకోవాలని ఒత్తిడి చేశారు. రాజేంద్ర గంజ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టారు.